సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 18

బుధవారం 10-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



నితీశ్ 'షో'

వైజాగ్ కుర్రాడి మెరుపు ప్రదర్శన
పంజాబ్‌పై సన్‌రైజర్స్ గెలుపు - 14లో



డిక్సన్ చేతికి ఇస్మార్ట్ ఇండియా

50.1 శాతం వాటా కొనుగోలుకు డీల్..
ఐటెల్, ఇన్‌ఫినిక్స్ సొంతం - 15లో



రాముడిని అవమానించిన కాంగ్రెస్

అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణాన్ని నిలిపివేయడానికి కాంగ్రెస్ ఎన్నో ప్రయత్నాలు చేసిందని ప్రధాని మోదీ ఆరోపించారు.

వివరాలు 6లో ▸



సీఈసీ రాజీవ్‌కు 'జెడ్ కేటగిరీ'

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు కేంద్ర ప్రభుత్వం జెడ్ కేటగిరీ భద్రతను కల్పించింది.

వివరాలు 6లో ▸



ఎంవీఏలో సీట్లు ఖరారు

మహారాష్ట్రలోని 48 స్థానాలకు గానూ శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) 21 సీట్లలో, కాంగ్రెస్ 17, ఎన్‌సీపీ (శరద్‌పవార్) 10 చోట్ల పోటీ చేయనున్నాయి.

వివరాలు 6లో ▸



కేజ్రీవాల్ అరెస్టు సబబే

మద్యం స్కాం కేసులో కేజ్రీవాల్ అరెస్టు విషయంలో చట్టాల ఉల్లంఘన జరగలేదని.. అరెస్టు సబబేనని ఢిల్లీ హైకోర్టు తేల్చిచెప్పింది.

వివరాలు 6లో ▸

• అక్రమాల మార్గదర్శికి గూబ గుయ్యిమనిపించిన సుప్రీం..

డిపాజిట్ల నిగ్గు తేలాల్సిందే

అధీకృత అధికారి కృష్ణరాజు ఫిర్యాదును కొట్టివేస్తూ.. ఉమ్మడి హైకోర్టు చివరి రోజున జస్టిస్ రజని ఇచ్చిన తీర్పు రద్దు

- విచారణ సమయంలో నిర్దిష్ట విధానాన్ని పాటించలేదని సుప్రీంకోర్టు ఆక్షేపణ
- హైకోర్టు తీర్పు ఏకపక్షం.. అందరి వాదనలు వినలేదని స్పష్టీకరణ
- అన్ని అంశాలపై తిరిగి లోతుగా విచారించాలని తెలంగాణ హైకోర్టుకు ఆదేశం
- ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు, ఉండవల్లితో సహా అందరి వాదనలు వినండి
- మార్గదర్శి ఫైనాన్షియర్స్ డిపాజిట్లపై నిగ్గు తేలాలి.. సమగ్ర పరిశీలన చేయండి
- ఆరు నెలల్లో విచారణ పూర్తి చేయాలి
- తెలంగాణ హైకోర్టుకు పంపొద్దని పలుమార్లు కోరిన రామోజీ న్యాయవాదులు
- తోసిపుచ్చిన సుప్రీంకోర్టు ధర్మాసనం
- కేసు గురించి మాట్లాడకుండా ఆదేశాలివ్వాలన్న సిద్ధార్థ లూథ్రా
- అదెలా సాధ్యం? ఎలాంటి గ్యాగ్ ఉత్తర్వులు ఇవ్వలేమని సుప్రీం స్పష్టీకరణ



"కోర్టు తీర్పుల్ని ఒక్కొక్కరు ఒక్కోలా స్వీకరిస్తారు. విమర్శించరాదంటూ లక్ష్మణ రేఖ ఎలా గీయగలం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఈనాడు వ్యతిరేకంగా ఉంది. ఈనాడుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యతిరేకంగా ఉంది. ఈనాడుకు వ్యతిరేకంగా ఉండొద్దని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని మేం ఆదేశించలేం..

- సుప్రీం కోర్టు

సాక్షి, అమరావతి: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిబంధనలకు విరుద్ధంగా రూ.వేల కోట్లను అక్రమంగా డిపాజిట్ల రూపంలో ప్రజల నుంచి స్వీకరించిన కేసులో మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని యజమాని రామోజీరావుకు సుప్రీం కోర్టు గట్టి షాకిచ్చింది. చట్ట ఉల్లంఘనకు పాల్పడినందుకు రామోజీరావు, మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ అధీకృత అధికారి కృష్ణరాజు నాంపల్లి కోర్టులో ఇచ్చిన ఫిర్యాదును కొట్టివేస్తూ ఉమ్మడి హైకోర్టు జడ్జి జస్టిస్ తేలప్రోలు రజని ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు రద్దు చేసింది. డిపాజిట్లు తిరిగి ఇచ్చేసినందున తమపై కేసులు కొట్టేయాలంటూ రామోజీ, మార్గదర్శి ఫైనాన్షియర్స్ చేసిన అభ్యర్థనలను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. చట్ట విరుద్ధంగా వసూలు చేసిన సొమ్ములను వెనక్కి ఇచ్చేశామంటే ఎంత మాత్రం సరిపోదని వ్యాఖ్యానించింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ ద్వారా చట్ట విరుద్ధ డిపాజిట్ల సేకరణపై నిగ్గు తేలాల్సిందేనని తేల్చి చెప్పింది. మార్గదర్శి, రామోజీకి అనుకూలంగా

మిగతా 3వ పేజీలో ▶

ఆర్థిక ఉగ్రవాది అరాచకాలు

'మార్గదర్శి' పేరిట రామోజీ సామ్రాజ్య విస్తరణ.. ఆర్‌బీఐ చట్టానికి విరుద్ధంగా డిపాజిట్ల సేకరణ

ఆ ముసుగులో భారీగా నల్లధనం దందా

10లో

చెరుకూరి త్రిపాత్రాభినయం

హెచ్‌యూఎఫ్ కర్త, ప్రొప్రైటర్, చైర్మన్ పేర్లతో కనికట్టు

జనం సొమ్ముతో గురివింద విందు!

పండిన రామోజీ పాపాలు

10లో

ఫ్యాక్ట్‌చెక్

రామోజీ రాతల్లోనే 'కోతలు'..

బాబు పాలనలోనే 'చీకట్లు'

- టీడీపీ హయాంలో పవర్ హాలిడే, క్రాప్ హాలిడేలు
- గంటలు, రోజుల తరబడి రైతులకు, పరిశ్రమలకు కోతలు
- అప్పుడు కళ్లు మూసుకుని ఎన్నికల వేళ కుళ్లు రాతలేలా..?
- ఈదురు గాలులు, సాంకేతిక సమస్యల వల్ల ఎక్కడో అంతరాయం
- నిరంతర విద్యుత్తు సరఫరా ఇస్తున్నా ఈనాడు 'చీకటి' కథనం

11లో

న్యూస్‌రీల్

మా స్థానాలు, అభ్యర్థుల మార్పులుండవు: బీజేపీ



పొత్తులో బీజేపీకి కేటాయించిన అసెంబ్లీ, పార్లమెంటు సీట్లు విషయంలో గానీ, ఆయా స్థానాలకు ఇప్పటికే పార్టీ ప్రకటించిన అభ్యర్థుల విషయంలో గానీ ఎలాంటి మార్పులు ఉండవని బీజేపీ రాష్ట్ర ఎన్నికల సహ ఇన్‌చార్జ్ సిద్ధార్థనాథ్ సింగ్ చెప్పారు.

వివరాలు 11లో ▸

బాబు చెప్పినట్లే.. షర్మిల, సునీత డ్రామాలు



చంద్రబాబుతో ఒప్పందం చేసుకుని మరీ సొంత అన్న జగన్‌పై షర్మిల, సునీత విమర్శలు చేయడం మూర్ఖత్వమని నేషనల్ దళిత జేఏసీ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు మండిపడ్డారు. వివేక చివరి కోరిక ఇప్పుడు గుర్తొచ్చిందా అని నిలదీశారు. 20 ఏళ్లుగా తండ్రిని ఒంటరిగా వదిలేసిన సునీత నీతులు చెప్పడం సిగ్గుచేటన్నారు.

వివరాలు 11లో ▸

డబ్బుతో వస్తేనే టీడీపీ టికెట్లు



టీడీపీలో సూట్‌కేసుల్లో డబ్బు తీసుకొచ్చినవారికే టికెట్లు కేటాయిస్తున్నారని, ఎన్నో ఏళ్లుగా జెండా మోసినవారికి, పార్టీకోసం అహర్నిశలు కష్టపడినవారికి మొండిచెయ్యి చూపుతున్నారని అన్నమయ్య జిల్లా రాయచోటి టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సీఎం పదవి కోసం చంద్రబాబు లేని హైప్‌ను సృష్టిస్తున్నారని విమర్శించారు.

వివరాలు 11లో ▸



పల్నాడు జిల్లా గంటావారిపాలెంలో జరిగిన ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఆయన సతీమణి వైఎస్ భారతిని ఆశీర్వదిస్తున్న వేద పండితులు

ఉగాది వేడుకల్లో సీఎం జగన్ దంపతులు

2లో

- పల్నాడు జిల్లా గంటావారిపాలెం వద్ద క్యాంపులో సంప్రదాయబద్ధంగా నిర్వహణ
- పాల్గొన్న సీఎం జగన్, ఆయన సతీమణి వైఎస్ భారతి
- తెలుగు ప్రజలందరికీ మంచి జరగాలని సీఎం ఆకాంక్ష

శ్రీవారి ఆలయంలో వేడుకగా ఉగాది ఆస్థానం

5లో

మిమ్మల్నే గెలిపించుకుంటాం

నినదిస్తున్న జనం.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఊరూరా భరోసా

సరికొత్త రికార్డులకు వేదికగా నిలుస్తున్న 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర



- మండుటెండైనా, అర్ధరాత్రైనా ఉప్పొంగుతున్న అభిమానం
- స్కూలు విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు జననేత కోసం ఆరాటం
- దగ్గర నుంచి చూసేందుకు.. మాట కలిపేందుకు.. సెల్ఫీ దిగేందుకు పోటీ
- 'మేలు చేస్తాం.. ఓటు వేయండి' అనేది మామూలుగా నేతల మాట

2లో

- కానీ జనంతో సీఎం వైఎస్ జగన్ మమేకమవుతున్నప్పుడు తద్భిన్నమైన పరిస్థితులు.. 'మీ పాలనలో మాకు మంచి జరిగింది.. మిమ్మల్నే గెలిపించుకుంటాం' అని జనం హామీ
- రాజకీయాల్లో ఇలాంటి అరుదైన ఘట్టాలు.. ఇదే ప్రథమం అంటున్న రాజకీయ విశ్లేషకులు
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాయకత్వంపై విశ్వసనీయతకు ప్రతీక అంటున్న విశ్లేషణలు
- చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సభలకు కనిపించని జన స్పందన

వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయం ఖాయమంటున్న రాజకీయ పరిశీలకులు

ఇదంజగత్



నా కోసం తినకుండా ఉండకు.. ప్రచారం చేసుకొని అటు నుంచి అటు ఇఫ్తార్ విందుకెళ్లొస్తా!!

నాలుక మడతేస్తూ

నయవంచన

గతంలో నోటికి వచ్చినట్లు వలంటీర్లను తిట్టిన టీడీపీ అధినేత చంద్రబాబు

- అవి గోనె సంచులు మోసే ఉద్యోగాలంటూ ఎద్దేవా
- రాత్రిళ్లు తలుపులు కొడుతున్నారంటూ అవమానకర ఆరోపణలు
- ఇప్పుడు ఎన్నికల సమయంలో నాలుక మడత.. ఆ వ్యవస్థను కొనసాగిస్తామంటూ కొత్త డ్రామా
- మరోవైపు.. వలంటీర్లను అదేపనిగా తిడుతున్న టీడీపీ నేతలు
- వారిని ఉగ్రవాదులన్న శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్
- తమ పార్టీ ఫిర్యాదువల్లే వారితో పింఛన్ల పంపిణీ ఆగిందన్న ఆదిరెడ్డి వాసు.. వలంటీర్లను కొనసాగిస్తాం అంటున్న చంద్రబాబు
- ఎన్నికల వేళ టీడీపీ డబుల్‌గేమ్



సాక్షి, అమరావతి: నరంలేని నాలుక ఎన్ని వంకర్లయినా తిరుగుతుంది.. టీడీపీ అధినేత చంద్రబాబులా ఏదైనా మాట్లాడుతుంది. నిన్నటి వరకూ వలంటీర్లను ఇష్టం వచ్చినట్లు తిట్టిన నోటితోనే ఇప్పుడు వారిని కొనసాగిస్తామని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతనం కంటే ఎక్కువ ఇస్తామంటూ ఊసరవెల్లే సిగ్గుపడేలా ఎన్నికల వేళ చంద్రబాబు రంగులు మారుస్తున్నారు. తనకు రాజకీయ అవసరం తప్ప దేనిపైనా ఒక నిర్దిష్టంగా విధానమంటూ ఉండదని తన అవకాశవాద నైజాన్ని ఆయన మరోసారి చాటుకున్నారు. తాను అధికారంలోకి వస్తే వలంటీర్లకు ఇప్పుడిస్తున్న రూ.5 వేల గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతానని ఉగాది వేడుకల సందర్భంగా చంద్రబాబు ప్రకటించడంతో టీడీపీ నేతలే అవాక్కయ్యారు. మూడ్రోజుల క్రితమే వలంటీర్లకు నెలనెలా రూ.50 వేలు వచ్చేలా చేస్తానని

మిగతా 12వ పేజీలో ▶

జారుకుంటున్న

జనసైన్యం..

చంద్రబాబు చట్రంలో చిక్కుకున్న జనసేన అధినేత పవన్

పార్టీకి భవిష్యత్తు లేకుండా చేస్తున్న చంద్రబాబు

- గెలవని స్థానాలు జనసేనకు కట్టబెట్టిన టీడీపీ అధినేత.. ఇచ్చిన స్థానాల్లోనూ తన మనుషులే ఉండేలా కుట్రలు
- అన్నింటికీ తల ఊపుతున్న పవన్
- పవన్‌పై అసంతృప్తితో జనసేన నేతలు, అభిమానులు
- పార్టీకి భవిష్యత్తు లేదని నిర్ధారణ.. ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్న నేతలు
- పార్టీకి పట్టున్న ఉభయ గోదావరి జిల్లాల్లోనే పలువురు బయటకు
- వీరిలో అనేక మంది గత ఎన్నికల్లో పోటీ చేసి, గట్టి పోటీ ఇచ్చిన వారే

11లో





ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఆపద వేళ ఆదుకున్న సర్కారు



నా పిల్లలు చిన్నగున్నప్పుడే మా ఆయన కన్నుమూశారు. అప్పటి నుంచి కుటుంబ పోషణ బాధ్యత నాపై పడింది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో ఉంటున్నాం. ఏదో ఒక పనికి వెళితేగాని పూట గడిచేది కాదు. కొన్నిసార్లు పస్తులు కూడా ఉండాల్సి వచ్చేది. గత ప్రభుత్వం మమ్మల్ని ఏ విధంగానూ ఆదుకోలేదు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక నా పరిస్థితి బాగుపడింది. ఏ దిక్కూ లేని మా కుటుంబానికి సంక్షేమ పథకాలు అండగా నిలిచాయి. వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.28 వేలు వచ్చింది. పెన్షన్ కానుక ప్రతి నెలా వస్తోంది. ఆ డబ్బులతో కిరాణా, కూరగాయల వ్యాపారం ప్రారంభించాను. దాంతోపాటు కుట్టు మెషీన్ కొనుగోలు చేసి ఖాళీ సమయాల్లో బట్టలు కుడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. జగనన్న చేదోడు ద్వారా లబ్ధి పొందాను. అమ్మఒడి పథకం ద్వారా ఏటా రూ.15 వేలు చొప్పున ప్రభుత్వం అందించింది. దాంతో పిల్లల చదువుల భారం తప్పింది. మా కష్టాలన్నీ తీరాయి. దానికి కారణమైన ఈ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటాను.

– జుత్తిక వెంకటలక్ష్మి, చేబ్రోలు
(సూర్యనారాయణమూర్తి, విలేకరి, గొల్లప్రోలు)

భర్త చనిపోతే అండగా నిలిచారు



నేను ఓ ఇంట్లో పని చేసుకుంటున్నా. కూలి పనులు చేసుకుంటూ నన్ను, పిల్లల్ని పోషించిన మా ఆయన సీతా రామ్‌కుమార్ రెండేళ్ల క్రితం ఆకస్మికంగా చనిపోయారు. అప్పుడు ఈ ప్రభుత్వమే ఆదుకుని మా కుటుంబాన్ని నిలబెట్టింది. విశాఖ జిల్లా భీమిలి జోన్ పరిధిలోని సంతపేటలో నివసిస్తున్న మాకు నా భర్త చనిపోయిన తర్వాత ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకం కింద రూ.లక్ష అందించింది. దరఖాస్తు చేసిన వెంటనే వితంతు పింఛన్ మంజూరైంది. నా పెద్ద కుమారుడు కేశవ సాయి శ్రీ ఆంజనేయ సంతపేటలోని అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్‌లో 6వ తరగతి, రెండో అబ్బాయి దిల్వర్షన్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో 3 తరగతి చదువుతున్నారు. ఏటా రూ.15 వేల వంతున అమ్మఒడి వస్తోంది. కావలసిన పుస్తకాలు, యూనిఫాం వంటివన్నీ ప్రభుత్వమే ఉచితంగా ఇస్తుండడంతో పిల్లల చదువు భారం తప్పింది. ప్రతి నెలా ఉచితంగా 15 కిలోల రేషన్ బియ్యం ఇస్తున్నారు. ఇల్లు లేని నాకు ఆనందపురం మండలం జగన్నాథపురంలో రూ.3 లక్షల విలువైన స్థలం ఇచ్చారు. ఇంటి నిర్మాణం చేపట్టవలసి ఉంది. మా కుటుంబాన్ని ఎంతగానో ఆదుకున్న జగనన్నే మళ్లీ సీఎం కావాలని ఆశిస్తున్నా.

– బోర గౌరి, సంతపేట
(గేదెల శ్రీనివాసరెడ్డి, విలేకరి, తగరపువలస)

చేనేత వృత్తికి పునరుజ్జీవం



మా తాతల కాలం నుంచి చేనేత వృత్తినే జీవనాధారంగా చేసుకుని కాలం గడుపుతున్నాం. శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం కొనుసుల కొత్తూరులో బట్టలు నేసుకుని వాటిని అమ్ముకుని జీవించేవాళ్లం. కానీ పరిస్థితులు అనుకూలించక పోవడంతో ఈ వృత్తిలో కొనసాగడం కష్టమైంది. దివంగత మహానేత వైఎస్సార్ హయాంలో వస్త్రాల తయారీకి అవసరమైన ముడి సరుకు ధరలపై ట్యాక్స్ ఎత్తివేయడంతో కొంత వరకు మాకు సాయ పడింది. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోలేదు. బతుకు తెరువుకోసం వలస పోవాలని అనుకున్నాం. అదృష్టవశాత్తు ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక మా పరిస్థితుల్లో చాలా మార్పులొచ్చాయి. మగ్గం ఉన్న ప్రతి కుటుంబానికి ఏటా రూ.24 వేలు వంతున నేతన్న నేస్తం పథకం కింద అందించారు. దాంతో మా వృత్తికి కొంత భరోసా లభించింది. ముడి సరుకు తెచ్చుకునేందుకు అప్పు చేయాల్సిన బాధ తప్పింది. ఇప్పటి వరకు ఐదు దఫాలుగా మొత్తం రూ.1.20 లక్షలు వచ్చింది. మా నాన్నకు వృద్ధాప్య పింఛన్, అమ్మకు వైఎస్సార్ చేయూత ద్వారా రూ.18,750 వచ్చింది. మగ్గం ఉన్న చేనేత కుటుంబానికి విద్యుత్ సబ్సిడీ వస్తోంది. ఇంత కంటే మాకింకేం కావాలి? మా సంక్షేమానికి కృషి చేసిన జగనన్న రుణం తీర్చుకుంటాం.

– యర్ర సూర్యనారాయణ, కొనుసులకొత్తూరు
(లింగూడు వెంకటరమణ, విలేకరి, టెక్కలి)



నేడు మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఇలా..

- ఉదయం 9 గంటలకు ప్రారంభం
- దేవరంపాడు క్రాస్ వద్ద భోజన విరామం
- అయ్యప్పనగర్ బైపాస్ వద్ద బహిరంగ సభ
- ధూళిపాళ్ల దగ్గర రాత్రి బస

సాక్షి, అమరావతి: మేమంతా సిద్ధం 12వ రోజు బుధవారం (ఏప్రిల్ 10) షెడ్యూల్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం మంగళవారం విడుదల చేశారు. ఈ యాత్రలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రాత్రి బస చేసిన గంటావారిపాలెం వద్ద నుంచి బుధవారం ఉదయం 9 గంటలకు యాత్ర ప్రారంభిస్తారు. పుట్టవారిపాలెం, సంతమాగులూరు క్రాస్, రొంపిచర్ల క్రాస్, విప్పెర్ల, నెకరికల్లు మీదుగా దేవరంపాడు క్రాస్ వద్దకు చేరుకుని భోజన విరామం తీసుకుంటారు. అనంతరం కొండమోడు, పిడుగురాళ్ల బైపాస్ మీదుగా సాయంత్రం 3.30 గంటలకు అయ్యప్పనగర్ బైపాస్ వద్దకు చేరుకుంటారు. అక్కడ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. సభ అనంతరం కొండమోడు జంక్షన్, అనుపాలెం, రాజుపాలెం, రెడ్డిగూడెం మీదుగా ధూళిపాళ్ల దగ్గర రాత్రి బస శిబిరానికి చేరుకుంటారు.

12న గుంటూరులో మేమంతా సిద్ధం సభ

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు నగరంలో ఈనెల 12న 'మేమంతా సిద్ధం' సభ జరుగుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం తెలిపారు. మంగళవారం ఆయన ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితో కలిసి సభ జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 12వ తేదీ ఉదయం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర సత్తెనపల్లి, మేడికొండూరు, పేరేచర్ల, నల్లపాడు, చుట్టుగుంట సెంటర్, వీవీపీ రోడ్ మీదుగా ఏటుకూరు చేరుకుంటుందని చెప్పారు. అక్కడ జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన సభలో ప్రజలను ఉద్దేశించి సీఎం జగన్ మాట్లాడుతారని తెలిపారు. రాత్రికి గుంటూరు జిల్లాలోనే సీఎం జగన్ బస చేస్తారని వెల్లడించారు. 13వ తేదీ ఉదయం ఎన్టీఆర్ జిల్లాలోకి బస్సు యాత్ర ప్రవేశిస్తుందని తెలిపారు.

ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దంపతులు

- పల్నాడు జిల్లా గంటావారిపాలెం వద్ద క్యాంపులో సంప్రదాయబద్ధంగా నిర్వహణ
- పూజల్లో పాల్గొన్న సీఎం జగన్, ఆయన సతీమణి వైఎస్ భారతి
- తెలుగు ప్రజలందరికీ మంచి జరగాలని ముఖ్యమంత్రి ఆకాంక్ష





తన సతీమణి వైఎస్ భారతీ రెడ్డి నుదుటిన బొట్టు పెడుతున్న సీఎం జగన్.. ఉగాది పచ్చడి స్వీకరిస్తున్న సీఎం జగన్ దంపతులు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్ భారతి మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం గంటావారిపాలెం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో నిర్వహించిన ఉగాది పూజా కార్యక్రమాల్లో సీఎం జగన్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని వేద పండితులు ఆశీర్వదించారు. తీర్థప్రసాదాలు, ఉగాది పచ్చడిని అందజేయగా సీఎం జగన్ దంపతులు స్వీకరించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ మంచి జరగాలని సీఎం జగన్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్, వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి..

రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. 'రాష్ట్ర ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో నా అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు, అవ్వాతాతలు, విద్యార్థులు అందరికీ మంచి జరిగి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నాను' అంటూ ట్వీట్ చేశారు.

మిమ్మల్నే గెలిపించుకుంటాం

నినదిస్తున్న జనం.. సీఎం జగన్‌కు ఊరూరా భరోసా

ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గం పరిధిలోని కొనకనమిట్ల వద్ద ఏప్రిల్ 7న 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. షెడ్యూలు ప్రకారం అక్కడ మధ్యాహ్నం 3.30 గంటలకు సభ ప్రారంభమవుతుందని నిర్వాహకులు చెప్పడంతో మధ్యాహ్నం 12 గంటలకే సభా ప్రాంగణంలోకి జనప్రవాహం ప్రారంభమైంది. మధ్యాహ్నం 3 గంటలకే సభా ప్రాంగణం ఇసుకేస్తే రాలనంతగా జనంతో కిక్కిరిసిపోయింది. ఓ వైపు మండుతున్న ఎండ.. మరో వైపు ఉక్కపోత.. అయినా సభా ప్రాంగణం నుంచి లక్షలాది మంది అక్కడి నుంచి కాలు కదపలేదు. బస్సు యాత్రకు జనం అడుగడుగునా నీరాజనం పలకడంతో సభా ప్రాంగణానికి సీఎం వైఎస్ జగన్ కాస్త ఆలస్యంగా సాయంత్రం 5 గంటలకు చేరుకున్నారు. జననేతను చూడగానే అప్పటిదాకా పడిన ఇబ్బందిని జనం మరిచిపోయి ఆనందంతో హర్షధ్వానాలు చేశారు. 'ఇంత మేలు చేసిన మీకు కాకుండా ఎవరికి ఓటు వేస్తాం.. మిమ్మల్ని గెలిపించుకోవాల్సిన బాధ్యత మాదే'నంటూ నినాదాలు చేశారు. ఇలా ఎక్కడికక్కడ సీఎం జగన్ పట్ల పెరుగుతున్న ఆదరణ సరికొత్త చారిత్రక విజయానికి బాటలు వేస్తోంది.



సాక్షి, అమరావతి: పేదంటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చడానికి.. చంద్రబాబు వంటి మోసగాళ్ల నుంచి రాష్ట్ర భవిష్యత్తును కాపాడేందుకు 'నేను సిద్ధం.. మీరంతా సిద్ధమా?' అని సీఎం వైఎస్ జగన్ పిలుపునిస్తే.. సెల్ ఫోన్ టార్చ్‌లైట్ వెలిగించి 'మేమంతా సిద్ధం' అంటూ లక్షల గళాలు దిక్కులు పిక్కటిల్లేలా నినదిస్తున్నాయి. మేమెంతా మీ వెంటేనంటూ అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, అన్నదమ్ములు అడుగులో అడుగు వేస్తున్నారు. ఎక్కడికక్కడ అభిమానం అడ్డుపడుతుండటంతో సీఎం జగన్ చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర షెడ్యూల్ సమయం కంటే రెండు గంటలు ఆలస్యంగా సాగుతోంది. ఈ నెల ఒకటవ తేదీన శ్రీసత్యసాయి జిల్లా కదిరిలోకి షెడ్యూలు సమయం కంటే మూడు గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.45 గంటలకు సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్ర ప్రవేశించింది. మధ్యాహ్నం 2 గంటలకే నేల ఈనిందా అన్నట్లుగా జనంతో కదిరి కిక్కిరిసిపోయింది. అనంతపురం–మదనపల్లె రహదారిపై సీఎం వైఎస్ జగన్ నిర్వహించిన రోడ్ షోకు అడగడుగునా జనం నీరాజనాలు పలకడంతో కుంభమేళాను తలపించింది. రోడ్ షో సాగినంత దూరం సెల్‌ఫోన్ టార్చ్‌లైట్‌లను వెలిగించి జనం సీఎం వైఎస్ జగన్‌కు సంఘీభావం తెలిపారు. రెండు కిలోమీటర్ల పొడవున రోడ్ షో నిర్వహించడానికి 2.10 గంటల సమయం పట్టిందంటే జనం ఏ స్థాయిలో పోటెత్తారన్నది అర్థం చేసుకోవచ్చు.

అందరి అభిమతం అదే..

వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని ఇడుపులపాయ నుంచి పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గంలోని శావల్యాపురం మండలం గంటావారిపాలెం వరకు ఇప్పటిదాకా సాగిన బస్సు యాత్రలో అడగడుగునా ఇలాంటి దృశ్యాలు సాక్షాత్కారించాయి. సాధారణంగా ఎన్నికల సమయంలో మీకు ఫలాన మేలు చేస్తాం.. మాకు ఓటేయండి.. అని ప్రజలకు నాయకులు హామీలు ఇస్తుంటారు. కానీ.. బస్సు యాత్రలో జనంతో సీఎం వైఎస్ జగన్ మమేకమైనప్పుడు 'మీ పాలనలో మాకు మంచి జరిగింది. మళ్లీ మీరే రావాలి. మిమ్మల్నే గెలిపించుకుంటాం' అంటూ యువతీ యువకుల నుంచి వృద్ధుల వరకు హామీలు ఇస్తుండటం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దేశ రాజకీయ చరిత్రలో ఇలాంటి మహోజ్వల ఘట్టాలను తామెన్నడూ చూడలేదని.. సీఎం వైఎస్ జగన్ నాయకత్వంపై ప్రజల్లో నమ్మకం బలంగా నాటుకుపోయిందనడానికి ఇవే తార్కాణమని విశ్లేషిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరో చారిత్రక విజయం సాధించడం ఖాయమనడానికి బస్సు యాత్రలో అడుగడుగునా కన్పిస్తున్న దృశ్యాలే నిదర్శనమని తేల్చి చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే టైమ్స్ నౌ–ఈటీజీ, జీన్యూస్ వంటి ప్రతిష్ఠాత్మక జాతీయ మీడియా సంస్థలు డజనుకు పైగా నిర్వహించిన సర్వేల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించడం ఖాయమని తెగేసి చెబుతుండటం గమనార్హం.

రాబోయేది వైఎస్సార్‌సీపీ సునామీయే

సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులను సన్నద్ధం చేయడానికి భీమిలి (ఉత్తరాంధ్ర), దెందులూరు (ఉత్తర కోస్తా), రాప్తాడు (రాయలసీమ), మేదరమెట్ల (దక్షిణ కోస్తా)లలో నిర్వహించిన సిద్ధం సభలకు జనం పోటెత్తడంతో ఒకదానికి మించి మరొకటి గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. ఉమ్మడి రాష్ట్రం, తెలుగు రాష్ట్రాల చరిత్రలో రాప్తాడు, మేదరమెట్ల సిద్ధం సభలు అతి పెద్ద ప్రజాసభలుగా నిలిచాయి. ఇదే సమయంలో ఎన్నికల తొలి విడత ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్వహిస్తున్న బస్సు యాత్ర జైత్ర యాత్రలా కొనసాగుతోంది. ప్రజాక్షేత్రంలో సీఎం వైఎస్ జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోవడానికి భయపడిన చంద్రబాబు.. జనసేనతో జట్టుకట్టి తాడేపల్లిగూడెంలో ఉమ్మడిగా నిర్వహించిన సభ జనం లేక అట్టర్ ఫ్లాప్ అయ్యింది. దాంతో బీజేపీతో జట్టుకట్టిన టీడీపీ–జనసేన.. సాక్షాత్తు ప్రధానిని రప్పించి చిలకలూరిపేటలో ప్రజాగళం పేరుతో నిర్వహించిన సభకు జనం మొహం చాటేయడంతో కూటమిలో నైతిక స్థైర్యం దెబ్బతింది. పొత్తులో సీట్ల లెక్క తేలాక.. అభ్యర్థుల ఎంపిక పూర్తయ్యాక, ఆ పార్టీలో చెలరేగిన అసమ్మతి కూటమిని చావు దెబ్బతీసింది. కేంద్ర ఎన్నికల సంఘంపై ఒత్తిడి తెచ్చి వృద్ధులకు ఇంటి వద్ద పెన్షన్ అందించకుండా వలంటీర్లను చంద్రబాబు అడ్డుకోవడంతో కూటమిపై అన్ని వర్గాల్లోనూ వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఓ వైపు సీఎం బస్సు యాత్రకు జనం బ్రహ్మరథం పడుతుండటం.. మరో వైపు చంద్రబాబు ప్రజాగళం పేరుతో, పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచార సభలకు ప్రజలు మొహం చాటేస్తుండటంతో కూటమి అభ్యర్థుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 21–22 లోక్‌సభ స్థానాలు చేజిక్కించుకుని ఘన విజయం సాధిస్తుందని పలు జాతీయ మీడియా సంస్థల సర్వేల్లో వెల్లడైంది. ఈ దృష్ట్యా రాబోయేది వైఎస్సార్‌సీపీ సునామీయేనని రాజకీయ విశ్లేషకులు తేల్చి చెబుతున్నారు.

జైత్ర యాత్రలా బస్సు యాత్ర

సార్వత్రిక ఎన్నికల తొలి విడత ప్రచారంలో భాగంగా గత నెల 27న వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ వద్ద మహానేత వైఎస్సార్ ఘాట్ నుంచి సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్రను ప్రారంభించారు. వైఎస్సార్, నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, పల్నాడు జిల్లాల మీదుగా ఇప్పటిదాకా బస్సు యాత్ర సాగింది. మండుటెండను లెక్క చేయకుండా స్కూలు విద్యార్థుల దగ్గర నుంచి అవ్వాతాతల వరకు పోటీపడి సీఎం జగన్‌కు సంఘీభావం తెలుపుతున్నారు. బిడ్డలను చంకనేసుకుని సీఎం జగన్‌ను చూసేందుకు బస్సు వెంట యువతీ యువకులతో పోటీపడుతూ మహిళలు పరుగులు తీస్తున్న దృశ్యాలు అడుగడుగునా కన్పిస్తున్నాయి. స్కూలు విద్యార్థులైతే సీఎం జగన్‌ను చూసేందుకు తల్లితండ్రులతోపాటు వస్తున్నారు. సీఎం జగన్‌ను చూడగానే 'అదుగో జగన్ మామయ్య' అంటూ చూపుతున్నారు. ఆ పిల్లలను సీఎం జగన్ అక్కున చేర్చుకుంటుండటంతో పిల్లలు ఆనందపరవశులవుతున్నారు. సీఎం వైఎస్ జగన్‌ను దగ్గర నుంచి చూసేందుకు.. మాట కలిపేందుకు.. వీలైతే సెల్ఫీ దిగేందుకు జనం పోటీ పడుతున్నారు. యువత, మహిళలు, రైతులు, వృద్ధులు ఇలా అన్ని వర్గాల వారితో సీఎం మమేకమవుతున్నారు. బస్సు యాత్రలో భాగంగా ప్రొద్దుటూరు, నంద్యాల, ఎమ్మిగనూరు, మదనపల్లె, పూతలపట్టు, నాయుడుపేట, కావలి, కొనకనమిట్లలో నిర్వహించిన బహిరంగ సభలకు జనం పోటెత్తడంతో ఒకదానికి మించి మరొకటి సూపర్ హిట్టయ్యాయి. ఏ సమయం అయినా సీఎం వైఎస్ జగన్ నిర్వహించే రోడ్ షోల్లో అభిమాన సంద్రం ఉప్పొంగుతోంది. రాత్రి పొద్దుపోయినా దర్శి జన సంద్రాన్ని తలపించింది.



ప్రజల్లో విశ్వసనీయతకు ప్రతీక

ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం సీఎం వైఎస్ జగన్ అమలు చేశారు. గత 58 నెలల్లో అర్హతే ప్రామాణికంగా.. ఎలాంటి వివక్షకు తావు లేకుండా.. అత్యంత పారదర్శకంగా నవరత్నాలు, సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ రూపంలో 87 శాతం కుటుంబాల ఖాతాల్లో రూ.2.70 లక్షల కోట్లు జమ చేశారు. నాన్ డీబీటీ రూపంలో మరో రూ.1.79 కోట్ల ప్రయోజనం చేకూర్చారు. డీబీటీ, నాన్ డీబీటీ కలిపి రూ.4.49 లక్షల కోట్ల ప్రయోజనం కలిగించారు. దేశ చరిత్రలో ఇదో రికార్డు. వాటిని సద్వినియోగం చేసుకున్న ప్రజలు పేదరికం నుంచి గట్టెక్కుతున్నారు. రాష్ట్రంలో పేదరికం 2015–16లో 11.77 శాతం ఉంటే.. 2022–23 నాటికి 4.19 శాతానికి తగ్గడమే అందుకు నిదర్శనం. విద్య, వ్యవసాయ, పారిశ్రామిక, వైద్య రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చిన సీఎం వైఎస్ జగన్ రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారు. కేబినెట్ నుంచి నామినేటెడ్ వరకు పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పెద్దపీట వేసి ఆ వర్గాల సామాజిక సాధికారతకు బాటలు వేశారు. గ్రామ, వార్డు సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ, జిల్లాల పునర్ వ్యవస్థీకరణ ద్వారా ప్రభుత్వ సేవలను ఇంటి గుమ్మం వద్దే ప్రజలకు అందిస్తున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలు కొనసాగించి.. సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ నాయకత్వంపై ప్రజల్లో రోజు రోజుకు విశ్వసనీయత పెరుగుతోంది. ఇదే బస్సు యాత్రలో సీఎం వైఎస్ జగన్‌కు బ్రహ్మరథం పట్టడానికి దారితీస్తోందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా ఉగాది వేడుకలు

సాక్షి,అమరావతి: గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఉన్న వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేదపండితులు రాకేష్ శర్మ పంచాంగ పఠనం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, మలసాని మనోహర్‌రెడ్డి, నారాయణ మూర్తి, బందెల కిరణ్ రాజ్ పాల్గొన్నారు. తాడేపల్లిలో వేద పండితులు నల్లపెద్ది శివరామ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ మహారుద్ర సహిత రాజశ్యామల సహస్ర చండీయాగం యాగశాలలో ఉగాది పూజలు నిర్వహించారు. సీఎం దంపతులకు అన్నీ శుభాలు జరగాలని కోరుతూ ఏపీ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ విజయశారదారెడ్డి, రక్షా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సురేష్ శ్రీ మహారుద్ర సహిత రాజశ్యామల సహస్ర చండీయాగాన్ని నిర్వహించారు.

నేడు టోఫెల్ పరీక్ష

- టోఫెల్ ప్రిపరేటరీ రాయనున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు
- 3 నుంచి 5 తరగతుల వరకు నేడు టోఫెల్ ప్రైమరీ పరీక్ష

సాక్షి, అమరావతి: ఆంగ్ల భాషలో రాష్ట్ర విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన టోఫెల్ ప్రిపరేటరీ సర్టిఫికేషన్ పరీక్ష బుధవారం నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. 13,104 పాఠశాలల్లో 3 నుంచి 5 తరగతుల వరకు చదువుతున్న 4,53,265 మంది విద్యార్థులు ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ (ఈటీఎస్) నిర్వహించే టోఫెల్ ప్రైమరీ పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. ఈ నెల 12న జరిగే టోఫెల్ జూనియర్ ప్రిపరేటరీ పరీక్షను 5,907 పాఠశాలలకు చెందిన 6 నుంచి 9 తరగతులు చదువుతున్న 16,52,142 మంది విద్యార్థులు రాయనున్నట్టు వివరించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు అమెరికాకు చెందిన ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ నుంచి టోఫెల్ సర్టిఫికెట్ ప్రదానం చేస్తారని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మన విద్యా వ్యవస్థను బలోపేతం చేసి, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచి, చిన్న వయసు నుంచే పోటీ పరీక్షల్లో రాణించేలా టోఫెల్ పరీక్షకు సిద్ధం చేయడం తమ లక్ష్యమన్నారు. జిల్లాల్లో అత్యుత్తమ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు పాఠశాలల మధ్య ఆరోగ్యకరమైన పోటీ వాతావరణం అవసరమని, ప్రతి పాఠశాలా ఉన్నత స్థాయిలో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థుల్లో ఉన్నతమైన నైపుణ్యాలు, బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడంలో రాజీ పడే ప్రసక్తి లేదన్నారు. టోఫెల్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రధాన నగరాలు, పట్టణాల్లో మంగళవారం నమోదైన ఉష్ణోగ్రతలు

నగరం/పట్టణం	గరిష్ఠం	కనిష్ఠం
రెంటచింతల	40.6	28.1
రాజమహేంద్రవరం	40.0	24.0
తిరుపతి	40.0	22.0
కర్నూలు	39.6	27.1
అనకాపల్లి	39.1	25.0
గుంటూరు	39.0	25.0
తాడేపల్లిగూడెం	39.0	23.0
నెల్లూరు	38.6	28.0
కడప	38.6	26.6
ఏలూరు	38.0	25.0
విజయవాడ	38.0	24.0
విశాఖపట్నం	35.6	23.8

క్లుప్తంగా...

పాఠశాల స్థాయిలోనే విలువలు నేర్పాలి

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్



ఆడిటోరియంను ప్రారంభిస్తున్న జస్టిస్ కృష్ణమోహన్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయిలోనే విలువలతో కూడిన సామాజిక పునాదులు వేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ అన్నారు. గుంటూరు కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో పునర్నిర్మించిన బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియాన్ని జస్టిస్ కృష్ణమోహన్ మంగళవారం ప్రారంభించారు. జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యారంగంలో విలువలు నానాటికీ దిగజారుతున్నాయని, భవిష్యత్తును నిర్మించుకునే విద్యార్థులకు విలువలతో కూడిన సామాజిక పునాదులు పాఠశాల నుంచే వేయాలని సూచించారు. భారతీయ విద్యా భవన్ కార్యదర్శి పెనుమత్స రామచంద్ర రాజు , బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ చైర్మన్ కృష్ణమూర్తి, సాహితీ సమాఖ్య కార్యదర్శి ఎస్‌వీఎస్ లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ శక్తిని గుర్తించినందుకు ధన్యవాదాలు

చంద్రబాబు, మోదీ, పవన్‌లను ఉద్దేశించి వైఎస్సార్‌సీపీ ట్వీట్

సాక్షి, అమరావతి: విప్లవాత్మకమైన వలంటీర్ వ్యవస్థ శక్తిని గుర్తించినందుకు చంద్రబాబుకు, నరేంద్రమోదీకి, పవన్ కళ్యాణ్‌లకు వైఎస్సార్ సీపీధన్యవాదాలు తెలియజేసింది. వలంటీర్లను కొనసాగిస్తానని, గౌరవ వేతనాన్ని పెంచుతానంటూ చంద్రబాబు చేసిన మోసపూరిత హామీలపై సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వైఎస్సార్‌సీపీ స్పందించింది. 'సీఎం జగన్ పాలన సాధించిన విజయానికి ఇదొక నిదర్శనం. ఈ విప్లవాత్మక వ్యవస్థను విపక్షాలు కూడా స్వాగతించి, దానిని అవలంబించేలా చేసింది. వలంటీర్లు బాధపడవద్దు. జూన్ 4న మళ్లీ వైఎస్ జగన్ ప్రభుత్వం రాగానే ఈ వలంటీర్ వ్యవస్థను తిరిగి తీసుకువస్తుంది' అని వైఎస్సార్‌సీపీ ట్వీట్ చేసింది.

విశాఖలో మెడికల్ సూచర్స్ సెంటర్



మెడ్‌టెక్ జోన్‌లో ఏర్పాటు కానున్న మెడికల్ సూచర్స్ సెంటర్ భవన నమూనా

సాక్షి, విశాఖపట్నం: అంతర్జాతీయ సంస్థలకు కేరాఫ్‌గా మారుతున్న విశాఖ నగరంలో మరో కీలక సంస్థ ఏర్పాటు కానుంది. ప్రపంచంలోనే అతి పెద్ద మెడ్‌టెక్ జోన్‌గా అవతరించిన ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో శస్త్ర చికిత్సలకు అవసరమైన మెడికల్ సూచర్స్ తయారీ సంస్థ రాబోతోంది. దీనికి సంబంధించిన భూమి పూజని మెడ్‌టెక్ జోన్‌లో మంగళవారం నిర్వహించారు. ఆస్ట్రేలియాకు చెందిన బయోవీవ్స్ లైఫ్‌సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ దీన్ని నిర్మిస్తోంది. మెడికల్ సూచర్స్ సౌకర్యాలు కల్పించేలా ఈ సెంటర్ ఏర్పాటు కానుందని బయోవీవ్స్ ప్రతినిధులు వెల్లడించారు.

టీవీ5 సాంబశివరావు పెట్రోల్ బంక్ స్వాధీనం

గచ్చిబౌలి: టీవీ 5 వైస్‌ప్రెసిడెంట్ సాంబశివరావుకు చెందిన పెట్రోల్ బంక్‌పై హెచ్‌పీసీఎల్ చర్యలకు దిగింది. ఫోర్జరీ డాక్యుమెంట్లతో పొందిన పెట్రోల్ బంక్‌ను మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. తనకు తెలియకుండా ఫోర్జరీ డాక్యుమెంట్లతో పెట్రోల్ బంక్ నడుపుతున్నారని సంధ్యా గ్రూపు ఎండీ శ్రీధర్‌రావు హెచ్‌పీసీఎల్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సాంబశివరావు, ఆయన కుటుంబ సభ్యులపైన మాదాపూర్ పీఎస్‌లో ఫోర్జరీ కేసు నమోదైంది. ఈ క్రమంలోనే హెచ్‌పీసీఎల్ అధికారులు పెట్రోల్ బంక్‌లోని కొంత భాగాన్ని సీజ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా హెచ్‌పీసీఎల్ అధికారులు ఆక్రమిత బంకును స్వాధీనం చేసుకున్నారు. పెట్రోల్ బంక్‌ను కూల్చివేసి అప్పగించాల్సి ఉందని సంధ్యా గ్రూపు ప్రతినిధులు తెలిపారు.

రేపు రంజాన్ పండుగ

- కనిపించని నెలవంక
- బుధవారంతో ఉపవాసాల ముగింపు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా మంగళవారం నెలవంక కనిపించినట్టు ఎక్కడి నుంచి కూడా సమాచారం రాలేదని, దీంతో గురువారం ఏప్రిల్ 11వ తేదీన ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్ పండుగ) జరుపుకోవాలని రుహియతే హిలాల్ కమిటీ (నెలవంక నిర్ధారణ కమిటీ) కన్వీనర్ సయ్యద్ ఇబ్రహీం హుస్సేనీ సజ్జాద్‌పాషా తెలిపారు. మొజంజాహీ మార్కెట్‌లోని కమిటీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నగరంతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని నెలవంక నిర్ధారణ కమిటీల ద్వారా నెలవంక కనబడినట్లు సమాచారం అందలేదన్నారు. బుధవారం రంజాన్ చివరి రోజుగా పరిగణించి ఉపవాసం పాటించాలని, గురువారం షవ్వాల్ 1వ తేదీ (ఏప్రిల్ 11)గా పరిగణించి రంజాన్ పండుగ జరుపుకోవాలని సూచించారు.

డిపాజిట్ల నిగ్గు తేలాల్సిందే

▶ మొదటి పేజీ తరువాయి

హైకోర్టు న్యాయమూర్తి ఏకపక్షంగా ఇచ్చిన తీర్పును పక్కనపెడుతున్నామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేసు లోతుల్లోకి వెళ్లి అందరి వాదనలు వినాలని తెలంగాణ హైకోర్టుకు స్పష్టం చేసింది. సీనియర్ న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించాలని, తాజాగా విచారణ చేపట్టి ఆర్నెళ్లలో ముగించాలని హైకోర్టుకు సూచించింది. స్వీకరించిన డిపాజిట్లకు సంబంధించి పబ్లిక్ నోటీసు ఇవ్వాలని పేర్కొంది. డిపాజిట్లు వెనక్కి తీసుకోని వారి సమస్యలు విని నివేదిక ఇచ్చేందుకు జ్యుడీషియల్ అధికారిని నియమించాలని హైకోర్టుకు సూచించింది. ఉమ్మడి హైకోర్టు విభజన చివరి రోజున అందరూ హడావుడిగా ఉన్న సమయంలో జస్టిస్ రజని ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఉండవల్లి అరుణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో పాటు మార్గదర్శి, రామోజీ దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను అత్యున్నత న్యాయస్థానం పరిష్కరించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

హైకోర్టు విభజనకు ఒక్క రోజు ముందు తీర్పు..

హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఉండవల్లి అరుణ్ కుమార్, ఏపీ ప్రభుత్వం, మార్గదర్శి, రామోజీరావులు దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లు తాజాగా మరోసారి విచారణకు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ... ఏపీ హైకోర్టు ఏర్పాటు కావడానికి ఒక రోజు ముందు అంటే 31.12.2018న మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు అనుకూలంగా ఉమ్మడి హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. అయితే మూడేళ్ల క్రితం హైకోర్టు తోసిపుచ్చిన క్వాష్ పిటిషన్‌కు, ఈ తాజా క్వాష్ పిటిషన్‌కు ఎలాంటి తేడా లేదన్నారు. కేసులో తాజాగా చోటు చేసుకున్న పరిణామాలు ఏవీ లేకున్నప్పటికీ మరోసారి క్వాష్ పిటిషన్ దాఖలు చేశారన్నారు. గతంలో హైకోర్టు తోసిపుచ్చిన అంశాన్ని దాచిపెట్టి ఈ పిటిషన్ వేశారని నివేదించారు. ఈ సమయంలో మార్గదర్శి తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ జోక్యం చేసుకొంటూ.. సేకరించిన రూ.2,600 కోట్లను 1,247 మంది డిపాజిటర్లకు 30.6.2023 నాటికి తిరిగి ఇచ్చేశారని చెప్పారు. సొమ్ము తీసుకున్న వారు కానీ, ప్రాసిక్యూషన్ స్టేట్ తెలంగాణ గానీ ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు. రూ.5.31 కోట్లు అన్‌క్లెయిమ్డ్ మొత్తం మాత్రమే మిగిలి ఉందన్నారు.

రూ.5 వేలు డిపాజిట్‌దారులు కోర్టుకొచ్చి పోరాడగలరా..?

ఈ సమయంలో న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుంటూ... సొమ్మంతా ఇచ్చేశారా? లేదా? ఫిర్యాదు చేశారా లేదా? అనే విషయాలు సమస్య కాదు. తీర్పులో హైకోర్టు ఏం చెప్పిందన్నదే ఇక్కడ ముఖ్యం. మొత్తం డిపాజిటర్లు ఇంత మంది ఉన్నారు.. ఇంత మొత్తం సొమ్ము ఉంది.. ఇస్తానన్న వడ్డీ, డివిడెంట్‌తో కలిపి ఇంత మొత్తం అయింది. ఆ తర్వాత సొమ్ములు ఇచ్చేశారు అనే విషయాలు తీర్పులో ఎక్కడున్నాయి? అని ప్రశ్నించారు. ఇలాంటి అంశాల్లో బయటకు రాలేని వ్యక్తుల సమస్యలు కూడా ఆలోచించాలన్నారు. రూ.5 వేలు డిపాజిట్ చేసిన వారు వేల రూపాయిలు ఖర్చు చేసి కోర్టుకు వచ్చి పోరాడగలరా? అని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న డిపాజిటర్ల గురించి హైకోర్టు పబ్లిక్ నోటీసు ఎందుకు ఇవ్వలేదో చూడాల్సిన అవసరం ఉందన్నారు.

మార్గదర్శిపై ఫిర్యాదులు లేవు...

మార్గదర్శిపై ఇప్పటి వరకూ ఫిర్యాదులు లేవని, ఇప్పుడు వస్తాయని సింఘ్వీ పేర్కొనగా.. సొమ్ములు మీవద్దే ఉంటే ఫిర్యాదు చేయడానికి ఎవరు ముందుకొస్తారని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. హైకోర్టుకు పంపడానికి ఏమీ లేదని, ఇక్కడే ఆదేశాలు ఇవ్వాలని సింఘ్వీ గట్టిగా కోరారు. ఈ సమయంలో నిరంజన్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ కొత్త పరిణామాలు ఏమీ లేకుండా ఒకసారి హైకోర్టు తోసిపుచ్చిన అంశాలతోనే క్వాష్ పిటిషన్ దాఖలు చేశారని గుర్తు చేశారు. హైకోర్టు ముందు వాదనలు జరిగిన సమయంలో తెలంగాణ నుంచి పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఒక్కరే హాజరయ్యారన్నారు. విభజన తర్వాత రెండు రాష్ట్రాలు ఏర్పడగా ఆ సమయంలో కోర్టు మాత్రం ఒక్కటే ఉందన్నారు. ఉల్లంఘనలు బయటకు రాగానే ఆ సమయంలో కొన్నాళ్లు డిపాజిట్లు నిలుపుదల చేసి మళ్లీ రూ.2,600 కోట్లు వసూలు చేశారని నిరంజన్‌రెడ్డి ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమయంలో సింఘ్వీ జోక్యం చేసుకొని ఇదంతా ప్రస్తుతం అనవసరమన్నారు.

హైకోర్టు కేసు లోతుల్లోకి వెళ్లలేదు...

ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ.. మీ తరఫున ముగ్గురు దిగ్గజాలు (సింఘ్వీ, రోహత్గీ, లూథ్రా) ఉన్నారంటూ వ్యాఖ్యానించింది. హైకోర్టు కేసు లోతుల్లోకి వెళ్లలేదని అభిప్రాయపడింది. గతంలో జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వులను సింఘ్వీ ప్రస్తావిస్తుండగా.. అదంతా తమకు తెలుసునని, ఆ ఉత్తర్వులను పరిశీలించామని ధర్మాసనం పేర్కొంది. దీంతో ఇదేమీ సహారా, ఆమ్రపాలి తరహా కేసు కాదని, రూ.5.31 కోట్లు మినహా మిగతా సొమ్ము అంతా వెనక్కి ఇచ్చేశామని, మొత్తం 70 వేల పేజీల రికార్డు సుప్రీంకోర్టుకు అందజేశామని సింఘ్వీ పేర్కొన్నారు. మొత్తం డిపాజిటర్లు ఎంత మంది? అని ధర్మాసనం ప్రశ్నించడంతో 2.7 లక్షల మంది అని సింఘ్వీ సమాధానమిచ్చారు.

చెల్లించారో లేదో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలి..

తొలుత ముందుకు రాని ఏపీ ప్రభుత్వం సడన్‌గా ఎందుకు వచ్చిందో కూడా అర్థం చేసుకోగలమని, అయితే దానిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయబోమని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఈ కేసును తిరిగి తెలంగాణ హైకోర్టుకు పంపుతామని, అక్కడ ఏపీ ప్రభుత్వం కూడా వాదనలు వినిపిస్తుందని, విచారణ పరిధి తెలంగాణ హైకోర్టుకు ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. రూ.2,600 కోట్లు తిరిగి చెల్లించేశామని సింఘ్వీ మరోసారి ప్రస్తావించడంతో... ఈ వాదన రాష్ట్ర ప్రభుత్వం నుంచి హైకోర్టుకు నివేదించాల్సి ఉందని న్యాయమూర్తి తెలిపారు. ఉమ్మడి హైకోర్టులో తెలంగాణ వాదనే విన్నారని, అయితే హైకోర్టు ఏ ప్రక్రియ అనుసరించిందనేది పరిశీలించాలని జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. పబ్లిక్ నోటీసు కన్నా మిన్నగానే తిరిగి చెల్లింపులు చేశామని, భవిష్యత్ మార్గదర్శకాలు ఇవ్వాలని సింఘ్వీ ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఆర్‌బీఐ స్టేటస్ రిపోర్టు ఇచ్చిన అంశాన్ని ఆయన గుర్తుచేయగా.. దాన్నేం మార్చలేం కదా? ఇప్పుడు అది అప్రస్తుతం అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

ఏమున్నా తెలంగాణ హైకోర్టులోనే..

సింఘ్వీ వాదనలు కొనసాగిస్తూ.. అదృష్టమో, దురదృష్టమో రామోజీరావు ఈనాడు పబ్లిషర్ కావడంతో చాలా విషయాలను ఆయన ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. రాష్ట్రంలో ఈనాడు చాలా పాత పేపరని, ఈటీవీ కూడా ఉందన్నారు. నాలుగేళ్లుగా ఈనాడు తమపై వార్తలు రాస్తోందనే కారణంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసులో ముందుకు వచ్చిందని ఆరోపించారు. ఇదంతా హైకోర్టులో చెప్పుకోవాలని ధర్మాసనం తేల్చి చెప్పింది. తిరిగి చెల్లించాల్సిన డిపాజిట్లు రూ.5 కోట్లు మాత్రమే ఉన్నందున ఉండవల్లి పిటిషన్‌ను కొట్టివేసి, భవిష్యత్తు మార్గదర్శకాలు ఇవ్వాలని సింఘ్వీ మరోసారి కోరగా హైకోర్టు ఎదుటే చెప్పుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

అక్కడొద్దు.. మీరే పరిష్కారం చూపండి

ఈ సమయంలో మార్గదర్శి తరఫు మరో సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ.. ఈ కేసును తెలంగాణ హైకోర్టుకు పంపొద్దని అభ్యర్థించారు. ఈ కేసు చాలా పాతదని, సుప్రీంకోర్టులోనే పరిష్కార మార్గం చూపాలని కోరారు. తగిన మార్గదర్శకాలు సూచిస్తూ ఆదేశాలు ఇవ్వాలన్నారు. అయితే తాము కేసు లోతుల్లోకి వెళ్లడం లేదని, నిర్దిష్ట కాలపరిమితితో కేసును పరిష్కరించాలని తెలంగాణ హైకోర్టుకు సూచిస్తామని ధర్మాసనం పేర్కొంది. అనంతరం మార్గదర్శి తరఫు మరో సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా వాదనలు ప్రారంభిస్తుండగా... ఆ పిటిషన్ ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది. హైకోర్టు ఆర్డర్‌లో హెచ్‌యూఎఫ్ విషయంలో వచ్చిన తప్పును సవాల్ చేశామని లూథ్రా తెలిపారు. ఇది ప్రస్తుతం అవసరం లేదని ధర్మాసనం అభిప్రాయపడింది.

తెలంగాణ హైకోర్టు అందరి వాదనలు వినాలి..

''పిటిషన్ దాఖలులో ఏపీ ప్రభుత్వ జాప్యాన్ని మన్నిస్తున్నాం. ఉండవల్లి అరుణ్‌కుమార్ ఎస్సెల్పీ విచారణ అర్హతతోపాటు పార్టీ ఇన్ పర్సన్‌గా అనుమతిస్తున్నాం. 31.12.18న ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేస్తున్నాం. మార్గదర్శి ఫైనాన్షియర్స్ డిపాజిట్ల కేసును తెలంగాణ హైకోర్టు తిరిగి విచారించాలి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఆర్‌బీఐ, ఉండవల్లి అరుణ్‌కుమార్, రామోజీరావు, అన్‌క్లయిమ్ డిపాజిటర్ల వాదనలు విని ఆరు నెలల్లోగా ఈ కేసును తేల్చాలి. అన్ క్లెయిమ్డ్ డిపాజిటర్ల సమస్యలు విని నివేదిక ఇచ్చేందుకు ఒక న్యాయాధికారిని నియమించాలి'' అని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.





ఏపీ ప్రభుత్వ వాదన కూడా వినాలి కదా...!

సింఘ్వీ తన వాదనలు కొనసాగిస్తూ.. ఫిర్యాదుదారు ఏపీ ప్రభుత్వం నియమించిన అ. దీకృత అధికారి కృష్ణరాజు అని, ప్రాసిక్యూట్ స్టేట్ తెలంగాణ ఒక్క ఫిర్యాదు కూడా చేయలేదన్నారు. సుప్రీంకోర్టుకు రావడానికి ఏపీ ప్రభుత్వం 1,236 రోజులు ఆలస్యం చేసిందనడంతో జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుంటూ డిపాజిటర్లు ఏపీలో కూడా ఉంటారు కదా? వారి వాదన ఆ రాష్ట్రం ద్వారానే కదా వినాలి? అని ప్రశ్నించారు. అయితే ఏపీ ప్రభుత్వం తొలుత రాలేదని సింఘ్వీ పేర్కొన్నారు. హైకోర్టు తీర్పునిచ్చే సమయంలో నిర్దిష్ట విధానాన్ని అనుసరించలేదనే విషయాన్ని తాము ప్రశ్నిస్తున్నామని జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. కేసు పూర్వాపరాల్లోకి, లోతుల్లోకి వెళ్లడం లేదని, అందరికీ అవకాశాలు తెరిచే ఉంచుతామన్నారు. హైకోర్టులో ప్రతివాదులందరూ వాదనలు వినిపించలేదని గుర్తు చేశారు. ఈ కేసును తిరిగి హైకోర్టుకు పంపుతామని తేల్చి చెప్పారు.

కత్తితో తిరగబడాలని లూథ్రానే చెప్పారు..

ఉండవల్లి అరుణ్‌కుమార్, ఆయన తరఫు న్యాయవాది అల్లంకి రమేశ్‌లు స్పందిస్తూ తాను ఎవరిపైనైనా వ్యాఖ్యలు చేసినా, ఎలాంటి పరుష పదాలు వినియోగించలేదన్నారు. రామోజీ రావుకు ఏదో అయిపోవాలని ఇక్కడకు రాలేదన్నారు. ఈ సమయంలో గతంలో సిద్దార్థ లూథ్రా చేసిన ఓ ట్వీట్ (స్కిల్ కేసులో చంద్రబాబుకు బెయిల్ రాని సందర్భంలో)ను ఉండవల్లి గుర్తు చేశారు. ఎక్కడా విజయం సాధించకపోతే ప్రజలు కత్తితో తిరగబడే అవకాశం ఉందంటూ ఒకరు సామాజిక మాధ్యమంలో వ్యాఖ్యలు చేశారని తెలిపారు. తానెప్పుడూ అలా చేయలేదని లూథ్రా పేర్కొనగా నిరూపించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఉండవల్లి తెలిపారు. తాను 50 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, వ్యక్తిగతంగా విమర్శించినట్లు ఎవరూ అనలేదన్నారు. ఈ కేసు పూర్తయ్యే వరకూ ఎక్కడా, ఎవరూ, ఏమీ మాట్లాడకూడదని ఆదేశాలు ఇవ్వాలని లూథ్రా ధర్మాసనాన్ని కోరారు. దీనిపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేస్తూ అలా ఎలా ఆదేశాలు ఇవ్వగలమని ప్రశ్నించింది. ఇరు పక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఈ ఆరు నెలలు వారికి పరీక్ష లాంటిదని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ప్రజా క్షేత్రంలో ఉన్నవారిని నియంత్రించడం సాధ్యం కాదన్నారు.

ఎలాంటి గ్యాగ్ ఆర్డర్ ఇవ్వలేం..

కోర్టు తీర్పులపై ఏపీ ప్రభుత్వం, ఉండవల్లి అరుణ్‌కుమార్ ఇష్టారీతిన వ్యాఖ్యలు చేస్తున్నారని రామోజీరావు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా నివేదించారు. ఏపీ ప్రభుత్వానికి సాక్షి పత్రిక ఉందని, దాంట్లో రామోజీరావుపై కథనాలు రాయకుండా నియంత్రించాలని కోరారు. ఈ దశలో నిరంజన్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ రామోజీరావుకే ఈనాడు, ఈటీవీ ఉన్నాయని కోర్టు దృష్టికి తెచ్చారు. సాక్షి పత్రికతో ఏపీ ప్రభుత్వానికి సంబంధం లేదన్నారు. తాను చట్టబద్ధంగా దీన్ని నిరూపించగలనని నిరంజన్‌రెడ్డి స్పష్టం చేశారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ఎలాంటి గ్యాగ్ ఆర్డర్‌లు ఇక్కడ ఇవ్వలేమని, కోర్టులో ఏం జరిగిందో చెప్పుకోవచ్చని, అదే సమయంలో జరగనిది చెప్పడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. కోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత ఉండవల్లి అరుణ్‌కుమార్ దాన్ని తప్పు పట్టారని లూథ్రా పేర్కొనడంతో దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. ఉండవల్లి మాజీ ఎంపీ, ప్రజా క్షేత్రంలో ఉంటారని వ్యాఖ్యానించింది. ప్రజల కోసమే ఉండవల్లి సుప్రీంకోర్టు వరకూ వచ్చారని, అదే సమయంలో కోర్టు తీర్పుపై తన అభిప్రాయాన్ని వెల్లడించి ఉంటారని పేర్కొంది. 'కోర్టు తీర్పులను కొందరు స్వాగతిస్తారు. మరికొందరు విమర్శిస్తారు. కోర్టు తీర్పులను ఒక్కొక్కరూ ఒక్కోలా చూడరాదంటూ మేం లక్ష్మణ రేఖ గీయలేం. ఈనాడు పత్రికకు ఏపీ ప్రభుత్వం వ్యతిరేకమన్న భావనతో అలా వ్యవహరించొద్దని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించలేం కదా! ప్రజాక్షేత్రంలో ఉండేవారు మీడియా ముందు అనేక విషయాలు ప్రస్తావిస్తారు. మీడియా వాటిని రాస్తుంది. ఎవరినీ నియంత్రించలేం. ఎవరి అభిప్రాయాలు వారికుంటాయి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అదే సమయంలో ఇరు పక్షాలు కోర్టు పరిధిలో ఉన్న అంశాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేసింది.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను చావబాదిన పోలీసులు

- టీడీపీ నేత సమక్షంలో కొట్టిన బందరు రూరల్ పోలీసులు
- ఎస్ఐతోపాటు బాధ్యులందరినీ విధుల నుంచి తొలగించాలని ఎమ్మెల్యే పేర్ని నాని డిమాండ్
- చర్యలు తీసుకుంటామన్న డీఎస్పీ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు




పార్టీ కార్యకర్తలను సముదాయిస్తున్న పేర్ని నాని

కోనేరు సెంటర్: టీడీపీ నేత సమక్షంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలను చితకబాదిన కృష్ణా జిల్లా బందరు రూరల్ పోలీసుల తీరు వివాదస్పదంగా మారింది. బందరు మండలం ఉల్లిపాలెంలో ఇటీవల జరిగిన ఓ గ్రామ దేవత సంబరంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ కార్యకర్తలు గొడవ పడ్డారు. కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు గాయాలు కావడంతో వారు ఆస్పత్రిలో చేరారు. దీనిపై పరస్పర ఫిర్యాదులు అందుకున్న బందరు రూరల్ ఎస్ఐ చాణక్య ఆస్పత్రి నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు డిశ్చార్జ్ అయ్యాక వారిని మంగళవారం స్టేషన్‌కు పిలిపించారు. మరో ఏఎస్సై, కానిస్టేబుల్‌తో కలిసి సుల్తానగరంకు చెందిన ఓ టీడీపీ నేత సమక్షంలో ముగ్గురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను లాఠీలతో ఎస్ఐ కుళ్లబొడిచారు. అంతేకాకుండా పిడిగుద్దులు గుద్ది, కార్యకర్తల ముఖాలను గోడకు బలంగా నొక్కి చిత్రహింసలు పెట్టారు. పోలీసులు కొట్టిన దెబ్బలకు ముగ్గురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్లో ఒకరికి చేయి విరిగిపోగా, మరొకరికి తలపై గాయమైంది. ఇంకో కార్యకర్త వీపంతా రక్తపుమరకలతో నిండిపోయింది. పోలీసుల చేతిలో చావుదెబ్బలు తిన్న కార్యకర్తలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బందరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పేర్ని నాని, ఆయన తనయుడు పేర్ని కిట్టు, తదితర నాయకులు, కార్యకర్తలు పోలీసు స్టేషన్‌కు చేరుకుని పోలీసుల తీరును ఖండించారు. కేసు నమోదు చేశాక తమ కార్యకర్తలను కొట్టే అధికారం మీకెవరిచ్చారంటూ పేర్ని నాని నిలదీశారు. టీడీపీ నేత సమక్షంలో తమ కార్యకర్తలను ఏకపక్షంగా కొట్టిన ఎస్ఐతోపాటు బాధ్యులందరినీ విధుల నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమాచారం అందుకున్న బందరు డీఎస్పీ సుభానీ, సబ్ డివిజన్‌కు చెందిన సీఐలు, ఎస్ఐలు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు కూడా భారీగా వచ్చారు. దీంతో స్టేషన్ వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. డీఎస్పీ ఈ ఘటనపై విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని పేర్ని నానికి హామీ ఇచ్చారు. దీంతో ఆయన శాంతించి అక్కడి నుంచి వెనుదిరిగారు. ఘటనపై డీఎస్పీ విచారణకు ఆదేశించారు.

రైతు క్షేత్రాలకు పరిశోధనా ఫలాలు చేరాలి

వ్యవసాయ ఉద్యానవన పంచాంగాలను ఆవిష్కరించిన సీఎస్



వ్యవసాయ, ఉద్యాన పంచాంగాలను ఆవిష్కరిస్తున్న సీఎస్ జవహర్‌రెడ్డి, తదితరులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని రైతు భరోసా కేంద్రాలను సమన్వయం చేసుకుంటూ పంటల వారీగా సాగు సమాచారాన్ని రైతులకు చేరేలా శాస్త్రవేత్తలు కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీ క్రోధి నామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం , డా.వైఎస్సార్ ఉద్యానవన విశ్వవిద్యాలయాలు రూపొందించిన వ్యవసాయ, ఉద్యాన పంచాంగాలను సీఎస్ ఆవిష్కరించారు. విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పరిశోధనా ఫలాలు రైతులకు చేరినప్పుడే వాటికి సార్థకత చేకూరుతుందన్నారు. సాగులో పాటించాల్సిన ఉత్తమ యాజమాన్య పద్ధతులతో పాటు వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం, భూసార పరీక్షలు, సామాజిక విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన పలు అంశాలను ఈ వ్యవసాయ పంచాంగంలో పొందుపర్చారన్నారు. రాష్ట్రంలో ప్రధాన పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు అనుసరించాల్సిన విధానాలపై సమగ్రంగా వివరించడం బాగుందన్నారు. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో రాష్ట్రంలోని రైతాంగమంతా మంచి దిగుబడులు సాధించి సుఖ శాంతులతో జీవనం సాగించాలని సీఎస్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయాల వైస్ చాన్స్‌లర్లు డాక్టర్.ఆర్.శారద జయలక్ష్మి, డాక్టర్ టి.జానకీరామ్, విస్తరణ సంచాలకులు కేఎస్.ఎస్.నాయక్, ఇ.కరుణశ్రీ, రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, విస్తరణ శాస్త్రం ప్రధాన శాస్త్రవేత్త బి.ముకుంద రావు, ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి జె.శారద, సీనియర్ శాస్త్రవేత్త యం .వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ కపట ప్రేమ!

- నాడు భారీ యంత్రాలతో యథేచ్ఛగా తవ్వకాలు
- ఉపాధి కరవై రోడ్డున పడ్డ ఇసుక కార్మికులు
- తప్పు సరిదిద్దుకొనే పనిలో చిన్నబాబు
- ఇదంతా ఎన్నికల జిమ్మిక్కులేనంటున్న బాధితులు



2016 మే 4న భారీ యంత్రాలతో నిర్వహిస్తున్న ఇసుక తవ్వకాలు

తాడేపల్లిరూరల్: ఇసుక కార్మికులపై టీడీపీ మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నారా లోకేశ్ కపట ప్రేమ చూపుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని, భారీ యంత్రాలతో ఇసుక దోచుకుంటున్నారని ఎన్నికల వేళ పసలేని ఆరోపణలు చేశారు. టీడీపీ హయాంలో ఆ పార్టీ నేతలు ఇష్టారాజ్యంగా ఇసుకను అమ్ముకున్న సంఘటనలు, అడ్డుకున్న అధికారులపై జరిగిన దాడులు మరిచి, మేము అధికారంలోకి వస్తే ఇసుక, భవన నిర్మాణ కార్మికులకు చేతినిండా పని కల్పిస్తామంటూ హామీలు గుప్పిస్తున్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. లోకేశ్ వ్యాఖ్యల నేపథ్యంలో 2014 నుంచి 2019 వరకు పరిణామాలను పరిశీలిస్తే...

2014కు ముందు...

ఉండవల్లి ప్రకాశం బ్యారేజ్ పైభాగంలో సైతం ఇసుక కార్మికులు నీటిలోకి దిగి పారలతో ఇసుక లోడింగ్ చేసేవారు. ప్రకాశం బ్యారేజ్ దిగువ ప్రాంతంలోని పాతూరు, గుండిమెడ, చిర్రావూరు, గొడవర్రు, రామచంద్రాపురం, పెదకొండూరు, వీర్లపాలెం దళిత కుటుంబాలు ఇసుక ట్రాక్టర్లకు, లారీలకు లోడింగ్ చేసి, పొట్ట నింపుకునేవారు.

2014 తర్వాత అక్రమంగా హైదరాబాద్‌కు ఇసుక

టీడీపీ అధికారం చేపట్టగానే ఆ పార్టీ సామాజిక వర్గానికి చెందిన నేతలు రేపల్లె నుంచి అచ్చంపేట వరకు మకాం వేశారు. దొరికిన కాడికి ఇసుక దోచుకుంటూ జేబులు నింపుకొన్నారు. కృష్ణానది ఎగువ ప్రాంతంలో ఉన్న ఇసుక కార్మికులను ఒక్కొక్కరిని తొలగించారు. అనుమతులు లేని భారీ పడవలను దించి, వాటికి ఇసుక తోడే యంత్రాలను ఏర్పాటు చేశారు. రోజుకు ఒక్కొక్క ఇసుక క్వారీ నుంచి 30 వేల టన్నుల ఇసుకను హైదరాబాద్ తదితర ప్రాంతాలకు భారీ వాహనాల్లో తరలించేవారు. ఇది గమనించిన స్థానిక నాయకులు మా ప్రాంతంలో కూడా ఇసుక తవ్వకాలు చేసుకోవచ్చని తలచారు. అంతే... భారీ యంత్రాలతో దోపిడీకి పాల్పడ్డారు.

అప్పటి గుంటూరు ఎమ్మెల్యే సోదరుడిది కీలక పాత్ర

ఈ దోపిడీలో అప్పటి గుంటూరుకు చెందిన ఓ ఎమ్మెల్యే సోదరుడు, నారా లోకేశ్ మిత్రుడు కీలక పాత్ర పోషించారు. చినబాబుకు సైతం భారీగా సొమ్ములు పంపారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. పాతూరు, గుండిమెడ ఇసుక రీచ్‌లో కార్మికులను పోలీసులతో బెదిరించి మరీ బయటకు పంపివేశారు. చిర్రావూరులో కొంతకాలం అక్కడి కార్మికులకు పని కల్పించారు. తర్వాత భారీ వాహనాల్లో ఇసుకను బయటకు తరలించాలంటే కార్మికుల వల్ల కాదని తాత్కాలికంగా మూడు రోజులపాటు క్వారీని నిలుపుదల చేశారు. అనంతరం 200 యంత్రాలు తీసుకువచ్చి ఇసుక లోడింగ్ నిర్వహించారు. దీంతో కార్మికులకు ఉపాధి కరవైంది.

అధికారులను బెదిరించి...

ఇసుక రీచ్‌ల్లో అధికారులు యంత్రాలకు అనుమతులు ఇవ్వనప్పటికీ వారిని భయభ్రాంతులకు గురిచేసి భారీగా తవ్వకాలు చేపట్టారు. అనుమతులకు మించి తవ్వకాలు వల్ల ఆ గుంతల్లో పడి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. వీటిని మూసివేయాలని పాతూరు, చిర్రావూరు తదితర ప్రాంతాల్లో స్థానికులు ఆందోళన చేశారు. పోలీసులచేత బెదిరించి, ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా జరిపారని నేటికీ కార్మికులు చెబుతున్నారు.



యథాభూతజ్ఞానం పొందిన వ్యక్తి దేనిలోనూ ఆత్మ లేదనీ, ఆత్మకు సంబంధించినది కూడా ఏదీ లేదనీ తెలుసుకుంటాడని బౌద్ధ ధర్మం చెబుతుంది.
– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి
బుధవారం, 10 ఏప్రిల్ 2024

సుప్రీమ్ తేల్చిన ప్రత్యేక హక్కు

ఇది చరిత్రాత్మక తీర్పు. ప్రభుత్వ విధానాలపై ప్రభావం చూపగల తీర్పు. ''పర్యావరణ మార్పుల దుష్ప్రభావం నుంచి విముక్తి''ని సైతం ప్రత్యేకమైన ప్రాథమిక హక్కుగా భారత సర్వోన్నత న్యాయస్థానం తొలిసారిగా గుర్తించింది. రాజ్యాంగం కల్పించిన సమానత్వపు హక్కు (ఆర్టికల్ 14), వ్యక్తిగత స్వేచ్ఛ, జీవించే హక్కు (ఆర్టికల్ 21)ల విస్తృత పరిధిలోకే అదీ వస్తుందంటూ గత వారం సుప్రీమ్ పేర్కొనడం విశేషం. గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ (బట్టమేక పిట్ట), లెస్సర్ ఫ్లోరికాన్ (గడ్డి నెమలి) లాంటి అంతరిస్తున్న పక్షుల పరిరక్షణకు సంబంధించిన ఓ కేసు విచారణలో కోర్ట్ ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. పక్షులను కాపాడడం, పర్యావరణ పరిరక్షణ... రెండూ కీలకమైన లక్ష్యాలంటూనే, ఒకదాని కోసం మరొకదాన్ని బలి చేయకుండా సమగ్ర వైఖరిని అవలంబించడం అవసరమని స్పష్టం చేసింది. పర్యావరణ మార్పులపై ఉదాసీనంగా ఉన్న పాలకులకు బాధ్యతను గుర్తు చేసింది.

గతంలోకి వెళితే, పక్షుల రక్షణ కోసం 2021లో గుజరాత్, రాజస్థాన్‌లలోని 99 వేల చదరపు కి.మీ.ల పైగా ప్రాంతంలో ఎత్తైన విద్యుత్ లైన్లపై సుప్రీమ్ ధర్మాసనం పూర్తి నిషేధం విధించింది. సౌరఫలకాల ప్రాజెక్టుల వద్ద వేసిన ఎత్తైన వైర్లకు తగిలి పక్షులు మరణిస్తుండడంతో ఈ వివాదం రేగి, నిషేధం దాకా వచ్చింది. అయితే సౌర, పవన విద్యుచ్ఛక్తికి అవకాశం ఉన్న ప్రాంతంలో భూగర్భ విద్యుత్ కేబుళ్ళనే అనుమతిస్తే, స్వచ్ఛ ఇంధన లక్ష్యాలలో భారత్ వెనుకబడుతుందని కోర్ట్ తాజాగా భావించింది. పర్యావరణంపై ప్రపంచ ప్రయత్నాలకు అది అవరోధమనీ, పైపెచ్చు జీవించే హక్కు, సమానత్వపు హక్కు, ఇంధనం అందుబాటు లాంటి ప్రాథమిక హక్కులకు ముప్పు అనీ అభిప్రాయ పడింది. పక్షులను రక్షిస్తూనే, పర్యావరణాన్ని పరిరక్షించేలా సమతూకం పాటించడంపై దృష్టి పెట్టాలంటూ, విద్యుత్‌లైన్లపై ఏకపక్ష నిషేధాన్ని తొలగించింది. మార్చి 21న ఈ ఉత్తర్విచ్చినా శనివారం మొత్తం తీర్పును అప్‌లోడ్ చేయడంతో పర్యావరణంపై జడ్జీల విస్తృత చర్చ బయటకొచ్చింది.

ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం తన తీర్పులో భాగంగా చేసిన వ్యాఖ్యలు దీర్ఘకాలిక ప్రభావం చూపనున్నాయి. పర్యావరణ మార్పులపై భారత్‌లో చట్టం లేనంత మాత్రాన వాటి దుష్ప్రభావాల నుంచి భద్రతకు భారతీయులకు హక్కు లేదని కాదు అని కోర్ట్ కుండబద్దలు కొట్టింది. పర్యావరణ మార్పుతో సమానత్వపు హక్కుపై ఎంత ప్రభావం ఉంటుందో సోదాహరణంగా చర్చించింది. పర్యావరణ మార్పు వల్ల ఒకచోట తిండికీ, నీటికీ కొరత ఏర్పడితే ధనికుల కన్నా బీదలపై ఎక్కువ ప్రభావం చూపుతుందనీ, సమానత్వపు హక్కనే భావనే దెబ్బతింటుందనీ విశదీకరించడం విశేషం. క్లైమేట్ ఛేంజ్‌కూ, మానవ హక్కులకూ ఉన్న సంబంధాన్ని ప్యారిస్ ఒప్పందం గతంలోనే గుర్తించింది. అంతర్జాతీయ చట్టాల కింద గ్రీన్‌హౌస్ వాయువుల్ని తగ్గిస్తూనే, ఆరోగ్య వాతావరణంలో జీవించడానికి ప్రజలకున్న ప్రాథమిక హక్కును కాపాడాలని సుప్రీమ్ పేర్కొనడం కీలకాంశం.

ఇది స్వాగతించాల్సిన విషయం. ఆ మాటకొస్తే పర్యావరణ పరిరక్షణను హక్కుల కోణంలో నుంచి వ్యాఖ్యానించడం సుప్రీమ్ చాలాకాలంగా చేస్తున్నదే. కాలుష్యరహిత వాతావరణంలో బతకడమనేది జీవించే హక్కులో భాగమని దశాబ్దాల క్రితమే పేర్కొంది. స్వచ్ఛమైన నీరు, గాలి అనేవి ప్రజల హక్కు అని గత నెలలోనూ వ్యాఖ్యానించింది. తాజా తీర్పు వాటికి కొనసాగింపు. అయితే, దేశంలోని కోట్లాది ప్రజానీకాన్ని పర్యావరణ దుష్ప్రభావాల నుంచి విముక్తం చేసేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడానికి ఈ కొత్త తీర్పు అయినా పూనిక నిస్తుందా అన్నది ప్రశ్న. అసలు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణంలో బ్రతికే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. కానీ, వనరుల దుర్వినియోగం, మార్కెట్ శక్తుల ప్రకృతి విధ్వంసం, పెరిగిపోతున్న వినిమయవాదం ప్రాణాల మీదకు తెస్తోంది.

తెలిసైనా, తెలియకైనా అలా పర్యావరణ హాని చేయడమంటే మనిషి జీవించే హక్కును నిరాకరించడమే! జీవితాలనూ, జీవనోపాధినీ దెబ్బ తీస్తున్న ఈ పరిస్థితులు మానవాళి ఉనికికే ఎదురైన సవాళ్ళు. పైపెచ్చు, ధనికులతో పోలిస్తే దారితెన్నూ లేని బీదసాదలపై ఈ ప్రభావం అధికమని అందరూ అంగీకరిస్తున్నదే. ఆ పరిస్థితులు కొనసాగరాదన్నదే సుప్రీమ్ ఆదేశం అందిస్తున్న సందేశం. వర్షపాతాల్లో మార్పులు, వేళ కాని వేళ వడగాడ్పులు రాగల కాలంలో మరింత పెరగనున్నాయని ప్రపంచ సంస్థలు భారత్‌ను ఇప్పటికే హెచ్చరించాయి. హిమానీనదాలు కరుగుతున్నా, సముద్రమట్టాలు పెరుగుతున్నా, రాజధానిలోనే స్వచ్ఛమైన గాలి కరవైనా అవేవీ పాలకులకు ప్రాధాన్యాలుగా కనపడక పోవడం దౌర్భాగ్యం. ఆ తలనొప్పి విద్యావేత్తలు, ఉద్యమకారులు, పౌరసమాజ బృందాలదేనని పొరబడుతున్న వేళ సుప్రీమ్ తీర్పు చెంపపెట్టు.

పర్యావరణ పరిరక్షణను గాలికొదిలేసి, ప్రభుత్వాలు చేపడుతున్న అనేక విధానాలు ఇవాళ ప్రజల పాలిట శాపంగా మారుతున్నాయనేది నిష్ఠురసత్యం. దానికి తోడు కనీస స్పృహ లేకుండా నేల, నింగి, గాలి, నీరును కలుషితం చేయడంలో అందరం పోటీలు పడుతున్నాం. పర్యవసానాలే ఇప్పుడు చూస్తున్న అధిక ఉష్ణోగ్రతలు, అకాల వర్షాలు, ఆకస్మిక వరదలు, ఇంకా అనేకానేక పర్యావరణ దుష్ప్రభావాలు. ఈ పరిస్థితుల్లో సుప్రీమ్ గుర్తించిన ఈ ప్రత్యేక హక్కు పార్లమెంట్‌కు మేలుకొలుపు కావాలి. పర్యావరణంపై కుంభకర్ణ నిద్ర నుంచి ఇకనైనా పాలకులు మేల్కోవాలి. ప్రభుత్వాలు తక్షణమే రంగంలోకి దిగాల్సి ఉంది. వనరుల సమర్థ వినియోగంపై చర్యలు చేపట్టి, అందరిలో అవగాహన పెంచాల్సి ఉంది. లేదంటే, ఈ తాజా తీర్పు ఆసరాగా పౌరులు తమ హక్కును కాపాడుకొనేందుకు చట్టపరమైన మార్గాలను అనుసరించే వీలు ఉండనే ఉంటుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.విదియ రా.8.15 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** అశ్విని ఉ.7.11 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** సా.4.20 నుండి 5.52 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.35 నుండి 12.25 వరకు, **అమృత ఘడియలు:** రా.1.31 నుండి 3.01 వరకు

సూర్యోదయం : 5.51
సూర్యాస్తమయం : 6.10
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ఆ అనుమానాలు పోవాలంటే...

అభిప్రాయం



ఎ ఎల్ ఐ చౌగులే

ఈవీఎంలతో అక్రమాలకు పాల్పడటం అసాధ్యమని భారత ఎన్నికల కమిషన్ చెబుతోంది. కానీ వీటిపై వస్తున్న సందేహాలను నివృత్తి చేయడంలో విఫలమవుతోంది. ఎన్నికలు అక్రమాలకు తావు లేకుండా జరగడమే కాదు, జరిగినట్లు కనిపించాలి కూడా! ఎన్నికలు పారదర్శకంగా జరిగాయా లేదా అన్నది తెలుసుకునేందు సులువైన పరిష్కారం, వీవీప్యాట్ స్లిప్‌లను అందివ్వడం!! స్పష్టంగా చెప్పాలంటే... ఓటర్లు ఓ బటన్‌ను నొక్కడం ద్వారా ఓటేస్తారు. నొక్కినదానికే పడిందని నిర్ధారించే వీవీప్యాట్ స్లిప్ వీరికి భౌతికంగా అందుతుంది. ఓటరు ఈ స్లిప్‌ను సరి చూసుకుని మళ్లీ వీవీప్యాట్ బాక్స్‌లో వేయాలి. దీనివల్ల ఓట్లు రెండింటిలోనూ రికార్డు అవుతాయి. రెండింటినీ లెక్కించి, సరి చూసిన తరువాత ఫలితాలు ప్రకటించాలి.

దేశంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై ప్రకటన చేస్తూ (మార్చి 16, 2024) భారత ఎన్నికల ప్రధాన అధికారి(సీఈసీ) రాజీవ్ కుమార్ చాలా ధీమాగా ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్)లతో అక్రమాలకు పాల్పడటం అసాధ్యమని స్పష్టం చేశారు. ఈవీఎంలన్నీ ఎన్నికల ప్రక్రియ, నియమ నిబంధనలకు అనుగుణంగా ప్రత్యేకంగా డిజైన్‌చేసి తయారు చేసినవని వివరించారు. ఈవీఎం వ్యవస్థలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌తో పాటు, ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రెయిల్ (వీవీప్యాట్) అనే మూడు భాగాలు ఉంటాయన్నది మనకు తెలుసు. ఎన్నికలు పారదర్శకంగా జరిగాయా లేదా అన్నది తెలుసుకునేందుకూ, ఈవీఎంలపై వస్తున్న అనుమానాల నివృత్తికీ వీవీప్యాట్‌లు కీలకమవుతాయి. కానీ ఎన్నికల కమిషన్ మాత్రం ఈవీఎంల పనితీరుపై ఎలాంటి సందేహాలు అవసరం లేదని బల్లగుద్ది మరీ చెబుతోంది. ఇంకోలా చెప్పాలంటే వీటిపై అనుమానాలు రేకెత్తడమే తప్పన్న చందంగా మాట్లాడుతోంది. ఈవీఎంల వల్ల ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, వేగంగా జరుగుతుందని, వీవీప్యాట్ స్లిప్పులపై ఆధారపడాల్సిన అవసరం లేదన్నది ఎన్నికల కమిషన్ వాదనగా ఉంది.

నమ్మమంటే నమ్మాల్సిందేనా?

ఈవీఎంల దుర్వినియోగం అసాధ్యమని సీఈసీ చెబుతున్నా ఓటర్లలో చాలామందికి ఆ నమ్మకమైతే లేదు. ఈవీఎంలపై సందేహాలు వద్దు అని చెప్పేందుకు సీఈసీ తానే రాసిన ఓ ఉర్దూ ద్విపదను ఉటంకించారు. ఆరోపణలపై ఈవీఎంలే స్వయంగా స్పందిస్తే ఎలా ఉంటుందో వివరించారు. ''తీరని కోరికలకు అన్ని వేళల్లో అందరిపై దూషించడం సరికాదు. మీరేంటో మీరే నిరూపించుకోలేనప్పుడే ఈవీఎంలపై తప్పు మోపుతారు'' అన్నారు. ఈవీఎంల దుర్వినియోగం ఆరోపణలను నిర్ద్వంద్వంగా తిరస్కరించడం, 'తీరని కోరికలు'గా అభివర్ణించడంతోనే ఈవీఎంలు విశ్వసనీయమైనవి అయిపోవు. ఎన్నికలు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలన్న ఎన్నికల కమిషన్ బాధ్యత పూర్తయినట్టూ కాదు.

ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరగాలని కోరుతున్నది ప్రజాస్వామ్య వాదులు, రాజకీయ పార్టీలు, ఈవీఎం నిపుణులు. ఈవీఎంల విషయంలో పారదర్శకత లేదనీ, వాటిని నమ్మలేమనీ వీరందరూ పలు సందర్భాల్లో ముక్తకంఠంతో స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ ఈ సందేహాలను నివృత్తి చేసే ప్రయత్నం ఇప్పటివరకూ చేయలేదు. ఈ ధోరణి అనుమానాలు మరిన్ని రేకెత్తేలా చేసేందుకు మాత్రమే ఉపయోగపడుతోంది. దేశంలో పేదరికం తగ్గిపోయిందంటూ నీతి ఆయోగ్ విడుదల చేసిన సంఖ్యలను అస్సలు ప్రశ్నించకూడదన్నట్టుగా ఉంది ఎన్నికల కమిషన్ ధోరణి. దేశ జనాభాలో 11 శాతం మంది మాత్రమే దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారనీ, గడచిన



తొమ్మిదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం కోరల నుంచి బయటపడ్డారనీ నీతి ఆయోగ్ చెబుతోంది. పారదర్శకత ఏమాత్రం లేని నేపథ్యంలో ఎవరైనా సరే ఎన్నికల కమిషన్ ఈవీఎంలపై చేస్తున్న ప్రకటనలను, ఇస్తున్న భరోసాలను ఎలా నమ్మగలరు?

ఎన్నికలు అందరి వ్యవహారం...

ఓటర్లు వేసిన ఓటును మార్చి చూపే అవకాశం కానీ, ఈవీఎంలు తప్పులు చేయడం కానీ అసాధ్యమని ఎన్నికల కమిషన్(ఈసీ) చెబుతోంది. కానీ చాలా కారణాల వల్ల అనుమానాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఉదాహరణకు ఈవీఎంలో పోలైన ఓట్లు, లెక్కించిన ఓట్లకు సంబంధించి 2019 సాధారణ ఎన్నికల్లో సుమారు 373 నియోజకవర్గాల గణాంకాల్లో తీవ్రమైన తేడాలున్నట్లు 'ద క్వింట్' వెబ్‌సైట్ గుర్తించింది. ఈ విషయంపై సీఈసీ, ఈసీ స్పందన నాస్తి. ఎన్నికల తరువాత ఎవరైనా అనుమానాలు వ్యక్తం చేస్తే, ఆరోపణలు చేస్తే వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌దే. తద్వారా మాత్రమే అది ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగిందన్న భరోసా సామాన్యుడికి ఇవ్వగలదు.

ఎన్నికల్లో ఓడిపోయిన వారు మాత్రమే ఈవీఎంల విశ్వసనీయతపై సందేహాలు లేవనెత్తుతారు అని సీఈసీ చేసిన వ్యాఖ్య రెండు విషయాలను సూచిస్తుంది.

మొదటిది... ఎన్నికల్లో గెలిచేందుకు తమ వంతు శ్రమ చేయని వారు చెప్పే కుంటిసాకు అని చెప్పే ప్రయత్నం. రెండోది... ఎన్నికలు కేవలం రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు మాత్రమే పరిమితమని చెప్పడం. రెండూ తప్పే. ప్రజాస్వామ్యంలో సర్వాధికారి పౌరుడే. ఈ ప్రజాస్వామ్య సర్వాధికారి సార్వభౌమత్వాన్ని తనకు నచ్చిన వ్యక్తికి దఖలు పరచడమే ఓటింగ్. ఈ పని జరగాలంటే ఎన్నికలు, ఓటింగ్ వ్యవస్థ ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు లోబడి ఉండాలి. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో, అక్రమాలకు తావు లేకుండా జరగడమే కాదు... అలా జరిగినట్లు కనిపించాలి కూడా.

అంతేకాదు... తాము వేసిన ఓటు సక్రమంగా పడిందా లేదా ఓటరుకు స్పష్టంగా తెలిసేలా ఉండాలి. ఓటింగ్, లెక్కింపు వ్యవస్థలు రెండూ కూడా ఓటరు ఎవరికి ఓటేశారో వారికే ఓటు పడిందని ధ్రువీకరించేలా పనిచేయాలి. వేసిన వెంటనే రికార్డు కావాలి. రికార్డు అయిన విధంగానే లెక్క కూడా తేలాలి. ఈవీఎం యంత్రాలపై ఈసీ నిఘా అనేది రెండు కారణాల వల్ల అంత నమ్మదగ్గదిగా అనిపించదు. మొదటిది ఈవీఎం యంత్రాలను ప్రభావితం చేయగలమని, లేదా అవసరాలకు తగ్గట్టుగా పనిచేసేలా చేయగలమన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు ఈసీ తగినంతగా ప్రయత్నించకపోవడం; ఓటర్లు, ప్రతిపక్ష రాజకీయ పార్టీల్లో ఈసీ విశ్వసనీయత అనేది అతి నిమ్న స్థాయికి చేరడం. ఇందుకు కారణాలు చాలానే ఉన్నాయి. వివక్ష లేకుండా ఎన్నికల కోడ్‌ను అమలు చేయలేకపోవడం వాటిల్లో ఒకటి మాత్రమే.

ఈవీఎంలు సక్రమంగా పనిచేయవు అనేందుకూ, నిర్దిష్ట పార్టీకి అనుకూలంగా ఓట్లు వేయించుకోవచ్చు అనేందుకూ ఆధారాలు లేవు. అక్రమాలు జరిగే అవకాశం ఉన్నంతమాత్రాన జరిగినట్టూ కాదు. కానీ సాక్ష్యం లేకపోవడం అన్నది సంఘటనే జరగకపోవడం కాదు.

వీవీప్యాట్ స్లిప్ ఇవ్వాలి!

ఎన్నికల సమయంలో వ్యవస్థలు, వనరులన్నింటిపై పెత్తనం, అధికారం ఒక పార్టీదిగా ఉంటుంది. అందుకే ఓటింగ్ ప్రక్రియ సందర్భంగా అనుమానాలు, ఆరోపణలు వస్తూంటాయి. ఈవీఎంల విషయంలో ఓటర్లు, ప్రతిపక్ష పార్టీల అతిపెద్ద ఆందోళన ఏమిటంటే... తమ ఓటు రికార్డు అయ్యిందా, లేదా అన్నది. ఈ ఆందోళనకు సులువైన పరిష్కారం ఉంది. ఓటర్లకు వీవీప్యాట్ స్లిప్‌లను అందివ్వడం. ఓటరు తాను అనుకున్న పార్టీకే ఓటు పడిందని నిర్ధారించుకుంటే ఆ స్లిప్‌ను బాక్స్‌లో మళ్లీ వేస్తాడు. స్పష్టంగా చెప్పాలంటే... ఓటర్లు ఓ బటన్‌ను నొక్కడం ద్వారా ఓటేస్తారు. ఆ తరువాత వీరికి భౌతికంగా వీవీప్యాట్ స్లిప్ అందుతుంది. ఓటరు ఈ స్లిప్‌ను సరి చూసుకుని మళ్లీ వీవీప్యాట్ బాక్స్‌లో వేయాలి. దీనివల్ల ఓట్లు రెండింటిలోనూ రికార్డు అవుతాయి. రెండింటినీ లెక్కించి సరి చూసిన తరువాత ఫలితాలు ప్రకటించాలి. గత ఏడాది డిసెంబరులో ఇండియా కూటమి కూడా ఇదే సూచన చేసింది. సుప్రీంకోర్టు విచారణలోని అంశాల్లోనూ ఇది ఉంది. వీవీప్యాట్ స్లిప్స్‌ను లెక్కించి ఫలితాలను ప్రకటించడం వల్ల ఫలితాల వెల్లడిలో కొంత జాప్యం జరగవచ్చు కానీ... ఏడు దశల్లో నెలన్నర పాటు ఎన్నికలు జరగ్గా కానీ జాప్యం ఒకట్రెండు రోజులు ఫలితాలు వెల్లడించేందుకు అయితే నష్టమేమీ ఉండదు.

వ్యాసకర్త ముంబై కేంద్రంగా పనిచేస్తున్న స్వతంత్ర జర్నలిస్టు
('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మునిగేందుకే...



ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ నుంచి గానీ, ఇంకెక్కడి నుంచైనా గానీ (ప్రియాంక గాంధీ భర్త) రాబర్ట్ వాద్రాకు కాంగ్రెస్ టికెట్ ఇవ్వడమంటే అది ఆత్మహత్యా సదృశమే!
– ప్రశాంత్ భూషణ్, న్యాయవాది

అన్నీ అక్కర్లేనివే!



నా స్నేహితుడి జీ-మెయిల్‌లో 25,000 ఈమెయిల్స్ ఉన్నాయి. 'అన్‌సబ్‌స్క్రైబ్' పదం ఉన్న అన్ని మెయిల్లను డిలీట్ చేయడానికి అతడు ఒక ఫిల్టర్ రూపొందించాడు. ఇప్పుడు అతడి మెయిల్స్ కేవలం 100 అయ్యాయి.
– నోవా కగన్, ఆంత్రప్రెన్యూర్

పిరికి దాడి



ఏప్రిల్ 1న ఇజ్రాయెల్ చేసిన డమాస్కస్(సిరియా) దాడి... యుద్ధం, దౌత్యాలకు సంబంధించిన సాహిత్య రచనలో అత్యంత తీవ్రమైన మోసంగా లెక్కలోకి వస్తుంది. తన దౌత్య కాంపౌండులోకి దొంగతనంగా ఫైటర్లను పంపి ఇజ్రాయెల్ పిరికిపందలా దాడి చేస్తుందని ఇరాన్ ఊహించి ఉండదు.
– ఎం.కె. భద్రకుమార్, మాజీ దౌత్యవేత్త

బాగా అర్థమైనట్టుంది!



ఇరాన్ అణ్వాయుధ ప్రదేశాల మీద దాడి చేస్తామని ఇజ్రాయెల్ బెదిరించగానే, ప్రత్యక్ష దాడి నుంచి ఇరాన్ వెనక్కి తగ్గింది. డమాస్కస్‌లోని పైస్థాయి జనరల్ హత్యకు స్పందనగా దాడికి విముఖతతో ఉన్నట్టూ, బదులుగా పరోక్ష యుద్ధం కొనసాగించనున్నట్టూ తెహ్రాన్ చెబుతోంది. ప్రబల పరాక్రమపు భాష ఇరాన్‌కు బాగా అర్థమవుతోంది.
– ఇంతియాజ్ మహమూద్, థింకర్

మోదీ మోదీయేనా?



వైభవోపేతమైన హిందూ గతాన్ని సంఘీయులు నమ్ముతారు; మోదీకి ముందు ఒక ఆదర్శ ప్రపంచం ఉండేదని ఉదారవాదులు నమ్ముతారు. రెండూ భ్రమలే. ఈ రెండు కల్పనలూ బ్రాహ్మణీయమే. మోదీకి ముందు కాలమూ మోదీ బీజాలను మోసింది. కేవలం మోదీని ఖండించడంతో మాత్రమే సరిపెట్టని, కొత్త ఆలోచన చేయడమే ఇప్పటి సవాలు.
– హర్‌తోష్ సింగ్ బల్, సంపాదకుడు

కొత్త ప్రారంభం



అబూ ధాబీలోని బాప్స్ హిందూ మందిరాన్ని దర్శించే అవకాశం కలిగింది. అదొక సంపూర్ణమైన దివ్యానుభవం. అన్నట్టు, నవరాత్రి, గుడీ పడ్వా, ఉగాది పండుగల శుభాకాంక్షలు. ఈ శుభ సందర్భాలు మీకూ, మీ ప్రియమైనవారికీ ఆనందం, సంపద, కొత్త ప్రారంభాలను తేవాలని కోరుకుంటున్నాను.
– అక్షయ్ కుమార్, నటుడు

చివరి మనిషి



ఒక ప్రాచీన భాషను మాట్లాడే చివరి మనిషి కావడం ఎలా ఉంటుందో ఊహించగలరా? దక్షిణాఫ్రికాకు చెందిన సాన్ ప్రజలు (ప్రధానంగా వేటాడుతారు) మాట్లాడే క్వోయ్‌సాన్ భాషావర్గానికి చెందిన ఎన్‌లూ భాషను మాట్లాడే చివరి మనిషి గ్యూ కట్రీనా ఎసా. ఈ భాష 25 వేల ఏళ్ల పాతది!
– జో బాసీ, ఆఫ్రికా చరిత్ర ప్రేమికుడు

అడవుల్లో అగ్గిని ఆపాలంటే...

ఇటీవల కార్చిచ్చు వల్ల తగలబడిపోతున్న అడవుల వార్తలు తరచూ వింటున్నాం. విస్తృతంగా వ్యాపించే ఈ అగ్గిని ఆర్పగలిగే సామర్థ్యం, ఆధునిక పరికరాలు, సమాచార వ్యవస్థ మన అటవీశాఖ దగ్గర లేవు. అయినా పరిమిత వనరులతోనే అటవీ అధికారులు దావానలాన్ని ఆర్పివేసే ప్రయత్నం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రధానంగా గోదావరి పరీవాహక ప్రాంతంలోని దండకారణ్యం, కృష్ణా పరీవాహక ప్రాంతంలో నల్లమల అడవులు ఉన్నాయి. దండకారణ్యంలో ప్రతీ సంవత్సరం జనవరి చివరి మాసంలో అగ్గి ప్రారంభమై 14 వారాల పాటు కొనసాగి పెద్ద ఎత్తున అడవులు తగులబడుతూ కనిపిస్తుంటాయి. మెదక్, నిజామాబాద్ జిల్లాల్లోనూ, నల్లమలలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తూ ఉంటుంది. దీనివల్ల, ఆయా అటవీ ప్రాంతాల్లో ఎంతో విలువైన వృక్ష జాతులు, వన్య ప్రాణులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

తెలంగాణలో 2023 మార్చి నుండి 2024 మార్చి 20 వరకు 282 అగ్గి రాజుకున్న సంఘటనలు జరిగాయని అటవీ శాఖ లెక్కలు చెబుతున్నాయి. 2001 నుండి 2022 వరకు రాష్ట్రంలో అగ్నిప్రమాదాల వల్ల దాదాపు 3.30 శాతం అడవులు అంతరించాయని లెక్కలు సూచిస్తున్నాయి.

అటవీ ప్రాంతాల్లో అగ్గి పుట్టి అడవులు ధ్వంసం కావడం మన దేశంలో అత్యధికంగా మిజోరాం, మణిపూర్, అస్సాంల అనంతరం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే అధికంగా ఉంది. మార్చి, ఏప్రిల్ మాసాల్లో అధికంగా ఈ ప్రమాదాలు నమోదవుతూ ఉంటాయి. అయితే, మన దేశంలో అత్యధికంగా మానవ కారక అగ్ని ప్రమాదాలే అధికంగా జరుగుతున్నాయి. పాశ్చాత్య దేశాల్లో మాత్రం ప్రకృతి పరమైన కారణాల వల్ల అడవుల్లో అగ్గి రాజుకుంటున్నది.

ఇక తెలంగాణ రాష్ట్రానికొస్తే, దండకారణ్య అటవీ ప్రాంతాల్లో నాణ్యమైన తునికాకు లభ్యం అవుతుంది. తునికాకు టెండర్లు పూర్తి కాగానే, తునికి చెట్లను ప్రూనింగ్ చేస్తే మరింత నాణ్యమైన ఆకు వస్తుంది. ప్రూనింగ్‌లో భాగంగా కొమ్మ కొట్టాల్సి ఉంటుంది. ఈ ప్రూనింగ్ ప్రక్రియ కొద్దిగా వ్యయంతో కూడుకున్నందున బీడీ ఆకు కాంట్రాక్టర్లు, కొందరు స్థానిక కూలీలకు డబ్బు ఎరవేసి అడవుల్లో అగ్గి పెట్టిస్తుంటారు. అడవులు తగలబడటం వల్ల జంతువులు, పక్షులు ప్రాణాలు కోల్పోతున్నాయి. చెట్లపై గుడ్లు పెట్టిన పక్షులు ఎగిరిపోగా గుడ్లు మంటలకు ఆహుతవుతున్నాయి. ఫలితంగా వాటి పునరుత్పత్తి ప్రక్రియ ఆలస్యం అవుతోంది.

కేవలం ప్రజా చైతన్యంతోనే ఈ అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని అటవీ అధికారులు అంటున్నారు. విస్తారమైన అటవీ ప్రాంతం ఉండడం చేత ఎక్కడో మారు మూల లేదా పర్వత ప్రాంతాల్లో అగ్గి రాజుకొని అది వ్యాపిస్తూ ఉంటుంది. ఆ ప్రాంతానికి అటవీ శాఖ అధికారులు చేరుకొనేటప్పటికే నష్టం జరిగి పోతోంది. 'అటవీ, ఏజెన్సీ ప్రాంతాల ప్రజలను అడవుల్లో నిప్పు రాజుకోగానే వెంటనే ఆర్పే విధంగా వారిని చైతన్య పరుస్తున్నాం. వెంటనే అటవీ శాఖ అధికారులకు తెలియ చేయడం, గ్రామ స్థాయిలోనే అగ్గి విస్తరించకుండా స్థానిక పద్ధతుల ద్వారా ఆర్పడం వంటివి చేయిస్తున్నా'మని అటవీ అధికారులు అంటున్నారు. మరి ఈ చర్యలు ఎంత వరకు ఫలితాలనిస్తాయో చూడాలి.

– కన్నెకంటి వెంకట రమణ; జాయింట్ డైరెక్టర్, సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ

పవన్ అప్పగింతలు-కుప్పిగంతులు

అభిప్రాయం



పి. విజయబాబు

పవన్ కల్యాణ్ పార్టీ వ్యవహారం కానీ, ఆయన వ్యవహార శైలి కానీ పరిశీలిస్తే బహుశా ఇలాంటి పార్టీ భారతదేశంలోనే ఎక్కడా మనకు కనిపించదేమో అని పిస్తుంది. విచిత్రం ఏమిటంటే, ఈ మధ్యకాలంలో పార్టీని పదేళ్లు నడిపాను అంటూ తరచు మాట్లాడుతున్నారు. పార్టీ పెట్టి పదేళ్లు అయి ఉండొచ్చు కానీ పట్టుమని చెప్పుకోదగిన స్థాయిలో పది కార్యక్రమాలైనా ఉన్నాయా అంటే చెప్ప దానికి ఆ పార్టీ కార్యకర్తలే తడబడతారు. ఎందుకంటే పదేళ్లు పూర్తిగా నడిపింది పార్ట్ టైం పాలిటిక్స్. పార్ట్ టైం ఉద్యోగాల గురించి విన్నాంగానీ పార్ట్ టైం రాజకీయాలను పరిచయం చేసింది మాత్రం పవన్ అనే చెప్పాలి. పోనీ ఆ పార్ట్ టైం కార్యకలాపాలైనా ఆయన నిర్వహించారా అంటే అదీ లేదు. తను జస్ట్ గెస్ట్ ఫాకల్టీ మాత్రమే!



సినిమాల్లో ఒక మాస్ హీరోలా ఎలా నటి స్తారో... అదే సంస్కృతి (ప్రక్రియ)ని రాజకీయల్లో కూడా చొప్పించి తన ఘనత చాటుకున్నారు. సినిమాలో హీరో చేసే ఫైట్లు, ఫీట్లూ అన్నీ డూప్. పాడే పాటలూ ఆయన పాడరు. కానీ ప్రేక్షకులకు హీరోనే ఇవన్నీ చేస్తాడని అనిపిస్తుంది. ఇదే ఫార్ములా రాజకీయాలకి అప్లై చేశారు పవన్ కల్యాణ్.

పార్టీని ప్రారంభించి దాని నిర్వహణ బాధ్యత నాదెండ్ల మనోహర్‌కి అప్పజెప్పారు. ప్రెస్ మీట్‌లో ఏదైనా మాట్లాడాలన్నా, విలేకరులు అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పాలన్నా నాదెండ్ల మనోహర్ ఇన్‌పుట్స్ ఇస్తే తప్ప జవాబు చెప్పలేని పరిస్థితి. ఉపన్యాసాలు ఇవ్వాలంటే ఎవరో రాసిచ్చిన ఉప న్యాసాలకు హావభావాలు జోడించడం మాత్రమే పవన్ చేసే పని.

ఫైనల్‌గా సినిమాను డిస్ట్రిబ్యూటర్‌కు అమ్మే సినట్టు పార్టీని చంద్రబాబు చేతిలో పెట్టేశారు. పార్టీ కార్యకర్తల చేతుల్లో తెలుగుదేశం జెండాలు పెట్టారు. చెప్పులేసుకుని తిరిగే వాళ్ళను చట్ట సభలకు పంపిస్తానని చెప్పి వాళ్ళ చేతుల్లో చివరగా చిప్ప పెట్టి కోటీశ్వరులకు టిక్కెట్లు ఇచ్చేసు కున్నారు. పైగా తన పార్టీలో ఎవరెవరు నించో వాలి అనే నిర్ణయాధికారాన్ని కూడా చంద్రబాబుకే అప్ప జెప్పే శారు. అచ్చంగా డిస్ట్రిబ్యూటర్ ఏ ఏ థియేటర్స్‌కు సినిమా రిలీజ్ చేయాలో నిర్ణయించినట్టు!

సాక్షాత్తు తను పిఠాపురంలో పోటీ చేసే చోట పట్టుమని నాలుగు రోజులు తిరిగే ఓపిక కూడా లేక ఆ బాధ్యతనూ వర్మ చేతిలో పెట్టేశారు. వాలంటీర్లను నోటికొచ్చినట్టు తిట్టి, అవ్వ తాతల్ని మండుటెండలో అష్ట కష్టాలు పెడుతూ తను మాత్రం గంట కూడా ఎండలో తిరగలేక స్పెషల్ ఫ్లైట్‌లో హైదరాబాద్ చెక్కేస్తున్నారు. ఈ విచిత్ర విన్యాసాలు, విపరీత పోకడలకు జన సైనికులే తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. వీర మహిళ లైతే ఒక అడుగు ముందుకు వేసి, ''మాటలు కోటలు దాటిస్తున్నాడు. మానాభిమానాల్ని మాత్రం 'కోట'లో దాచి పెడుతున్నాడు'' అంటూ నర్మగర్భంగా టీవీ చర్చల్లోనే వ్యాఖ్యానించటం గమనార్హం!

వ్యాసకర్త పూర్వ సంపాదకులు

సూక్ష్మంలో మోక్షం

రోగి, రోగం, ఔషధం... ఈ మూడు అంశాలకు హోమియోపతిలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. స్వస్థత, అస్వస్థత, వ్యాధి అనేవి 'రోగ' పరంగా కాక 'రోగి'పరంగా విశ్లేషించాలి అన్నది హోమియో వైద్య మౌలిక సూత్రం. సూక్ష్మమైన హోమియోపతి గుళికతో అనితరసాధ్యమైన క్యాన్సర్ లాంటి వ్యాధుల నుండి సైతం మోక్షం కల్పించే అవకాశం ఉంది. దాదాపు రెండున్నర శతాబ్దాల క్రితం జర్మనీలో పుట్టిన డాక్టర్ శామ్యూల్ హానిమన్ కృషి ఫలితంగా పురుడు పోసుకుని ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందిన వైద్యవిధానం ఇది. హోమియోపతిలో ప్రతి వ్యక్తి కూడా భిన్నమైన వ్యక్తే. వ్యాధితో పాటు అతని వ్యక్తిత్వం కూడా ముఖ్యమే. ఉదాహరణకు అందరికీ సమస్య ఉబ్బసం లేదా ఆయాసం (ఆస్తమా) కావచ్చు, కానీ దాని వెనుక పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. వాటిని గుర్తించి, వ్యక్తిని అర్థం చేసుకొని దాని ఆధారంగా వ్యాధిని సమూలంగా నయం చేయడం ఈ విధానంలోని ప్రత్యేకత.



డా॥ శామ్యూల్ హానిమన్

రోగాన్ని తగ్గించడానికి వాడే మందు మోతాదు అతి సూక్ష్మంగా ఉండాలని ప్రతిపాదించారు హానిమన్. ఆ రకంగానే మందుల్ని తయారుచేసి వ్యాధి నివారణలు కలిగించి అద్భుత ఫలితాలు చూపించారాయన. ఔషధాల వల్ల అవాంఛనీయ దుష్ఫలితాలు తలెత్తకుండా ఉండేందుకు వాటిని ప్రత్యేక పద్ధతిలో పల్చన (ప్రొటెన్షియలైజేషన్) చేసి వాడటం మొదలు పెట్టారు.

ప్రతి పదార్థానికి భౌతిక, రసాయనిక ధర్మాలే కాక, వైద్య ధర్మాలు కూడా ఉంటాయి. ఎందుకూ పనికిరానిదిగా భావించే ఇసుక నుండి తయారు చేసిన 'సైలీషియా' హోమియోపతిలో సర్జన్‌గా పనిచేస్తుంది. మనం నిత్యం వాడుకునే ఉప్పు నుండి తయారుచేసిన 'నేట్రమ్మూర్' క్యాన్సర్‌కు సైతం మందుగా పనిచేస్తుంది.

ఒక ఔషధం ఆరోగ్యవంతునిలో ఏ వ్యాధి లక్షణాలను సృష్టిస్తుందో ఆ లక్షణాలు గల రోగికి అదే ఔషధాన్ని సూక్ష్మరూపంలో ఇచ్చినట్లయితే స్వస్థత చేకూరుతుంది. అంతేకాకుండా ఔషధ ధర్మాల నిర్ధారణకు ఆ మందులను ముందుగా మానవులపై మాత్రమే ప్రయోగించి చూడటం అన్న విధానానికి పునాది వేసింది హోమియో వైద్యం. ఇప్పుడు ఏ వైద్య విధానంలోనైనా ఒక ఔషధ తుది పరీక్షలు మనిషి మీద జరిపిన తర్వాతే మార్కెట్‌లోకి విడుదల చేయడం గమనార్హం.

– డా॥ పరికిపండ్ల అశోక్,
హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ అధ్యక్షులు
(హోమియోపతి వైద్య ప్రదాత డాక్టర్ శామ్యూల్ హానిమన్ జయంతి నేడు)

క్లుప్తంగా...

శ్రీవారి సన్నిధిలో ఆర్మీ చీఫ్ కమాండర్



పెద్ద శేష వాహనం వద్ద ఆర్మీ చీఫ్ కమాండర్ జనరల్ మనోజ్ పాండే

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆర్మీ చీఫ్ కమాండర్ జనరల్ మనోజ్ పాండే మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా..టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

శ్రీక్రోధి నామ సంవత్సరంలో ఏపీ సుభిక్షంగా ఉంటుంది

- విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి



పెందుర్తి: శ్రీక్రోధి నామ సంవత్సరంలో కుజుడు రాజుగా..శని మంత్రిగా ఉండటంతో దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణాలు..దేశంలో అగ్ని ప్రమాదాలు, భూకంపాలు సంభవించే అవకాశం ఉందని విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి చెప్పారు. దేశ ఆర్థిక పరిస్థితి పురోభివృద్ధి చెందుతుందని తెలిపారు. విశాఖ శ్రీశారదా పీఠంలో ఉగాది వేడుకలు పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో మంగళవారం జరిగాయి. శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారికి స్వామీజీలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెన్నేటి శ్రీనివాసశర్మ పంచాంగ శ్రవణంలో రాశుల వారీగా తెలుగు సంవత్సరాది ఫలితాలను వివరించారు. స్వరూపానందేంద్ర అనుగ్రహ భాషణం చేస్తూ.. రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని, సకాలంలో వర్షాలు పడి పంటలు పండుతాయని చెప్పారు. ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని చెప్పారు. ఉత్తరాది రాష్ట్రాల్లో 50 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉంటాయన్నారు. ఇతర దేశాలకు ఆర్థిక కుంగుబాటు ఉంటుందని.. భారత్‌లో అందుకు భిన్నంగా ఉంటుందని చెప్పారు. ఏప్రిల్ 9 నుంచి జూన్ 30 వరకు పరిస్థితులు కాస్త ఇబ్బందికరంగా ఉంటాయని వివరించారు. అనంతరం ఆయన పంచాంగాన్ని ఆవిష్కరించారు. భక్తులకు ఉగాది పచ్చడి వితరణ చేశారు.

ఏపీ భవన్‌లో ఘనంగా ఉగాది

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని ఏపీభవన్‌లో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఈ ఉత్సవాల్లో కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి వి.ఎల్. కాంతారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బి.ఎల్.శరవణన్ బృందం నాదస్వర వాదన శ్రోతలను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి కాంతారావు మాట్లాడుతూ దేశ రాజధానిలో ఏపీ భవన్‌కు ప్రత్యేక స్థానముందన్నారు. రుచికరమైన భోజనానికి, సాంస్కృతిక కార్యక్రమాలకు ఎంతో ప్రతీక అని కొనియాడారు. కమిషనర్ లవ్ అగర్వాల్ మాట్లాడుతూ, 'ఉగాది పచ్చడి' జీవితంలోని వివిధ అనుభూతులకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. అనంతరం చిలకమర్తి ప్రభాకర చక్రవర్తి శర్మ పంచాంగ పఠనంతో వివిధ రాశి ఫలితాలు వివరించారు. వెంకట నాగ అనురాధ, విట్టల్ శిష్య బృందాలు తమ కూచిపూడి నృత్యంతో అతిథులను ఆకట్టుకున్నారు.

39 కిలోల బంగారం స్వాధీనం



అనంతపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న పోలీసులు అనంతపురంలో మంగళవారం ఓ వాహనంలో 39 కేజీల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి అనంతపురానికి బంగారం తరలిస్తున్నట్లు గుర్తించారు. రూ.23 కోట్లు విలువ చేసే బంగారానికి ఎలాంటి రసీదులూ లేకపోవడంతో పోలీసులు జప్తు చేసి అనంతపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించారు. అయితే.. అనంతపురం, కర్నూలు నగరాల్లోని బంగారు దుకాణాలకు సరఫరా చేసే ఏజెన్సీకి చెందినదంటూ సదరు ఏజెన్సీ ప్రతినిధులు పోలీసుల వద్దకు వచ్చి విన్నవించారు. ప్రధాన కేంద్రం అనంతపురం కావడంతో హైదరాబాద్ నుంచి ఇక్కడికి తీసుకొచ్చి.. ఇక్కడ నుంచి అనంతపురం, కర్నూలులోని కార్పొరేట్ బంగారు దుకాణాలకు సరఫరా చేస్తామని తెలిపారు. అలాగే సోమవారం రాత్రి 11 గంటల సమయంలో అనంతపురం నగరం నుంచి కోయంబత్తూరుకు తరలిస్తున్న కోటి రూపాయల విలువ చేసే బంగారు, రూ.13.50 లక్షల నగదును వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు

రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ, జనసేన, బీజేపీల నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ విప్, ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సమక్షంలో మంగళవారం పెనుగంచిప్రోలు మండలం తోటచర్ల, శనగపాడు, కొళ్లికుళ్ల గ్రామాలకు చెందిన టీడీపీ, బీజేపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. అదేవిధంగా జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామ వైఎస్సార్‌సీపీ మాజీ అధ్యక్షుడు ఆనంగి శ్రీనివారావు యాదవ్ ఇటీవల టీడీపీలో చేరారు. ఆయన తిరిగి ఉదయభాను సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

– సాక్షి నెట్‌వర్క్

- విజయవాడ 11వ డివిజన్‌కు చెందిన టీడీపీ, జనసేన కార్యకర్తలు 100మందికి పైగా వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి దేవినేని అవినాష్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.
- పల్నాడు జిల్లా వినుకొండలో కొప్పుకొండ గ్రామ పంచాయతీ బ్రహ్మయ్య పాకాలు గ్రామానికి చెందిన 50 కుటుంబాలవారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.
- కృష్ణాజిల్లా కోడూరు మండలంలోని ఉల్లిపాలెం గ్రామానికి చెందిన 20 కుటుంబాలవారు వైఎస్సార్‌సీపీలో చేరారు. జనసేనకు చెందిన వీరందరికీ అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.
- పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం కేపీపాలెం నార్త్‌లో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సమక్షంలో మెట్రీవు ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకుడు బర్రి రమేష్ తన అనుచరులు సుమారు 25 మందితో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు.
- పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సమక్షంలో అత్తిలికి చెందిన తూర్పు కాపు సంఘ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీలో చేరినవారిలో తూర్పు కాపు సంఘ నాయకులు, అత్తిలి రెండో వార్డు మాజీ సభ్యుడు ముల్లు సత్యనారాయణ, కిలాడి అప్పన్న, రెడ్డి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.
- పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం టౌన్, మండలంలోని గొల్లవానితిప్ప గ్రామానికి చెందిన జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.
- ఏలూరు జిల్లా పెదవేగి మండలం రామసింగవరం గ్రామానికి చెందిన 40 కుటుంబాలవారు టీడీపీ, జనసేన పార్టీలను వీడి దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన విజయవాడ 11వ డివిజన్‌కు చెందిన టీడీపీ, జనసేన యువతతో విజయవాడ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి దేవినేని అవినాష్



ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో ఆనంగి శ్రీనివాసరావును వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను



ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కృష్ణాజిల్లా కోడూరు మండలం ఉల్లిపాలెం గ్రామానికి చెందిన జనసేన నాయకులు



ఏలూరు జిల్లా పెదవేగి మండలం రామశింగవరంలో వైఎస్సార్‌సీపీలో చేరినవారితో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



పల్నాడు జిల్లా వినుకొండలో వైఎస్సార్‌సీపీలో చేరిన బ్రహ్మయ్యపాకాలు గ్రామస్తులతో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శ్రీవారి ఆలయంలో వేడుకగా ఉగాది ఆస్థానం

రాష్ట్రంలోని ప్రధానాలయాల్లో ఉగాది వేడుకలు



దుర్గమ్మకు మల్లెపూలతో అభిషేకం చేస్తున్న వేదపండితులు



శ్రీశైలంలో మల్లన్న రథోత్సవం



శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానంలో పాల్గొన్న జీయర్ స్వాములు, టీటీడీ చైర్మన్ భూమన

తిరుమల/ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ)/కాణిపాకం(చిత్తూరు రూరల్)/శ్రీశైలం టెంపుల్: తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది ఆస్థానం వేడుకగా జరిగింది. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారికి, విష్వక్సేనుల వారికి అర్చకులు విశేష సమర్పణ చేశారు. విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశించారు. శ్రీవారి ఉత్సవర్లను బంగారు వాకిలిలో గరుడాళ్వారుకు అభిముఖంగా సర్వభూపాల వాహనంపై, ఉత్సవర్ల పక్కనే మరో పీఠంపై శ్రీ విష్వక్సేనుల వారిని వేంచేపు చేశారు. శ్రీవారి మూలవిరాట్‌కు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపజేశారు. అనంతరం పంచాంగ శ్రవణం జరిగింది. బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు ఉగాది ఆస్థానం నిర్వహించారు. ఆలయంలో టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో 10 టన్నుల సాంప్రదాయ పుష్పాలు, 60 వేల కట్ ఫ్లవర్స్‌తో ఏర్పాటు చేసిన ఫల–పుష్ప అలంకరణలు ఆకట్టుకున్నాయి. అయోధ్య రామాలయం, బాలరాముడి సెట్టింగ్, నవధాన్యాలతో రూపొందించిన మత్స్య అవతారము మైమరిపించింది. టీటీడీ గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 150 మంది పుష్పాలంకరణ కళాకారులు, 100 మంది టీటీడీ గార్డెన్ సిబ్బంది 2 రోజులు శ్రమించి ఈ ఆకృతులను రూపొందించారు.

వైభవంగా దుర్గమ్మకు పుష్పార్చన..

ఇంద్రకీలాద్రిపై వసంత నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇవి ఈ నెల 18 వరకు జరుగుతాయి. మంగళవారం తెల్లవారుజామున అంతరాలయంలో మూలవిరాట్‌కు స్నపనాభిషేకం నిర్వహించారు. దేవస్థానం రూపొందించిన పంచాంగాన్ని దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆవిష్కరించారు. అమ్మవారి ప్రధానాలయం, ఉపాలయాలను పుష్పాలతో అలంకరించారు. దుర్గమ్మకు విశేష పుష్పార్చన చేపట్టారు. ఉగాది సందర్భంగా ధర్మపథం వేదికపై కప్పగంతుల సోమయాజుల సిద్ధాంతి పంచాంగ శ్రవణం చేశారు. సాయంత్రం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు వెండి రథంపై నగరోత్సవాన్ని నిర్వహించారు.

కాణిపాకంలో అంగరంగ వైభవంగా..

కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఉగాది వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాన్ని పలు రకాల పుష్పాలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. వేకువజామున స్వామికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈవో వెంకటేశు స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. శివకుమార్ శర్మ రచించిన కాణిపాక దేవస్థానం పంచాంగాన్ని ఆవిష్కరించారు. పురోహితులు మోహన్, రామలింగం పంచాంగ శ్రవణం చేశారు. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. రాత్రి సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను కాణిపాకం పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు.

శ్రీశైలంలో వేడుకగా రథోత్సవం...

శ్రీశైలంలో మల్లన్న రథోత్సవం వైభవంగా సాగింది. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేయించి ఊరేగింపుగా రథశాల వద్దకు తోడ్కొనివచ్చి రథంపై అధిష్ఠింపజేశారు. అర్చకులు ఉత్సవమూర్తులకు ప్రత్యేక హారతులిచ్చి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ రథోత్సవం గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు సాగింది. అమ్మవారి ఉత్సవమూర్తిని రమావాణీ సేవిత రాజరాజేశ్వరీ అలంకారంలో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ ఏడాది దేశం పారిశ్రామికరంగంలో అభివృద్ధి చెందుతుందని శ్రీశైలం దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి పండిత బుట్టే దైవజ్ఞ తెలిపారు. ఉగాది సందర్భంగా ఆయన ఆలయ ప్రాంగణంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



జస్టిస్ సుజాతకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ)/అన్నవరం: ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వి.జ్యోతిర్మయి, జస్టిస్ వి.సుజాత కుటుంబసమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. వీరికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న జస్టిస్ వి.జ్యోతిర్మయి, జస్టిస్ వి.సుజాతకు వేద పండితులు ఆశీర్వచనాన్ని, ఆలయ ఈవో కేఎస్ రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

సత్యదేవుని దర్శించుకున్న జస్టిస్ గోపాలకృష్ణారావు

కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో కొలువుదీరిన శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు అధికారులు, పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఈవో కె.రామచంద్రమోహన్ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.



జస్టిస్ జ్యోతిర్మయికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు



జస్టిస్ గోపాలకృష్ణారావుకు సత్యదేవుని చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో రామచంద్ర మోహన్

వైభవంగా అప్పన్న పెళ్లిరాట మహోత్సవం

స్వామివారి మూలవిరాట్‌ను తాకిన సూర్యకిరణాలు



సింహాచలం: ఉగాదిని పురస్కరించుకుని సింహగిరిపై కొలువుదీరిన శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి పెళ్లిరాట మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఈ నెల 19న చైత్రశుద్ధ ఏకాదశి సందర్భంగా జరిగే స్వామివారి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని పెళ్లిరాట మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో తొలుత పంచాంగ శ్రవణం జరిపారు. అనంతరం ఆలయ ఉత్తర ద్వారం వద్ద, రాజగోపురం వద్ద, వార్షిక కల్యాణం జరిగే నృసింహ కల్యాణ మండపంలోనూ పెళ్లిరాటలు వేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

మూడేళ్ల తర్వాత మళ్లీ దర్శనభాగ్యం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్‌ను మూడేళ్ల తర్వాత మంగళవారం సాయంత్రం సూర్యకిరణాలు తాకాయి. ఉగాది రోజు సాయంత్రం స్వామివారి మూలవిరాట్‌ను సూర్యకిరణాలు తాకడం పరిపాటి. అయితే సాయంత్రం 5.40 గంటల సమయంలో సూర్యకిరణాలు ఆలయ రాజగోపురంలో నుంచి ధ్వజస్తంభం ప్రాంగణం ద్వారా ఆస్థాన మండపం, భోగమండపం మీదుగా అంతరాలయంలో ఉన్న మూలవిరాట్‌పై పడ్డాయి. ఈ అపురూప దృశ్యాన్ని తిలకించి భక్తులు పరవశించారు.

ఇట్లు.. జనార్దనరెడ్డి, టీడీపీ అభ్యర్థి

- 'కోడ్' ఉన్నా యథేచ్ఛగా డబ్బు, దుస్తుల పంపిణీ
- బనగానపల్లెలో పేష్ మాం, ఇమాంలకు తాయిలాలు



మసీదులో నగదు, దుస్తులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నంద్యాల: తెలుగుదేశం పార్టీ బనగానపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బి.సి.జనార్దన్‌రెడ్డి ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తాయిలాలు ఎర వేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ అభ్యర్థి ఫోటో ఉన్న ట్యాంకులు పెట్టి నీటిని సరఫరా చేశారు. దీనిపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు అందింది. ఈ ఘటన మరువక ముందే మంగళవారం రంజాన్ మాసం సందర్భంగా బనగానపల్లె పట్టణంలోని 28 మసీదుల్లో ఉన్న పేష్‌మాం, ఇమాంలకు దుస్తులు, నగదు పంపిణీ చేశారు. దుస్తులు ప్లాస్టిక్ కవర్లో, రూ.1200 నగదును ఎన్వలప్ కవర్లో పెట్టి అందజేశారు. నగదు అందజేసే ఎన్వలప్ కవర్‌పై ఏకంగా జనార్దనరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అని పేరు ముద్రించడం విశేషం. నియోజకవర్గంలోని మరిన్ని మసీదుల్లో కూడా తన అనుచరులతో ఇదే విధంగా పంపిణీ చేసినట్లు సమాచారం. దీనిపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు వద్ద ప్రస్తావించగా దీనిపై తమకు ఇప్పటికే ఫిర్యాదులు వచ్చాయని, విచారణ చేసి నివేదిక అందజేయాలని ఎంపీడీఓను ఆదేశించామన్నారు.

దుర్గమ్మ సేవలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మీనా



ముకేష్‌కుమార్ మీనా దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ముకేష్‌కుమార్ మీనా దంపతులకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న మీనా దంపతులకు వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఆలయ ఈవో కేఎస్ రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టు వస్త్రాలను అందజేశారు.

బరితెగించిన 'భాష్యం'!

- విద్యార్థులను ఫీజుల కోసం వేధిస్తున్న యాజమాన్యం
- భాష్యం విద్యా సంస్థల అధినేత ప్రవీణ్ టీడీపీ తరఫున పోటీ
- ఈ నేపథ్యంలో ఖర్చులు ఉన్నాయంటూ ఒత్తిళ్లు
- 'అనంత'లో రోజంతా ఓ గదిలో 50 మంది విద్యార్థుల నిర్బంధం
- విద్యా సంవత్సరం ముగిసేలోపు చెల్లిస్తామని తల్లిదండ్రులు చెప్పినా వినని వైనం
- ఫీజులు చెల్లిస్తేనే పిల్లలను బడికి పంపాలంటూ హుకుం
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన



అనంతపురం ఎడ్యుకేషన్: 'భాష్యం' విద్యా సంస్థలు బరితెగించాయి. ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో భాష్యం విద్యా సంస్థలకు బ్రాంచ్‌లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లా పెదకూరపాడు శాసనసభ నియోజకవర్గం నుంచి భాష్యం విద్యా సంస్థల అధినేత ప్రవీణ్ టీడీపీ తరఫున పోటీ చేస్తున్నారు. దీంతో ఎన్నికల ఖర్చుల కోసమంటూ ఆ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులను వేధిస్తున్నారు. విద్యా సంవత్సరం ముగిసేలోగా ఫీజులు చెల్లిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నా భాష్యం యాజమాన్యం పట్టించుకోవడం లేదు. ఫీజులు చెల్లిస్తేనే బడికి పంపాలంటూ హుకుం జారీ చేస్తోంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతపురంలో భాష్యం స్కూల్ ఉంది. అధినేత ఎన్నికల ఖర్చులకు డబ్బులు అవసరమని పై నుంచి ఆదేశాలు రావడంతో ఫీజుల కోసం సిబ్బంది విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఫీజు చెల్లిస్తేనే మీ పిల్లలను బడికి పంపండి.. లేకుంటే పంపొద్దు అని తల్లిదండ్రులకు కరాఖండీగా చెప్పేస్తున్నారు. ఈ నెల ఆరో తేదీన 1–9 తరగతుల విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షల ప్రారంభానికి ముందు ఫీజు చెల్లించిన వారినే పరీక్షలకు అనుమతిస్తామని భాష్యం యాజమాన్యం తేల్చిచెప్పింది. దీంతో చాలామంది తమ పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ఫీజు మొత్తాన్ని చెల్లించారు. ఉన్నట్టుండి ఒత్తిడి చేయడంతో మరికొంతమంది తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోజంతా పిల్లల నిర్బంధం

పూర్తి ఫీజు చెల్లించలేదనే నెపంతో పది రోజుల క్రితం అనంతపురం భాష్యం స్కూల్‌లో దాదాపు 50 మంది విద్యార్థులను రోజంతా సిబ్బంది ఒక గదిలో నిర్బంధించారు. తరగతుల్లో కూర్చోబెట్టకుండా వారందరినీ ఒక గదిలో కూర్చోబెట్టారు. అదికూడా బెంచీలపై కాకుండా నేలపై కూర్చోబెట్టి ఇబ్బందులకు గురి చేశారు. సాయంత్రం పాఠశాల సమయం ముగిశాక వారిని ఇళ్లకు పంపడంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో గోడు చెప్పుకున్నారు. దీంతో మరుసటి రోజు పాఠశాలకు వెళ్లిన తల్లిదండ్రులు.. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను నిలదీశారు. పాఠశాల ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్ నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ యాజమాన్యం నుంచి తమకు తీవ్రస్థాయిలో ఒత్తిడి ఉందని, తామేమీ చేయలేమని విద్యార్థుల తల్లిదండ్రులకు తేల్చిచెప్పారు. ఎవరితోనైనా చెప్పుకోండి.. ముందు ఫీజు కట్టండని చెప్పడంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు తిరగబడ్డారు. సమస్య పెద్దదయ్యే పరిస్థితి కనిపించడంతో కాస్త వెనక్కి తగ్గి ఈ నెల 12లోపు అందరూ ఫీజు చెల్లించాలని తల్లిదండ్రులకు పాఠశాల ప్రిన్సిపాల్ సూచించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపడితే భాష్యం పాఠశాలల యాజమాన్యం చేస్తున్న అరాచకాలు మరిన్ని వెలుగులోకి వస్తాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చెబుతున్నారు.


అడవిని జయించేదెవరో?

ఛత్తీస్‌గఢ్‌లో హోరాహోరీ | ఆదినుంచీ బీజేపీ ఆధిపత్యమే | ఈసారి చెక్ పెట్టే యత్నాల్లో కాంగ్రెస్

స్టేట్ స్కాన్

పుడమి తల్లికి పచ్చని కోక చుట్టినట్టు అపార అటవీ సంపదతో అలరారే రాష్ట్రం ఛత్తీస్‌గఢ్. దేశంలోకెల్లా మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉండటం, సగం భూభాగం దట్టమైన అడవులే కావడంతో ఇక్కడ ఎన్నికల నిర్వహణ కత్తిమీద సామే. 2000 సంవత్సరంలో మధ్యప్రదేశ్ నుండి విడిపోయిన ఈ రాష్ట్రంలో ఆది నుంచీ జాతీయ పార్టీలదే హవా. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ నువ్వానేనా అన్నట్లు తలపడుతున్నా లోక్‌సభకు వచ్చేసరికి తొలినుంచీ కాషాయ జెండాయే ఎగురుతోంది. హిందీ బెల్టు రాష్ట్రాల్లో బీజేపీకి కంచుకోటగా నిలుస్తున్న ఛత్తీస్‌గఢ్‌లో ఈసారి ఎలాగైనా సత్తా చాటాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది...

- సాక్షి, నేషనల్ డెస్క్



ఏకంగా ఏడు రాష్ట్రాలతో సరిహద్దులు పంచుకుంటున్న ఛత్తీస్‌గఢ్‌పై బీజేపీ, కాంగ్రెస్ ఈ లోక్‌సభ ఎన్నికల్లో గట్టిగా ఫోకస్ పెట్టాయి. 2019లో బీజేపీ మొత్తం 11 సీట్లలో పోటీ చేసి 9 స్థానాలను దక్కించుకుంది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2004లో జరిగిన తొలి లోక్‌సభ ఎన్నికల నుంచి 2014 వరకు కమలనాథులు ప్రతిసారీ పదేసి సీట్లు నెగ్గి హ్యాట్రిక్ కొట్టారు. కాంగ్రెస్ ఒకే సీటుతో సరిపెట్టుకుంటూ వచ్చింది. ఆ లెక్కన గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక సీటు అదనంగా దక్కింది. కానీ 2023 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గద్దె దించిన బీజేపీ ఈసారి రెట్టించిన ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. రాష్ట్రంలోని 11 లోక్‌సభ స్థానాల్లో 4 ఎస్టీలకు కేటాయించారు.



సర్వేల ఓటు ఎవరికి?

ఎప్పట్లాగే ఈ లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఛత్తీస్‌గఢ్‌లో కాషాయదళానికి తిరుగులేదని అనేక సర్వేలు కుండబద్దలు కొడుతున్నాయి. బీజేపీకి 10 సీట్లు దక్కుతాయని, కాంగ్రెస్ ఒక్క స్థానానికే పరిమితం కావచ్చని చెబుతున్నాయి. 11 సీట్లనూ కమలనాథులే క్లీన్ స్వీప్ చేయొచ్చని కూడా మరికొన్ని సర్వేలు అంచనా వేయడం విశేషం.

కాంగ్రెస్‌కు చావో రేవో

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని బలంగా ఢీకొడుతున్న కాంగ్రెస్, లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి మాత్రం తేలిపోతోంది. 2000 సంవత్సరంలో కాంగ్రెస్ నేత అజిత్ జోగి ఛత్తీస్ తొలి సీఎంగా గద్దెనెక్కారు. 2003లో కొత్త రాష్ట్రంలో జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి అధికారం దక్కింది. అయినా 2014 దాకా విపక్ష నేతగా జోగి చక్రం తిప్పారు. కానీ పార్టీ వ్యతిరేక కార్యకలాపాల ఆరోపణలపై జోగి, ఆయన కుమారుడు అమిత్ 2014లో కాంగ్రెస్ నుంచి ఉద్వాసనకు గురయ్యారు. దాంతో పార్టీకి జనాకర్షణ ఉన్న నాయకుడు లేకుండా పోయారు. జనతా కాంగ్రెస్ చత్తీస్‌గఢ్ (జేసీసీ) పేరుతో జోగి వేరుకుంపటి పెట్టుకున్నా పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ, బీఎస్పీలతో జట్టు కట్టినా జేసీసీకి 5 సీట్లే దక్కాయి. జనం అనూహ్యంగా కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. సీఎంగా ఐదేళ్లు కొనసాగిన బఘేల్ సంక్షేమ పథకాలతో ప్రజలకు చేరువయ్యారు. అయినా 2019 లోక్‌సభ ఎన్నికల్లో 9 సీట్లతో దుమ్ము రేపిన బీజేపీ, తాజాగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ను కంగుతినిపించి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది.

ఒంటరి పోరే

అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం నేపథ్యంలో లోక్‌సభ పోరులో ఎలాగైనా పుంజుకోవాలన్న భావిస్తున్న కాంగ్రెస్ జాతీయ మ్యానిఫెస్టోలోని ఆరు న్యాయాలు, 25 గ్యారంటీలను గట్టిగా ప్రచారం చేస్తోంది. బెట్టింగ్ స్కామ్‌లో చిక్కుకున్న మాజీ సీఎం బఘేల్ రాజ్‌నందగావ్ నుంచి బరిలో ఉన్నారు. పలు రాష్ట్రాల్లో విపక్ష ఇండియా కూటమిలోని పార్టీలతో సీట్ల సర్దుబాటు చేసుకుంటున్న కాంగ్రెస్ ఛత్తీస్‌గఢ్‌లో ఒంటరిగానే బరిలోకి దిగుతోంది.

బీజేపీ గిరిజన పాచిక

లోక్‌సభ ఎన్నికల్లో ఛత్తీస్‌గఢ్‌లో తిరుగులేని ఆధిక్యం ప్రదర్శిస్తున్న బీజేపీ 2018లో రాష్ట్రంలో తొలిసారి అధికారాన్ని కోల్పోయింది. ముఖ్యంగా గిరిజనులు అత్యధికంగా ఉండే సర్గుజా ప్రాంతంలో ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పూర్తి ఆధిపత్యం కనబరిచింది. 2023 అసెంబ్లీ పోరులో మాత్రం అక్కడ మెజారిటీ సీట్లు బీజేపీ పరమయ్యాయి. రాష్ట్రంలో 32 శాతమున్న ఎస్టీలకు బీజేపీ ఏకంగా 29 సీట్లు కేటాయించి 17 చోట్ల గెలుపొందింది. ఈ దృష్ట్యా గిరిజనులకు మరింత చేరువయ్యేలా కాషాయ పార్టీ ఈసారి వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. 15 ఏళ్లు సీఎంగా చేసిన రాజ్‌పుత్ వర్గానికి చెందిన రమణ్ సింగ్‌ను కాదని విష్ణుదేవ్ సాయ్ రూపంలో తొలిసారి ఓ గిరిజన నేతను సీఎంను చేసింది. రాష్ట్ర పార్టీ అధ్యక్షునిగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా పని చేసిన విష్ణుదేవ్‌కు 2019లో బీజేపీ ఎంపీ టికెట్ కూడా ఇవ్వకపోవడం విశేషం.

మోదీ, మందిరం, అభివృద్ధి...

ఈ ఎన్నికల్లో అయోధ్య రామమందిర కల సాకారం, మోదీ చరిష్మా, పదేళ్ల బీజేపీ పాలనలో దేశవ్యాప్తంగా సాధించిన అభివృద్ధి వంటి అంశాలను ప్రచారాస్త్రాలుగా సంధిస్తోంది బీజేపీ. కాంగ్రెస్‌కు చెందిన మాజీ సీఎం భూపేశ్ బఘేల్ హయాంలో భారీ బెట్టింగ్ స్కామ్ జరిగిందంటూ కమనాథులు తమ ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. దాదాపు రూ.5,500 కోట్ల మహాదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ కుంభకోణంలో రూ.508 కోట్లు బఘేల్‌కు అందాయనే ఆరోపణలతో బీజేపీ కొత్త సర్కారు ఆయనపై ఎఫ్‌ఐఆర్ కూడా నమోదు చేసింది! మోదీ ఇప్పటికే రాష్ట్రంలో పలు ఎన్నికల ర్యాలీల్లో పాల్గొని బీజేపీ ప్రచార పర్వానికి ఊపు తెచ్చారు.

మహారాష్ట్ర ఎంవీఏలో సీట్ల పంపిణీ ఖరారు

శివసేన(యూబీటీ)కి 21, కాంగ్రెస్‌కు 17, ఎన్‌సీపీ(ఎస్పీ)కి 10 స్థానాలు

ముంబై: మహారాష్ట్రలో ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) పక్షాల మధ్య లోక్‌సభ ఎన్నికల సీట్ల పంపిణీ ఖరారైంది. 48 స్థానాలకు శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) అత్యధికంగా 21 సీట్లలో, కాంగ్రెస్ 17, ఎన్సీపీ (శరద్‌పవార్) 10 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. మొదట్నుంచీ కాంగ్రెస్ పట్టుబడుతున్న సాంగ్లి, భివాండీల్లో శివసేన(యూబీటీ), ఎన్సీపీ(ఎస్పీ) చెరో చోటు నుంచి బరిలోకి దిగనున్నాయి. ఏకాభిప్రాయంతోనే సీట్ల పంపిణీ కుదిరిందని ఎన్సీపీ(ఎస్పీ)చీఫ్ శరద్ పవార్ స్పష్టం చేశారు. బీజేపీని మట్టి కరిపించడమే కూటమి లక్ష్యమని శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే చెప్పారు. దాని సాధనకు విశాల దృక్పథంతో వ్యవహరించాలని తాము నిర్ణయించుకున్నట్లు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలె చెప్పారు. ఒకట్రెండు రోజుల్లోనే అభ్యర్థులను ప్రకటిస్తామని వారు చెప్పారు. రాష్ట్రంలో ఏప్రిల్ 19 నుంచి మొదలుకొని ఐదు విడతలుగా లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి.

ఈ ఏడాది సాధారణ వర్షపాతమే!

ప్రైవేట్ వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా

న్యూఢిల్లీ: దేశంలో ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని ప్రైవేట్ వాతావరణ అంచనాల సంస్థ 'స్కైమెట్' మంగళవారం వెల్లడించింది. ఈ ఏడాది వర్షాకాలంలో మొదటి అర్ధభాగంతో పోలిస్తే రెండో అర్ధభాగంలో ఎక్కువ వర్షాలు కురుస్తాయని తెలియజేసింది. జూన్ నుంచి సెప్టెంబర్ దాకా.. నాలుగు నెలలపాటు లాంగ్-పీరియడ్ యావరేజ్(ఎల్‌పీఏ) 868.6 మిల్లీమీటర్లు కాగా, ఇందులో 96 శాతం నుంచి 104 శాతం వర్షపాతం నమోదైతే సాధారణ వర్షపాతంగా పరిగణిస్తారు. ఈసారి 102 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లుస్కైమెట్ అంచనా వేసింది. దక్షిణ, పశ్చిమ, వాయువ్య భారతదేశంలో తగినంత వర్షాలు పడతాయని వెల్లడించింది. బిహార్, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో లోటు వర్షపాతం నమోదవుతుందని తెలియజేసింది. ఈశాన్య రాష్ట్రాల్లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురుస్తాయని ఉద్ఘాటించింది. ఇండియాలో 2023లో ఎల్ నినో పరిస్థితుల కారణంగా సగటు కంటే తక్కువ



వర్షపాతం నమోదైంది. అంతకంటే ముందు వరుసగా నాలుగు సంవత్సరాలు సాధారణం, సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిశాయి. ఎల్ నినో క్రమంగా లా నినాగా మారుతోందని, దీని వల్ల వర్షపాతం మెరుగవుతుందని స్కైమెట్ ఎండీ జతిన్ సింగ్ చెప్పారు.

ఎలక్షన్ బీట్

రెండో దశ బరిలో 1,210 మంది

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల రెండో దశ ఎన్నికల్లో 1,210 మంది అభ్యర్థులు పోటీకి సిద్ధమయ్యారు. 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 88 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఈ నెల 26న పోలింగ్ జరుగనుంది. ఈ 88 స్థానాల్లో పోటీ కోసం 2,633 నామినేషన్లు దాఖలుకాగా పరిశీలన అనంతరం 1,428 నామినేషన్లు చెల్లుబాటు అయ్యేవిగా గుర్తించారు. ఏప్రిల్ 8వ తేదీతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో ఔటర్ మణిపూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి నలుగురు అభ్యర్థులతో పాటు 12 రాష్ట్రాలు, యూటీల నుంచి 1,206 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. రెండో దశ పోలింగ్‌లో కేరళలోని 20 నియోజకవర్గాలకు 500 నామినేషన్లు, కర్ణాటకలోని 14 స్థానాలకు 491 నామినేషన్లు దాఖలయ్యాయి. త్రిపురలో ఒక ఎంపీ స్థానానికి కనిష్టంగా 14 నామినేషన్లు రాగా మహారాష్ట్రలోని నాందేడ్ సీటుకు గరిష్టంగా 92 నామినేషన్లు దాఖలయ్యాయి.

హేమమాలినిపై వ్యాఖ్యలు.. సుర్జేవాలాకు ఈసీ నోటీస్

న్యూఢిల్లీ: బీజేపీ ఎంపీ హేమ మాలిని పట్ల అమర్యాదకర, అసభ్యకర వ్యాఖ్యలు చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ నేత రణదీప్ సుర్జేవాలాకు ఎన్నికల కమిషన్ మంగళవారం నోటీసిచ్చింది. బహిరంగ వేదికలపై మహిళల గౌరవాన్ని కాపాడేలా ప్రసంగించాలంటూ తాము పంపిన మార్గదర్శకాలను కాంగ్రెస్ నేతలు పాటించేలా తీసుకున్న చర్యలను వివరించాల్సిందిగా ఆ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గేను సైతం కోరింది. ఈ నెల 11వ తేదీ సాయంత్రంలోగా స్పందించాలని సుర్జేవాలాకు, మరుసటి రోజు సాయంత్రం వరకు ఖర్గేకు గడువిచ్చింది. కాంగ్రెస్ నేతలు పదే పదే ఉల్లంఘనలకు పాల్పడుతుండటంపైనా ఈసీ సీరియస్‌గా ఉంది.

బీఎస్పీ అభ్యర్థి మృతి.. బేతూల్‌లో ఎన్నిక వాయిదా

బేతూల్ (మధ్యప్రదేశ్): మధ్యప్రదేశ్‌లోని బేతూల్ లోక్‌సభ నియోజకవర్గ బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) అభ్యర్థి అశోక్ భలావి హఠాన్మరణం చెందారు. దీంతో, అక్కడ ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. అశోక్ గుండె పోటుకు గురయ్యారని, ఆస్పత్రికి వచ్చే సమయానికే ఆయన తుదిశ్వాస విడిచినట్లు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అశోక్ భలావి మృతితో బేతూల్‌లో ఈ నెల 26న జరగాల్సిన ఎన్నికను వాయిదా వేసినట్లు జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి నరేంద్ర సింగ్ రఘువంశీ తెలిపారు.

రామున్ని అవమానించిన కాంగ్రెస్

- రామాలయ నిర్మాణాన్ని అడ్డుకొనేందుకు యత్నించింది
- అభివృద్ధిని అడ్డుకోవడానికి నన్ను బెదిరిస్తున్నారు
- ప్రతిపక్ష నేతలపై మోదీ ధ్వజం
- యూపీ, మధ్యప్రదేశ్, తమిళనాడుల్లో ప్రచారం



పిలిభిత్/భోపాల్: అయోధ్యలో భవ్య రామ మందిర నిర్మాణాన్ని నిలిపివేయడానికి ప్రతిపక్ష కాంగ్రెస్ ఎన్నో ప్రయత్నాలు చేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. అయినా దేశ ప్రజలు రూపాయి రూపాయి కూడబెట్టి అద్భుతమైన ఆలయం నిర్మించుకున్నారని చెప్పారు. ఆలయ నిర్వాహకులు పెద్ద మనసుతో క్షమించి, ప్రాణప్రతిష్ఠకు హాజరు కావాలని కోరుతూ ఆహ్వానం పంపిస్తే కాంగ్రెస్ దాన్ని తిరస్కరించిందని, తద్వారా శ్రీరాముడిని అవమానించిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమానికి హాజరైన నేతలను కాంగ్రెస్ నుంచి ఆరేళ్ల పాటు బహిష్కరించారని తప్పుపట్టారు. మంగళవారం ఉత్తరప్రదేశ్‌లోని పిలిభిత్, మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్, తమిళనాడు రాజధాని చెన్నైలో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. బహిరంగ సభల్లో ప్రసంగించారు. బుజ్జగింపు రాజకీయాల్లో కాంగ్రెస్ పూర్తిగా కూరుకుపోయిందని, అందులో నుంచి ఎప్పటికీ బయటకు రాలేదని విమర్శించారు. బుజ్జగింపు రాజకీయాల రుణం తీర్చుకోవడానికే పౌరసత్వ సవరణ చట్టాన్ని(సీఏఏ) కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ వ్యతిరేకిస్తున్నాయని ధ్వజమెత్తారు. రాముడిని పూజించిన వారిని కాంగ్రెస్ నుంచి బహిష్కరించారని, ఇదెక్కడి పైత్యం? అని ధ్వజమెత్తారు. ఇలాంటి పాపం చేసినవారిని ప్రజలు క్షమించబోరని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. దేశ ప్రజలు ఆరాధించే 'శక్తి'ని కాంగ్రెస్ పార్టీ కించపర్చిందని ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. శక్తి ఎదుట మనం తల వంచి నమస్కరిస్తుంటామని, అలాంటి శక్తిని కూలదోయాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిస్తున్నారని ఆక్షేపించారు. ఆ నాయకులను శక్తి ఎప్పటికీ క్షమించదని అన్నారు. మన దేశానికి చెందిన గొప్ప వ్యక్తులను ఇండియా కూటమి నేతలు అవమానించారని విమర్శించారు. గుజరాత్‌లోని సర్దార్ వల్లభ్ భాయి పటేల్ ఐక్యతా విగ్రహాన్ని విపక్ష నేతలు దర్శించలేదని చెప్పారు. వారికి విదేశాల్లో గడపానికి సమయం ఉంటుంది గానీ ఐక్యతా ప్రతిమను దర్శించడానికి సమయం లేదా? అని నిలదీశారు. ప్రపంచ దేశాలు నేడు ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నాయని, అయినప్పటికీ అనుకున్న లక్ష్యం సాధించడం సాధ్యమేనని ప్రపంచ దేశాలకు భారత్ చాటి చెబుతోందని ప్రధానమంత్రి వెల్లడించారు. దేశ ప్రజల ఓటుతోనే ఇది సాధ్యమవుతోందని పేర్కొన్నారు.

మహాకాలుడి భక్తుడిని.. ఎవరికీ భయపడను

దేశ అభివృద్ధిని అడ్డుకోవడానికి ప్రతిపక్ష నాయకులు తనను దూషిస్తున్నారని, బెదిరింపులకు గురి చేస్తున్నారని నరేంద్ర మోదీ ఆరోపించారు. అవినీతిపరులను రక్షించడమే ఇండియా కూటమి లక్ష్యంగా మారిపోయిందన్నారు. దేశ భద్రతకు గ్యారంటీ ఇచ్చినప్పుడు తిట్టారని, ఆర్టికల్ 370ని రద్దు చేసినప్పుడు దూషించారని, అయోధ్యలో రామాలయ ప్రాణ ప్రతిష్ఠ చేసినప్పుడు అనరాని మాటలు అన్నారని విపక్ష నేతలపై మండిపడ్డారు. తాను మహాకాళుడి భక్తుడినని, ఎవరికీ భయపడనని తేల్చిచెప్పారు. 'న్యూ ఇండియా'ను నిర్మించడానికి రాబోయే ఎన్నికలు మనకు ఒక మిషన్ అని ప్రజలకు సూచించారు. ప్రధానమంత్రిగా తన మూడో టర్మ్‌లో అతిపెద్ద, చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకోబోతున్నానని, ఇందుకు ప్రజల ఆశీర్వచనాలు కావాలని కోరారు. చెన్నైలో మోదీ రోడ్ షోకు జనం భారీగా తరలివచ్చారు. ఉత్తరప్రదేశ్‌లోని పిలిభిత్‌లో ప్రచారానికి సిట్టింగ్ ఎంపీ వరుణ్ గాంధీ, ఆయన తల్లి మేనకా గాంధీ హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇక్కడ వరుణ్ గాంధీ స్థానంలో జితిన్ ప్రసాదను బీజేపీ రంగంలోకి దింపడం తెలిసిందే.

కేజ్రీవాల్ అరెస్టు సబబే

ఢిల్లీ హైకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తనను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపిస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. కేజ్రీవాల్ అరెస్టు విషయంలో చట్టాల ఉల్లంఘన జరగలేదని తేల్చిచెప్పింది. అరెస్టు సబబేనని పేర్కొంది. ఆయనను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కస్టడీకి అప్పగించడం కూడా చట్టవిరుద్ధం కాదని స్పష్టంచేసింది. తనను అరెస్టు చేసి, ఈడీ కస్టడీకి అప్పగించడాన్ని సవాలు చేస్తూ కేజ్రీవాల్ గతవారం దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ మంగళవారం తీర్పు వెలువరించారు. కేజ్రీవాల్‌ను అరెస్టు విషయంలో తగిన సాక్ష్యాధారాలు ఈడీ వద్ద ఉన్నాయన్నారు. ఆయనను ఈడీ కస్టడీకి అప్పగిస్తూ ట్రయల్ కోర్టు జారీ చేసిన ఉత్తర్వును సమర్థించారు. తదుపరి విచారణ కోసం కేజ్రీవాల్‌ను ఈడీ అదుపులోకి తీసుకోవడం చట్టబద్ధమేనని స్పష్టం చేశారు. ''చట్టం అందరికీ సమానంగా వర్తిస్తుంది. ముఖ్యమంత్రికి ఒక చట్టం, సామాన్యులకు మరో చట్టం ఉండదు. ముఖ్యమంత్రికి ప్రత్యేక హక్కులుండవు. కోర్టులు రాజ్యాంగ నైతికతను పాటిస్తాయి తప్ప రాజకీయపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవు. ఈ కేసు కేంద్ర ప్రభుత్వానికి, కేజ్రీవాల్‌కు మధ్య కాదు. ఇది కేజ్రీవాల్‌కు, ఈడీకి మధ్య సాగుతున్న వ్యవహారం'' అన్నారు. ఈ తీర్పుపై సుప్రీం కోర్టుకు వెళ్తామని ఆప్ నేత, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ వెల్లడించారు.

దక్షిణకొరియాలో నేడే ఎన్నికలు

సియోల్: దక్షిణ కొరియా జాతీయ అసెంబ్లీ(పార్లమెంట్) ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం ఎన్నికలు జరుగబోతున్నాయి. మొత్తం 300 స్థానాలున్న పార్లమెంట్‌లో 254 స్థానాలను ప్రత్యక్ష ఎన్నిక ద్వారా భర్తీచేస్తారు. మిగిలిన 46 స్థానాలను చిన్నాచితక పార్టీలకు వాటికి లభించిన ఓట్ల శాతం ఆధారంగా కేటాయిస్తారు. ఈ ఎన్నికల్లో ప్రధానంగా అధికార పీపుల్ పవర్ పార్టీ, ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ పోటీ పడుతున్నాయి. దేశంలో మొత్తం 4.4 కోట్ల మంది ఓటర్లున్నారు. ఈసారి రెండు ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ పోరు తప్పదని సర్వేలు చెబుతున్నాయి. ఈ ఎన్నికలు పీపుల్ పవర్ పార్టీ నేత, అధ్యక్షుడు యూన్ సుక్ ఇయోల్ పరిపాలనకు రిఫరెండమ్ అని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఆయన 2022లో అధ్యక్షుడిగా అధికారంలోకి వచ్చారు. మరో మూడేళ్ల పదవీ కాలం మిగిలి ఉంది. ఈ ఎన్నికల్లో పీపుల్ పవర్ పార్టీకి తక్కువ స్థానాలు వస్తే యూన్ సుక్ ఇయోల్‌కు ఇబ్బందులు తప్పక పోవచ్చు. ఆయనను పదవి నుంచి తొలగించాలన్న డిమాండ్లు ఊపందుకోవచ్చు. మరోవైపు డెమొక్రటిక్ పార్టీ నాయకుడు లీ జే-మ్యూంగ్ ఈసారి ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలచుకోవాలన్న పట్టుదలతో ఉన్నారు. సర్వే కూడా అదే అంచనా వేస్తున్నాయి. పార్లమెంట్‌లో ప్రతిపక్షం ఆధిక్యం పెరిగితే పరిపాలన పరంగా అధ్యక్షుడు యూన్ సుక్ ఇయోల్‌కు కొత్త సవాళ్లు ఎదురవుతాయి.

చైనా అంగుళం కూడా ఆక్రమించలేదు: అమిత్ షా

లఖీంపూర్ (అస్సాం): మోదీ ప్రభుత్వ హయాంలో మన భూభాగాన్ని చైనా ఒక్క అంగుళం కూడా ఆక్రమించుకోలేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. 1962లో అస్సాం, అరుణాచల్ ప్రదేశ్‌లను చైనా ఆక్రమించుకుంటున్నా నాటి ప్రధాని నెహ్రూ చూస్తూ వదిలేసిన వైనాన్ని ఆయా రాష్ట్రాల ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరన్నారు. అస్సాంలోని లఖీంపూర్‌లో మంగళవారం ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. కేంద్రం, రాష్ట్రంలోని హిమంత ప్రభుత్వం బంగ్లాదేశ్‌తో మన సరిహద్దులను కట్టుదిట్టం చేసి చొరబాట్లను నిలువరించాయన్నారు. డొక్లాం సహా మన భూభాగంలో ఒక్క అంగుళాన్ని కూడా చైనా ఆక్రమించలేదని, ఆ దేశ బలగాలను వెనక్కి తరిమివేశామని చెప్పారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు అస్సాంకు అన్యాయం చేశాయని ఆరోపించారు.

క్లీన్ చిట్ ఎలా ఇస్తారు?: కాంగ్రెస్

చైనాకు అమిత్ షా ఆక్లీన్‌చిట్ ఇస్తున్నారంటూ కాంగ్రెస్ మండిపడింది. తాము అధికారంలోకి వస్తే చైనా దురాక్రమణను అడ్డుకుని తీరుతామని స్పష్టం చేసింది. అరుణాచల్‌లోకి చైనా 60 కి.మీ. మేర చొచ్చుకొచ్చిందని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు.



ఎన్నికల వి-చిత్రం

ఉత్తరాఖండ్‌లో డెహ్రాడూన్‌కు చెందిన బీజేపీ మహిళా మోర్చా కార్యకర్తలు పార్టీ పేరు, గుర్తు, ఎన్నికల నినాదాలతో మంగళవారం ఇలా వినూత్నంగా మెహందీ పెట్టుకున్నారు

తారలోకచోట... మెరుపులు మరోచోట

స్వరాష్ట్రంలో టికెటిచ్చేందుకు ఆసక్తి చూపని పార్టీలు | బయటి రాష్ట్రాల్లోనే నేతలుగా రాణిస్తున్న భోజ్‌పురి తారలు

ఎలక్షణీయం

వాళ్లంతా భోజ్‌పురీ సినీ పరిశ్రమను తిరుగు లేకుండా ఏలిన, ఏలుతున్న తారలు. వెండితెరపై కనిపించారంటే విజిల్లు, క్షీరాభిషేకాలే. అయితే వారిపట్ల ఈ వీరాభిమానమంతా భోజ్‌పురీ సినిమాలకు పుట్టిల్లయిన బిహార్, పొరుగు రాష్ట్రం జార్ఖండ్‌లకే పరిమితం. వాళ్లు స్థానికంగా ఎంతగా వెలిగినా బాలీవుడ్, తెలుగు తదితర సినీ పరిశ్రమల్లోనే విలన్లుగా, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా నటించడం ద్వారానే దేశవ్యాప్తంగా ఫేమ్‌లోకి వచ్చారు. రాజకీయ రంగస్థలంపైనా ఇదే సీన్ రిపీటవుతోంది. భోజ్‌పురీ తారలెవరూ వారి స్వరాష్ట్రమైన బిహార్లో పెద్దగా ఉనికి చాటలేకపోతున్నారు. కారణాలేవైనా వారిని అక్కడినుంచి బరిలోకి దింపేందుకు పార్టీలు అంతగా ఆసక్తి చూపడం లేదు. దాంతో ఇతర రాష్ట్రాల నుంచి పోటీ చేసి మాత్రమే వాళ్లు లోక్‌సభలో అడుగు పెడుతున్నారు...

భోజ్‌పురీ నటీనటులకు, వారి స్వరాష్ట్రమైన బిహార్‌కు రాజకీయంగా ఎప్పుడూ చుక్కెదురే. పొరుగు రాష్ట్రాలకో, సుదూరాలకో వెళ్లి మాత్రమే రాజకీయాల్లో రాణిస్తున్నారు. పలు తెలుగు సినిమాల్లో విలన్‌గా రాణించిన భోజ్‌పురీ సూపర్‌స్టార్ రవికిషన్ 2014 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఉత్తరప్రదేశ్ నుంచి అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. కానీ జౌన్‌పూర్ లోక్‌సభ స్థానంలో బరిలో దిగిన ఆయన ఘోర ఓటమి చవిచూసి ఆరో స్థానంలో నిలిచారు. అనంతరం బీజేపీలో చేరి 2019 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలోని గోరఖ్‌పూర్ నుంచి 3 లక్షల ఓట్ల పై చిలుకు భారీ మెజారిటీతో నెగ్గారు. ఈసారి కూడా అక్కడినుంచే బరిలోకి దిగుతున్నారు.


నటుడు రవికిషన్


నటుడు మనోజ్ తివారీ

మరో ప్రముఖ భోజ్‌పురీ నటుడు మనోజ్ తివారీ అయితే ఏకంగా ఢిల్లీని తన రాజకీయ కర్మభూమిగా మార్చుకున్నారు. బిహార్లోని కైమూర్ జిల్లా అతర్వాలియా గ్రామానికి చెందిన ఆయన ఈశాన్య ఢిల్లీ బీజేపీ సిట్టింగ్ ఎంపీ. ఈసారి కూడా అక్కడినుంచే పోటీలో ఉన్నారు. భోజ్‌పురీ నటగాయకుడు దినేశ్‌లాల్ యాదవ్ పరిస్థితీ అంతే. గత లోక్‌సభ ఎన్నికల్లో యూపీలోని ఆజంగఢ్ నుంచి నెగ్గిన ఆయన ఈసారీ అక్కడి నుంచే పోటీలో ఉన్నారు. మరో భోజ్‌పురీ గాయకుడు పవన్ సింగ్‌కు కూడా ఈసారి పశ్చిమబెంగాల్‌లోని అసన్‌సోల్ నుంచి బీజేపీ టికెటివ్వగా రెండు రోజులకే ఆయన అనూహ్యంగా బరి నుంచి తప్పుకున్నారు. బిహారీ బాబుగా ప్రసిద్ధుడైన బాలీవుడ్ దిగ్గజం శత్రుఘ్న సిన్హా గతంలో రెండుసార్లు బిహార్‌లోని పాట్నా సాహిబ్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ తరఫున గెలిచినా 2019లో టికెట్ దక్కకపోవడంతో పశ్చిమ బెంగాల్ వలస వెళ్లారు. అసన్‌సోల్ లోక్‌సభ స్థానం నుంచి తృణమూల్ కాంగ్రెస్ తరఫున గెలిచారు. ఈసారీ అక్కడి నుంచే పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న ఇంటర్నెట్ సంచలనం, భోజ్‌పురీ గాయని నేహా సింగ్ రాథోడ్‌కు ఈసారి ఢిల్లీ నుంచి టికెట్ ఇస్తారంటున్నారు.


శత్రుఘ్న సిన్హా

గుంజన్.. ఒకే ఒక్కడు

ఈ లోక్‌సభ ఎన్నికల్లో భోజ్‌పురి సినీ పరిశ్రమకు సంబంధించి బిహార్ నుంచి పోటీ చేస్తున్నది గుంజన్ కుమార్ ఒక్కరే. అయితే ఈ భోజ్‌పురీ/మగధీ గాయకుడు తన స్వస్థలమైన నవడా నుంచి ఇండిపెండెంట్‌గా బరిలో దిగుతున్నారు. ''అన్ని ప్రధాన పార్టీలనూ సంప్రదించా. ఎవరూ టికెటివ్వకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నా'' అని వాపోతున్నారాయన! భోజ్‌పురి నటులు, గాయకులకు బిహార్‌లో లోక్‌సభ టికెటివ్వడానికి ప్రధాన పార్టీలు వెనకా ముందాడుతున్న మాట వాస్తవమేనని భోజ్‌పురి గాయకుడు వినయ్ బిహారీ అంటున్నారు. ఆయన బిహార్‌లోని పశ్చిమ చంపారన్ జిల్లా లౌరియా ఎమ్మెల్యే. 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున విజయం సాధించారు. కానీ ఏ పార్టీ కూడా టికెటివ్వకపోవడంతో 2010లో తొలిసారి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాల్సి వచ్చింది. ''ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందిన భోజ్‌పురీ భాషకు బిహార్లోనే తగిన గౌరవం లభించడం లేదు. బహుశా అందుకే భోజ్‌పురీ నటీనటులు, గాయకులకు ఇతర రాష్ట్రాల నుంచే తప్ప స్వరాష్ట్రంలో పోటీ చేసే అవకాశం దక్కడం లేదు. రాబోయే రోజుల్లో పరిస్థితులు మారతాయేమో!' అన్నారు. భోజ్‌పురీ నటీనటులు, గాయకులకు బీజేపీ ముమ్ముందు కచ్చితంగా బిహార్ నుంచి అవకాశమిస్తుందని తనకు నమ్మకముందని రవికిషన్ చెప్పుకొచ్చారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

సీఈసీ రాజీవ్‌కుమార్‌కు జెడ్ కేటగిరీ భద్రత


సార్వత్రిక ఎన్నికల వేళ కేంద్రం కీలక నిర్ణయం



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్(సీఈసీ) రాజీవ్‌కుమార్‌కు కేంద్ర ప్రభుత్వం జెడ్ కేటగిరీ భద్రతను కల్పించింది. ఈ మేరకు మంగళవారం కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆరుగురు ఎన్ఎస్‌జీ కమాండోలు, ఆరుగురు పోలీసులతోపాటు మరో 22 మంది భద్రతా సిబ్బంది మొత్తం 40 నుంచి 45 మందితో కూడిన బృందం రాజీవ్ కుమార్‌ను 24 గంటలూ వెన్నంటి ఉంటుంది. ఇటీవల పలు అంశాలపై రాజకీయ పార్టీల నిరసనలు, విదేశాల నుంచి వస్తున్న బెదిరింపులు, నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల వేళ హోంశాఖ వీవీపీ సెక్యూరిటీ భద్రతపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం సీఈసీ, ఇద్దరు ఎన్నికల కమిషనర్లకు ఢిల్లీ పోలీసు విభాగానికి చెందిన సాయుధ బృందం భద్రత కల్పిస్తోంది. గతంలో సీఈసీ దివంగత టీఎన్ శేషన్‌కు మాత్రమే ఒక సమయంలో కేంద్ర సాయుధ బలగాల భద్రత కల్పించారు. 1984 బ్యాచ్‌కు చెందిన విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్‌కుమార్. 2022లో కేంద్ర ఎన్నికల సంఘానికి 25వ ప్రధాన కమిషనర్‌గా ఈయన బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు, 2020 నుంచి ఆయన ఎన్నికల కమిషనర్‌గా ఉన్నారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

బుధవారం । 10 । ఏప్రిల్ । 2024



నగరోత్సవం
ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో ఉగాది పండుగ నేపథ్యంలో మంగళవారం శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్లకు వెండి రథంపై నగరోత్సవాన్ని నిర్వహించారు.



చెరువులకు జలకళ
మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవడంతో చెరువులు జలకళతో కనిపిస్తున్నాయి.

కొండలమ్మ సన్నిధిలో..


గుడ్లవల్లేరు: వేమవరం కొండలమ్మ అమ్మవారిని కృష్ణా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఐఆర్ఎస్ అధికారి కుమార్‌చౌరవ్ దంపతులు మంగళవారం దర్శించుకున్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (బుధ)

విజయవాడ	6.27
జగ్గయ్యపేట	6.29
మచిలీపట్నం	6.25
గుడివాడ	6.27

న్యూస్‌రీల్

వీరాంజనేయునికి వెండి సర్వాంగం


రాపర్ల(పామర్రు): రాపర్ల గ్రామంలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయానికి భక్తులు వెండి సర్వాంగాన్ని మంగళవారం బహూకరించారు. స్థానికులు చప్పిటి సత్యనారాయణ, లక్ష్మీ దంపతులు స్వామివారికి సుమారు 3.250 కిలోల వెండి సర్వాంగాన్ని అందజేశారు. దీని విలువ సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. సంవత్సరాది పురస్కరించుకుని ఆలయానికి అందజేశామని వివరించారు. కార్యక్రమంలో పోతన భోగేశ్వరరావు, కుందేటి నాగరాజు, పూర్ణబసవయ్య, కాకర్ల ప్రభాకరరావు, తుంగల అంజియ్య తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ జాతీయ పోటీలకు విజయవాడ క్రీడాకారులు


విజయవాడస్పోర్ట్స్: బాస్కెట్‌బాల్ జాతీయ యూత్ చాంపియన్‌షిప్‌నకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టులో విజయవాడ క్రీడాకారులు అమల్ రెడ్డి, జి.నిరంజన్‌రాయల్ చోటు దక్కించుకున్నారు. వీరిద్దరూ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కోచ్ సంతోష్ వద్ద నాలుగేళ్లుగా శిక్షణ పొందుతున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యంత క్రీడా నైపుణ్యం ప్రదర్శించి, అనంతరం జరిగిన జట్టు ఎంపికలోనూ సత్తా చాటారు. ఈ నెల తొమ్మిది నుంచి 15వ తేదీ వరకు పుదుచ్చేరిలో బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, పుదుచ్చేరి బాస్కెల్‌బాల్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించే 38వ జాతీయ పోటీల్లో వీరు పాల్గొననున్నారు. వీరిని డీఎస్‌డీవో ఎస్.ఎ.అజీజ్, కృష్ణా జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి సుభాష్‌చంద్రబోస్ అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం


తిరుమలగిరి(జగ్గయ్యపేట): వాల్మీకోద్భవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి భక్తుడు రూ.1,00,116 అందజేసినట్లు ఈవో సాంబశివరావు మంగళవారం తెలిపారు. సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం కందిబండకు చెందిన కొనగండ్ల వెంకటరెడ్డి దంపతులు విరాళాన్ని అందించారని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భరద్వాజ్, సభ్యులు పాల్గొన్నారు.

ఐజీఎస్‌లో ఈద్ నమాజ్


లబ్బీపేట(విజయవాడతూర్పు): ఏటా మాదిరి ఇందిరాగాంధీ స్టేడియంలో బహిరంగ ఈదుల్ ఫితర్ నమాజ్ నిర్వహించనున్నట్లు ముస్లిం ఈద్గా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కాలేషావలీ, మునీర్ అహ్మద్ షేక్ తెలిపారు. ఈద్ నమాజ్ నిర్వహించే ప్రాంగణంలో మంగళవారం నమాజ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. డాక్టర్ కాలేషావలి, మునీర్ అహ్మద్‌షేక్ మాట్లాడుతూ రంజాన్‌రోజు ఉదయం 7.15 గంటలకు ఈద్ సందేశం ప్రారంభమవుతుందని తెలిపారు. నమాజ్ ఉదయం 8 గంటలకు జరుగుతుందన్నారు. నమాజు కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈద్గా కమిటీ ప్రతినిధులు ఎండీ అన్వర్ పాషా, ఎండీ ఇర్ఫాన్, మౌలానా మక్బూల్ అహ్మద్ నద్వీ, మైనార్టీ నేతలు డాక్టర్ మెహబూబ్ షేక్, సయ్యద్ అలీం పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- 40 డిగ్రీలకు చేరువలో..
- వేడిగాలులతో అల్లాడుతున్న ప్రజలు
- మరింత పెరిగే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ





సాక్షి, మచిలీపట్నం: ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతున్నాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఉదయం 7 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఉష్ణోగ్రతలు పెరగడంతో ఉదయం 10 గంటలకే ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. గతేడాది కంటే నాలుగు డిగ్రీలు అధిక వేడితో 40 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రత ఉంది. మధ్యాహ్నం వేళ నిప్పుల కుంపటిని తలపిస్తోంది. ఎండతో పాటు వేడిగాలులతో జనం అల్లాడిపోతున్నారు. మరోవైపు రాత్రి పూట ఉష్ణోగ్రతల్లోనూ భారీ పెరుగుదల ఉంది. కనిష్ఠంగా ఐదు డిగ్రీలు ఎక్కువ నమోదవుతోంది. రోహిణీ కార్తె రాక ముందే ఎండలు మండుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వేడి గాలులు, ఉక్కపోత కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. రానున్న రోజుల్లో భానుడి భగభగలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

అల్లాడుతున్న కూలీలు, చిరు వ్యాపారులు

ఎండల కారణంగా కూలీలు, రైతులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొలం పనులకు వెళ్లిన రైతులు, కూలీలు మధ్యాహ్నం వేళ నీరసిస్తున్నారు. పొట్ట కూటి కోసం రోడ్లపై ఉండే వ్యాపారులు వేడి, గాలి, ఎండతో అల్లాడిపోతున్నారు.

ఎన్నికల ప్రచారాలపై ప్రభావం

సార్వత్రిక ఎన్నికలు మే 13న జరగనుండటంతో పలు పార్టీల నేతలు ప్రచారాలు ముమ్మరం చేశారు. పోలింగ్‌కు 32 రోజులు మాత్రమే గడువు ఉండటంతో అభ్యర్థులు కార్యకర్తలు, అనుచరులతో ప్రజలకు చేరువయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. గడువు సమీపిస్తుండటంతో వారు ఎండలోనే ప్రచారం చేస్తున్నారు. కొంతమంది ఎండ వేడికి తాళలేక మధ్యలోనే ప్రచారం ఆపేసి వెనుదిరుగుతున్నారు. భానుడి దెబ్బకు ఎక్కువ మంది ఉదయం లేదా సాయంత్రం వేళ ప్రచారం చేస్తున్నారు.

ఉష్ణోగ్రతల వివరాలు

2024 ఏప్రిల్	గరిష్ఠం	కనిష్ఠం	2023 ఏప్రిల్	గరిష్ఠం	కనిష్ఠం
1వ తేదీన	36.8	25.3	1వ తేదీన	34.2	25.7
2న	37.0	25.8	2న	33.9	26.7
3న	36.8	26.1	3న	34.4	26.4
4న	34.9	26.1	4న	34.8	27.7
5న	36.2	26.1	5న	34.8	26.0
6న	37.2	26.8	6న	35.2	25.3
7న	36.0	26.6	7న	35.1	24.9
8న	38.1	28.8	8న	34.9	24.3
9న	38.9	28.9	9న	34.9	23.9

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో వడదెబ్బ ముప్పు పొంచి ఉంది. పిల్లలు, గర్భిణులు, బాలింతలు, షుగర్, కిడ్నీ వ్యాధి గ్రస్తులు, వృద్ధులు మండుటెండల్లో బయటకు రాకూడదు. తప్పనిసరై బయటకు వెళ్లాల్సి వస్తే.. గొడుగు, తలకు టోపీ తప్పకుండా ధరించాలి. మాంసాహారం తగ్గించాలి. రోజుకు కనీసం 4 లీటర్లకు పైగా నీళ్లు తాగాలి. పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటివి తీసుకోవాలి. చెమట ఎక్కువ పోవడం, గొంతు ఎండిపోవడం, చర్మం పొడిబారడం వంటి లక్షణాలున్న వారు నీరు ఎక్కువగా తీసుకోవాలి. ఎక్కువగా తాగాలి.

– డాక్టర్ ఎం. విజయ్ కృష్ణ, జనరల్ మెడిసిన్, జీజీహెచ్, మచిలీపట్నం



ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పంచాంగ శ్రవణంలో రజత్‌భార్గవ, కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు

సకలం శుభప్రదం..

- రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌భార్గవ
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా రాష్ట్ర స్థాయి ఉగాది వేడుకలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఉగాది అని.. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో సకలం శుభప్రదం కావాలని కోరుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజత్ భార్గవ చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో మంగళవారం భాషా సాంస్కృతిక శాఖ, దేవదాయ ధర్మదాయ శాఖ, ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ, దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు తదితరులు హాజరయ్యారు. టీటీడీ, శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం పంచాంగాన్ని ఆవిష్కరించి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. పండితులు కప్పగంతు సుబ్బరామ సోమయాజి సిద్ధాంతి పంచాంగ పఠనం చేశారు. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో వ్యవసాయం, విద్య, వైద్య ఆరోగ్యం, సాంఘిక, ఆర్థిక, వాణిజ్య తదితర రంగాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని పేర్కొన్నారు. రజత్ భార్గవ మాట్లాడుతూ షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి మనిషి జీవితానికి అవసరమైన సమతా సందేశాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. మే 13వ తేదీ ఎన్నికలు జరగనున్నాయని.. ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. దేవదాయధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు జాతికి చాలా ముఖ్యమైన పండగ ఉగాది అని పేర్కొన్నారు.

పాడి పంటలతో ఆనందంగా ఉండాలి

కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఉగాది వేడుకలు కలెక్టరేట్‌లో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కొత్త సంవత్సరంలో రైతులు పాడి పంటలతో ఆనందంగా ఉండాలని.. పశు సంపద బాగుండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో రాష్ట్రంలోని వివిధ దేవాలయాలకు చెందిన వేద పండితులను సత్కరించారు. ఘంటసాల సంగీత కళాశాల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఉగాది వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు, డీఆర్వో శ్రీనివాసరావు, ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్, కలెక్టరేట్ ఏవో సీహెచ్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాయిలాల ఎర



గన్నవరం నియోజకవర్గం రామవరప్పాడులో డబ్బు పంపిణీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ (ఫైల్)

- క్షేత్ర స్థాయిలో టీడీపీ ప్రచారానికి స్పందన కరువు
- ద్వితీయ శ్రేణి నాయకులకు తాయిలాల ఎర వేస్తున్న ఆ పార్టీ అభ్యర్థులు
- ప్రచారంలో సైతం డబ్బు పంపిణీ
- మైలవరం, విజయవాడ వెస్ట్, గన్నవరంలో భారీగా ప్రలోభాలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ప్రజాక్షేత్రంలో టీడీపీకి ఎదురుగాలి వీస్తోంది. వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతుంటే, ప్రతిపక్ష టీడీపీలో మాత్రం నైరాశ్యం నెలకొంది. గ్రామాల్లో ప్రచారానికి వెళ్లినా నేతలకు స్పందన కానరావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో అసంతృప్తిలో ఉన్న టీడీపీలోని ద్వితీయ శ్రేణి నాయకులకు ఎర వేసి, వారిని తమ వైపు తిప్పుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రధానంగా గన్నవరం, గుడివాడ, మైలవరం, తిరువూరు, విజయవాడ వెస్ట్ నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారాల్లోనూ డబ్బుతో ఓటర్లకు గాలం వేస్తున్నారు. విజయవాడ పార్లమెంటు పరిధిలో అసంతృప్తిగా ఉన్న టీడీపీ నేతలు చేజారిపోకుండా నోట్ల కట్టలతో బేరం పెడుతున్నారు. మచిలీపట్నంలో జనసేన ఎంపీ అభ్యర్థి బాలశౌరికి ఎదురుగాలి వీస్తుండటంతో కొంతమంది ద్వితీయ శ్రేణి నేతలకు తాయిలాలు ఇచ్చి తమ వైపు తిప్పుకోవడానికి తంటాలు పడుతున్నారు.

ప్రచారంలోనూ డబ్బు పంపిణీ

విజయవాడ వెస్ట్ నియోజక వర్గంలో ప్రచారంలో తొలిరోజే బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి, టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని వినూత్న మార్గాన్ని ఎంచుకొన్నారు. హారతి ఇస్తే రూ.వెయ్యి, కొబ్బరి కాయలు కొడితే రూ.వెయ్యి అంటూ మహిళలకు తాయిలాల ఎర వేశారు. ప్రచారంలో మహిళలు వరుసగా అభ్యర్థులకు హారతి ఇవ్వడం తంతుగా మారింది. గన్నవరంలో యార్లగడ్డ వెంకటరావు కూడా ఇదే తరహాలో డబ్బు పంపిణీ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రచారంలో పాల్గొన్న వారికి రూ.500, చికెన్, మటన్ భోజనాలు, పార్టీ జెండాలు మోసిన వారికి విచ్చల విడిగా మద్యం బాటిళ్లు పంచుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుడివాడలో టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము ప్రచారంలో పెయిడ్ ఆర్టిస్టులను ఏర్పాటు చేసుకొన్నారని తెలుస్తోంది. తిరువూరులో కొలికపూడి శ్రీనివాస్ డబ్బునే ఆయుధంగా ఎంచుకొన్నారు. గిరిజన తండాలు, ఎస్సీ కాలనీలో ప్రజలనే లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందే గన్నవరంలో టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకటరావు గ్రామ కమిటీల ద్వారా ఇళ్ల స్థలాలు ఇస్తామని దరఖాస్తులు స్వీకరించి ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేశారు. మచిలీపట్నం పార్లమెంటు పరిధిలో పెద్ద ఎత్తున మహిళలకు చీరెలు పంపిణీ చేశారు.

ద్వితీయ శ్రేణి నాయకులకు వల

వైఎస్సార్ సీపీ పార్లమెంటు అభ్యర్థి కేశినేని నానికి నియోజకవర్గంలో బలమైన క్యాడర్‌తోపాటు టాటా ట్రస్ట్ ద్వారా సేవలు అందించిన మంచి పేరుంది. ఈ నేపథ్యంలో టీడీపీ పార్లమెంటు అభ్యర్థి కేశినేని చిన్ని ప్రచారానికి ప్రజా స్పందన లేకపోవడంతోపాటు అసంతృప్తితో ఉన్న టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులను ప్రలోభ పెడుతున్నట్లు సమాచారం తెలుస్తోంది. నాయకుని స్థాయిని బట్టి డబ్బు ముట్టజెప్పి, పార్టీలో చేరికలు అంటూ కలరింగ్ ఇస్తున్నారు. ఇప్పటికే ఆయన విజయవాడ తూర్పు, సెంట్రల్, వెస్ట్, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు నియోజక వర్గాలో వారి స్థాయిని బట్టి ద్వితీయ శ్రేణి నాయకులకు డబ్బు పంపిణీ పూర్తి చేశారు. మైలవరం నియోజక వర్గంలో నేతలంతా తమ వెంటే ఉన్నారని చెప్పుకొనేందుకు వసంత కృష్ణ ప్రసాద్ తంటాలు పడుతున్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజల్లో ఆయనపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ నేతలు ఎవ్వరూ ఆయనకు మద్దతుగా లేకపోవడంతో, టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులకు డబ్బులతో గాలం వేస్తున్నారు. విజయవాడ వెస్ట్‌లో సుజనాచౌదరి సైతం ద్వితీయ శ్రేణి నాయకులపై ఫోకస్ పెట్టి, తాయిలాల పంపిణీ చేసి తమ వైపు తిప్పుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. మొత్తం మీద కూటమి అభ్యర్థులకు ఎదురుగాలి వీస్తుండటంతో, ఓటర్లను, ద్వితీయ శ్రేణి నేతలను ఆకర్షించడానికి రకరకాల ఎత్తుగడలు వేస్తున్నారు.

పచ్చందాల డంపింగ్ యార్డ్

- ఆకర్షణీయంగా అజిత్‌సింగ్‌నగర్ చెత్త డంపింగ్ యార్డు
- ఏ రోజు చెత్త ఆ రోజే జిందాల్ కంపెనీకి తరలింపు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో చెత్త సమస్య దూరం



గ్రీనరీతో ఆకట్టుకుంటున్న యార్డు లోపల భాగం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎటు చూసినా వేల టన్నుల్లో పేరుకుపోయిన వ్యర్థాలు.. ఎక్కడ చూసినా లక్షల సంఖ్యలో ముసురుకుని కనిపించే ఈగలు.. కిలో మీటర్ల దూరం వరకూ వ్యాపించే దుర్వాసన.. కారు మబ్బులను తలపించేలా విస్తరించిన దట్టమైన పొగ.. ఇదీ గతంలో విజయవాడ అజిత్‌సింగ్ నగర్ డంపింగ్ యార్డు దుస్థితి. ఈ కారణంగా ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టిన చర్యలతో చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. డంపింగ్ యార్డు ప్రాంగణం పచ్చని మొక్కలతో ఉద్యాన వనాన్ని తలపిస్తూ ఆహ్లాదం పంచుతోంది.

గతంలో నిత్యం వార్తల్లోనే..

అజిత్‌సింగ్‌నగర్ డంపింగ్ యార్డు ఒకప్పుడు నిత్యం వార్తల్లో ఉండేది. నగరంలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలన్నీ ఇక్కడే డంప్ చేసేవారు. ఈ ప్రాంతంలో భరించలేని దుర్వాసన వ్యాపించేది. ఆకతాయిలు తరచూ వ్యర్థాలకు నిప్పుపెట్టడంతో పొగ దట్టంగా వ్యాపించేది. ఫలితంగా స్థానికులకు ఊపిరి ఆడని పరిస్థితి నెలకొనేది. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఇది అతి పెద్ద సమస్య. రాజకీయ పార్టీల ఎన్నికల మేనిఫెస్టోల్లో డంపింగ్ యార్డ్ చెత్త సమస్య భాగమైందంటే సమస్య తీవ్రత ఎంతో అర్థం చేసుకోవచ్చు. వామపక్ష పార్టీలు డంపింగ్ యార్డు సమస్యపై ఆందోళన చేయని రోజు ఉండేది కాదు. అయితే ఇదంతా గతం.

వైఎస్సార్ సీపీ పాలనలో పరిష్కారం

2019లో వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక అజిత్‌సింగ్‌నగర్ చెత్త సమస్యకు చెక్ పెట్టింది. చెత్త సేకరణకు 250 క్లాప్ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. నగరంలో నిత్యం ఉత్పత్తయ్యే సుమారు 700 టన్నుల వ్యర్థాలను క్లాప్ వాహనాల్లో డంపింగ్ యార్డ్‌కు చేర్చి, అక్కడి నుంచి పెద్ద వాహనాల్లో గుంటూరులోని జిందాల్ కంపెనీకి తరలించే ప్రక్రియ చేపట్టింది. ఈ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత నగరంలో ఎక్కడా చెత్త అనేదే కనిపించడం లేదు. ఏ రోజు ఉత్పత్తి అయిన చెత్త ఆ రోజే జిందాల్ కంపెనీకి తరలించేలా ఏర్పాట్లు చేసింది. దీంతో కిలో చెత్త కూడా డంపింగ్ యార్డులో నిల్వలేకుండా బయటకు వెళ్లిపోతోంది. డంపింగ్ యార్డు పేరు విన్నా, అటు వైపు చూడాలన్న భయపడే స్థానికులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన చర్యలతో ఊపిరి పీల్చుకున్నారు. తమ బాధలు తొలగిపోయాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డులో చెత్త సమస్య పరిష్కారం కావడం, దుర్వాసన లేకపోవడంతో ఆ ప్రాంతంలో ఇళ్ల ధరలు రెట్టింపు అయ్యాయని చెబుతున్నారు. ఈ నాలుగేళ్లలో వామపక్ష పార్టీలు డంపింగ్ యార్డు వద్ద ఏ రకమైన ఆందోళన చేయలేదంటే పరిస్థితిలో ఎటువంటి మార్పులు వచ్చాయో గమనించవచ్చని చెబుతున్నారు.



చెత్త వాహనాల కోసం ఏర్పాటు చేసిన ప్లాట్‌ఫాం

ఆకర్షణీయంగా డంపింగ్ యార్డు

డంపింగ్ యార్డ్ ప్రస్తుతం ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంది. ప్రధాన ద్వారం చూపరులను లోపలకు ఆహ్వానిస్తోంది. చెత్త వాహనాలు వచ్చి వెళ్తున్నా దుర్వాసన రాకుండా చేపట్టాల్సిన అన్ని చర్యలు తీసుకున్నారు. యార్డు లోపల గ్రీనరీ ఏర్పాటు చేశారు. పచ్చని మొక్కలతో ఆ ప్రాంగణం కళకళలాడుతోంది. యార్డులోపల నిర్మించిన పార్క్ ఆహ్లాదం పంచుతోంది. విజ్ఞాన కేంద్రం ఆకట్టుకుంటోంది.



డంపింగ్ యార్డులో విజ్ఞాన వేదిక

డంపింగ్ యార్డు సూపర్‌గా ఉంది



డంపింగ్ యార్డులో చెత్త సమస్యతో ఎన్నో ఏళ్లు ఇబ్బందులు ఎదుర్కొన్నాం. యార్డుల్లో టన్నుల్లో వ్యర్థాలు పేరుకుపోయేవి. వాటి నుంచి భరించలేని దుర్వాసన వ్యాపించేది. ఇప్పుడు ఆ సమస్యలు లేవు. యార్డుకు ప్రహరీ నిర్మించారు. లోపలి భాగంలో మొక్కలు నాటారు. ఇప్పుడు డంపింగ్ యార్డు సూపర్‌గా ఉంది.

– కరీముల్లా, అజిత్‌సింగ్‌నగర్ వాసి

చెప్పినట్టే సమస్య పరిష్కారం



డంపింగ్ యార్డు సమస్య ఎన్నో ఏళ్లుగా ఉంది. ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని ఎన్నికల ముందు చెప్పాం. చెప్పిన విధంగానే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాం. ప్రభుత్వం చేపట్టిన చర్యలతో చెత్త సమస్యకు పరిష్కారం లభించింది. ఇప్పుడు ఈ ప్రాంతంలో చెత్తకు సంబంధించి ఏ సమస్యా లేదు.

– అవుతు శ్రీ శైలజ, డిప్యూటీ మేయర్

క్లుప్తంగా

బైక్ యాత్రికుడికి అభినందనలు



తోటచర్ల(పెనుగంచిప్రోలు): వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ శ్రీకాకుళానికి చెందిన గొర్లె సన్యాశిరావు 175 నియోజకవర్గాల్లో బైక్ యాత్ర చేపట్టారు. పెనుగంచిప్రోలు మండలంలోని తోటచర్ల గ్రామానికి చేరుకున్న ఆయనను స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను మంగళవారం అభినందించారు. యాత్ర విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ విప్లవం కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అవసరం ఉందన్నారు. సన్యాశిరావు 175 నియోజకవర్గాల్లో ప్రచారంలో భాగంగా 99వ నియోజకవర్గంగా జగ్గయ్యపేట వచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్కపూడి గాంధీ, సచివాలయ మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, జగ్గయ్యపేట మునిసిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి చిన్నా, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కునగుంట్ల కోటేశ్వరరావు, నాయకులు ఎం.హనుమంతరావు పాల్గొన్నారు.

ఘనంగా బాజీబాబా ఉరుసు



పెదకాకాని: పెదకాకాని సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గా 536వ ఉరుసు మహోత్సవం రెండో రోజు మంగళవారం ఘనంగా జరిగింది. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలతో ఉత్సవం ముగిసింది. రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో బోర్డు అసిస్టెంట్ సెక్రటరీ సయ్యద్ ఆదం షఫీ, ఈఓ షేక్ ముక్తార్ బాషా ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్గా ఉరుసు మహోత్సవం సాంప్రదాయ పద్ధతిలో భాగంగా పెదకాకాని పొలిమేర సెంటర్ నుంచి ప్రత్యేక చాంధిని అలంకరణలో గంధం బిందెలతో సోమవారం రాత్రి ప్రారంభమైన బాజీ బాబా వారి గుఱ్ఱం ఊరేగింపు వెనిగండ్ల, పెదకాకాని పురవీధుల్లో కొనసాగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు బాజీ బాబా వారి గుర్రానికి మిఠాయిలు, పండ్లు తినిపించారు. కొబ్బరికాయలు, పూలు, గంధం సమర్పించారు. బాబా వారి గుర్రం దర్గాలోకి చేరుకోగానే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, భక్తులకు గంధం పంపిణీ చేశారు. పకీర్ల సన్నాయి వాయిద్యాలు, బ్యాండ్ మేళాలు, కనక తప్పెట్లు, బాణ సంచా వెలుగుల్లో ఉరుసు అత్యంత వైభవంగా జరిగింది. వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. వక్ఫ్ బోర్డు అధికారులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కనుల పండువగా దుర్గమ్మకు పుష్పార్చన

- ఇంద్రకీలాద్రిపై వసంత నవరాత్రోత్సవాలు ప్రారంభం
- శ్రీ క్రోధినామ ఉగాది నేపథ్యంలో పంచాంగ పఠనం
- వెండి రథంపై ఆదిదంపతుల నగరోత్సవం



అమ్మవారికి మరువంతో అభిషేకం చేస్తున్న వేదపండితులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కొలువుదీరిన ఇంద్రకీలాద్రిపై మంగళవారం వసంత నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దుర్గమ్మకు విశేష పుష్పార్చన కనుల పండువగా జరిగింది. తెలుగు వారి సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయంలో పంచాంగ పఠనం, సాయంత్రం ఆది దంపతులకు వెండి రథంపై నగరోత్సవాన్ని నిర్వహించారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు భక్తులు తొలి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

18 వరకు వసంత నవరాత్రోత్సవాలు

మంగళవారం ప్రారంభమైన వసంత నవరాత్రోత్సవాలు ఈ నెల 18వ తేదీ వరకు కొనసాగుతాయి. ఉత్సవాల్లో అమ్మవారికి రోజుకో విశేషమైన పుష్పాలతో అర్చన నిర్వహిస్తారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున అంతరాలయంలో మూలవిరాట్‌కు స్నపనాభిషేకం నిర్వహించారు. తెల్లవారుజాము మూడు గంటలకు అమ్మవారికి స్నపనాన్ని ఆలయ అర్చకులు నిర్వహించిన అనంతరం నిత్య అలంకరణ, పూజాది కార్యక్రమాలు జరిగాయి. ఉదయం ఎనిమిది గంటలకు ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు దంపతులు, ఆలయ అర్చకులు, వేద పండితులు, ముఖ్య అధికారులు అమ్మవారిని తొలి దర్శనం చేసుకున్న అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. అమ్మవారిని దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వదించారు. ఉగాదిని పురస్కరించుకుని దేవస్థానం రూపొందించిన పంచాంగాన్ని కమిషనర్ సత్యనారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకుడు లింగంభొట్ల బద్రీనాథ్‌బాబు, వైదిక కమిటీ సభ్యులు కోట ప్రసాద్, రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, మురళీ, ఇతర అర్చకులు పాల్గొన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలను పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో అడుగడున అరటి పిలకలు, మామిడి తోరణాలతో అలంకరించారు. వార్షిక పరీక్షలు పూర్తి కావడంతో విద్యార్థులు, యువతీయువకులతో పాటు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కనక దుర్గమ్మను దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో క్యూలైన్లు కిటకిటలాడగా, వీఐపీల తాకిడి కూడా కనిపించింది.



వెండి రథంపై దర్శనమిచ్చిన గంగ. పార్వతి (దుర్గామాత) సమేత శ్రీ మల్లేశ్వర స్వామి



అభిషేకానికి పూలను తీసుకొస్తున్న ఈఓ రామారావు, వేదపండితులు తదితరులు

వైభవంగా పుష్పార్చన

వసంత నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని దుర్గమ్మకు విశేష పుష్పార్చన జరిగింది. తొలుత అంతరాలయం నుంచి అమ్మవారి ఉత్సవ మూర్తికి ఊరేగింపు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీని దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఈఓ కె.ఎస్.రామరావు, ఇతర అధికారులు ఊరేగింపుగా వేదిక వద్దకు చేరుకున్నారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం లక్ష్మీగణపతి ప్రాంగణం వద్ద అమ్మవారికి అర్చకులు మల్లెలు, మరువంతో అర్చన నిర్వహించారు. అమ్మవారికి అర్చన చేసేందుకు తీసుకొచ్చిన పుష్పాలను తొలుత ప్రధాన ఆలయంలో అమ్మవారికి చూపిన అనంతరం ఈఓ రామరావు దంపతులు, స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఏఈఓ ఎస్.రమేష్‌బాబు పుష్పాలను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ వేదిక వద్దకు తీసుకువచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య అమ్మవారికి విశేష పుష్పార్చన జరిగింది.

అనంతరం పంచహారతుల సేవ నిర్వహించగా, ఆలయ అధికారులు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పుష్పార్చన అనంతరం అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమైన భక్తులకు ఆపుష్పాలను పంపిణీ చేశారు.

ధర్మపథం వేదికపై పంచాంగ పఠనం

ఉగాదిని పురస్కరించుకుని అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై పంచాంగ పఠనం జరిగింది. కప్పగంతు సోమయాజులు సిద్ధాంతి పంచాంగ పఠనం చేశారు. అనంతరం ఆయన్ను ఆలయ ఈఓ రామరావు సత్కరించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం భక్తులకు దేవస్థానం రూపొందించిన పంచాంగాలకు పంపిణీ చేశారు.

ఆది దంపతుల నగరోత్సవం

ఉగాదిని పర్వదినం నేపథ్యంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు వెండి రథంపై నగరోత్సవాన్ని నిర్వహించారు. మహా మండపం నుంచి ప్రారంభమైన నగరోత్సవం బ్రాహ్మణ వీధి, కోమల విలాస్ మీదగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, సామారంగం చౌక్ మీదగా తిరిగి ఆలయానికి చేరింది. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు ఆద్యంతం కనుల పండువగా జరిగింది.

ఇంగ్లిష్ స్పీకింగ్‌లో ఉచిత శిక్షణ

'మేధా ఇన్‌స్టిట్యూట్' ఫౌండర్ చిరంజీవి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్కారీ స్కూళ్లలో ప్రాథమిక విద్య నుంచీ ఇంగ్లిషు మీడియాన్ని అందుబాటులోకి తేవడం ప్రశంసనీయమని 'మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్' వ్యవస్థాపకుడు, చీఫ్ కోచ్ డాక్టర్ ఎ.చిరంజీవి అభిప్రాయపడ్డారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా ఏ రంగంలోనైనా ఇంగ్లిష్‌పై పట్టున్న వారికే అవకాశాలు మెరుగ్గా ఉంటున్నాయని చెబుతూ.... ఆసక్తి ఉన్న వారి కోసం తమ సంస్థ ఉచితంగా ఇంగ్లిషు స్పీకింగ్ కోర్సును అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. ''మా ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేసి 30 సంవత్సరాలవుతున్న సందర్భంగా ఈజీ ఇంగ్లిష్ కార్యక్రమాన్ని తలపెట్టాం. ఆన్‌లైన్లో ఉచితంగా అందజేస్తాం'' అని చెప్పారాయన. ఈజీ ఇంగ్లిష్ ద్వారా స్పోకెన్ ఇంగ్లిష్ మాత్రమే కాకుండా దాదాపు 9 రకాల అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలియజేశారు. ఈ నెల రెండో వారం నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. ''ఈ కోర్సుకు ఆసక్తి ఉన్న ఎవరైనా రిజిస్టర్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ కోసం ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుంటే చాలు. వారి మొబైల్‌కు రిజిస్ట్రేషన్ లింకు వస్తుంది. లేనిపక్షంలో 9866006662 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపినా వారి మొబైల్ ఫోన్‌కు లింకును పంపిస్తాం'' అని వివరించారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతుందని, ఆ తర్వాత తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు.

వైభవంగా ఉగాది వేడుకలు



పంచాగం పఠనం చేస్తున్న వెంకట పూర్ణ సిద్ధాంతి



శివరామ కృష్ణ క్షేత్రంలో వేద స్వస్తి నిర్వహిస్తున్న పండితులు

విజయవాడ కల్చరల్: శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను విజయవాడ నగరంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. పలు ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. సంప్రదాయ బద్ధంగా జరిగిన వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పున్నమ్మ తోటలోని టీటీడీ కల్యాణమండపంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేదాంతం మురళీ కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ అధికారులు నూతన సంవత్సర తెలుగు పంచాంగాన్ని విక్రయించారు. అధికారులు, శ్రీవారి సేవా మండలి సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు. కంచి కామకోటి పీఠ పాలిత శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో క్రోధినామ సంవత్సరం సందర్భంగా శ్రీ వెంకటేశ్వర, చంద్రమౌళీస్వర స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు వేద సభ నిర్వహించారు. శ్రీతంగిరాల వేంకట పూర్ణ సిద్ధాంతి పంచాంగ పఠనం చేశారు. దుర్గాపురంలోని శివరామ కృష్ణ క్షేత్రంలో భారతీ తీర్థ మహాస్వామి 74వ జయంతి, ఉగాది వేడకల సందర్భంగా వేదపండితులు వేద పారాయణం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ఆది దంతపతుల త్రిశతి నిర్వహించారు. దేవాలయ ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ వేద పండితులను సత్కరించారు.

ఇఫ్తార్ విందులో వసంత అనుచరుల వీరంగం

జి.కొండూరు: మైలవరంలో పట్టణంలో మంగళవారం రాత్రి ముస్లిం సంఘాలు నిర్వహించిన ఇఫ్తార్ విందులో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వసంత వెంకటకృష్ణప్రసాద్ అనుచరులు వీరంగం సృష్టించారు. పట్టణంలోని సీఎంఆర్ కల్యాణ మండపంలో ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు వసంత వెంకటకృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై వారి ఆతిథ్యం స్వీకరించి వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆయన వెంట వచ్చిన అనుచరులు విందు చేసేందుకు సిద్ధమవగా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు ముందుగా అవకాశం ఇవ్వాలని నిర్వాహకులు కోరారు. ముందుగా విందు చేసేందుకు తమకు అవకాశం ఇవ్వలేదనే కోపంతో వసంత అనుచరులు ముస్లింలను దుర్భాషలాడుతూ కుర్చీలు విసురుతూ వీరంగం సృష్టించారు. ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లింలు భయాందోళనకు గురయ్యారు. వసంత కృష్ణప్రసాద్ అనుచరుల తీరుపై ముస్లింల నాయకులు, ముస్లింలు అసహనం వ్యక్తం చేశారు.

వలంటీర్లు అమ్ముడుపోరు

మాజీ మంత్రి పేర్ని నాని



విలేకరులతో మాట్లాడుతున్న పేర్ని నాని

గుడివాడ టౌన్: వలంటీర్ వ్యవస్థను సర్వనాశనం చేయాలని కోరుకున్న చంద్రబాబు కొత్తగా వారికి గాలం వేసే పనిలో పడ్డారని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) పేర్కొన్నారు. చంద్రబాబు ఎన్ని లక్షలిచ్చినా వలంటీర్లు అమ్ముడుపోరని స్పష్టం చేశారు. మంగళవారం కృష్ణా జిల్లా గుడివాడలోని వైఎస్సార్‌సీపీ ఎన్నికల కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు మొదట్లో కులాలకు గాలం వేసి వారిని వాడుకుని వదిలేశారన్నారు. అనంతరం ప్రాంతీయ తత్వంతో గాలం వేసి వాడుకుని వదిలేశారన్నారు. బూటకపు మాటలు చెబుతూ, అవసరానికి ప్రజలను వాడుకునే నయవంచకుడు చంద్రబాబు అని అన్నారు. ప్రజలకు గాలం వేయడం, వదిలేయడంతో ప్రజల్లో నమ్మకం కోల్పోయారని చెప్పారు. ఇప్పుడు వలంటీర్లకు గాలం వేస్తున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు దగ్గరైందని గ్రహించిన చంద్రబాబు దాన్ని సర్వనాశనం చేసేలా రకరకాల కుతంత్రాలకు తెర లేపారన్నారు. చంద్రబాబు, అతని దత్తపుత్రుడు మూడు పదుల వయస్సు దాటని చిన్నారులైన ఆడ, మగ వలంటీర్లను హేయంగా విమర్శించారన్నారు. పురుషులు ఇళ్లలో లేనప్పుడు మగ వలంటీర్లు తలుపులు కొడతారని, మహిళలను ముంబైలోని రెడ్‌లైట్ ఏరియాలకు అమ్మేస్తున్నారని చంద్రబాబు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజల డేటా అంతా తీసుకుని విదేశాలకు పంపుతున్నారని ముక్కుపచ్చలారని వలంటీర్లను నీచాతినీచంగా అభివర్ణిస్తూ విమర్శలు చేశారన్నారు. వలంటీర్ వ్యవస్థ ఎన్నికల ముందు అవ్వాతాతలకు పింఛన్ పంచకూడదని చంద్రబాబు అండ్ కో నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ద్వారా ఢిల్లీ ఎన్నికల అధికారి నుంచి ఆదేశాలు ఇప్పించారన్నారు. ఇందుకోసం హైకోర్టు, సుప్రీం కోర్టులలోనూ ప్రయత్నాలు చేసి విఫలం కావడంతో పొత్తుపెట్టుకున్న బీజేపీ నాయకులను ప్రభావితం చేసి ఈ ఆదేశాలు తెచ్చారన్నారు. దీంతో ప్రజల్లో వచ్చిన వ్యతిరేకత గమనించిన చంద్రబాబు తాను అధికారంలోకి వస్తే వలంటీర్లకు నెలకు రూ.10 వేలు ఇస్తామని మోసపూరిత ప్రకటనలు చేస్తున్నాడన్నారు. సేవా దృక్పథంతో పనిచేస్తున్న వలంటీర్లపై చంద్రబాబు చేసిన విమర్శల్ని వారు మర్చిపోరన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో మృతదేహం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలోని అమ్మపాద అపార్ట్‌మెంట్ సమీపంలోని డ్రెయిన్‌లో గుర్తుతెలియని పురుషుడి మృతదేహం లభించింది. పోలీసుల కథనం మేరకు.. జాతీయ రహదారి పక్కన అమ్మపాద అపార్ట్‌మెంట్ సమీపంలో డ్రెయిన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గమనించిన మునిసిపల్ కార్మికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి ఒంటిపై తెల్ల చొక్కా, నల్ల ఫ్యాంట్ ఉన్నాయి. అతని ఆచూకీ తెలిపే వివరాలు ఏవీ లభించలేదు. రెండు, మూడు రోజుల క్రితం డ్రెయిన్‌లో పడివుంటాడని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గంజాయి విక్రేతలు ఇద్దరు అరెస్ట్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. న్యూ రాజరాజేశ్వరీపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు గంజాయి తీసుకొస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఏఎస్‌ఐ పీడీఎల్ ప్రసన్న ఆధ్వర్యంలో సిబ్బంది కేజీఎఫ్ అపార్ట్‌మెంట్స్ వెనుక భాగంలో తనిఖీలు చేపట్టారు. కట్టా గోపి(23), అమృత సురేష్ (23) పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేస్తే రెండు కిలోల గంజాయి లభించింది. పెయింటింగ్ పనులు చేసుకునే వారిద్దరు డబ్బులు తేలిగ్గా సంపాదించాలనే అత్యాశతో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితులు ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం వారికి 14 రోజుల రిమాండ్ విధించింది.

నవ యువ వసంతం



ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

- రానున్న ఎన్నికల్లో యువ ఓటర్లు
- కొత్తగా నమోదైన ఓటర్లు 37,760
- ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 16.83 లక్షల ఓటర్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మనదేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు కీలక పాత్ర పోషిస్తోంది. ఇంతటి ముఖ్యమైన ఓటు దేశ భవితను నిర్దేశిస్తోంది. మరో నెల రోజుల్లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయడానికి ఎన్టీఆర్ జిల్లాలోని యువతరం ఉవ్విళ్లూరుతోంది. యువత ఓటు వేసి నవ వసంతానికి ఎదురుచూస్తున్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల భవితను వీరు నిర్దేశించనున్నారు. యువత ఓటు ఎటువైపు ఉంటే అటువైపు విజయం తథ్యమని పలువురు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

జిల్లాలో 37,760 మంది నూతన ఓటర్లు

ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ పశ్చిమ, తూర్పు, సెంట్రల్, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు నియోజకవర్గాల్లో మొత్తం 37,760 మంది కొత్తగా యువత ఓటర్లుగా నమోదయ్యారని అధికారులు తెలిపారు. మార్చి 16 వరకూ నమోదైన వివరాల ప్రకారం ఈ సంఖ్యను అధికారులు ప్రకటించారు. జిల్లాలో మొత్తం ప్రాజెక్టెడ్ జనాభా 25,89,917 మంది ఉండగా అందులో ఓటర్లు 16,74,995 మంది ఉన్నారు. అందులో పురుష ఓటర్లు 8,17,484 మంది, మహిళా ఓటర్లు 8,57,361 మంది, ట్రాన్స్‌జెండర్లు 150 మంది ఉన్నట్లు అధికారిక నివేదికలు చెబుతున్నాయి. కొత్తగా 18 నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఓటర్లుగా నమోదయ్యారు. వీరిలో 20,321 మంది పురుషులు, 17,438 మంది మహిళలు, ఒకరు ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. మొత్తం ఓటర్లలో మహిళా ఓటర్లు అధికంగా ఉండగా, కొత్తగా నమోదైన ఓటర్లలో పురుషులు అధికంగా ఉండటం విశేషం.

ఎన్టీఆర్ జిల్లాలో 18-19 వయస్సు కలిగిన కొత్త ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు,	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం
తిరువూరు (ఎస్సీ)	2461	1967	0	4428
విజయవాడ వెస్ట్	2425	2150	0	4575
విజయవాడ సెంట్రల్	3179	2986	0	6165
విజయవాడ ఈస్ట్	3074	2825	0	5899
మైలవరం	3756	3161	1	6918
నందిగామ (ఎస్సీ)	2598	2058	0	4656
జగ్గయ్యపేట	2828	2291	0	5119
మొత్తం	20321	17438	1	37760


చాలా సంతోషంగా ఉంది



ఎన్నికల కమిషన్ 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు కావటానికి అవకాశం కల్పించింది. అధికార యంత్రాంగం మా కళాశాలలో అవగాహన సదస్సును నిర్వహించి అవగాహన కల్పించింది. దీంతో ఓటరుగా నమోదు చేసుకున్నాను. రానున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకుంటున్నాను. ఈ అవకాశం లభించడం చాలా సంతోషంగా ఉంది.

– ప్రవీణ్‌సాయి, విజయవాడ

ఓటు వేసేందుకు ఎదురు చూస్తున్నా



కొత్త ఓటరుగా నమోదయ్యాను. వచ్చే నెల 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయబోతున్నాను. తొలిసారిగా నేను ఓటు వేస్తున్నాను. చాలా సంతోషంగా ఉంది. మంచి వ్యక్తులను ఎన్నుకునేందుకు ఓటు ఆయుధంగా ఉంది. దానిని వినియోగించుకొని మంచి వారిని ఎన్నుకుంటాను. మా స్నేహితులు కూడా చాలా మంది కొత్తగా ఓటర్లుగా నమోదయ్యారు.

– ఐ.నిఖిల్, విజయవాడ

కొత్త ఓటర్ల నమోదుకు కృషి

కొత్త ఓటర్ల నమోదుకు ప్రభుత్వం కృషి చేసింది. దీంతో అధికంగా యువత నూతనంగా ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. వివిధ రూపాల్లో ప్రచారాన్ని నిర్వహించడం, కళాశాలల్లో ప్రత్యేకంగా శిబిరాలను, అవగాహన సదస్సులను ఏర్పాటుచేయడంతో ఆయా నియోజకవర్గాల్లో పెద్ద సంఖ్యలో యువత కొత్త ఓటర్లుగా నమోదు చేసుకున్నారని అధికారులు వివరిస్తున్నారు. ప్రస్తుతం కొత్తగా ఓటు నమోదు చేయడానికి అవకాశం ఉండటంతో ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): స్క్యూ బ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11 కె.వి. టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. పకీర్‌గూడెం, ప్రగతినగర్, శ్రీరాంనగర్, చంద్రమౌళిపురం, ఎంజీ రోడ్డు బెంజిసర్కిల్ ప్రాంతంతో మైత్రేయ వీధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

భూ పోరాటాలకు స్ఫూర్తి చంద్ర రాజేశ్వరరావు



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తన సొంత భూమిని పేదలకు పంచడమే కాకుండా దున్నే వారిదే భూమి అనే నినాదంతో ముందుకు సాగిన నాయకుడు కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత చంద్ర రాజేశ్వరరావు అని అభ్యుదయ రచయిత సంఘం(అరసం) జిల్లా ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్‌కుమార్ అన్నారు. చంద్ర రాజేశ్వరరావు 30వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ప్రజాశక్తినగర్‌లోని చంద్ర రాజేశ్వరరావు గ్రంథాలయం ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీకి సుదీర్ఘ కాలం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉంటూ కార్మిక, రైతాంగ సమస్యల మీద పోరాటాలు సాగించారని చెప్పారు. అరసం సభ్యుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని నేటి తరం నాయకులు, యువత ముందుకు సాగాలన్నారు.

అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం



విజయవాడకల్చరల్: బ్రాహ్మణ సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకట దశరథ రమేష్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి బ్రాహ్మణ సేవా సంఘానికి నూతన కార్యవర్గాన్ని మంగళవారం సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణమండపంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా డాక్టర్ బీవీ గురునాథ శర్మ, ఉపాధ్యక్షులుగా కాశీభట్ల సూర్యనారాయణ శాస్త్రి, కావూరి సత్యనారాయణ మూర్తి, యడ్లపాటి శేష సాయి, కె.శ్రీనివాసరావు, కామర్స్ రాజేష్, కొల్లిపర సతీష్, మేడికొండూరి ప్రసాదరావు, తాళ్లూరి రాజీవ్ శర్మ కార్యదర్శులుగా కామర్స్ మాధవి, యడ్లపాటి శిరీషా రాణి, అనుముల విజయలక్ష్మి, లక్ష్మీ కల్యాణిలను ఎన్నుకున్నామన్నారు.

దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వేసవి కాలంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదం చేస్తాయని భవానీపురం సీఐ కృష్ణ పేర్కొన్నారు. మానవతావాది జక్కిరెడ్డి పెద్ద సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం భవానీపురం చర్చి సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రజలకు చల్లని మజ్జిగ, తాగునీరు అందజేశారు. సీఐ కృష్ణ మాట్లాడుతూ స్థానిక ఊర్మిళా నగర్ సీతారెడ్డి కాలనీవాసులు ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. బొమ్మారెడ్డి ప్రసాద్ రెడ్డి, బోయపాటి వెంకటరావు, పులిపాటి దుర్గారెడ్డి, గుజ్జుల వెంకటేశ్వరరెడ్డి, దాసరి రామకృష్ణ, చింతమరెడ్డి వెంకటరెడ్డి, మూలె కొండారెడ్డి, పులిరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగనన్న పాలనలోనే బీసీలకు గుర్తింపు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే బీసీలకు తగిన గుర్తింపు లభించిందని ఏపీ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కొర్ను నారాయణ పేర్కొన్నారు. ఉగాది పండుగ సందర్భంగా ఆయన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, గుంటూరు ఎమ్మెల్యే అభ్యర్థిని విడదల రజినిని మంగళవారం కలిసి ముదిరాజ్ సంఘం తరుపున ఆమె విజయాన్ని కాంక్షిస్తూ అభినందనలు తెలిపారు. నారాయణ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇంత పెద్ద ఎత్తున బీసీల అభ్యున్నతికి కృషి చేసిన ఏకైక సీఎం జగన్ అన్నారు. ముఖ్యంగా ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన విడదల రజనీకి మంత్రి పదవి ఇవ్వటం తమ జాతికే గర్వకారణమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముదిరాజు సంఘీయులంతా అన్ని జిల్లాల్లో పర్యటించి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చేలా ప్రచారం చేస్తామని చెప్పారు.

నగరంలో నందన వనాలు

- కాలనీల్లో సుందరంగా పార్కుల ఏర్పాటు
- మానసికోల్లాసంపై దృష్టి పెడుతున్న నగర ప్రజలు
- ఒత్తిళ్లను అధిగమించేందుకు దోహదం

ఇది కదా.. అభివృద్ధి



కృష్ణానదీ తీరాన ఏర్పాటు చేసిన కృష్ణమ్మ జలవిహారం పార్కు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలో నందన వనాల్లాంటి పార్కులు అందుబాటులోకి వచ్చాయి. సూర్యోదయం, సూర్యాస్తమయం వేళ కాసేపు పచ్చని మొక్కని మధ్య సేద తీరేందుకు అనువుగా పార్కులను తీర్చిదిద్దారు. ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ వంటివి ఏర్పాటు చేశారు. ఉరుకుల పరుగుల జీవన విధానంలో గందరగోళంగా మారిన సిటీలైఫ్‌లో మానసికోల్లాసం కోసం పార్కులను ఆశ్రయిస్తున్నారు. వీకెండ్స్‌లో పార్కులకు వస్తున్న వారి సంఖ్య మరింత ఎక్కువగా ఉంది. దాదాపు తూర్పు నియోజకవర్గంలోని అన్ని కాలనీల్లో పార్కులు అందుబాటులోకి వచ్చాయి. వాటితో పాటు, కృష్ణమ్మ జలవిహారం పార్కు, రాజీవ్‌గాంధీ పార్కు, అంబేడ్కర్ పార్కు వంటి పెద్ద పార్కులు ఉన్నాయి.

అందుబాటులోనే పచ్చదనం

ప్రకృతి ఒడిలో సేదతీరేందుకు ఇంటి సమీపంలోనే పార్కులు అందుబాటులోకి వచ్చాయి. వాటిలో రకరకాల మొక్కలను పెంచుతున్నారు. ఉద్యానవనశాఖ ద్వారా నగర పాలక సంస్థ అరుదైన మొక్కలను అక్కడ ఏర్పాటు చేసింది. పార్కును సందర్శించిన వారికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా వాటిని తీర్చిదిద్దుతున్నారు. వాటిని సందర్శించి మానసికోల్లాసం పొందేలా రూపొందించారు. నగరంలోని ప్రధాన పార్కులైన రాజీవ్‌గాంధీ పార్కు, అంబేడ్కర్ పార్కు వంటి వాటిని రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి చేయడంతో పాటు, కాలనీల్లోనూ పార్కులు ఏర్పాటు చేశారు.

ఇంటి సమీపంలోనే..

వాకింగ్ చేయాలంటే ఒకప్పుడు దూర ప్రాంతంలోని గ్రౌండ్‌కు వెళ్లాల్సి రావడంతో మహిళలు వాకింగ్‌పై ఆసక్తి చూపేవారు కాదు. ఇప్పుడు తాము నివశిస్తున్న కాలనీల్లోనే పార్కులు ఏర్పాటు చేయడం, వాటిలో వాకింగ్ ట్రాక్‌లు ఉండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుల్లో వాకింగ్ చేసేందుకు మహిళలే ఎక్కువగా వస్తున్నారు. పిల్లలకు ఆట పరికరాలను ఏర్పాటు చేయడంతో కొందరు మహిళల తమ పిల్లలను తీసుకుని పార్కుకు వచ్చి, వాళ్లు ఆడుకుంటుంటే, తల్లులు వాకింగ్ చేస్తున్నారు.



రెవిన్యూ కాలనీలో పార్కులో పిల్లల కోసం ఏర్పాటు చేసిన పరికరాలు

కుటుంబ సమేతంగా...

నగర జీవికి శారీరక శ్రమ లేక పోవడంతో ఎక్కువగా జీవనశైలి వ్యాధులకు గురవుతున్నారు. వాటి నుంచి బయట పడేందుకు వ్యాయామంపై దృష్టి సారిస్తున్నారు. ఒకప్పుడు వ్యాయామం చేయాలంటే జిమ్‌కు వెళ్లాల్సి వచ్చేది. లేదంటే దూరం ప్రాంతంలో వాకింగ్ ట్రాక్ ఉన్న గ్రౌండ్‌కు వెళ్లేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇంటి సమీపంలో తమ కాలనీల్లోనే పార్కులు అందుబాటులోకి వచ్చాయి. వాటిలో వాకింగ్ ట్రాక్‌లతో పాటు, ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. కుటుంబ సమేతంగా మానసికోల్లాసం కోసం పార్కులకు వస్తున్నారు. ఇలా అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వం పార్కులను అభివృద్ధి చేసింది.

అనేక పార్కుల అభివృద్ధి..



గత ప్రభుత్వం కాలనీల్లో పార్కులను విస్మరించింది. ఒక్క పార్కును కూడా అభివృద్ధి చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వం కాలనీల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు పార్కులను అభివృద్ధి చేసింది. అందులో భాగంగా అనేక కాలనీల్లో పార్కులు, వాటిలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఇండోర్ జిమ్‌లను అందుబాటులోకి తేవడంతో వ్యాయామంపై దృష్టి సారిస్తున్నారు. ప్రజలకు మంచి చేసే ప్రభుత్వం ఇది.

– రామ్ పీఎస్ఆర్, లబ్బీపేట

మానసికంగా చాలా ఉపయోగం..



బిజీ లైఫ్ నుంచి బయట పడేందుకు వాకింగ్ చాలా అవసరం. పచ్చని మొక్కలు చూస్తూ వాకింగ్ చేయడం వలన మానసిక ఉల్లాసంతో పాటు, మెమరీ పెరుగుతుంది. వాకింగ్‌తో స్వచ్ఛమైన ఆక్సిజన్ బ్రెయిన్‌కు అందుతుంది. వృద్ధుల్లో జ్ఞాపకశక్తి తగ్గకుండా దోహదపడుతుంది. ఉదయం వేళ వాకింగ్‌తో విటమిన్ డి లభిస్తుంది. దీంతో ఎముకల పటుత్వంతో పాటు, హ్యాపీ హార్మోన్ రిలీజ్ అవుతుంది. తద్వారా మానసిక ఒత్తిళ్లు తగ్గుతాయి.

– దామర్ల దీప్తి, మానసిక నిపుణులు

సమాజంలో అన్ని వర్గాల అభివృద్ధి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): క్రోధి నామ సంవత్సరానికి అధిపతి బుధుడు కావటంతో సమాజం అభివృద్ధి దిశలో పయనిస్తుందని పంచాంగకర్త కప్పగంతు రామకృష్ణ చెప్పారు. ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా సిద్ధార్థ ఆడిటోరియంలో పంచాంగ పఠన కార్యక్రమం మంగళవారం జరిగింది. భౌగోళికం, ఆర్థికం, వ్యవసాయం, రాజకీయం, వృత్తి వ్యాపారాల పరంగా క్రోధి నామ సంవత్సరంలో వివిధ రాశుల వారికి లభించే ఫలితాలను రామకృష్ణ వివరించారు. వ్యాపారస్తులకు అనుకూల ఫలితాలు లభిస్తాయని, వ్యవసాయదారులకు ఈ సంవత్సరం ఫలవంతంగా ఉంటుందన్నారు. వివిధ రాశుల ఆదాయం, వ్యయం, రాజపూజ్యం, అవమానం వంటి విషయాలతో పాటు గోచార ఫలితాలను వివరించారు. పంచాంగ పఠనం అనంతరం కప్పగంతు రామకృష్ణను సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు సత్కరించారు. కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు దంపతులు, ఉపాధ్యక్షుడు వెల్లంకి నాగభూషణం దంపతులు, సంయుక్త కార్యదర్శి నిమ్మగడ్డ లలిత ప్రసాద్, సిద్ధార్థ విద్యాసంస్థల సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



పంచాంగ పఠనం చేస్తున్న కప్పగంతు రామకృష్ణ

ఠాగూర్ గ్రంథాలయంలో ఉగాది సంబరాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. జ్యోతి మహిళా మండలి – ఠాగూర్ గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. పోటీల్లో మహిళలు రంగవల్లులు వేసి వాటిని అందంగా అలంకరించారు. మహిళలు తమ సృజనను చూపారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి కే రమాదేవి మాట్లాడుతూ మహిళలు ఇంటి పనుల్లో తీరిక లేకుండా ఉంటారని, వారిలో దాగిన సృజనను వెలికితీసేందుకు పోటీలు నిర్వహించామన్నారు. ఉత్సాహంగా ఆట, పాటల్లో రాణించారన్నారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. వేడుకల్లో జ్యోతి మహిళా మండలి అధ్యక్షురాలు గంధం రూన్సీ, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న విజేతలతో గ్రంథాలయాధికారి రమాదేవి

ఉగాది పురస్కారాలు అందజేత

కృష్ణలంక(విజయవాడతూర్పు): క్రోధి నామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కృష్ణలంకలోని వాసవీ కల్యాణ మండపంలో వాసవీ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ప్రముఖులకు ఉగాది పురస్కారాలు అందజేశారు. దంత వైద్యుడు రామస్వామి, నేత్ర వైద్యుడు రామకృష్ణ, ఆడిటర్లు పెనుగొండ సుబ్బరాయుడు, గడ్డం సత్యనారాయణ, ఆయుర్వేద వైద్యుడు రవి, గోవింద మాల ఉపాసకుడు వెంకట గాంధీబాబు తదితరులను సత్కరించి ఉగాది పురస్కారాలు అందజేశారు. అనంతరం బ్రహ్మశ్రీ శ్రీరామసాయి పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ సేవా సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మానేపల్లి మాణిక్యాలరావు, గొంట్ల రామ్మోహనరావు, కోశాధికారి చందలూరి వెంకట సుబ్బారావు, మట్టా సుబ్బారావు, తడికమళ్ల సురేష్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



ఉగాది పురస్కారాలు అందజేస్తున్న వాసవీ సేవా సంఘం సభ్యులు

వైఎస్సార్ సీపీలోకి చేరికలు



పార్టీలో చేరిన నాయకులతో దేవినేని అవినాష్, కార్పొరేటర్ పుప్పాల కుమారి

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక ప్రాంతంలో ఇతర పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. 21వ డివిజన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన సుమారు 90 మంది జనసేన పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు స్థానిక కార్పొరేటర్ పుప్పాల కుమారి, డివిజన్ ప్రెసిడెంట్ టీపీ రెడ్డి, ఇటీవల జనసేన నుంచి పార్టీలో చేరిన సతీష్ ఆధ్వర్యంలో తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి దేవినేని అవినాష్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ అవినాష్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన నచ్చి ప్రతిపక్షాల కార్యకర్తలు స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వ్యవహార శైలి నచ్చకే యువతంతా వైఎస్సార్ సీపీ వైపు చూస్తోందన్నారు. టీడీపీని బతికించడం కోసమే పవన్ పార్టీని నడుపుతున్నాడని విమర్శించారు. నిబద్ధత గల నాయకుడు వైఎస్ జగన్ అని అన్నారు.

వైఎస్సార్ సీపీలో ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కులం, మతం, వర్గం, ప్రాంతం అనే తేడా లేకుండా పాలన సాగిస్తూ సంక్షేమాన్ని అందిస్తున్నామన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

ఘనంగా రాయల్ క్లబ్ వార్షికోత్సవం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మనకు ఉన్న దాంట్లోనే తోటి వారికి సహాయం చేయడాన్ని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని రాయల్ క్లబ్ అసోసియేషన్(స్వచ్ఛంద సామాజిక సేవా సంస్థ) జాతీయ అధ్యక్షుడు సుంకర కృష్ణ చెప్పారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్‌లోని ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో రాయల్ క్లబ్స్ అసోసియేషన్ 7వ వార్షికోత్సవం మంగళవారం సాయంత్రం జరిగింది. సుంకర కృష్ణ మాట్లాడుతూ.. స్నేహం, సేవ, సహకారం నినాదంతో తమ అసోసియేషన్ పని చేస్తుందన్నారు. అతిథులుగా జగదీష్ మైరెన్ ఎక్స్‌పోర్ట్స్ మేనేజింగ్ పార్టనర్ తోట జగదీష్, వెస్టిన్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కో–ఫౌండర్ కోటి దుర్గా ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా పాల్గొన్నారు. సభ అనంతరం మెట్రోకెమ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ అండ్ ఎండీ డాక్టర్ నండెపు వెంకటేశ్వరరావుకు రాయల్ జీవిత సాఫల్య పురస్కారాన్ని నిర్వాహకులు అందచేశారు. అసోసియేషన్ గౌరవ చైర్మన్ మిరియాల వెంకటేశ్వరరావు, ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ రామిశెట్టి కొండలరావు, కన్వీనర్స్, రాయల్ క్లబ్స్ విజయవాడ, ఓషో,చింతలపూడి, కైకలూరు, నరసాపురం సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న క్లబ్ జాతీయ అధ్యక్షుడు సుంకర కృష్ణ

దేవాలయాల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి

విజయవాడకల్చరల్: దేవాలయాల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతి అనుగ్రహ భాషణ చేశారు. సీతారామా కల్యాణ మండపంలో మంగళవారం క్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలు పంచాగ శ్రవణం, వేద సభ, స్వామి అనుగ్రహ భాషణ మండపం ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామిజీ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలలో వందలాది దేవాలయాలు జీర్ణ స్థితిలో ఉన్నాయని, వాటికి పూర్వవైభవం తీసుకురావాల్సిన అవసరముందన్నారు. భారతీయ సంస్కృతికి మూలం వేదాలని వాటిని కాపాడుకోవాలన్నారు. భువనేశ్వరీ పీఠం సనాతన హిందూ ధర్మం, దేవాలయ పరిరక్షణకు కృషి చేస్తోందని తెలిపారు. అనేక ప్రాంతాల్లో అవగాహనా సదస్సులు నిర్వహించి వారిని కార్యోన్ముఖులను చేస్తున్నామన్నారు. వేదపండతులు వేద సభను నిర్వహించారు. కల్యాణ మండపం నిర్వాహకులు దమ్మాలపాటి చంద్రశేఖర్ వేద పండితులను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ శర్వాణీ మూర్తి స్వామిజీ ఆశీస్సులు అందుకున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు వెలంపల్లి, విష్ణు, వేదికపై కమలానంద భారతీ స్వామి





ఇంద్రకీలాద్రిపై ఉగాది వేడుకలు

శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయంలో పంచాంగ శ్రవణం, సాయంత్రం ఆది దంపతులకు వెండి రథంపై నగరోత్సవాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







గాజుల అలంకారంలో అమ్మ వార్ల దర్శనం

కృష్ణలంక(విజయవాడతూర్పు): క్రోధి నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో శ్రీ మహాకాళీ, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లు గాజుల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సుమారు 50 వేల గాజులతో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. వసంత నవరాత్రులు ప్రారంభ సందర్భంగా లక్ష్మీగణపతి, మహాకాళీ, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకం, పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. అనంతరం 100 మందితో లలిత సహస్ర పారాయణం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణంలో పుచ్చా సూర్యప్రకాశ్ శాస్త్రిచే ఉగాది పంచాంగ శ్రవణం జరిగింది. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఆలయ అధ్యక్ష కార్యదర్శులు గొల్లపూడి పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు సీహెచ్ విజయకిరణ్, ఆలయ సూపరింటెండెంట్ ఎ.మధుసూదనరావు, సభ్యులు జి.సత్యం, మల్లేశ్వరరావు, రాజా, వంశీ, విశ్వేశ్వరయ్య, జగన్ తదితరులు పర్యవేక్షించారు.



గాజుల అలంకారంలో కాళీమాత, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లు

దుర్గమ్మ సన్నిధిలో కవి సమ్మేళనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కళావేదికపై మంగళవారం సాయంత్రం కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. డాక్టర్ కప్పగంతు రామకృష్ణ సారథ్యంలో ప్రముఖ పండితులు పింగళి వెంకట కృష్ణారావు, డాక్టర్ జె.వి.చలపతిరావు, డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ, పలివేటి శివరామకృష్ణ, పాంచాగ్నుల కృష్ణవేణి, డాక్టర్ యు.వి.రమణమూర్తి, దండిబోట్ల దత్తాత్రేయ శర్మ, పి.సత్యశైలజలు పాల్గొన్నారు. అనంతరం దేవస్థానం కవి పండితులకు అమ్మవారి దర్శనం కల్పించి విశిష్ట సత్కారం చేశారు.

జనం సొమ్ముతో గురివింద విందు!

పండిన రామోజీ పాపాలు • 'మార్గదర్శి' అక్రమ డిపాజిట్ల నిగ్గు తేలాల్సిందేనన్న సుప్రీంకోర్టు

- కేసు పునర్విచారణకు ఆదేశిస్తూ తీర్పు
- పత్రికా స్వేచ్ఛ ముసుగులో తప్పించుకోలేరని స్పష్టీకరణ
- బెడిసికొట్టిన రాజగురువు పన్నాగం
- 45 ఎస్ నిబంధనను ఉల్లంఘించి రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్ల సేకరణ
- కేసులు విచారణలో ఉండగానే మరో రూ.2వేల కోట్లు..
- డిపాజిటర్ల ప్రయోజనాల కోసం సీఎం జగన్ కీలక నిర్ణయం
- ఉండవల్లి పిటిషన్‌లో ఇంప్లీడ్ అయిన రాష్ట్ర ప్రభుత్వం.. 'మార్గదర్శి'వి అక్రమ డిపాజిట్లే.. రామోజీ ఆర్థిక నేరస్తుడేనన్న ఆర్‌బీఐ
- ఆ కేసు కొట్టివేత చెల్లదని తీర్పునిచ్చిన అత్యున్నత న్యాయస్థానం
- కేసు విచారణను ఆరు నెలల్లో పూర్తి చేయాలని తెలంగాణ హైకోర్టుకు ఆదేశం



యావజ్జీవ ఖైదు... రెండింతల జరిమానా!

మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ డిపాజిట్ల కేసులో నేరం నిరూపితమైతే రామోజీరావుకు రెండేళ్ల నుంచి యావజ్జీవ జైలు శిక్ష వరకు పడే అవకాశం ఉందని న్యాయ నిపుణులు స్పష్టం చేశారు. దీంతోపాటు ఆయన సేకరించిన అక్రమ డిపాజిట్లు రూ.2,600 కోట్లకు రెట్టింపు జరిమానా విధించవచ్చన్నారు. దీన్నిబట్టి రామోజీకి రెండేళ్ల నుంచి యావజ్జీవ జైలు శిక్షతో పాటు రూ.5,200 కోట్ల జరిమానా చెల్లించాలని తీర్పు వెలువడే అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.

అక్రమ డిపాజిట్లే... ఆర్థిక నేరస్తుడే: ఆర్బీఐ స్పష్టీకరణ

ఆర్బీఐ చట్టం సెక్షన్ 45 ఎస్‌ను ఉల్లంఘిస్తూ మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ డిపాజిట్లు వసూలు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి సోదాహరణంగా వివరించింది. ఆ డిపాజిట్లను ఎవరెవరికి తిరిగి చెల్లించారో.. ఎంతెంత చొప్పున చెల్లించారో వివరాలు వెల్లడించాల్సిందేనని వాదించింది. ఈ కేసు న్యాయస్థానంలో విచారణలో ఉండగానే మరో రూ.2 వేల కోట్ల వరకు అక్రమ డిపాజిట్లు సేకరించారని సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చింది. ఈ కేసులో పార్టీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా ఉండవల్లి అరుణ్ కుమార్ వాదనలు వినిపిస్తూ సెక్షన్ 45 ఎస్ కింద హెచ్‌యూఎఫ్ సంస్థలు డిపాజిట్లు సేకరించవచ్చా? లేదా? అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని కోరారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా తరఫు న్యాయవాది రమేశ్‌బాబు తన వాదనలు వినిపిస్తూ 'ఆర్బీఐ చట్టంలోని సెక్షన్ 45 ఎస్ ప్రకారం ఇన్‌కార్పొరేటెడ్ కంపెనీలు మినహా ఇతర సంస్థలు, వ్యక్తులు డిపాజిట్లు సేకరించకూడదు. హెచ్‌యూఎఫ్ కూడా డిపాజిట్లు సేకరించడానికి వీల్లేదు. కాబట్టి హెచ్‌యూఎఫ్ పేరిట మార్గదర్శి ఫైనాన్సియర్స్ డిపాజిట్లను సేకరించడం అక్రమమే, చట్ట విరుద్ధమే. రామోజీ ఆర్థిక నేరస్తుడే 'అని విస్పష్టంగా తేల్చి చెప్పారు. దీంతో ఈ కేసులో రిజర్వు బ్యాంక్‌ను కూడా పార్టీగా చేర్చి సుప్రీంకోర్టు విచారణను కొనసాగించింది.

సాక్షి, అమరావతి: ఆర్థిక అక్రమాల ఉగ్రవాది 'ఈనాడు' రామోజీ పాపాలు పండాయి! చట్టాలంటే లెక్క లేకుండా దశాబ్దాలుగా సాగిస్తున్న ఆర్థిక అక్రమాలకు చెక్ పడింది. వ్యవస్థలను మేనేజ్ చేసి తప్పించుకునే ఎత్తుగడలు ఎల్లకాలం సాగవని రుజువైంది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) నిబంధనలకు విరుద్ధంగా సాగించిన అక్రమ డిపాజిట్ల దందా రామోజీ మెడకు చుట్టుకుంది. టీడీపీ హయాంలో చంద్రబాబు అండదండలతో 'రమణ' మంత్రంతో కనికట్టు చేసి అక్రమ డిపాజిట్ల కేసు నుంచి తప్పించుకున్నా చట్టం నుంచి తప్పించుకోలేక పోయారు. మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ డిపాజిట్ల కేసును కొట్టివేయడానికి వీల్లేదని, ఆ కేసును సమగ్రంగా విచారించాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈనాడు పేరుతో పత్రికా స్వేచ్ఛ ముసుగులో ఈ కేసు నుంచి తప్పించుకునేందుకు రామోజీ చేసిన ప్రయత్నాలన్నీ సుప్రీంకోర్టు క్రియాశీలత ముందు వీగిపోయాయి. ఈనాడు అంటే ఆఫ్టరాల్ ఒక పేపర్ మాత్రమేనని న్యాయస్థానం వ్యాఖ్యానించడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈనాడుకు వ్యతిరేకంగా ఉందన్న రామోజీ మొసలి కన్నీళ్లను కొట్టిపారేస్తూ సుప్రీంకోర్టు విప్లవాత్మకమైన తీర్పును విస్పష్టంగా వెలువరించింది. మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ డిపాజిట్ల దందా పూర్వాపరాలు ఇవిగో...

రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్ల సేకరణ..

నిర్భీతిగా నిబంధనల ఉల్లంఘన చట్టాలకు తాను అతీతం అన్నట్టుగా భావించే రామోజీరావు మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట బరితెగించి ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారు. ఆర్బీఐ చట్టం 45 ఎస్ ప్రకారం ఇన్‌కార్పొరేటెడ్ కంపెనీలు మాత్రమే ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించాలి. అంతేగానీ ఇన్‌కార్పొరేటెడ్ కంపెనీలు కాని వ్యక్తులు, సంస్థలు, హిందూ అవిభక్త కుటుంబాలు(హెచ్‌యూఎఫ్)లు ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించకూడదు. ఈ నిబంధనను రామోజీ నిర్భీతిగా ఉల్లంఘించి అక్రమంగా డిపాజిట్లు సేకరించారు. 2006లో అప్పటి ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఫిర్యాదుతో సీఐడీ దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట రామోజీరావు 1997 నుంచి 2006 వరకు యథేచ్ఛగా అక్రమ డిపాజిట్లు సేకరించినట్లు గుర్తించడంతో మార్గదర్శి ఫైనాన్సియర్స్‌పై కేసు నమోదు చేసింది. మార్గదర్శి ఫైనాన్సియర్స్ 2006లో సమర్పించిన అఫిడవిట్ ప్రకారమే అప్పటికి రూ.2,610.38 కోట్లు అక్రమ డిపాజిట్లు సేకరించినట్లు వెల్లడైంది. హెచ్‌యూఎఫ్‌గా తాము డిపాజిట్లు సేకరించవచ్చంటూ రామోజీ చేసిన వితండవాదాన్ని ఆర్బీఐ అప్పట్లోనే సమ్మతించలేదు. సెక్షన్ 45ఎస్ ప్రకారం హెచ్‌యూఎఫ్‌లు ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. తన ఆర్థిక అక్రమాల వ్యవహారం బట్టబయలు కావడంతో రామోజీ అనివార్యంగా తప్పిదాలను అంగీకరించారు. డిపాజిట్‌దారులకు వారి డిపాజిట్లను తిరిగి చెల్లిస్తామని, మార్గదర్శి ఫైనాన్సియర్స్‌ను మూసి వేస్తామని ప్రకటించారు.

అక్రమ డిపాజిట్ల వివరాలు వెల్లడించం..

2006 నాటికే 32,385 మంది నుంచి రూ.2,610.38 కోట్లు డిపాజిట్లుగా సేకరించామని పేర్కొన్న రామోజీరావు 2008లో కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో తాము ఇంకా చెల్లించాల్సిన డిపాజిట్లు రూ.1,864.10 కోట్లు అని వెల్లడించారు. మరి మిగతా రూ.746.28 కోట్ల డిపాజిట్లు ఏమయ్యాయో ఆయన వెల్లడించలేదు. మరోవైపు తాము సేకరించిన డిపాజిట్లను పూర్తిగా చెల్లించేశామని 2012 తరువాత రామోజీ తాపీగా ప్రకటించారు. దీనిపై ఉండవల్లి అరుణ్ కుమార్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. డిపాజిట్లు ఎవరెవరి నుంచి ఎంతెంత సేకరించారు..? ఎవరెవరికి ఎంతెంత డిపాజిట్లు ఏయే తేదీల్లో చెల్లించారు...? నగదు రూపంలో చెల్లించారా? చెక్కుల రూపంలో చెల్లించారా? అనే వివరాలు వెల్లడించేలా ఆదేశించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీఐడీ వాస్తవాలు ఏమిటో వెలికి తీసేందుకు ప్రయత్నించాల్సి ఉండగా... నాడు అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గానీ, ఆ తరువాత చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ సర్కారుగానీ ఉద్దేశపూర్వకంగానే మౌనం దాల్చాయి. తద్వారా రామోజీరావు ఆర్థిక అక్రమాలకు పరోక్షంగా వత్తాసు పలికాయి. దాంతో రామోజీరావు తాను సేకరించిన అక్రమ డిపాజిట్ల వివరాలు చెపాల్సిన అవసరం లేదంటూ వితండవాదాన్ని వినిపించారు. తమకు ఎలాంటి క్రిమినల్ లయబిలిటీ లేదని వాదిస్తూ వచ్చారు. ఈ క్రమంలో 2018 డిసెంబర్ 21న (ఉమ్మడి హైకోర్టు చివరి పనిదినాన) మార్గదర్శి ఫైనాన్సియర్స్‌పై కేసును ఉమ్మడి హైకోర్టు కొట్టివేసింది. డిపాజిటర్ల ప్రయోజనాల కోసం ఈ తీర్పుపై సుప్రీం కోర్టులో అప్పీల్ చేయాల్సిన నాటి చంద్రబాబు సర్కారు ఏమీ పట్టనట్లు మౌనంగా ఉండిపోయింది. తద్వారా రామోజీ ఆర్థిక అక్రమాలకు చంద్రబాబు దన్నుగా నిలిచారు.

కేసును నిలబెట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ కేసు విషయంలో డిపాజిట్‌దారుల ప్రయోజనాలను కాపాడుతూ బాధ్యతాయుతంగా వ్యవహరించింది. మార్గదర్శి ఫైనాన్సియర్స్‌కు వ్యతిరేకంగా ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌లో ఏపీ ప్రభుత్వం ఇంప్లీడ్ అయ్యింది. దీంతో ఈ కేసు నీరుగారిపోకుండా చూడగలిగింది. ఈ నేపథ్యంలో మార్గదర్శి ఫైనాన్సియర్స్ వసూలు చేసిన అక్రమ డిపాజిట్లు వివరాలను సమర్పించాలని సుప్రీంకోర్టు గత ఏడాది ఆదేశించింది.

'ఈనాడు'కు వ్యతిరేకంగా ఉండొద్దని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించలేం

ఎప్పటి మాదిరిగానే పత్రికా స్వేచ్ఛ ముసుగులో తన అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు రామోజీ వేసిన ఎత్తుగడను సుప్రీంకోర్టు తిప్పికొట్టింది. ఈనాడు పత్రికకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకం కాబట్టే ఈ కేసు విషయంలో ఇంత పట్టుబడుతోందని రామోజీ తరఫున ప్రముఖ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, లూథ్రా, అభిషేక్‌మను సింఘ్వీలు వాదించినా ఫలితం లేకపోయింది. ఈ అంశానికి, అక్రమ డిపాజిట్లకు సంబంధం లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈనాడు పత్రికకు వ్యతిరేకంగా ఉండొద్దని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించలేం అని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక ఎన్నికలు ఉన్నందునే ఈ కేసుపై ఏపీ ప్రభుత్వం పట్టుబడుతోందన్న రామోజీ తరఫు న్యాయవాదుల వాదనలతో అత్యున్నత న్యాయస్థానం సమ్మతించలేదు. 'ఎన్నికలు ఉంటే ఈనాడుకు ఏమైంది? ఈనాడు ఏమీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు కదా..? ఈనాడు కేవలం ఓ పత్రికే కదా..? ఎన్నికలతో ఏం సంబంధం?' అని న్యాయస్థానం వ్యాఖ్యానించడం గమనార్హం. దీంతో ఉండవల్లి అరుణ్ కుమార్‌పైకి నెపాన్ని నెట్టివేసేందుకు రామోజీ తరఫు న్యాయవాదులు విఫలయత్నం చేశారు. ఉండవల్లి ఓ రాజకీయ నేత అని పేర్కొంటూ గతంలో హైకోర్టు తీర్పుపై వ్యతిరేక వ్యాఖ్యలు చేశారంటూ తెలుగులో ఉన్న వీడియో రికార్డులు తర్జుమా చేసి మరీ వినిపించారు. అయితే న్యాయస్థానాల తీర్పుపై విశ్లేషించవచ్చని, అదేమీ తప్పు కాదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. న్యాయస్థానాల తీర్పులపై విశ్లేషణలు జరగాలనే తాము కోరుకుంటామని తెలిపింది. ఉండవల్లి అరుణ్ కుమార్ లాంటి చదువుకున్న వ్యక్తులు విశ్లేషిస్తే మరింత మంచిదని కూడా వ్యాఖ్యానించింది. మేమే హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేస్తున్నాం కదా...? అంటే న్యాయస్థానాల తీర్పుపై విశ్లేషించినట్లే కదా? అని ప్రశ్నించింది. దాంతో తప్పించుకునేందుకు రామోజీ వేసిన అన్ని ఎత్తుగడలు బెడిసికొట్టాయి. అక్రమ డిపాజిట్ల కేసును తెలంగాణ హైకోర్టు ఆరు నెలల్లో విచారించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

మార్గదర్శి.. దొడ్డిదారి

- అనుబంధ కంపెనీలకు నిధులు మళ్లించిన రామోజీ
- ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందన్న విచారణాధికారి

సాక్షి, అమరావతి: ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి ఫైనాన్షియర్స్ రూ.2,600 కోట్ల మేర డిపాజిట్లు వసూలు చేసిన నేపథ్యంలో చట్ట ఉల్లంఘనలను పరిశీలించి నివేదిక ఇచ్చేందుకు ఎస్.రంగాచారిని ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ 2006లో అప్పటి ప్రభుత్వం జీవో జారీ చేసింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై చట్ట ప్రకారం న్యాయస్థానాల్లో ఫిర్యాదు చేసి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకునేందుకు ఐపీఎస్ అధికారి టి.కృష్ణరాజును అధీకృత అధికారిగా నియమిస్తూ జీవో ఇచ్చింది. దీంతో ఉలిక్కిపడ్డ రామోజీ వీరిద్దరి నియామకాలను సవాలు చేస్తూ 2006లో పిటిషన్ దాఖలు చేయగా హైకోర్టు కొట్టివేసింది.

నిధులు మళ్లించేశారన్న రంగాచారి..

విచారణకు రామోజీ, మార్గదర్శి ఏమాత్రం సహకరించకుండా కార్యాలయాల్లో తనిఖీలకు అడ్డుపడ్డారు. డాక్యుమెంట్లను పరిశీలించిన రంగాచారి 2007లో ఫిబ్రవరిలో తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ డిపాజిట్లను తిరిగి చెల్లించే స్థితిలో లేదని, దాని ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని నివేదికలో వెల్లడించారు. రామోజీరావు తన అనుబంధ కంపెనీలకు మార్గదర్శి ఫైనాన్షియర్స్ నిధులను మళ్లించడమే అందుకు ప్రధాన కారణమని రంగాచారి తేల్చారు.

నాంపల్లి కోర్టులో ఫిర్యాదు..

చట్ట ఉల్లంఘనలకు పాల్పడినందుకు మార్గదర్శి ఫైనాన్షియర్స్, రామోజీరావును ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ అధీకృత అధికారి టి.కృష్ణరాజు 2008 జనవరిలో నాంపల్లి మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో క్రిమినల్ ఫిర్యాదు (సీసీ నెంబర్ 540) దాఖలు చేశారు. ఈ ఫిర్యాదును కొట్టివేయాలని కోరుతూ మార్గదర్శి 2008లో పిటిషన్ దాఖలు చేయగా హైకోర్టు తిరస్కరించింది.

తదుపరి చర్యల నిలిపివేతకు 'సుప్రీం' నో...

దీంతో దిక్కుతోచని రామోజీరావు 2010లో ఓ అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. విచారణను సెక్షన్ 45(ఎస్)(1), 45(ఎస్)(2), 58బీ(5ఏ) రెడ్ విత్ సెక్షన్ 58(ఈ)లకే పరిమితం చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరగా నాంపల్లి కోర్టు దీన్ని తోసిపుచ్చుతూ 2011లో ఉత్తర్వులిచ్చింది. దీనిపై మార్గదర్శి, రామోజీరావు హైకోర్టును ఆశ్రయించారు. హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) అయిన మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45ఎస్ పరిధిలోకి రాదంటూ వాదించారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన అప్పటి న్యాయమూర్తి జస్టిస్ తేల్రపోలు రజనీ మార్గదర్శిపై కృష్ణరాజు దాఖలు చేసిన ఫిర్యాదులో తదుపరి చర్యలన్నీ నిలిపివేస్తూ 2018లో ఉత్తర్వులిచ్చారు. ఆ తరువాత ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. సుప్రీంకోర్టు సైతం నాంపల్లి కోర్టు ముందున్న ఫిర్యాదు (సీసీ 540)లో తదుపరి చర్యలను నిలిపేసేందుకు నిరాకరించింది. హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులను కొనసాగేందుకూ నిరాకరించింది.

చివరి రోజు విచారణ.. అదే రోజు తీర్పు

అటు తరువాత 1.1.2019న ఉమ్మడి హైకోర్టు విభజన జరిగింది. 31.12.2018న ఉమ్మడి హైకోర్టుకు చివరి రోజు. అందరూ భావోద్వేగంతో విభజన హడావుడిలో ఉన్నారు. ఆ సమయంలో కృష్ణరాజు ఫిర్యాదును కొట్టేయాలంటూ రామోజీరావు దాఖలు చేసిన వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ తేల్రపోలు రజనీ విచారణ జరిపారు. అదే రోజు అంటే 2018 డిసెంబర్ 31న తీర్పు కూడా ఇచ్చేశారు. హెచ్‌యూఎఫ్ ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45ఎస్ పరిధిలోకి రాదని జస్టిస్ రజనీ తన తీర్పులో తేల్చేశారు. నాంపల్లి కోర్టులో అధీకృత అధికారి కృష్ణరాజు దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టివేస్తూ తీర్పునిచ్చారు. డిపాజిట్ల సేకరణ విషయంలో మార్గదర్శి ఫైనాన్షియర్స్, రామోజీరావుకు ఎలాంటి దురుద్దేశాలు లేవంటూ న్యాయమూర్తి సర్టిఫికెట్ ఇచ్చేశారు. అసలు ఈ కేసు విచారణకు వచ్చినట్లు గానీ, న్యాయమూర్తి ఇలా తీర్పునిచ్చినట్లుగానీ ఎవరూ గుర్తించలేదు. తరువాత కొద్ది నెలలకు ఈ తీర్పు వెలుగు చూసింది. దీంతో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంప్లీడ్ అయింది.

ఆర్థిక ఉగ్రవాది అరాచకాలు

'మార్గదర్శి' పేరిట రామోజీ సామ్రాజ్య విస్తరణ

ఆర్‌బీఐ చట్టానికి విరుద్ధంగా డిపాజిట్ల సేకరణ

సాక్షి, అమరావతి: పచ్చళ్ల వ్యాపారి... చిట్‌ఫండ్ సంస్థ యజమాని... పత్రికాధిపతి... ఫిల్మ్ సిటీ అధినేత... ఇవన్నీ చెరుకూరి రామోజీరావు ధరించిన లొసుగుల ముసుగులే! దశాబ్దాలుగా సాగించిన అక్రమ డిపాజిట్లే ఆయన దోపిడీకి రాచబాట. మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట రామోజీ సేకరించినవి అక్రమ డిపాజిట్లేనని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) సుప్రీంకోర్టుకు నివేదించడంతో కేసు కీలక మలుపు తిరిగింది. రామోజీరావు ఓ ఆర్థిక నేరస్తుడే అన్నది స్పష్టమైంది.

చిట్‌ఫండ్స్ బోర్డు.. ఫైనాన్సియర్స్ పేరిట భారీగా అక్రమ డిపాజిట్లు

2006 వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రశ్నించే వరకు 'మార్గదర్శి ఫైనాన్సియర్స్' అనే సంస్థ ఉన్నట్లు కూడా సామాన్యులకు తెలియదు. రాష్ట్రం అంతటా 'మార్గదర్శి చిట్ ఫండ్స్' కార్యాలయాలే కనిపించేవి. ఆ కార్యాలయాల్లోనే గుట్టు చప్పుడు కాకుండా 'మార్గదర్శి ఫైనాన్సియర్స్' పేరిట మరో కంపెనీ ఆర్థిక కార్యకలాపాలు సాగించిందనే విషయం బయటి ప్రపంచానికి తెలియదు. అలా 1997 నుంచి 2006 వరకు మార్గదర్శి ఫైనాన్సియర్స్ యథేచ్ఛగా అక్రమ కార్యకలాపాలు సాగించింది. ఆర్‌బీఐ చట్టం 45ఎస్ ప్రకారం కంపెనీల చట్టం కింద నమోదైన ఇన్‌కార్పొరేటెడ్ కంపెనీలు మాత్రమే ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించాలి. రామోజీ తన గ్రూపు సంస్థలను 'హిందూ అవిభాజ్య కుటుంబం(హెచ్‌యూఎఫ్) కింద నమోదు చేసినట్టుగా పేర్కొన్నారు. హెచ్‌యూఎఫ్ కింద నమోదైన కంపెనీలు ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయకూడదు. 2006లో మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ డిపాజిట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చే నాటికి ఏకంగా రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్లను సేకరించడం విభ్రాంతికర వాస్తవం. మార్గదర్శి ఫైనాన్సియర్స్‌పై కేసు న్యాయస్థానంలో విచారణలో ఉండగా మరో రూ.2 వేల కోట్ల వరకు అక్రమ డిపాజిట్లు సేకరించారని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది నిరంజన్ రెడ్డి సుప్రీంకోర్టుకు నివేదించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

అక్రమ డిపాజిట్ల సంఖ్య

నగరం	రూ.లక్ష నుంచి రూ.3లక్షలు	రూ.3 లక్షలు నుంచి రూ.5లక్షలు
హైదరాబాద్	9,500	1,800
విజయవాడ	4,750	1,655
విశాఖపట్నం	6,500	985
గుంటూరు	2,465	356
తిరుపతి	650	87
వరంగల్	1,200	165
కాకినాడ	875	63
రాజమండ్రి	1,150	184

లెంపలేసుకుని.. 'మార్గదర్శి' షట్టర్ క్లోజ్

మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ డిపాజిట్ల దందా బయటపడటంతో రామోజీరావు కంగుతిన్నారు. నాటి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమాలపై దర్యాప్తు చేసేందుకు అప్పటి ప్రభుత్వ సలహాదారు రంగాచారిని విచారణ అధికారిగా నియమించింది. సీఐడీ తరఫున న్యాయ స్థానాల్లో కేసులు దాఖలు చేసేందుకు టి.కృష్ణంరాజును అధీకృత అధికారిగా నియమించింది. మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట ఏకంగా రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్లు సేకరించినట్టు వీరు గుర్తించారు. సెక్షన్ 45 ఎస్ ప్రకారం హెచ్‌యూఎఫ్‌లు డిపాజిట్లు సేకరించకూడదని ఆర్‌బీఐ స్పష్టం చేయడంతో రామో జీ తాము తప్పు చేసినట్టు అంగీకరించారు. నగదు రూపంలో డిపాజిట్లు వసూలు చేసినట్లు వెల్లడించారు. డిపాజిట్ దారులకు వారి డిపాజిట్లను తిరిగి చెల్లించి మార్గదర్శి ఫైనాన్సియర్స్‌ను మూసి వేస్తామని న్యాయస్థానానికి లిఖిత పూర్వకంగా తెలిపారు.



అంతా నల్లధనం దందానే

మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహించిన 'మార్గదర్శి ఫైనాన్సియర్స్' ముసుగులో రామోజీరావు భారీగా నల్లధనం దందాను సాగించారు. సీఐడీ సోదాల్లో, ఆదాయ పన్ను శాఖ తనిఖీల్లో ఆ విషయం వెలుగు చూసింది. అందుకనే డిపాజిట్‌దారుల వివరాలను వెల్లడించేందుకు రామోజీరావు మొండికేశారు. డిపాజిట్ల ముసుగులో టీడీపీ పెద్దలు భారీగా నల్లధనాన్ని చలామణిలోకి తెచ్చారు.

- ▲ కేంద్ర ఆదాయపన్ను చట్టాన్ని కూడా ఉల్లంఘించి రామోజీ నల్లధనం దందా నడిపారు. రూ.20 వేలకు మించిన లావాదేవీలు నగదు రూపంలో తీసుకోకూడదని ఆదాయ పన్ను చట్టం సెక్షన్ 269 స్పష్టం చేస్తోంది. మార్గదర్శి ఫైనాన్సియర్స్‌లో దాదాపు అన్ని డిపాజిట్లు నగదు రూపంలోనే తీసుకోవడం గమనార్హం. నగదు రూపంలో డిపాజిట్లు స్వీకరించి తమ సిబ్బంది ద్వారా డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ), పే ఆర్డర్లు(పీఓ)ల రూపంలోకి మార్చినట్టు ఆదాయ పన్ను శాఖ అధికారుల తనిఖీల్లో బయట పడింది. డిపాజిట్ చేసిన మొత్తాలను రూ.50 వేల కంటే తక్కువ మొత్తాలుగా విభజించి మరీ డీడీలు, పీఓలుగా మార్చారు.
- ▲ మార్గదర్శి ఫైనాన్సియర్స్ రశీదు రూపంలో సేకరించిన డిపాజిట్ల పత్రాలను పరిశీలిస్తే అదంతా నల్లధనం బాగోతమేనన్నది స్పష్టమవుతోంది. డిపాజిట్‌దారుల పాన్ నంబర్లు, పూర్తి చిరునామాలు కూడా లేకుండానే డిపాజిట్లు సేకరించడం గమనార్హం.
- ▲ రామోజీరావు 2008లో సమర్పించిన అఫిడవిట్‌లో రూ.1,864.10 కోట్లు డిపాజిట్‌దారులకు చెల్లించేశామని తెలిపారు. మరి మిగిలిన దాదాపు రూ.750 కోట్ల డిపాజిట్లు ఏమయ్యాయనే విషయంపై మౌనం వహించారు. గుట్టుచప్పుడు కాకుండా రికార్డుల నుంచి తొలగించిన ఆ డబ్బంతా రామోజీకి అత్యంత సన్నిహితుడైన టీడీపీ పెద్దలు, ఆయన గ్యాంగ్‌వేనని తెలుస్తోంది.

చెరుకూరి త్రిపాత్రాభినయం

- ఆర్‌బీఐని బురిడీ కొట్టిస్తూ అక్రమ డిపాజిట్ల దందా
- హెచ్‌యూఎఫ్ కర్త, ప్రొప్రైటర్, చైర్మన్ పేర్లతో కనికట్టు

సాక్షి, అమరావతి: ప్రేక్షకులను అలరించేందుకు కథానాయకులు కొన్ని సినిమాల్లో ద్విపాత్రాభినయం... త్రిపాత్రాభినయం చేయటాన్ని చూస్తుంటాం. చట్టం కళ్లకు గంతలు కట్టి ఆర్థిక అక్రమాలకు పాల్పడేందుకు త్రిపాత్రాభినయం చేయడం మాత్రం చెరుకూరి రామోజీరావుకే చెల్లింది. ఆర్‌బీఐ కళ్లుగప్పేందుకు చెరుకూరి తన చాతుర్యాన్ని ప్రదర్శించారు.

ఆర్‌బీఐను బురిడీ కొట్టించేందుకే...


ఆర్‌బీఐ చట్టం 45ఎస్ ప్రకారం కంపెనీల చట్టం ప్రకారం నమోదైన ఇన్‌కార్పొరేటెడ్ కంపెనీలు మాత్రమే ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించాలి. కాగా రామోజీరావు తన గ్రూపు సంస్థలను 'హిందూ అవిభాజ్య కుటుంబం(హెచ్‌యూఎఫ్) కింద నమోదు చేసినట్టు పేర్కొన్నారు. అంటే హెచ్‌యూఎఫ్ కింద నమోదైన కంపెనీలు ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయకూడదు. కానీ మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట రామోజీరావు ఏకంగా రూ.2,600 కోట్లకుపైగా అక్రమ డిపాజిట్లు సేకరించారు. దీనిపై ఆర్‌బీఐగానీ ఇతర దర్యాప్తు సంస్థలుగానీ ప్రశ్నిస్తే తప్పించుకునేందుకు ఆయనో ఎత్తుగడ వేశారు. అదే త్రిపాత్రాభియనం...

సాంకేతిక కారణాలతో తప్పించుకునే ఎత్తుగడ


చెరుకూరి రామోజీరావు అనే వ్యక్తి ఏకకాలంలో మార్గదర్శి ఫైనాన్సియర్స్ డిపాజిట్ రశీదులపై హెచ్‌యూఎఫ్ కర్తగా... చెక్కులపై ప్రొప్రైటర్‌గా... బోర్డు మీటింగుల మినిట్స్ బుక్‌లో చైర్మన్‌గా సంతకాలు చేశారు. మార్గదర్శి ఫైనాన్సియర్స్ అనేది చట్ట విరుద్ధంగా ఏర్పాటు చేసిన సంస్థ. ఆ సంస్థ ముసుగులో ఏకంగా రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్లు సేకరించారు మరి. సాంకేతిక కారణాలను సాకుగా చూపించి తప్పించుకునేందుకే రామోజీరావు ఇలా వేర్వేరు హోదాలతో సంతకాలు చేశారన్నది సుస్పష్టం. కరడుగట్టిన ఆర్థిక నేరస్తులు మినహా ఇతరులు ఇంత పక్కాగా మోసగించలేరని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

డిపాజిట్ పత్రాలపై హెచ్‌యూఎఫ్ కర్తగా...

మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమంగా వసూలు చేసిన డిపాజిట్ల విలువ మేరకు తమ డిపాజిట్‌దారులకు పత్రాలను జారీ చేసింది. వాటిపై రామోజీరావు తనను తాను 'హెచ్‌యూఎఫ్ కర్త'గా పేర్కొంటూ సంతకం చేశారు.



హెచ్‌యూఎఫ్ కర్తగా రామోజీ రావు చేసిన సంతకం




మార్గదర్శి ప్రొప్రైటర్‌గా రామోజీరావు చేసిన సంతకం

చెక్కులపై ప్రొప్రైటర్‌గా...

మార్గదర్శి ఫైనాన్సియర్స్ తమ డిపాజిట్‌దారులకు కాలపరిమితి తరువాత చెక్కుల రూపంలో చెల్లింపులు చేసింది. ఆమేరకు జారీ చేసిన చెక్కులపై రామోజీరావు 'ప్రొప్రైటర్' అని పేర్కొంటూ సంతకం చేశారు. అంటే డిపాజిట్ రశీదు మీద హెచ్‌యూఎఫ్ కర్తగా ఉన్న రామోజీరావు చెక్కు దగ్గరకు వచ్చేసరికి మాత్రం ప్రొప్రైటర్ అయిపోయారు.

బోర్డు మీటింగులో చైర్మన్‌గా...

ఇక మార్గదర్శి ఫైనాన్సియర్స్ బోర్డు మీటింగుల విషయం వచ్చేసరికి రామోజీరావు మరో పాత్రలోకి ప్రవేశించారు. బోర్డు మీటింగు మినిట్స్ బుక్‌లో, తీర్మానాల్లోనూ ఆయన 'చైర్మన్' అని సంతకం చేశారు.



చైర్మన్‌గా రామోజీ రావు చేసిన సంతకం

క్లుప్తంగా...

పవన్ రాజకీయాలకు పనికిరాడు: అంబటి రాంబాబు



సత్తెనపల్లి: 'నేను మొదటి నుంచీ చెబుతూనే ఉన్నాను. జనసేనలో ఏమీ లేదని. పవన్ కళ్యాణ్ రాజకీయాలకు పనికిరాడు' అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మంగళవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సకల జన సంక్షేమం సీఎం వైఎస్ జగన్ తోనే సాధ్యమన్నారు. పాకాలపాడు ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ప్రక్రియ ప్రారంభించామని.. అయినా సమయం సరిపోక నిలిచిపోయిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ రాగానే పాకాలపాడు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి, ప్రారంభించే బాధ్యత తనదని రైతులకు హామీ ఇచ్చారు. ఈ నెల 12న నియోజకవర్గంలోని రాజుపాలెం నుంచి సత్తెనపల్లి మీదుగా గుంటూరు మార్గంలో సీఎం వైఎస్ జగన్ మేమంతా సిద్ధం బస్సు యాత్ర రోడ్ షో జరుగుతుందన్నారు. భారీ స్థాయిలో ప్రజలు హాజరై సీఎం వైఎస్ జగన్‌ని ఆశీర్వదించాలని కోరారు. ఇంటికే పెన్షన్ రావాలన్నా, గడప వద్దకే పరిపాలన సాగాలన్నా.. పారదర్శకంగా సంక్షేమం కొనసాగాలన్నా మే13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి సత్తెనపల్లి శాసనసభ్యుడిగా తనను, నరసరావుపేట ఎంపీగా డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి తద్వారా సీఎం వైఎస్ జగన్‌ని రెండోసారి ముఖ్యమంత్రిని చేయాలని అభ్యర్థించారు.

జగనన్న పాలన దేశానికే దిక్సూచి

రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌రామ్



రాజమహేంద్రవరం సిటీ: ఏపీలో పేదల సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసినన్ని సంక్షేమ పథకాలు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశంలో మరెక్కడా ఏ ముఖ్యమంత్రి అమలు చేయలేదని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ స్పష్టం చేశారు. జగనన్న పాలన దేశానికి దిక్సూచిలా మారిందని చెప్పారు. రాజమహేంద్రవరంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈసారి ట్రిపుల్ ఇంజిన్‌తో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని ప్రతిపక్ష నేతలు అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏపీలో వైఎస్సార్‌సీపీ ఇంజిన్ ఒక్కటే దేశంలోని ఏ రాష్ట్రంలోనూ జరగనంత అభివృద్ధి, సంక్షేమంతో శరవేగంగా దూసుకుపోతున్నదని ఎంపీ చెప్పారు. అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధి, సంకల్పం ఉంటే ఇంజిన్లతో పని లేదని, దానికన్నా శరవేగంగా దూసుకుపోగల సత్తా సీఎం జగన్‌కు ఉందన్నారు. కూటమికి పొరపాటున అధికారం అప్పగిస్తే రాష్ట్రం అతలాకుతలంగా మారి అరాచకం పెచ్చరిల్లుతుందని అన్నారు. చిత్తశుద్ధితో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు ఎంపీ భరత్‌రామ్ విజ్ఞప్తి చేశారు.

మా స్థానాలు, అభ్యర్థుల మార్పులుండవు

బీజేపీ రాష్ట్ర ఎన్నికల సహ ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: పొత్తులో బీజేపీకి కేటాయించిన అసెంబ్లీ, పార్లమెంటు సీట్లు విషయంలో గానీ, ఆయా స్థానాలకు ఇప్పటికే పార్టీ ప్రకటించిన అభ్యర్థుల విషయంలోగానీ ఎలాంటి మార్పులు ఉండవని కేంద్ర పార్టీ తరపున రాష్ట్ర ఎన్నికల సహ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్న సిద్ధార్థనాథ్ సింగ్ అన్నారు. మంగళవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ సీట్లు మార్పు ఉండదని స్పష్టం చేశారు. బీజేపీకి కేటాయించిన నరసాపురం లోక్‌సభ, అనపర్తి అసెంబ్లీ స్థానాల్లో మార్పులు జరిగే అవకాశం ఉందంటూ గత కొద్ది రోజులుగా తెలుగుదేశం పార్టీ అనుబంధ సోషల్ మీడియాతో పాటు వారి అనుకూల మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఇప్పుడు దానిపై సిద్ధార్థనాథ్ సింగ్ వ్యాఖ్యలతో ఈ ప్రచారానికి తెరపడినట్లేనని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి.

పిఠాపురం నుంచే మార్పు మొదలు: పవన్



ఉగాది ఉత్సవాల్లో పాల్గొన్న పవన్

పిఠాపురం: త్వరలో ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడబోతోందని, మార్పు పిఠాపురం నుంచే మొదలవుతుందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా, గొల్లప్రోలు మండలం, చేబ్రోలులోని కొత్త ఇంట్లో మంగళవారం ఆయన గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఠాపురం నుంచే విజయ ప్రస్థానం ప్రారంభించబోతున్నానన్నారు. నూతన గృహంలో ఆయన ఉగాది ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జనసేన నేతలతో పవన్ సమావేశమయ్యారు. ప్రచారంపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నేతలు డబ్బు సంచులు తరలిస్తున్నారని, భారీగా ఖర్చు పెడుతున్నారని ఆరోపించారు.

జారుకుంటున్న జనసైన్యం

చంద్రబాబు చట్రంలో చిక్కుకున్న జనసేన అధినేత పవన్ | పార్టీకి భవిష్యత్తు లేకుండా చేస్తున్న చంద్రబాబు

సాక్షి, అమరావతి: చంద్రబాబు చట్రంలో ఇరుక్కుపోయిన పవన్ కళ్యాణ్‌తో జనసేన పార్టీ మనుగడ సాధించలేదని, రాజకీయ ఆకాంక్షలు తీరవని ఆయననే నమ్ముకున్న పార్టీ శ్రేణులు, అభిమానులు నిర్ధారణకు వచ్చేశారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు గమనించి కీలకమైన ఎన్నికల సమయంలో పార్టీ నాయకులు ఒక్కొక్కరే వీడిపోతున్నారు. పార్టీ ఉనికి ఉన్న ఉమ్మడి గోదావరి జిల్లాల్లోనే గత నెల రోజుల్లో పెద్ద సంఖ్యలో నాయకులు పార్టీని వీడారు. ఉమ్మడి తూర్పు గోదావరిలో స్వయంగా పవన్ పోటీ చేస్తున్న పిఠాపురం నియోజకవర్గం నుంచి గత 2019 ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన మాకినీడి శేషకుమారితో పాటు ఆ జిల్లాలో మమ్మిడివరం ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ, అమలాపురం ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు, జగ్గంపేట పార్టీ ఇన్‌చార్జి పాఠంశెట్టి సూర్యచంద్రరావు, కాకినాడ మాజీ మేయర్ సరోజ రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనూ 2019లో ఉంగుటూరు అభ్యర్థిగా పోటీ చేసిన నౌడు వెంకటరమణ, కైకలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బీవీ రావు, ఆచంట సమన్వయకర్త చేగొండి సూర్యప్రకాష్ రాజీనామా చేశారు. ఈ రెండు జిల్లాల్లో చాలా మంది నాయకులు పార్టీ కార్యక్రమాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో సైతం నెల క్రితమే విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి 2019లో జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన బత్తిన రాము పార్టీకి రాజీనామా చేశారు. తాజాగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన పోతిన మహేష్ కూడా పార్టీని వీడారు. వీళ్లంతా గత ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసి 15 వేలకు పైగా ఓట్లు తెచ్చుకున్న వారే. ఇలా గత ఎన్నికల్లో జనసేన పోటీ చేసిన 136 స్థానాల్లో 35 స్థానాల్లో మాత్రమే 15 వేలకు పైబడి ఓట్లు వచ్చాయి. ఇలాంటి నాయకులే ఇప్పుడు పార్టీని వీడి వెళ్లిపోతున్నారు. ఇది పార్టీ ఉనికికే ప్రమాదమని రాజకీయ నిపుణులు పేర్కొంటున్నారు.



పొత్తుల్లో బాబు మాయ

- టీడీపీతో పొత్తు ద్వారా జనసేన కేవలం రెండు జిల్లాల పార్టీగా మారిపోయింది. కేవలం ఉమ్మడి గోదావరి జిల్లాల్లోనే చంద్రబాబు జనసేనకు ఎక్కువ సీట్లిచ్చారు. రాష్ట్రస్థాయి పార్టీగా జనసేన ఎదిగే అవకాశమే లేకుండా తొక్కేశారు. ఇచ్చిన సీట్లు కూడా జనసేన ఓడిపోయేవే. చివరికి పవన్‌కే అంత అనుకూలం కాని పిఠాపురం సీటివ్వడం చంద్రబాబు కుట్రపూరిత రాజకీయానికి నిదర్శనమని జనసేన నేతలు అంటున్నారు. గత పదేళ్లలో పవన్ తనకంటూ ఒక నియోజకవర్గం ఏర్పాటు చేసుకోలేకపోవడంతో పిఠాపురంలో టీడీపీపై ఆధారపడ్డారు. అక్కడ టీడీపీ ఇన్‌చార్జి వర్మ ప్రచార పోస్టర్లలో పవన్ ఫొటోలకన్నా తనవే పెద్దవి వేసుకుంటున్నారు. ఇది పవన్‌కు చంద్రబాబు వెన్నుపోటేనని జనసేన శ్రేణులు అంటున్నాయి. మరోపక్క జనసేనకు ఇచ్చిన సీట్లలోనూ ఎక్కువ స్థానాల్లో తన మనుషులే పోటీ చేసేలా చంద్రబాబు చక్రం తిప్పుతున్నారు.
- 2019లో భీమవరంలో పవన్ పైనే పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి రామాంజనేయులు నెల ముందు జనసేనలోకి వచ్చారు. ఆయనకే టికెట్ ఇవ్వడంతో పార్టీ శ్రేణులు నోరెళ్లబెట్టాయి.
- చంద్రబాబు బీజేపీలో ఉన్న తన ప్రధాన అనుచరుడు సుజనా చౌదరికి టికెట్టు కోసం విజయవాడ పశ్చిమ సీటును జనసేనకు కాకుండా బీజేపీకి ఇచ్చారు. ఇక్కడ 2019లో జనసేనకు 22,367 ఓట్లు రాగా, బీజేపీకి వచ్చినవి 4,206 ఓట్లే. ఆ నియోజకవర్గం నుంచి సీటు ఆశించిన జనసేన నేత పోతిన మహేష్ సోమవారం పార్టీకి రాజీనామా చేశారు.
- భీమిలి స్థానాన్ని మొదట జనసేనకే కేటాయించారు. కానీ, టీడీపీ నేత గంటా శ్రీనివాసరావు భీమిలి నుంచే పోటీ చేస్తానని పట్టుబట్టడంతో ఆ స్థానాన్ని చంద్రబాబు వెనక్కి తీసుకొన్నారు. గంటాను అభ్యర్థిగా ప్రకటించారు. భీమిలిలో 2019 ఎన్నికల్లో జనసేనకు దాదాపు 25 వేల ఓట్లు వచ్చాయి. ఇప్పుడా జనసేన నేత వర్గం తీవ్ర నైరాశ్యంలో ఉంది.
- రైల్వే కోడూరులో పవన్ అభ్యర్థిని ప్రకటించాక కూడా చంద్రబాబు అతన్ని కాదని, ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి అనుచరుడికే టికెట్ ఇప్పించుకున్నారు.
- అవనిగడ్డ అసెంబ్లీ టికెట్టు జనసేన నాయకులకు దక్కకుండా అక్కడి టీడీపీ ఇన్‌చార్జిని ఆఖరి నిమిషంలో జనసేనలోకి పంపి, అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో స్థానిక జనసేన నాయకులు ఆగ్రహించారు. రెండు మూడు రోజుల్లో వారు భవిష్యత్ కార్యాచరణ ప్రకటించేందుకు సిద్ధమవుతున్నారు.

పవన్‌కే ఆశలు సన్నగిల్లి..

పొత్తులు, మూడు పార్టీల మధ్య సీట్ల కేటాయింపు తర్వాత మూడు పార్టీల్లోనూ అసంతృప్తులు పెరిగి పార్టీల మధ్య ఓట్ల బదిలీనే కష్టమన్న అభిప్రాయం మూడు పార్టీ నాయకుల్లో పెరిగింది. ఇక జనసేన నేతల్లో తీవ్రమవుతున్న అసంతృప్తిని చూశాక పవన్‌కు కూడా కూటమి గెలుపుపై నమ్మకాలు తగ్గిపోయి, ఎన్నికల ప్రచారాన్ని పెద్దగా పట్టించుకోవడంలేదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఆ కారణంగానే అనారోగ్యం, షూటింగులంటూ ప్రచారం మధ్యలో నిలిపివేసి, హైదరాబాద్ వెళ్లివస్తున్నారని చెబుతున్నారు. గత నెల 30న ప్రచారం మొదలు పెట్టి నాలుగు రోజులకే నిలిపివేశారు. ఈ నెల 7న మళ్లీ ప్రచారాన్ని ప్రారంభించి, ఒక్కరోజులోనే ఆపేశారు. అది కూడా పవన్ పోటీచేసే పిఠాపురంలోనే. ఇక రాష్ట్రంలోని మిగతా స్థానాల గురించి పవన్ పెద్దగా ఆలోచించడం లేదని రాజకీయ నిపుణులు పేర్కొంటున్నారు.

పవన్ సామాజికవర్గం నేతలకు కనువిప్పు

రాజ్యాధికారం దక్కుతుందేమోనన్న ఆశతో పవన్‌కు మద్దతిస్తున్న ఓ సామాజికవర్గానికి చెందిన కొందరు నేతలకు కూడా కనువిప్పు కలిగింది. తాము జనసేన వెంట ఉంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడానికి పనికి వస్తుంది గానీ, తమ ఆశలు తీరవని తెలిసొచ్చింది. కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి చంద్రబాబేనని, రెండో మాటే లేదంటూ లోకేశ్ కూడా ఇంతకుముందే కుండబద్దలు కొట్టడం, ఆ వ్యాఖ్యలను పవన్‌కళ్యాణ్ కనీసం ఖండించకపోవడంతో వారికి భవిష్యత్తు కళ్ల ముందు కనిపించింది. వారంతా ఇప్పుడు జనసేనను వీడి వెళ్లిపోతున్నారు.

దమ్మున్న నాయకుడితోనే నా ప్రయాణం

- మాట ఇస్తే మడమ తిప్పని నేతతో కలిసి అడుగులేస్తాను
- ఇలాంటి నేత ఎవరో రాష్ట్రంలో అందరికీ తెలుసు
- వేరే జెండాలు మోసే నాయకుడితో వెళ్లలేక జనసేన నుంచి బయటకు వచ్చా
- పోతిన మహేష్



వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలో దమ్మున్న నాయకుడితోనే తన ప్రయాణం ఉంటుందని జనసేన నుంచి బయటకు వచ్చిన పోతిన మహేష్ స్పష్టం చేశారు. మాట ఇస్తే మడమ తిప్పని నేతతో కలిసి అడుగులేస్తానని తెలిపారు. జనసేన పార్టీకి రాజీనామా చేసిన నేపథ్యంలో మహేష్ ఒక టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడారు. జనసేన పార్టీలో తనను రాజకీయంగా చంపేశారని, అందువల్లే ఆ పార్టీకి రాజీనామా చేశానన్నారు. జెండా కూలీగా, వేరే జెండా మోసే నాయకుడితో ప్రయాణం చేయలేక ఆ పార్టీ నుంచి బయటకు వచ్చానన్నారు. నాయకుడంటే నమ్మకం, భరోసా అని, భవిష్యత్‌ను అందించే వ్యక్తి నిజమైన నాయకుడని చెప్పారు. అటువంటి నాయకుడితోనే తాను వెళ్తానన్నారు. మాట ఇస్తే మడమ తిప్పని నాయకుడు ఎవరో రాష్ట్రంలో అందరికీ తెలుసన్నారు. సింహంలా సింగిల్‌గా వచ్చే నాయకుడితో వెళ్లాలని.. అలాంటి వ్యక్తి నాయకత్వంలో పనిచేయాలని తన క్యాడర్, సన్నిహితులు తనకు చెప్పారని వెల్లడించారు. అటువైపే వెళ్లాలని అందరూ సూచిస్తున్నారన్నారు. జనసేన నేతలు వేరే జెండాలు మోయాలని బలంగా నిర్ణయం తీసుకున్నారని అటువంటి వారితో వెళ్లలేమన్నారు. కూటమిలో 24 సీట్లు తీసుకున్నప్పుడు, ఆ తర్వాత 21 సీట్లకు అంగీకారం తెలిపినప్పుడు పవన్‌ను కాపులు పెద్ద ఎత్తున వ్యతిరేకించారని చెప్పారు. పవన్ కేవలం గోదావరి జిల్లాల్లోనే పోటీ చేయాలని భావిస్తున్నారని విమర్శించారు. ఆయన ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రజల కోసం ఏర్పాటు చేసిన పార్టీ నేతగా మాట్లాడటం లేదని ఆరోపించారు.

డబ్బుతో వస్తేనే టీడీపీ టికెట్లు

- ఎన్నో ఏళ్లుగా జెండా మోసిన వారికి మొండిచెయ్యి చూపారు
- నాయకులను కాపాడుకోలేని బాబు రాష్ట్రాన్ని ఎలా కాపాడతారు?
- టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్ రెడ్డి



రాయచోటి టౌన్: తెలుగుదేశం పార్టీలో సూట్‌కేసుల్లో డబ్బు తీసుకొచ్చినవారికే టికెట్లు కేటాయిస్తున్నారని, ఎన్నో ఏళ్లుగా జెండామోసినవారికి, పార్టీ కోసం అహర్నిశలు కష్టపడినవారికి మొండిచెయ్యి చూపుతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి(వాసు) సోదరుడు, అన్నమయ్య జిల్లా రాయచోటి టీడీపీ నేత, లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. రాయచోటిలోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాతికేళ్లుగా అధికారంలో ఉన్నా, లేకున్నా పార్టీ కోసం పని చేశానని, నియోజక వర్గంలోని అన్ని ప్రాంతాలు తిరుగుతూ జెండాలను మోశానని, టికెట్ ప్రకటించేటప్పుడు కనీసం తనను సంప్రదించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టికెట్ల కేటాయింపులో ఏకపక్షంగా వ్యవహరించిందని మండిపడ్డారు. పార్టీ నాయకులకు గ్యారంటీ ఇవ్వలేని చంద్రబాబు ప్రజలకు ఏం గ్యారెంటీ ఇస్తారని నిలదీశారు. ముఖ్యమంత్రి సీటు కోసం చంద్రబాబు నాయుడు లేని హైప్ సృష్టిస్తున్నారని వ్యాఖ్యానించారు. కొత్త కొత్త వ్యక్తులతో కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులరెడ్డి, నెల్లూరు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పెమ్మసాని చంద్రశేఖర్ ఇలా విదేశాల నుంచి అప్పటికప్పుడు సూట్‌కేసులతో దిగిన వారికి టికెట్లు ఇస్తున్నారన్నారు. రాయచోటి, రాజంపేట, ప్రొద్దుటూరు, మదనపల్లె ఇలా చాలా అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను రెచ్చగొట్టి రేసులో పెట్టారని వాపోయారు. అందుకే ఆ పార్టీకి, పార్టీ సభ్యత్వానికి, ఇన్‌చార్జి పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

నేడు వైఎస్సార్‌సీపీలో చేరిక

వినుకొండ దగ్గర జరుగుతున్న మేం సిద్ధం బస్సుయాత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు వైఎస్సార్‌సీపీలో చేరనున్నట్టు రమేష్‌కుమార్ రెడ్డిప్రకటించారు. తన వ్యక్తిత్వం తెలిసినవారు, తన పనితీరు నచ్చినవారు తనతో కలసి వస్తారని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకుసమాధానంగా తెలిపారు. వైఎస్సార్‌సీపీలో పదవులకోసం కాకుండా తెలుగు దేశం పార్టీ ఓటమే ధ్యేయంగా పని చేస్తానని, అందుకోసం అహర్నిశలు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

బాబు చెప్పినట్లే షర్మిల, సునీత డ్రామాలు

- జగన్‌ను తిడితే ప్రజలు ఓట్లు వేస్తారనుకోవడం మూర్ఖత్వం
- వివేక చివరి కోరిక ఇప్పుడు గుర్తొచ్చిందా షర్మిల?
- 20 ఏళ్లుగా తండ్రిని ఒంటరిగా వదిలేసిన సునీత ఇప్పుడు నీతులు చెప్పడం సిగ్గుచేటు
- షర్మిల, సునీత తీరుపై నేషనల్ దళిత జేఏసీ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు మండిపాటు

సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబుతో ఒప్పందం చేసుకుని మరీ సొంత అన్న వైఎస్ జగన్‌పై షర్మిల, సునీత విమర్శలు చేయడం మూర్ఖత్వమని నేషనల్ దళిత జేఏసీ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్ వల్ల వైఎస్సార్ కీర్తి ప్రతిష్టలు పెరిగితే.. షర్మిల వల్ల దివంగత నేత ప్రతిష్ట దిగజారిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. షర్మిల, సునీతలు చేస్తున్న అసత్య ప్రచారాలను ఖండిస్తూ ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ చనిపోతే.. ప్రకృతి ఆగ్రహంతో పావురాల గుట్టలో మాంసపు ముద్ద అయ్యాడంటూ రేవంత్ వికృత విమర్శలు చేసిన విషయాన్ని షర్మిల మరిచిపోవడం దారుణమని పేర్కొన్నారు. చరిత్ర పుటల్లో వైఎస్సార్ పేరు లేకుండా చేయాలని చంద్రబాబు ఎన్నో కుట్రలు, కుయుక్తులు పన్నాడని.. అటువంటి రేవంత్, చంద్రబాబు పంచన చేరి షర్మిల, అనిల్‌కుమార్, సునీత ఆడుతున్న డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. తన బాబాయి వివేకా చివరి కోరిక మేరకు కడప ఎంపీకి పోటీ చేస్తున్నానని షర్మిల చెబుతోందని, అదే నిజమైతే 2019లో ఎందుకు పోటీ చేయలేదని ప్రశ్నించారు. చనిపోయిన వైఎస్సార్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్పిన కాంగ్రెస్ పంచన చేరడం దారుణమైతే.. అన్న వైఎస్ జగన్‌పై విమర్శలు చేయడం మరింత దారుణమన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం 'రుజువు కాని నేరారోపణలను అభ్యర్థిపై చేయకూడదని, అవేమి పట్టించుకోకుండా షర్మిల చేస్తున్న ఆరోపణలు, విమర్శలు దారుణమని పేర్కొన్నారు. వైఎస్ వివేకాను దాదాపు 20 ఏళ్లపాటు ఒంటరిగా వదిలేసి తన తల్లి సౌభాగ్యమ్మతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్న నర్రెడ్డి సునీత ఇప్పుడు నీతులు చెబుతున్న తీరు చూస్తే సభ్య సమాజం సిగ్గు పడుతుందని తెలిపారు. వివేకాను గొడ్డలితో నరికి చంపానని, ఆయన మర్మాంగాలను ఛిద్రం చేశానని బాహాటంగా చెబుతున్న దస్తగిరికి బెయిల్ ఇప్పించడమే కాకుండా అతన్ని సంరక్షిస్తున్న సునీత ఇప్పుడు ఎవరికి అనుకూలంగా పలుకులు పలుకుతుందో జనం గమనిస్తున్నారన్నారు. వివేకా హత్యకు గురైన ప్రదేశంలో రక్తపు మరకలను శుద్ధిచేసిన నలుగురికీ నేటికీ జీతాలు ఇచ్చి పోషిస్తున్న సునీత ఇష్టం వచ్చినట్టు వైఎస్ జగన్‌పై విమర్శలు చేస్తే జనం సహించరని వరప్రసాదరావు హెచ్చరించారు.

పాలకొండ జనసేన అభ్యర్థిగా టీడీపీ నాయకుడికే టికెట్

ప్రకటించిన పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన పాలకొండ నియోజకవర్గంలోనూ బాబు అభ్యర్థే పోటీ చేస్తున్నారు. ఇటీవలే టీడీపీ నుంచి జనసేనలోకి వచ్చిన నిమ్మక జయకృష్ణను పార్టీ అభ్యర్థిగా అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటించారు. జయకృష్ణ గత ఎన్నికల్లో పాలకొండలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. పది రోజుల క్రితం వరకు టీడీపీలోనే ఉన్నారు. పవన్ కూడా పాలకొండకు జనసేన నుంచి అభ్యర్థులను ఎంపిక చేయకుండా పెండింగులో పెట్టారు. జయకృష్ణ కొద్ది రోజుల క్రితం జనసేనలో చేరడంతో ఆయనకు టికెట్ ఖరారు చేశారు.

పవన్‌పై ట్రాన్స్‌జెండర్ పోటీ

పిఠాపురం: జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై పిఠాపురంలో ట్రాన్స్‌జెండర్ తమన్నా సింహాద్రిని పోటీకి నిలుపుతున్నట్లు భారత చైతన్య యువజన పార్టీ ప్రకటించింది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ తమ పార్టీ తరఫున సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే 32 మంది అభ్యర్థుల జాబితాను మంగళవారం విడుదల చేశారు. ఇందులో పిఠాపురం నుంచి పవన్‌పై పోటీకి తమన్నా సింహాద్రి పేరును ప్రకటించారు. బిగ్‌బాస్ టీవీ షోలో పాల్గొన్న తమన్నా సింహాద్రి గతంలో మంగళగిరిలో నారా లోకేశ్‌పై పోటీ చేసి ఓడిపోయారు. తమన్నా మాట్లాడుతూ పిఠాపురంలో పవన్ కళ్యాణ్‌ను కచ్చితంగా ఓడిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.

రామోజీ రాతల్లోనే 'కోతలు'.. బాబు పాలనలోనే 'చీకట్లు'

టీడీపీ హయాంలో పవర్ హాలిడే, క్రాప్ హాలిడేలు

సాక్షి, అమరావతి

ఫ్యాక్ట్ చెక్

"పరిశ్రమలకు వారంలో రెండు రోజుల పాటు పవర్ హాలిడే అమలు చేస్తున్నాం. వారంతపు సెలవుతో కలిపి వారంలో మూడు రోజులు పరిశ్రమలకు విద్యుత్ ఉండదు." "గ్రామాల్లో ఎనిమిది గంటలు..పట్టణాల్లో ఆరు గంటలు..నగరాల్లో నాలుగు గంటలు ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ విధిస్తున్నాం." "వ్యవసాయానికి ఏడు గంటలు విద్యుత్ ఇవ్వడం కష్టం ..నాలుగు గంటలు రెండు విడతల్లో ఇస్తాం..క్రాప్ హాలిడే తీసుకుంటే ఇంకా మంచిది." ...ఇదీ చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితి..బాబు హయాంలో రాష్ట్రాన్ని చీకటి మయం చేశారు. రైతులు అర్ధరాత్రి అపరాత్రి తేడా లేకుండా విద్యుత్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియక పొలాల్లోనే పడిగాపులు కాసేవారు. ఆ సమయంలో పాముల బారినపడి ప్రాణాల మీదకు తెచ్చుకునేవారు. గ్రామాల్లో పగలూ రాత్రీ గంటల తరబడి కోతలు విధించేవారు. కొన్ని సీజన్ల పంటలకు విద్యుత్ సరఫరా లేక రైతులు క్రాప్ హాలిడే పేరుతో పంటలు వేయకుండా చేలను బీడు భూములుగా వదిలేసేలా అప్పటి పాలకులు ప్రోత్సహించారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల నుంచి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసింది. రైతులకు ఉచితంగా పగటి పూటే 9 గంటల విద్యుత్‌ను అందిస్తోంది. భారీ విద్యుత్ డిమాండ్, తీవ్ర విద్యుత్ కొరత ఉండే వేసవిలోనూ ఎలాంటి కోతలు లేకుండా, లోడ్ రిలీఫ్ అవసరం రాకుండా, క్రాప్ హాలిడే విధించకుండా, పవర్ హాలిడే పెట్టకుండా అన్ని వర్గాల ప్రజలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందిస్తోంది. కానీ దీనిని చూసి బాబు తోక పత్రికైన ఈనాడు కుళ్లుకుంటోంది. ఇలాంటి పాలనకు ప్రజలు ఎన్నికల్లో బ్రహ్మరథం పట్టనున్నారని గ్రహించి, తప్పుడు రాతలతో జనాన్ని నమ్మించాలని చూస్తోంది. అందులో భాగంగానే 'కంటి మీద కునుకు లేకుండా చేస్తారా జగన్?' అంటూ ఈనాడు మంగళవారం ఓ అబద్ధాన్ని అచ్చేసింది. రామోజీ రాస్తున్న రాతల్లో అన్నీ కోతలేనని, వాస్తవాలను పరిశీలిస్తే ఎవరికైనా అర్థమవుతుంది.

- శ్రీకాకుళం జిల్లా గార మండలం జల్లువలస, జఫ్రా బాద్, రాఘవాపురం, వాదాడ, తోనంగి శాలి హుండం గ్రామాల పరిధిలో సోమవారం ఉదయం 05:34 నుండి సాయంత్రం 04:15 గంటల వరకు కరెంటు లేదు అన్నది వాస్తవం కాదు. ఎందుకంటే ఆ రోజు బలమైన ఈదురు గాలులు వచ్చిన కారణంగా కళింగపట్నం, చల్లపేట, అతులుగు సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్స్‌పై చెట్టు కొమ్మలు పడి ట్రిప్ అయి కొంత విద్యుత్ అంతరాయం ఏర్పడింది.
- రాజమహేంద్రవరం జిల్లా గండేపల్లి మండలం, కె. సూరపాలెం గ్రామీణ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 07:15 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచింది. రాజమహేంద్రవరం తాడితోట సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8.55 నుంచి సాయంత్రం 04:15 గంటల వరకు సరఫరా నిలిచింది అన్నది కూడా వాస్తవం కాదు. ఈదురు గాలుల వల్ల 33/11 కేవీ గండేపల్లి సబ్ స్టేషన్‌లో 11కేవీ సూరంపాలెం ఇండస్ట్రియల్ పరిధిలో చెట్లు కొమ్మలు, వెదురు చెట్లు లైన్ మీద పడి బ్రేక్ డౌన్ అయ్యింది. కొమ్మలు, చెట్లు తొలగించి మధ్యాహ్నం 1 గంటకు సరఫరా పునరుద్ధరించారు. అలాగే 33/11కేవీ తాడితోట సబ్ స్టేషన్ పరిధిలోగల 11కేవీ ఇన్నిస్ పేట ఫీడర్ పైన నక్కలగూడెం వద్ద గల వీటి కాలేజ్ దగ్గర చెట్టు కొమ్మలు పడటంతో సరఫరాలో అంతరాయం కలిగింది. తెగిన విద్యుత్ లైన్ పునరుద్ధరించి 09:59 గంటలకు సరఫరా ఇచ్చారు.
- పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం, అలవద్ద, కురుపాం, మండలం భర్తంగి గ్రామాల పరిధిలో ఉదయం 09:24 గంటలకు 33/11కేవీ గుమ్మలక్ష్మీపురంలోని 11కేవీ గుమ్మలక్ష్మీపురం-ఆర్కే బాయ్ ఫీడర్ పరిధిలో అల్లవరం గ్రామం వద్ద చెట్టు కొమ్మలు లైను మీద పడి విద్యుత్ అంతరాయం కలిగింది. వాటిని తొలగించి 09:48 గంటలకు సరఫరా యథావిధిగా కొనసాగించారు.
- కడపలోని 220 కెవి సబ్‌స్టేషన్‌లో బ్యాటరీల మరమ్మతుకు గురై సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యుత్తు సరఫరా పునరుద్ధరించారు.
- కర్నూలు సర్కిల్ పరిధిలోని గుండ్లకొండ సబ్‌స్టేషన్, అనంతపురం సర్కిల్ పరిధిలోని రాయదుర్గం, తిరుపతి సర్కిల్ పరిధిలోని పూతలపట్టు సబ్ స్టేషన్లలో బ్రేక్‌డౌన్ కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అయినప్పటికీ ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో లైటింగ్ సప్లైలో మాత్రం ఎటువంటి అంతరాయం లేదు.

కంటి మీద కునుకు లేకుండా చేస్తారా జగన్?



ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు

ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)ల పరిధిలో ఎక్కడా విద్యుత్ కోతలు లేవు. ఎండ తీవ్రత దృష్ట్యా ఏసీల వినియోగంతో ఓవర్ లోడ్ కారణంగా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్తును కొనుగోలు చేస్తూ వినియోగదారులకు నాణ్యమైన నిరంతరాయ సరఫరా చేస్తున్నారు. కానీ సాంకేతిక సమస్యలతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో అంతరాయాలను విద్యుత్ కోతలుగా ఈనాడు రాసుకొచ్చింది. నిజానికి ఎక్కడా ఎలాంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ కోటాను అందిస్తోంది. అయితే సోమవారం పలు ప్రాంతాల్లో ఎక్కువగా ఈదురు గాలుల వల్ల 33 కేవీ లైన్లలో సాంకేతిక లోపాలు తలెత్తాయి. వాటికి మరమ్మతులు చేయడం కారణంగా విద్యుత్ అంతరాయాలు కలిగాయి. కార్పొరేట్ కార్యాలయం నుంచే కాకుండా సర్కిల్ స్థాయి, డివిజన్ స్థాయిల్లో కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయాల పర్యవేక్షణకు లోడ్ మానిటరింగ్ సెల్ ఇరవై నాలుగ్గంటలూ పనిచేస్తున్నాయి. సరఫరాలో ఎక్కడైనా అంతరాయం ఏర్పడితే సంబంధిత డివిజన్, సర్కిల్, కార్పొరేట్ ఆఫీస్ స్థాయిల్లో అధికారులు వెంటనే స్పందించి విద్యుత్తు సరఫరా పునరుద్ధరణకు కృషి చేస్తున్నారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం వినియోగదారులు టోల్ ఫ్రీ నెంబర్ 1912 కు ఫోన్ చేసి పరిష్కారం పొందేలా అధికారులు చర్యలు చేపట్టారు.

క్లుప్తంగా...

రైతన్న 'సిద్ధం'



కాడెద్దులకు సిద్ధం స్టిక్కర్లతో పొలానికి వెళ్తున్న రైతు చింతకుంట మురళి

వెల్దుర్తి (కృష్ణగిరి): ఉగాది పండుగ నాడు కర్నూలు జిల్లాలో రైతులు తమ కాడెద్దులను పొలానికి తీసుకెళ్లి పూజాది కార్యక్రమాలు నిర్వహించి.. పొలం పనులు చేపట్టడం ఆనవాయితీ. వెల్దుర్తి మండలం రత్నపల్లెకు చెందిన రైతు చింతకుంట మురళి మంగళవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిపై తనకున్న అభిమానాన్ని వినూత్నంగా చాటుకున్నాడు. తన కాడెద్దులపై రంగులు చల్లి, అలంకరించి, పత్తికొండ 'సిద్ధం' పోస్టర్లను కాడెద్దులకు తగిలించి గ్రామంలో ఊరేగింపుగా తన పొలానికి వెళ్లి పనులు మొదలుపెట్టాడు.

టీడీపీ నేత ఫరూక్‌కు తప్పిన ప్రమాదం



ఫరూక్‌కు ప్రాథమిక చికిత్స చేస్తున్న హైవే సిబ్బంది

పాణ్యం: నంద్యాల జిల్లా పాణ్యం మండల పరిధిలోని తమ్మరాజుపల్లె జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్‌కు గాయాలయ్యాయి. హైవే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఫరూక్ నంద్యాల నుంచి కర్నూలుకు మంగళవారం సాయంత్రం 3.30 గంటల సమయంలో బయలు దేరారు. ఈ క్రమంలో తమ్మరాజుపల్లె గ్రామం హైవే పక్క నుంచి ఒక్కసారిగా వేగంగా వచ్చిన గేదెలు ఫరూక్ కారును ఢీకొన్నాయి. ఘటనలో రెండు బర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా.. ఒకదున్నకు గాయాలయ్యాయి. ఫరూక్ ప్రయాణిస్తున్న ఫార్చ్యూనర్ కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఎయిర్ బెలూన్ ఓపెన్ కావడంతో ఆయన స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇదే కారులో ఫరూక్‌తో పాటు డ్రైవర్, మరో వ్యక్తి ఉన్నారు. విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

పాల్ వినతిపై తగిన నిర్ణయం తీసుకోండి

కేంద్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీకి హెలికాప్టర్ గుర్తును కామన్ సింబల్ కేటాయించేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీఐ) ఆదేశించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఈ ఏడాది మార్చి 19న ఇచ్చిన వినతిపత్రంపై చట్ట నిబంధనలకు లోబడి తగిన నిర్ణయం తీసుకుని, ఆ విషయాన్ని అతనికి తెలియజేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ నెల 10వ తేదీలోపు ఏం నిర్ణయం తీసుకున్నారో తెలపాలని స్పష్టం చేసింది. ఒకవేళ ఏదైనా కారణంతో ఎన్నికల సంఘం ఆ వినతిని పరిగణనలోకి తీసుకోకపోతే.. ఈ నెల 12లోపు తిరిగి వినతి పత్రం సమర్పించుకునేందుకు పాల్‌కు వెసులుబాటు ఇచ్చింది. ఈ వినతిపై కూడా చట్ట నిబంధనలకు లోబడే నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల సంఘానికి తేల్చి చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ ఇటీవల తీర్పు వెలువరించారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీకి హెలికాప్టర్ గుర్తును కామన్ సింబల్ కేటాయించేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీఐ) ఆదేశించాలని కోరుతూ పాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. తమ పార్టీకి కామన్ సింబల్ కేటాయించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించానని, ఎన్నికల సంఘం ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోలేదని పాల్ కోర్టుకు విన్నవించారు.

వెల్లివిరిసిన మతసామరస్యం

కడప ఆలయంలో ముస్లింల ఉగాది పూజలు



తీర్థం స్వీకరిస్తున్న ముస్లిం మహిళ

కడప కల్చరల్: మత సామరస్యానికి మారు పేరుగా నిలిచి వైఎస్సార్ జిల్లా మరోమారు తన ప్రత్యేకతను చాటుకుంది. ఉగాది సందర్భంగా ముస్లింలు కడప రాయుని ఆలయాన్ని దర్శించుకోవడం ఆనవాయితీ. మంగళవారం ఉగాది పర్వదిన సందర్భంగా పెద్ద సంఖ్యలో ముస్లింలు ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తిరుమలకు తొలిగడపగా భావించే కడప రాయుని ఆలయంలో అమ్మవారు బీబీ నాంచారిని తమ ఆడబిడ్డగా భావిస్తూ అమ్మవారితో పాటు స్వామికి ముస్లింలు భత్యం, నూనె, దక్షిణ ఇచ్చే సంప్రదాయం అనాదిగా వస్తోంది. ఉగాది సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ముస్లిం భక్తులు క్యూలో నిలబడి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కొబ్బరికాయలు, ఇతర పూజా ద్రవ్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు, శఠగోప ఆశీర్వాదం స్వీకరించారు.

కూటమిలో క్రోధాగ్ని

నిరసనల భగభగలు

- రాజమహేంద్రవరంలో పురందేశ్వరికి నిరసన సెగ
- మిత్రపక్షాల సమన్వయ కమిటీ సమావేశంలో టీడీపీ నేతల ఆందోళన
- ఫ్లెక్సీలో టీడీపీ నేత బొడ్డు వెంకటరమణ చౌదరి ఫొటో లేదని ఆగ్రహం
- ఫ్లెక్సీ చించి రోడ్డుపై బైఠాయింపు.. స్తంభించిన ట్రాఫిక్
- పురందేశ్వరి మౌనంపై బీజేపీ నేతల ఆగ్రహం
- ఇప్పటికే సోము వీర్రాజు వర్గం దూరం
- నూజివీడులో టీడీపీ అభ్యర్థి పార్థసారథికి గుబులు
- రెబల్ అభ్యర్థి ముద్దరబోయినకు జై కొట్టిన తెలుగుదేశం శ్రేణులు
- ఉండి ఎమ్మెల్యే రామరాజు కంటతడి
- సీటు వదులుకునేందుకు సిద్ధంగా లేనని స్పష్టీకరణ



రామరాజుకే ఎమ్మెల్యే సీటు ఇవ్వాలని నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు.

సాక్షి, రాజమహేంద్రవరం/నూజివీడు/కాళ్ల: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో కుమ్ములాటల పర్వం కొనసాగుతోంది. తెలుగు సంవత్సరాది వేళా నిరసనల సెగ చల్లారలేదు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు వ్యవహార శైలి స్వపక్ష శ్రేణుల్లోనే విభేదాల అగ్గి రాజేస్తోంది. తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం బూరుగుపూడి గ్రామంలోని ద్వారకామాయి ఫంక్షన్ హాలులో సోమవారం రాత్రి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సమన్వయ సమావేశం రసాభాసగా మారింది. రాజమహేంద్రవరం బీజేపీ ఎంపీ అభ్యర్థిగా ఎంపికైన తరువాత తొలిసారి ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో పురందేశ్వరి పాల్గొన్నారు. సభా వేదికపై ప్రధాని నరేంద్ర మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, పురందేశ్వరి, కూటమి రాజానగరం నియోజకవర్గ అభ్యర్థి, జనసేన నేత బత్తుల బలరామకృష్ణ ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దీనిలో టీడీపీ రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి ఫొటో లేకపోవడంపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీ కోసం సీటు త్యాగం చేసిన నేత ఫొటో ఎందుకు పెట్టలేదని పురందేశ్వరిని నిలదీస్తూ ఆ ఫ్లెక్సీని చించి పారేశారు. ఫ్లెక్సీలో ఉన్న మోదీ ఫొటోనూ చించివేస్తున్నా వారిని వారించేందుకు పురందేశ్వరి కనీసం యత్నించకపోగా, చిరునవ్వులు చిందిస్తూ అలాగే వేదికపై కూర్చోవడం విమర్శలకు దారి తీసింది. ఆమె తీరుపై బీజేపీ శ్రేణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ శ్రేణుల నిరసనల నేపథ్యంలో ఫంక్షన్ హాలు నుంచి ఆమె మెల్లగా జారుకున్నారు. సాధారణంగా పార్టీ అగ్రనేతల ఫొటోలు, ఫ్లెక్సీలను ఎవరైనా చించితే నాయకులు, కార్యకర్తలు సహించలేరు. కానీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వైఖరి ఇందుకు భిన్నంగా ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

■ పశ్చిమగోదావరి జిల్లా ఉండి సీటు మార్చే యోచనలో టీడీపీ అధిష్టానం ఉండటంతో ఎమ్మెల్యే మంతెన రామరాజు భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతమయ్యారు. కాళ్ల మండలం పెదఅమిరం నిర్మలాదేవి ఫంక్షన్ హాలులో మంగళవారం నిర్వహించిన టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. సమావేశంలో టీడీపీ నాయకులు స్పందిస్తూ.. ఉండి అభ్యర్థిని మారిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రాజీనామాలకూ వెనుకాడబోమని స్పష్టం చేశారు. సమావేశానికి పార్టీ పరిశీలకుడిగా వచ్చిన ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు సమక్షంలోనే వారు ఈ విషయాన్ని తేల్చిచెప్పడం గమనార్హం. ఎమ్మెల్యే మంతెన రామరాజు మాట్లాడుతూ.. తన సీటును వదులుకోవడానికి సిద్ధంగా లేనని స్పష్టం చేశారు. ఏ తప్పూ చేయకుండా త్యాగానికి సిద్ధం కావాలనడం న్యాయం కాదని ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. పార్టీ ఆదేశించిన ప్రతి కార్యక్రమాన్నీ విధిగా చేయడం తన తప్పా అని ప్రశ్నించారు. కార్యకర్తల నిర్ణయమే తనకు శిరోధార్యమని, వేరే వ్యక్తికి సీటు కేటాయిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. పార్టీ నేతల అభిప్రాయాలను అధిష్టానం దృష్టికి తీసుకువెళతానని గన్ని వీరాంజనేయులు చెప్పారు.

తొలి నుంచీ పురందేశ్వరికి చుక్కెదురు

వాస్తవానికి ఎంపీ అభ్యర్థిగా ఎంపికైన పురందేశ్వరికి మొదటి నుంచీ ఇక్కడ చుక్కెదురవుతూనే ఉంది. రాజమహేంద్రవరం వచ్చిన వెంటనే ఆమె స్థానిక బీజేపీ నాయకులను కలుపుకొని వెళ్లాల్సింది పోయి.. వేరుకుంపటి పెట్టారు. పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజును పూర్తిగా పక్కన పెట్టారు. ఈ పరిణామం సోము వర్గంతోపాటు పార్టీ శ్రేణులను దూరం చేసింది. దీంతో సభలు, సమావేశాల్లో ఆమెకు నిరసనల సెగ ఎదురవుతూనే ఉంది. అనపర్తి ఎమ్మెల్యే టికెట్‌ను తొలుత టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి కేటాయించి.. పొత్తు అనంతరం బీజేపీకి ఇవ్వడంపైనా టీడీపీ వర్గాల్లో తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తమైంది. అక్కడ ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి, స్థానిక బీజేపీ నాయకులను వ్యతిరేకిస్తూ రామకృష్ణారెడ్డి స్వతంత్రంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అయినా పురందేశ్వరి పెదవి విప్పకపోవడంపై ఆమె టీడీపీకి లాభం చేకూర్చేలా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఫ్లెక్సీలో ప్రధాని మోదీ ఫొటో చించుతున్నా స్పందించకపోవడం ఈ వాదనకు బలం చేకూరుస్తోందని బీజేపీ శ్రేణులు అంటున్నాయి.



పురందేశ్వరి ఎదుటే ఫ్లెక్సీ చించేస్తున్న టీడీపీ శ్రేణులు



ముద్దరబోయినకు మద్దతు తెలిపిన ఆగిరిపల్లి మండల టీడీపీ నాయకులు

■ ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథికి రెబల్ అభ్యర్థి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు తలనొప్పిగా మారారు. టీడీపీ ఓట్లన్నీ ముద్దరబోయినకు పడితే తన పరిస్థితి ఏమిటని కొలుసు ఆందోళన చెందుతున్నట్టు సమాచారం. 2014, 2019 ఎన్నికల్లో ఓటమి పాలైనా ఇక్కడే ఉండి టీడీపీ కార్యకర్తలకు, నాయకులకు ముద్దరబోయిన అండగా నిలబడ్డారు. అయినా అధిష్టానం ఆయనకు టికెట్ నిరాకరించింది. స్థానికేతరుడైన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథికి టికెట్ కేటాయించింది. ఇది టీడీపీ కార్యకర్తల్లో అసంతృప్తిని రాజేసింది. తొలి నుంచి ముద్దరబోయినకే టికెట్ అంటూ చెబుతూ వచ్చిన చంద్రబాబు చివరకు మొండిచేయి చూపడంతో కార్యకర్తల్లో, యాదవ సామాజిక వర్గంలో ముద్దరబోయినపై సానుభూతి పెరిగింది. దీంతో సైకిల్ పార్టీకి పడే ఓట్లలో భారీగా గండిపడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. పైకి పార్థసారథి గెలుపు తనదేనంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా.. లోలోన మదనపడుతున్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ముద్దరబోయిన ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. గడపగడపకు వెళ్లి చంద్రబాబు, టీడీపీ తనకు చేసిన మోసాన్ని వివరిస్తున్నారు. ఆగిరిపల్లికి చెందిన పలువురు టీడీపీ సీనియర్ నాయకులూ ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు జై కొట్టారు. నూజివీడులోని ముద్దరబోయిన కార్యాలయానికి వచ్చి తమ మద్దతు తెలిపారు. ముద్దరబోయినకు మద్దతు పలికిన వారిలో టీడీపీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు కొండా మంగయ్య, ఎస్సీ సెల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జన్ని రాంబాబు, ఆగిరిపల్లి మండల ఉపాధ్యక్షుడు గండికోట రంగారావు, తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడు కలవకొల్లు ప్రసాద్ తదితరులు ఉన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేకు టికెట్ ఇవ్వడమేమిటని వీరంతా టీడీపీ అధిష్టానాన్ని ప్రశ్నించారు.

కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు 112 దరఖాస్తులు

- దేశంలో ఇప్పటికే ఉన్న వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్ల పెంపునకు 58 దరఖాస్తులు
- రాష్ట్రంలో ఐదు కొత్త కళాశాలల ఏర్పాటుకు కూడా..
- అనుమతుల జారీకి కసరత్తు చేస్తున్న ఎన్ఎంసీ

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా 2024–25 విద్యా సంవత్సరంలో కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు, ఎంబీబీఎస్ సీట్ల పెంపునకు సంబంధించిన దరఖాస్తులను నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) పరిశీలించింది. కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు కోసం 112, ఎంబీబీఎస్ సీట్ల పెంపునకు 58 దరఖాస్తులు వచ్చినట్టు వెల్లడించింది. కాగా, ఏపీలో నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుకు ఐదు దరఖాస్తులు అందినట్టు తెలిపింది. వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.8 వేల కోట్లకు పైగా వ్యయంతో రాష్ట్రంలో 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా విజయనగరం, ఏలూరు, రాజమహేంద్రవరం, మచిలీపట్నం, నంద్యాల కళాశాలలను 2023–24 విద్యా సంవత్సరంలో ప్రారంభించింది. ఒక్కో చోట 150 చొప్పున 750 ఎంబీబీఎస్ సీట్లను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చింది. కాగా వచ్చే విద్యా సంవత్సరం (2024–25)లో పులివెందుల, మదనపల్లె, మార్కాపురం, ఆదోని, పాడేరుల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు వైద్య శాఖ దరఖాస్తు చేసింది. అలాగే మరో ఏడు వైద్య కళాశాలలను 2025–26 విద్యా సంవత్సరంలో ప్రారంభించడానికి వీలుగా బోధనాస్పత్రుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మొత్తం 17 వైద్య కళాశాలల ఏర్పాటు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మన విద్యార్థులకు 2,550 ఎంబీబీఎస్ సీట్లను అందుబాటులోకి తెస్తోంది. తద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందని ద్రాక్షగా ఉన్న వైద్య విద్యను వారికి చేరువ చేస్తోంది.

ఐదు దశల్లో అనుమతుల ప్రక్రియ

కొత్త కళాశాలలకు అనుమతులు ఇచ్చే ప్రక్రియను ఎన్ఎంసీ ఐదు దశల్లో చేపడుతోంది. తొలి దశలో దరఖాస్తుల పరిశీలన అనంతరం నిబంధనల ప్రకారం ధ్రువపత్రాలు సమర్పించని, బోధనాస్పత్రుల్లో పడకలు, ఫ్యాకల్టీ, ఇతర అంశాల్లో లోటుపాట్లు ఉన్న కళాశాలలకు నోటీసులు జారీ చేస్తోంది. వివరణ ఇవ్వడానికి కళాశాలలకు గడువు విధించింది. ఈ ప్రక్రియ ముగిశాక రెండో దశలో ఫ్యాకల్టీ ఆధార్ ఎనేబుల్డ్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ (ఏఈబీఏఎస్) నమోదు చేపట్టనుంది. ఈ రెండు దశల ప్రక్రియ ముగియడానికి మరో రెండు వారాలు పట్టే అవకాశం ఉంది. అనంతరం మూడో దశలో కళాశాలలు, బోధనాస్పత్రుల్లో ఎన్ఎంసీ తనిఖీలు చేపట్టనుంది. నాలుగో దశలో కళాశాలలపై సమీక్ష చేపడుతుంది. ఐదో దశలో అనుమతులు జారీ చేస్తుంది.

ఏపీ కాంగ్రెస్ అభ్యర్థుల మరో జాబితా విడుదల

ఆరు లోక్‌సభ, 12 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల ప్రకటన

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ, పార్లమెంటు ఎన్నికల బరిలో నిలవనున్న అభ్యర్థుల మరో జాబితాను కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది. ఆరు లోక్‌సభ స్థానాలతో పాటు 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఈ మేరకు మంగళవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు.

లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులు

1. విశాఖపట్నం – పులుసు సత్యనారాయణరెడ్డి
2. అనకాపల్లి – వేగి వెంకటేశ్
3. ఏలూరు – కావూరి లావణ్య
4. నరసరావుపేట – గార్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్
5. నెల్లూరు – కొప్పుల రాజు
6. తిరుపతి (ఎస్సీ) – డా.చింతా మోహన్

అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులు:

1. టెక్కలి – కిల్లి కృపారాణి
2. భీమిలి – అడ్డాల వెంకటవర్మ రాజు
3. విశాఖపట్నం సౌత్ – వాసుపల్లి సంతోష్
4. గాజువాక – లక్కరాజు రామారావు
5. అరకు లోయ (ఎస్టీ)– శెట్టి గంగాధరస్వామి
6. నర్సీపట్నం – ఆర్. శ్రీరామమూర్తి
7. గోపాలపురం (ఎస్సీ) – సోడదాసి మార్టిన్ లూథర్
8. యర్రగొండపాలెం (ఎస్సీ) – డా.బూదాల అజితరావు
9. పర్చూరు – నల్లగొర్ల శివ శ్రీలక్ష్మీ జ్యోతి
10. సంతనూతలపాడు (ఎస్సీ) – విజేష్‌రాజ్ పాలపర్తి
11. గంగాధర నెల్లూరు (ఎస్సీ) – రమేష్‌బాబు దెయ్యాల
12. పూతలపట్టు (ఎస్సీ) – ఎం.ఎస్.బాబు

చిరంజీవి కాంగ్రెస్‌లోనే ఉన్నారు

- సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు



రాజమహేంద్రవరం సిటీ: మాజీ కేంద్రమంత్రి, సినీ నటుడు చిరంజీవి కాంగ్రెస్‌లోనే ఉన్నారని, ఆయనకు పార్టీ సభ్యత్వం ఉందని సీడబ్ల్యూసీ సభ్యుడు, ఆ పార్టీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు స్పష్టం చేశారు. రాజమహేంద్రవరంలో ఎన్నికల కార్యాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. జనసేనకు చిరంజీవి రూ.5 కోట్ల విరాళం ఇవ్వడంతో ఆయన ఆ పార్టీలోకి వెళుతున్నారనే వార్తలపై స్పందించారు. తమ్ముడికి ఆర్థిక సాయం అందించడంలో అపోహలకు తావు లేదన్నారు.

108 రకాలతో బాహుబలి విందు

మునిమనుమడి రాక సందర్భంగా వేడుక



బుట్టాయగూడెం: ఇన్నాళ్లూ మనం కొత్త అల్లుడు ఇంటికొస్తే అత్త,మామలు వినూత్నంగా భారీ వంటకాలతో బాహుబలి విందు ఏర్పాటు చేయడం చూశాం. అయితే ఓ రిటైర్డ్ పోస్ట్‌మాస్టర్ కుటుంబం తమ మునిమనుమడి రాకతో 108 రకాలతో బాహుబలి విందు ఏర్పాటు చేశారు. వివరాల్లో వెళితే... ఏలూరు జిల్లా, బుట్టాయగూడెం మండలంలోని మర్లగూడెంలో క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగను రిటైర్డ్ పోస్ట్‌మాస్టర్ కనిగొల్ల దుర్గారావు కుటుంబ సభ్యులు మంగళవారం వినూత్నంగా జరుపుకున్నారు. ఉగాది పండుగకు తొలిసారిగా ఇంటికి వచ్చిన మునిమనుమడు నాగ సూర్య ప్రవీణ్‌కు 108 రకాల పిండివంటలు, మధుర ఫలాలు, వివిధ రకాలైన తినుబండారాలు, మీగడ, వెన్నపూస, స్వీట్స్, హాట్స్, కేక్స్, పండ్ల రకాలు, డ్రై ఫ్రూట్స్, బిస్కెట్స్, చాక్లెట్స్, చక్కెర పొంగలి, పులిహోర, బూరి వంటి రకాలు కూడా ఈ విందులో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మర్లగూడెం పరిసర ప్రాంతవాసులు కూడా తరలివచ్చారు. ఈ సందర్భంగా చిన్నారి నాగసూర్యప్రవీణ్‌ను ఆశీర్వదించారు.

నాలుక మడతేస్తూ నయవంచన

▶ మొదటి పేజీ తరువాయి

నమ్మబలికారు. అసలు ఆ వ్యవస్థ పనికి రానిదని, దాన్ని రద్దుచేస్తానన్న నోటితోనే ఇప్పుడు దాన్ని కొనసాగిస్తానని పొంతనలేని మాటలంటూ 'నయా'వంచన చేస్తున్నారు. అవసరార్థం ఎప్పటికప్పుడు తన విధానాలు, మాటలకు తూచ్ చెబుతూ ఎక్కడికక్కడ ఊసరవెల్లిలా చంద్రబాబు రంగులు మార్చడం చూసి సొంత పార్టీ వాళ్లే నోరెళ్లబెడుతున్నారు.

అప్పుడు అన్ని మాటలు అని..

నిజానికి.. వైఎస్ జగన్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేస్తున్న వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు, టీడీపీ, జనసేన నేతలు గతంలో చేసిన దుష్ప్రచారం అంతా ఇంతా కాదు. వలంటీర్లు చేసేది గోనె సంచులు మోసే ఉద్యోగమని, అవి ఉద్యోగాలా అని చంద్రబాబు ఎద్దేవా చేశారు. రాత్రిళ్లు ఇళ్లకు వెళ్లి తలుపులు కొడుతున్నారని, ఆడవాళ్లకు వలంటీర్ల వల్ల రక్షణ కరువైందంటూ నోటికొచ్చినట్లు మాట్లాడారు. ఊళ్లలో వలంటీర్లు న్యూసెన్స్‌గా మారారని, వీళ్ల ప్రభుత్వానికి ఏజెంట్లుగా మారారని.. అంతేకాక, బెదిరింపులు, అవినీతికి పాల్పడుతున్నారని ఇష్టమొచ్చినట్లు ఆరోపణలు చేశారు. ఆయన దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ అయితే మరింత రెచ్చిపోయి రాష్ట్రంలో వేలాది మంది మహిళలు అదృశ్యమవుతున్నారని, అందుకు వలంటీర్లే కారణమని వారిపై అడ్డగోలు అభాండాలు వేశారు. తామొస్తే వలంటీర్ల వ్యవస్థ నడుం విరగ్గొడతామంటూ బరితెగించి మాట్లాడారు. ఎల్లో మీడియాలో అయితే వలంటీర్లకు వ్యతిరేకంగా టన్నుల కొద్దీ వ్యతిరేక కథనాలు అచ్చేసింది. చివరికి.. వలంటీర్ల వ్యవస్థను ఆపేందుకు చంద్రబాబు తన మనుషుల ద్వారా కోర్టుల్లో పిటిషన్లు సైతం వేయించారు. వారిని అడ్డుకోవడం ద్వారా ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను ఆపడానికి ఆయన చేయని కుట్రలేదు.



నిమ్మగడ్డ ద్వారా వలంటీర్లకు బ్రేకులు..

చివరికి.. తన కోసమే పనిచేసే, తన నమ్మిన బంటు అయిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ద్వారా కోర్టుకు వెళ్లి ఎన్నికల సమయంలో వారు విధుల్లో పాల్గొనకుండా అడ్డుకున్నారు. తద్వారా ఈనెల వృద్ధులు, దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ల పంపిణీని అడ్డుకున్నారు. ఇంటింటికీ వెళ్లి వారికి వలంటీర్లు పింఛన్లు ఇవ్వకుండా ఆపి అనేకమంది వృద్ధుల మరణాలకు కారకుడిగా నిలిచారు. దీంతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం పెల్లుబికింది. చంద్రబాబు తమకిచ్చే పింఛన్లు రాకుండా అడ్డుకున్నారనే విషయం ప్రతి పింఛన్‌దారునికి అర్థమవడంతో ఆయన వెంటనే తన నాలుక మడతేశారు. తాను పింఛన్ల పంపిణీని ఆపమనలేదని, వలంటీర్లకు తాము వ్యతిరేకం కాదంటూ కొత్త పల్లవి అందుకున్నారు. అంతేకాక.. ఎన్నికల కమిషన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖలు రాసి ఇంటింటికీ పింఛన్ల పంపిణీ చేయాలని మొసలికన్నీరు కారుస్తూ తెగ హడావుడి చేశారు. అయితే, అప్పటికే చంద్రబాబు చేసిన నష్టం, ఆడిన నాటకాలు ప్రజలకు తెలిసిపోయింది.

ప్రజాగ్రహంతో నయా.. వంచన

ఈ నేపథ్యంలో.. వలంటీర్లు, పింఛనర్లకు వ్యతిరేకంగా టీడీపీ వికృతంగా ఆడిన ఈ రాజకీయ క్రీడతో ప్రజల్లో చంద్రబాబు, టీడీపీ, జనసేనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. తమ నోటి దగ్గర కూడును చంద్రబాబు తీసివేశారని తిట్టని పింఛనర్లు లేరు. దీంతో బెంబేలెత్తిపోయిన చంద్రబాబు ప్లేటు ఫిరాయించారు. వలంటీర్లపై కొత్త మోసానికి తెరతీశారు. నష్ట నివారణకు తాను వ్యతిరేకించిన వ్యవస్థను పొగుడుతూ కొత్త పాచిక విసిరారు. చివరికి తాను అధికారంలోకొస్తే వారిని కొనసాగిస్తానని, గతం కంటే ఎక్కువ భృతి ఇస్తానని చెబుతూ వారిని ఆకట్టుకునేందుకు మరో డ్రామా మొదలుపెట్టారు. ఇన్నాళ్లూ తిట్లు, శాపనార్థాలతో అడుగడుగునా అవమానించిన వారిని నెత్తిన పెట్టుకుంటానంటూ చంద్రబాబు కల్లబొల్లి కబుర్లు చెబుతుండడం చూసి వలంటీర్లు ఆయన్ను వింతగా చూస్తున్నారు. తమను లేకుండా చేస్తామన్న వారే ఇప్పుడు ఓట్ల కోసం తమకు గేలం వేస్తుండడం చూసి హేళనగా నవ్వుకుంటున్నారు. చంద్రబాబు అవకాశవాద రాజకీయాలు గతంలో చాలా చూసినా ఇప్పుడు తమతో ఆడుతున్న నాటకాలు చూసి వలంటీర్లు ఛీదరించుకుంటున్నారు.

టీడీపీకి విరాళాలివ్వండి..

ఇక టీడీపీకి విరాళాలివ్వాలని చంద్రబాబు కోరారు. పార్టీకి విరాళాలిచ్చేందుకు తీసుకువచ్చిన వెబ్‌సైట్‌ను మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. తన వంతుగా రూ.99,999లు ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికీ కొన్ని జిల్లాల్లో తమ పార్టీకి కార్యాలయాలు లేవన్నారు. టీడీపీ ఏనాడూ భూములు తీసుకుని ప్యాలెస్‌లు కట్టలేదని చెప్పారు. అంతకుముందు.. టీడీపీ కార్యాలయంలో ఉగాది వేడుకలు, పంచాగ శ్రవణం జరిగాయి.

టీడీపీ నేతల బరితెగింపు వ్యాఖ్యలు..

ఇదిలా ఉంటే.. పింఛన్ల పంపిణీపై తన కుట్ర బెడిసికొట్టడంతో నిమిషాల్లో చంద్రబాబు స్వరం మార్చినా టీడీపీ నేతలు మాత్రం మరింత రెచ్చిపోయారు.

▲ రాజమండ్రి అర్బన్ టీడీపీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసు తాము చేసిన ఫిర్యాదులవల్లే వలంటీర్ల వ్యవస్థ ద్వారా జరిగే ఇంటింటికీ పింఛన్ల పంపిణీ నిలిచిపోయిందని బహిరంగంగా చెప్పారు. ఇది తమ ఘనతేనని మీడియా సమావేశంలో ఆయన గొప్పగా ప్రకటించుకున్నారు.

▲ శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అయితే వలంటీర్లు ఉగ్రవాదులని, స్లీపర్ సెల్స్‌లా పనిచేస్తున్నారంటూ దారుణమైన వ్యాఖ్యలు చేశారు.

▲ అలాగే, కనిగిరి టీడీపీ అభ్యర్థి ఉగ్ర నరసింహారెడ్డి రూ.3 వేలు పింఛను తీసుకోకపోతే ముసలోళ్లు చచ్చిపోతారా అంటూ జుగుప్సాకర వ్యాఖ్యలు చేశారు.

..ఇలా టీడీపీ నేతలంతా వలంటీర్లు, అవ్వాతాతల పింఛన్లపై నోటికొచ్చినట్లు మాట్లాడారు. అంతటితో ఆగకుండా వలంటీర్లను పింఛన్ల పంపిణీకి దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినప్పుడు టీడీపీ శ్రేణులు సంబరాలు కూడా చేసుకున్నాయి.

జన్మభూమి కమిటీలతో ద్రోహం చేసినట్లేగా..

ఇదిలా ఉంటే.. వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తానని చెప్పడం ద్వారా తన హయాంలోని జన్మభూమి కమిటీలతో ప్రజలు దగా పడ్డారనే విషయాన్ని చంద్రబాబు చెప్పకనే చెప్పారు. అప్పట్లో జన్మభూమి కమిటీలు ప్రజలను ఎన్నో రకాలుగా రాచి రంపాన పెట్టాయి. ప్రభుత్వ సేవలు, పథకాలు అందాలంటే ఈ కమిటీలకు లంచాలు ఇచ్చుకోవాల్సిందే. దీనిపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత వచ్చి తెలుగుదేశం పార్టీపై జనం తిరుగుబాటు చేసే పరిస్థితి ఏర్పడింది. ఫలితంగానే 2019 ఎన్నికల్లో చంద్రబాబు చిత్తుగా ఓడిపోయారు. ఆ తర్వాత వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను వారి ద్వారా అమలుచేశారు. లంచాలకు ఆస్కారం లేకుండా నేరుగా ప్రజల అకౌంట్లలోకి ఆ పథకాల డబ్బులు బదిలీ చేశారు. ఇక వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ అయితే విప్లవాత్మకమైన రీతిలో జరిగింది. ఇలాంటి వ్యవస్థపై చంద్రబాబు ఈర్ష్య, అసూయతో రగిలిపోయారు. నోటికొచ్చినట్లు అవాకులు చెవాకులు పేలారు. దీంతో పార్టీకి నష్టం జరగడంతో మాటమార్చి దాన్ని కొనసాగిస్తానని చెప్పడం, తాను వారికి ఇంకా ఎక్కువ పారితోషికం ఇస్తానని చెప్పడం చూస్తుంటే తన జన్మభూమి కమిటీలు విఫలమైనట్లు అంగీకరించినట్లేనని తేలిపోయింది. ముందు ఆ విషయాన్ని ఒప్పుకుని లెంపలు వేసుకుంటే బాగుంటుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
బుధవారం ॥ 10-4-2024

యోగా గురువు


హన్సా యోగేంద్ర

వయసు 76 ఉత్సాహం 16

మన దేశంలో యోగా గురువులంటే పురుషులే కనిపిస్తుంటారు. కాని హన్సా యోగేంద్ర యోగా గురువుగా చేసిన కృషి ఎవరికీ తక్కువ కానిది. ముఖ్యంగా వయోవృద్ధులలో నైరాశ్యం తొలగి జీవన ఉత్సాహం ఏర్పడాలంటే ఏం చేయాలో ఆమె వీడియో పాఠాల ద్వారా తెలియచేస్తుంది. ఆలోచన, ఆహారం, ఆరోగ్యం ఈ మూడింటికీ మార్గదర్శి హన్సా యోగేంద్ర.

ముందు మనం హన్సా యోగేంద్ర రోజువారీ జీవితం చూద్దాం. ఆమె ఉదయం 5 గంటలకు నిద్ర లేస్తారు. కాసేపు మంచం మీదే పవన ముక్తాసన వంటి ఒకటి రెండు ఆసనాలు వేస్తారు. కొన్ని నిమిషాల ప్రాణాయామం చేస్తారు. ఓంకార ధ్వని చేస్తారు. 'ఇది సృష్టిలోని శక్తిని మీకు అనుసంధానిస్తుంది' అంటారు. అప్పుడు 'మార్నింగ్ డ్రింక్' తాగుతారు. అంటే టీ, కాఫీ కాదు. రాత్రంతా వెండిగ్లాసులో ఉంచిన నీటిని కాచి దానిలో ఉసిరి, అల్లం, మిరియాలు, పసుపు, అశ్వగంధ మిశ్రమాల పొడిని కొద్దిగా కలిపి కాస్త నిమ్మకాయ పిండి ఆ కషాయాన్ని తీసుకుంటారు. 'ఇది జఠరాగ్నికి చాలా మంచిది' అంటారామె. ఆ తర్వాత కాసేపు మత్స్యాసనం, భుజంగాసనం, శలభాసనం వేస్తారు. సరిగ్గా 8.30 అల్పాహారం తీసుకుంటారు. అల్పాహారం అంటే రాత్రి నానబెట్టిన డ్రైఫ్రూట్స్. చివరలో పాలు. ఆ తర్వాత ఆమె యోగా వీడియోలు రికార్డు చేస్తారు. లేదంటే తమ మానసిక శారీరక బాధలు చెప్పుకోవడానికి వచ్చే అనుయాయుల సమస్యలు విని కౌన్సెలింగ్ చేస్తారు. మధ్యాహ్నం భోజనంలో ఒక రోటీ, పప్పు, ఏదైనా కూర. 'నేను భోజన బల్ల మీద నీళ్ల గ్లాస్ పెట్టుకోను. మజ్జిగ గ్లాసు పెట్టుకుంటాను. నీళ్ల కంటే మజ్జిగ మన జీర్ణక్రియకు మంచిది' అంటారామె. ఆ తర్వాత పనిలో పడతారు. సాయంత్రం కాసేపు వాకింగ్ చేస్తారు. ఉడకబెట్టిన పప్పులేవైనా తీసుకుంటారు. రాత్రి సూప్‌తో పాటు, ఇడ్లీ సాంబార్ లాంటివి భుజిస్తారు. రాత్రి సరిగ్గా 10.30కు నిద్ర పోతారు. 'జీవితం ప్రశాంతంగా గడవాలంటే సిస్టమేటిక్‌గా ఉండాలి' అంటారామె.

■ యోగా గురువు

హన్సా యోగేంద్ర ముంబైలో పుట్టి పెరిగింది. చిన్న వయసులోనే యోగా పట్ల ఆకర్షితురాలైంది. బిఎస్సీ, ఎల్ఎల్‌బీ చేసినా మనసు యోగా వైపుకు లాగడంతో ప్రఖ్యాత యోగా గురువు యోగేంద్ర స్థాపించిన 'ది యోగా ఇన్‌స్టిట్యూట్'కు తరచూ వెళ్లేది. అక్కడే ఆమె యోగేంద్ర కుమారుడు జయదేవ యోగేంద్ర దగ్గర యోగా నేర్చుకుంది. ఆ తర్వాత జయదేవను వివాహం చేసుకుంది. ఈ పెళ్లికి ఆమెవైపు పెద్దలు అంగీకరించలేదు. కాని తన జీవితాన్ని యోగాకు అంకితం చేయాలన్న నిశ్చయంతో ఆమె జయదేవను వివాహం చేసుకుంది. ఆ తర్వాత భర్తతో కలిసి యోగా కేంద్రాన్ని వృద్ధిలోకి తెచ్చింది. ఇప్పుడు ఆమె 76 సంవత్సరాలు. గత ముప్పై, నలభై ఏళ్లలో ఆమె సంస్థ ద్వారా తయారైన యోగా టీచర్లు, ఆమె ద్వారా కనీసం లక్షమంది ప్రపంచవ్యాప్తంగా ఉన్నారు. ఇవాళ ఆమె చేసే వీడియోలు లక్షల్లో చూస్తున్నారు. జీవితాన్ని ఆనందమయం చేసుకోవడానికి యోగా ఉత్తమ మార్గం అంటారామె.


హన్సా యోగేంద్ర

■ అలవాట్లు.. ఆలోచనలు

అలవాట్లు. ఆలోచనల మీద నియంత్రణ అన్నది జీవితాన్ని అదుపులో ఉంచుతుందని అంటారు హన్సా. అర్థవంతంగా జీవించడం ప్రతి ఒక్కరి అవసరం అని చెబుతారు. విపరీతమైన పరుగులాట, వేళకాని వేళ భోజనం, వేళకాని వేళలో నిద్ర... ఇవి జీవితానికి, ఆరోగ్యానికి ప్రధాన శత్రువులంటారామె. ఇవే అనవసర వృద్ధాప్యాన్ని తెస్తున్నాయని అంటారు. ప్రకృతిలో దొరికే అందరికీ తెలిసిన పదార్థాలతోనే అకాల వృద్ధాప్యాన్ని నిరోధించవచ్చంటారు. కాఫీ, టీ వంటివి కూడా శరీరానికి అక్కర్లేదని అవి అలవాటుగా మారి నాడీ వ్యవస్థను డీలా పరుస్తాయంటారు. 'ఐదు ముఖ్యమైన ఉదయపు అలవాట్లు', 'మంచినీరు తాగాల్సిన పద్ధతి', 'ప్రతి స్త్రీ వేయాల్సిన ఐదు ఆసనాలు', 'స్నానం చేయాల్సిన పద్ధతి', 'ఎలాంటి ఆహారం తీసుకోవాలి', 'జబ్బులు రానివ్వని ఐదు ముద్రలు'... ఆమె చేసిన ఇలాంటి వీడియోలన్నీ పెద్దఎత్తున ఆదరణ పొందాయి. సాత్విక ఆహారం గురించి 'ది సాత్విక్ కిచెన్' అనే పుస్తకం రాశారామె. 'ఆధ్యాత్మికత, ఆసనాలు మన జీవితానికి మార్గం చూపుతాయి. మిమ్మల్ని మీరు తెలుసుకోండి. తెలుసుకొని ఆధ్యాత్మికంగా మీ బలహీనతలను జయించండి' అంటారు హన్సా. 'జీవితం విసిరే సవాళ్లకు సిద్ధంగా ఉండి రిస్క్ తీసుకునైనా నిజాయితీగా పోరాడితే జీవితం కచ్చితంగా మీకు సంతోషాలనే ఇస్తుంది. జీవితాన్ని అనవసర జంజాటాల్లో పడేయకండి' అంటారామె. హన్సా కుమారుడు రిషి జయదేవ్ యోగేంద్ర కూడా యోగ సాధనలో ఉన్నాడు. 'అతన్ని చూసి నేను గర్విస్తున్నాను' అంటారామె.

అవకాశాలను సృష్టించుకోవాలి!

మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఆరుషి ఢిల్లీ వాసి. కాలేజీ రోజుల నుంచే ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా ఫ్యాషన్ డ్రెస్సులు, జ్యువెలరీ అమ్మకాలు చేపట్టింది. ఏడేళ్ల క్రితం 30 వేల రూపాయలతో 'లావిష్' పేరుతో సొంతంగా కంపెనీ ఏర్పాటు చేసి, విదేశాలకూ తన ఉత్పత్తులను సరఫరా చేస్తోంది. పాతికమందికి పైగా మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించింది. దేశంలో గ్రామీణ మహిళా కళాకారులను గుర్తించి, వారితో నెట్‌వర్కింగ్ ఏర్పాటుచేసి, ఉపాధి కల్పిస్తోంది. 'అవకాశాలను వెతకడం కాదు, మనమే సృష్టించుకోవాలి' అంటున్న ఆరుషి నేటి తరానికి స్ఫూర్తిదాయకం.


ఆరుషి

''నేను ఫ్యాషన్ డ్రెస్సులు, కస్టమైజ్డ్ జ్యువెలరీ, డెకరేటివ్ వస్తువులు, పిల్లల బట్టలు, ఇతర ఉపకరణాలను ఎగుమతి చేస్తుంటాను. నాకు మొదటి నుంచి బిజినెస్ అంటే ఇష్టం. కాలేజీ రోజుల్లో అమ్మతో కలిసి అనేక ఈ-కామర్స్ సైట్‌లలో చీరలు, సూట్‌లు అమ్మేదానిని. కానీ, చాలా పోటీ అనిపించేది. ఏదైనా సరే భిన్నంగా చేయాలనే కోరిక ఉండేది. కానీ, సరైన మార్గం దొరికేది కాదు. కాలేజీలో చదువుతూనే ఓ కంపెనీలో ఉద్యోగం కూడా చేశాను. కానీ, నాకు నేనుగా నిరూపించుకునే పనిచేయాలనుకునేదాన్ని. దీంతో ఆ ఉద్యోగాన్ని వదిలేసి పూర్తి సమయాన్ని వ్యాపారానికి కేటాయించాలనుకున్నాను. ఉద్యోగం ద్వారా సంపాదించిన మొత్తంతో సొంతంగా వ్యాపారం చేయాలనుకున్నాను. 30 వేల రూపాయలతో 'లావిష్' అనే పేరుతో కంపెనీని రిజిస్టర్ చేయించాను. అమెజాన్‌తో కలిసి చీరలు, ఫ్యాషన్ జ్యువెలరీ వంటివి అమ్మడం మొదలుపెట్టాను. రెండేళ్లు ఈ పనులు ఇలాగే కొనసాగాయి.

■ అంతర్జాతీయంగా..

అమ్మే ఉత్పత్తులకు నా సొంత ఆలోచనను జోడించాను. సొంతంగా డిజైన్లు చేయడంతో పాటు కొనుగోలుదార్లు అడిగే డిజైన్లపైనా పనిచేయడం మొదలుపెట్టాను. కస్టమైజ్డ్ డిజైన్లు అవడంతో ఆర్డర్లు విరివిగా రావడం మొదలయ్యాయి. దేశంలోనే కాదు అంతర్జాతీయంగానూ కొనుగోలుదార్లు పెరిగారు. పాతికలక్షలకు పైగా టర్నోవర్ సాధిస్తున్నాను.

■ మహిళలు మాత్రమే

నా కంపెనీలో మహిళలు మాత్రమే పనిచేస్తున్నారు. దేశంలోని గ్రామాల నుండి కళాకారుల సమాచారం సేకరిస్తాను. వారి నైపుణ్యాలను మెరుగుపరుస్తాను. అక్కడ ఉత్పత్తులను తయారు చేయించి, వాటిని విక్రయిస్తాను. మహిళలు మాతో కనెక్ట్ అవడానికి ప్రత్యేక ప్రయోజనం కూడా ఉంది. తమ ఉత్పత్తులను మార్కెటింగ్ చేయనవసరం లేదు. అమ్ముకోవడం కోసం బయటికి వెళ్లనక్కరలేదు. ఇంట్లో కూర్చొని ఉపాధి పొందవచ్చు. అంతేకాదు, వారి నైపుణ్యాలను ప్రపంచం గుర్తిస్తుంది. దీనిద్వారా ఎంతోమంది మహిళలకు ఉపాధి లభిస్తుంది. మన హస్తకళలకు ముఖ్యంగా ఆభరణాలకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. విదేశీ మహిళలకు రాజస్థానీ వస్త్రధారణ, బంజారా నగలు అంటే పిచ్చి. వారు భారతీయ సంస్కృతిని చాలా ఇష్టపడతారు. దీని కారణంగానే వారు భారతీయ డ్రెస్సులు, ఆభరణాలవైపు ఆకర్షితులవుతారు.

■ ఒంటరి తల్లి

నా సక్సెస్ వెనక మా అమ్మ మద్దతు చాలా ఉంది. నేను ముందడుగు వేయడంలో అమ్మ ఎప్పుడూ ప్రోత్సహిస్తుంటుంది. మా చెల్లినీ, నన్ను అమ్మ ఒంటరిగా చాలా కష్టపడి పెంచింది. ఆ కష్టంలో... నేను నా మార్గం కనుక్కోవడానికి ధైర్యాన్ని కూడా ఇచ్చింది. అందుకే ఈ రోజు వరకు 12 దేశాలకు ఒంటరిగా వెళ్లి, సందర్శించగలిగాను.

■ ఇంటి పేరుకు నో!

నా పేరుకు ఇంటిపేరు జోడించకూడదని నా సొంత నిర్ణయం. అందుకే, నా పేరుకు ముందు సర్‌నేమ్ ఉండదు. ఒక వ్యక్తి చేసే పనే వారి గుర్తింపు అవుతుంది. అందుకే, ఇంటి పేరును జత చేసుకోవాల్సిన అవసరం లేదని నేను భావించాను. అందుకు మా అమ్మ కూడా మద్దతు తెలిపింది. కానీ, ముఖ్యమైన పేపర్లలో సర్‌నేమ్ లేకుండా ఇవ్వలేమనే నిబంధనలతో చాలా సమస్యలను ఎదుర్కోవాల్సి వచ్చింది. స్కూల్లో, కాలేజీలో ప్రతిచోటా ఈ సమస్య ఎదురైంది. కానీ, నా నిర్ణయాన్ని మార్చుకోలేనని స్పష్టంగా చెప్పాను. అందుకు, చట్టపరంగానూ, న్యాయసలహాలు తీసుకున్నాను. దీంతో నా సర్టిఫికెట్లన్నింటిలోనూ నా పేరు మాత్రమే ఉంటుంది.

■ ఒంటరి యాత్రికురాలిని

నాకు ప్రయాణాలు అంటే ఇష్టం. ప్రకృతి అందమైన ప్రపంచాన్ని మన ముందుంచింది. దానిని ఆస్వాదించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి అనుకుంటాను. స్వదేశంలో లేదా విదేశంలో ఎక్కడ సందర్శనకు వెళ్లినా ప్రతిచోటా వారి సంస్కృతి, కళల గురించి తెలుసుకుంటాను. గ్రామాల్లో దాగి ఉన్న సాంస్కృతిక, కళాత్మక ప్రతిభను తెలుసుకొని, నైపుణ్యాలను మెరుగుపరిచి, ప్రపంచం ముందుకు తీసుకువస్తుంటాను'' అని తన విజయపథాన్ని వివరించింది ఆరుషి.

బ్యూటిప్



అరటిపండు గుజ్జులో కొద్దిగా కొబ్బరి నూనె వేసి, ఈ రెండింటినీ కలిపి ముఖానికి పట్టించాలి. ఇరవై నిమిషాల తరువాత మర్దన చేసి నీటితో కడిగేయాలి. ఇది మంచి క్లెన్సర్‌గా పనిచేయడమేగాక, చర్మానికి తేమనందిస్తుంది.



డబ్బును పెట్టుబడిగా పెట్టడమే ఎక్కువమందికి తెలుసు. 'టైమ్'ను పెట్టుబడిగా పెడితే? 'ఫలితాలు మనల్ని ఎక్కడికో తీసుకువెళతాయి' అంటుంది 100-అవర్ రూల్. బ్యూటీబ్రాండ్ 'మామా ఎర్త్' కో-ఫౌండర్ గజల్ అలఘ్ 'ఎక్స్'లో షేర్ చేసిన '100-అవర్ రూల్' పోస్ట్ యువలోకంలో చక్కర్లు కొడుతుంది. కంఫర్ట్ జోన్ నుంచి బయటికి వచ్చి కొత్త స్కిల్స్ వేగంగా నేర్చుకోవడంపై దృష్టి పెట్టే '100-అవర్ రూల్'పై యువతరం ఆసక్తి ప్రదర్శిస్తోంది. ఆ రూల్‌ను ఆచరణలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది...

యూత్ పల్స్



100 అవర్ రూల్

'మనకు చాలా సహజంగా వినిపించే ప్రశ్న... అరే అది ఎలా నేర్చుకున్నావు? అని. ఇలాంటి వారికి నేను వెంటనే ఇచ్చే సమాధానం... 100-అవర్ రూల్. కొత్త స్కిల్‌ను సొంతం చేసుకోవడానికి వంద గంటలు పూర్తిగా కేటాయించండి' అంటుంది గజల్ అలఘ్.

'వ్యక్తిత్వ వికాసం, స్కిల్ డెవలప్‌మెంట్‌పై 100- అవర్ రూల్ సానుకూల ప్రభావం చూపుతుంది' అని చెబుతున్న గజల్ ఆ రూల్‌ని స్వయంగా ఆచరించి సత్ఫలితాలను సొంతం చేసుకుంది.

ఆమె దృష్టిలో 100-అవర్ రూల్ అనేది గేమ్ చేంజర్.

గజల్ పోస్ట్ చూసి 'ఐ విల్ హ్యావ్ టు ట్రై ఇట్' అన్న అనేకమందిలో బెంగళూరుకు చెందిన హాసిని ఒకరు. కర్నాటక సంగీతం నేర్చుకోవాలనేది తన చిరకాల కల. అయితే అది కలగానే మిగిలి పోతుంది. '100-అవర్ రూల్' గురించి చదివిన తరువాత, సోషల్ మీడియాలో ఈ రూల్‌పై వెల్లువెత్తుతున్న ఉత్సాహాన్ని చూస్తున్న తరువాత'100 అవర్ రూల్‌లో భాగంగా ఎలాగైనా సరే ఎంతోకొంత కర్నాటక సంగీతం నేర్చుకోవాల్సిందే' అని డిసైడైపోయింది.

'సంవత్సరంలో వంద గంటలు, రోజులో పద్దెనిమిది నిమిషాలు మనం నేర్చుకోవాలనుకుంటున్న దానిపై కేటాయిస్తే ఎంతోమందికి కంటే మెరుగ్గా ఉంటాం' అంటుంది 'ఎక్స్' యూజర్ విష్ణుప్రియా అరోర.

'100-అవర్ రూల్‌లో భాగంగా రోజులో కొంత సమయాన్ని నాకు ఇష్టమైన పెయింటింగ్‌కు కేటాయిస్తున్నాను' అంటున్నాడు భోపాల్‌లోని ఎంబీఏ స్టూడెంట్ అభయ్ కుమార్.

పెయింటింగ్, క్రియేటివ్ రైటింగ్, ఫొటోగ్రఫీ టెక్నిక్స్, కొత్తభాష నేర్చుకోవడం, ఇన్‌స్ట్రుమెంట్స్ ప్లే... మొదలైన వాటికి సంబంధించి ఈ టెక్నిక్ బాగా ఉపయోగపడుతుంది.

'బిగినర్స్‌ను 100 అవర్ రూల్ కాన్ఫిడెంట్ క్రియేటర్‌గా ట్రాన్స్‌ఫార్మ్ చేస్తుంది' అంటున్నారు నిపుణులు.

కాస్త వెనక్కి వెళితే...

రచయిత గ్లాడ్‌వెల్ 10,000-అవర్ రూల్‌ను డెవలప్ చేశాడు. తన 'అవుట్‌లియర్స్' పుస్తకంలో 10,000- అవర్ రూల్ గురించి వివరించాడు. ఈ రూల్‌కు మంచి పాపులారిటీ వచ్చింది. ఆ తరువాత '100-అవర్ రూల్' అనేది పవర్‌ఫుల్ అనే వాదన వచ్చింది. '100-అవర్' సక్సెస్‌కు ప్రధాన కారణం మనం నేర్చుకోదల్చిన స్కిల్ లేదా ఏరియాను చిన్న కంపోనెంట్స్‌గా విభజించి దానిమీద ఫోకస్ చేయడం.

10,000 అవర్ రూల్ ప్రాక్టీస్ కొంతమందికి కష్టం కావచ్చు. మొదట ఉత్సాహంతో మొదలుపెట్టినా ఆ తరువాత మధ్యలోనే జారిపోవచ్చు. 100-అవర్‌కి అలాంటి పరిమితులు ఉండకపోవడం లాంటివి పాపులారిటీకి కారణం కావచ్చు.

'నైపుణ్యాన్ని సొంతం చేసుకునే విషయంలో 100-అవర్ రూల్ వాస్తవిక మార్గంలో ప్రయాణిస్తుంది. అయితే 10,000- అవర్ అయినా 100-అవర్ రూల్‌కు అయినా కృషి, అంకిత భావం ముఖ్యం' అంటున్నారు నిపుణులు.

అవలీలగా...

వ్యక్తులు కొత్త స్కిల్స్‌ను సొంతం చేసుకోవడానికి 100-అవర్ రూల్ ఉపయోగపడుతుంది. సాధనకు సంబంధించి వారి పరిధిని మరింత విస్తరిస్తుంది. ఒకప్పుడు సాధించలేని, సాధించలేమని అపోహ పడిన వాటిని కూడా సాధించేలా చేస్తుంది. నా వ్యక్తిగత విషయానికి వస్తే ఈ రూల్‌ను అనుసరించడం ద్వారా ఉత్తమఫలితాలు అందుకున్నాను. కష్టపడి పనిచేస్తే, దేనికైనా తగినంత సమయం కేటాయిస్తే ఎలాంటి స్కిల్ అయినా అవలీలగా సొంతం అవుతుంది.

– గజల్ అలఘ్, 'మామా ఎర్త్' కో-ఫౌండర్



గెలుపు దారి

టెక్ తేజం


తేజ

ఫీల్డ్ మారడం అనేది మంచి నీళ్ల తాగినంత సులభం కాదు. కాస్త అటూ ఇటూ అయితే మూడు చెరువుల నీళ్లు తాగాల్సి ఉంటుంది. 'నేను సాధించగలను' అనే పట్టుదల ఉన్న వారికి మాత్రం ఏ ఫీల్డ్ అయినా ఒకటే. అలాంటి ప్రతిభావంతులలో తేజ ఒకరు. ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్‌గా పనిచేసిన తేజ ఐటీ రంగంలోకి అడుగుపెట్టి టెక్ లీడర్‌గా మంచి పేరు సంపాదించింది.

కర్ణాటకలోని బెల్గాంలో పెరిగిన తేజ మనకమె డాక్టర్ అయిన తండ్రి నుంచి విజ్ఞానప్రపంచానికి సంబంధించిన ఎన్నో విషయాలు తెలుసుకునేది. డిఐవై (డూ ఇట్ యువర్ సెల్ఫ్) ప్రాజెక్ట్స్ చేసేది. కర్ణాటక యూనివర్శిటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ కోర్సు చేసింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ తొలిసారిగా నాన్-మెడికల్ ఏరియాలలో మహిళల కోసం ద్వారాలు తెరుస్తున్న సమయం అది. తన సీనియర్స్ ఎయిర్ ఫోర్స్‌లో చేరిపోయారు. వారిని యూనిఫామ్‌లో చూడడం తేజాకు ఎగ్జయిటింగ్‌గా అనిపించింది. వారి స్ఫూర్తితోనే ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లోకి వచ్చింది. బెంగళూరులోని ఎయిర్ ఫోర్స్ టెక్నికల్ కాలేజీలో ప్రాథమిక శిక్షణ తరువాత మౌంట్ అబూలో పోస్టింగ్ ఇచ్చారు. మౌంట్ అబూ స్టేషన్‌లోని ఉద్యోగులలో ఇద్దరు మాత్రమే మహిళలు. అందులో తాను ఒకరు. మహిళల కోసం ప్రత్యేక వాష్ రూమ్స్ ఉండేవి కావు. ఇలాంటి సమస్యలు ఎన్ని ఉన్నా ఎప్పుడూ నిరాశపడేది కాదు తేజ.

మౌంట్ అబూ తరువాత నాసిక్, బెంగళూరులలో కూడా పనిచేసింది.

మన దేశాన్ని ఐటీ బూమ్ తాకిన సమయం అది.

ఐటీ ఫీల్డ్‌లో ఉన్న సోదరుడు తేజాతో ఆ రంగానికి సంబంధించి ఎన్నో విషయాలు పంచుకునేవాడు. దీంతో ఐటీ రంగంపై తనకు ఆసక్తి పెరిగింది. అలా ఎయిర్ ఫోర్స్‌ను వదిలి ఐటీ రంగంలోకి అడుగు పెట్టింది. టీసీఎస్(టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్)లో డెవలపర్‌గా చేరింది. ఫ్రెషర్‌గా ఐటీ రంగంలో కెరీర్ మొదలు పెట్టిన తేజ అక్కడ ఎన్నో విషయాలు నేర్చుకుంది. ఆ తరువాత విప్రో టెక్నాలజీస్‌లో పనిచేసింది. 2005లో డెల్ టెక్నాలజీలో మేనేజర్‌గా చేరింది. ఒక్కోమెట్టు ఎక్కుతూ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ (ఐటీ) స్థాయికి చేరింది.

జెండర్ స్టీరియో టైప్స్‌ను బ్రేక్ చేస్తూ డెల్ ఐటీ-ఇండియాలో కీలక స్థానంలో చేరిన తొలి మహిళగా గుర్తింపు పొందింది.

డెల్ ఫౌండేషన్‌లో సేల్స్ అండ్ మార్కెటింగ్, సప్లై చైన్, డేటా సైన్స్... మొదలైన విభాగాల్లో పట్టు సాధించింది. సీఎస్ఆర్ యాక్టివిటీస్‌పై బాగా ఆసక్తి చూపేది. 'టెక్నాలజీ సహాయంతో ఎన్నో మంచిపనులు చేయవచ్చు' అంటున్న తేజ రకరకాల స్వచ్ఛంద సంస్థలతో కలిసి ఎన్నో మంచి కార్యక్రమాలు చేసింది.

కోవిడ్ మహమ్మారి సమయంలో బుద్ధ ఫౌండేషన్‌తో కలిసి వలస కార్మికులకు పునరావాసం కల్పించింది.

'ప్రతి మహిళకు ఒక రోల్‌మోడల్, మెంటర్ ఉండాలి. అప్పుడే ఎన్నో విజయాలు సాధించగలరు' అంటున్న తేజ డెల్‌లో 'మెంటర్ సర్కిల్ కాన్సెప్ట్'ను అమలు చేసింది. ప్రతి సర్కిల్‌లో కొందరు మహిళలు ఉంటారు. వారికో మెంటర్ ఉంటారు. ఈ సర్కిల్‌లో తమ సమస్యలను చర్చించుకోవచ్చు, సలహాలు తీసుకోవచ్చు. ఒకరికొకరు సహాయంగా నిలవచ్చు.

'ఇంజినీరింగ్ కాలేజీలో క్లాసులో నలుగురు అమ్మాయిలు మాత్రమే ఉండేవాళ్లం. ఇప్పటి పరిస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మా కుటుంబంలో నేను ఫస్ట్ ఉమెన్ ఇంజనీర్‌ని. ఇప్పుడు ఎంతోమంది ఉన్నారు. ఒక ముక్కలో చెప్పాలంటే సమాజంలో చాలా మార్పు వచ్చింది. ఇది ఆహ్వానించదగిన మార్పు. నేను నేర్చుకున్న విషయాల ద్వారా ఇతరులకు ఏ రకంగా సహాయం చేయగలను అని ఎప్పటికప్పుడు ఆలోచిస్తుంటాను. టైమ్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ఎన్నో సమావేశాలు నిర్వహించాను' అంటుంది తేజ.

రజతంగా ఐశ్వర్య కాంస్యం



గత ఏడాది జరిగిన ఆసియా క్రీడల్లో 400 మీటర్ల పరుగులో భారత అథ్లెట్ ఐశ్వర్య మిశ్రా కాంస్యం సాధించింది. అయితే ఇప్పుడు ఆమె ప్రదర్శనకు రజత పతకంగా ప్రమోషన్ దక్కింది. ఈ ఈవెంట్‌లో రజతం సాధించి ఉజ్బెకిస్తాన్ అథ్లెట్ ఫరీదా సొలియెవా డోపింగ్ పరీక్షల్లో పట్టుబడింది. దాంతో అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య ఆమెపై 3 ఏళ్ల నిషేధం విధించింది. ఫలితంగా ఐశ్వర్య టైమింగ్ (53.07)ను రెండో స్థానంగా గుర్తిస్తూ ఆమె కాంస్యాన్ని రజతంగా మార్చారు.

భారత మహిళల శుభారంభం

ప్రతిష్టాత్మక బిల్లీ జీన్ కింగ్ కప్‌లో భారత మహిళల టెన్నిస్ జట్టు శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన పోరులో భారత్ 3-0 తేడాతో పసిఫిక్ ఓషియానియా జట్టును ఓడించింది. తొలి సింగిల్స్‌లో రుతుజ భోసలే 6-0, 6-0తో తరనీ కమోను చిత్తు చేయగా...రెండో సింగిల్స్‌లో అంకితా రైనా 6-1, 6-3తో సవోర్స్ బ్రిన్‌పై విజయం సాధించింది. డబుల్స్‌లో భారత జంట భమిడిపాటి శ్రీవల్లి రష్మిక - ప్రార్థనా తోంబరే 6-1, 6-1తో మెహతీయ బూసీ - రూబీ కాఫిన్ జోడిని ఓడించింది. పసిఫిక్ మహాసముద్రంలోని ఫిజీ తదితర చిన్న దేశాలు కలిపి బిల్లీ జీన్ కింగ్ కప్‌లో 'పసిఫిక్ ఓషియానియా' జట్టు పేరుతో బరిలోకి దిగుతున్నాయి.

నితీశ్ 'షో'

- వైజాగ్ కుర్రాడి మెరుపు ప్రదర్శన
- ఉత్కంఠ పోరులో సన్‌రైజర్స్ గెలుపు
- 2 పరుగులతో ఓడిన పంజాబ్


నితీశ్ కుమార్

ముల్లన్‌పూర్: ఐపీఎల్‌లో ఇప్పటి వరకు ఇంట గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇప్పుడు రచ్చ గెలిచింది. పంజాబ్ గడ్డపై ఆంధ్ర బ్యాటర్ నితీశ్ కుమార్ రెడ్డి (37 బంతుల్లో 64; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగాడు. దీంతో హైదరాబాద్ 2 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై విజయం సాధించింది. ముందుగా సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. నితీశ్‌తో పాటు అబ్దుల్ సమద్ (12 బంతుల్లో 25; 5 ఫోర్లు) ధాటిగా ఆడారు. అర్ష్‌దీప్‌కు 4 వికెట్లు దక్కాయి. అనంతరం పంజాబ్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసి ఓడింది. శశాంక్ సింగ్ (25 బంతుల్లో 46; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించగా, అశుతోష్ (15 బంతుల్లో 33 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. ఆఖరి ఓవర్లో 29 పరుగులు కావాల్సి ఉండగా బౌలర్ ఉనాద్కట్ పట్టు తప్పాడు. వైడ్లతో పాటు పేలవ బంతులు వేయడంతో ఉత్కంఠ పెరిగింది. చివరకు పంజాబ్ 3 సిక్స్‌లు సహా 26 పరుగులే రాబట్టడంతో హైదరాబాద్ ఊపిరి పీల్చుకుంది.

నితీశ్ వీరబాదుడు...

ఓపెనర్ ట్రవిస్ హెడ్ (15 బంతుల్లో 21; 4 ఫోర్లు), మార్క్‌రమ్ (0)లను ఒకే ఓవర్లో అర్ష్‌దీప్ అవుట్ చేయగా, అభిషేక్ శర్మ (16)కు సామ్ కరన్ క్లీన్ వేశాడు. 39 పరుగులకే టాప్ 3 వికెట్లను కోల్పోయింది. రాహుల్ త్రిపాఠి (11) 'ఇంపాక్ట్' చూపలేక పోయాడు. సగం (10) ఓవర్లు ముగిసే సరికి జట్టు 66/4 స్కోరు చేసింది. అయితే నాలుగో ఓవర్లోనే క్రీజులోకి వచ్చిన నితీశ్ పదో ఓవర్‌దాకా చేసిన స్కోరు 14! ఒకటే బౌండరీ కొట్టాడు. ఇలా ఆడిన విశాఖ కుర్రాడు ధనాధన్‌కు స్విచ్చాన్ చేసినట్లుగా 11వ ఓవర్ నుంచి అనూహ్యంగా దంచేశాడు. హర్‌ప్రీత్ బౌలింగ్‌లో 4, 6 బాదగా, క్లాసెన్ ఓ ఫోర్ కొట్టడంతో 15 పరుగులు వచ్చాయి. రబడ, సామ్ కరన్ ఓవర్లలో చెరో సిక్సర్‌తో దూకుడు పెంచాడు. క్లాసెన్ (9) అవుటయ్యాక సమద్ రావడంతో దూకుడు 'డబుల్' అయింది. హర్‌ప్రీత్ 15వ ఓవర్‌నూ పూర్తిగా ఎదుర్కొన్న నితీశ్ 0, 4, 6, 4, 6, 2లతో 22 పరుగులు పిండుకున్నాడు. దీంతో 32 బంతుల్లోనే అతని ఫిఫ్టీ పూర్తయ్యింది. 17వ ఓవర్ వేసిన అర్ష్‌దీప్ 3 బంతుల వ్యవధిలో సమద్, నితీశ్‌లను అవుట్ చేయడంతో రైజర్స్ డెత్ ఓవర్లలో ఆశించినన్ని పరుగుల్ని చేయలేకపోయింది.

దెబ్బకొట్టిన భువీ...

ఓపెనర్ బెయిర్‌స్టో (0)ను రెండో ఓవర్లోనే కమిన్స్ డకౌట్ చేయగా, భువనేశ్వర్ వరుస ఓవర్లలో ప్రభ్‌సిమ్రన్ (4)తో పాటు మరో శిఖర్ ధావన్ (14)ను పెవిలియన్ చేర్చాడు. దీంతో 20 పరుగులకే టాపార్డర్ కూలింది. సామ్ కరన్ (22 బంతుల్లో 29; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), సికందర్ రజా (22 బంతుల్లో 28; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కాసేపు పోరాడారు. నటరాజన్ పదో ఓవర్లో సామ్ కరన్ బౌండరీ కోసం ప్రయత్నించగా మిడాఫ్‌లో కమిన్స్ కళ్లు చెదిరే క్యాచ్‌తో అతని ఆట ముగించాడు. జట్టు స్కోరు 91 పరుగుల వద్ద రజా నిష్క్రమించడంతో సన్‌రైజర్స్ గెలుపు దాదాపుగా ఖాయమైంది. అయితే ఆఖరి ఓవర్లో ఉనాద్కట్ 3 వైడ్లు వేయడంతో 2 బంతుల్లో 10 పరుగుల సమీకరణం పంజాబ్‌కు అవకాశమిచ్చింది. అశుతోష్ మరో షాట్ ఆడగా డీప్ మిడ్ వికెట్ వద్ద రాహుల్ త్రిపాఠి క్యాచ్ జారవిడిచాడు. ఒకే పరుగు రావడంతో ఇక ఆఖరి బంతికి 9 పరుగులు అసాధ్యమవడంతో హైదరాబాద్ గెలిచింది. అయితే చివరి బంతిని శశాంక్ సిక్స్ కొట్టడంతో సన్‌రైజర్స్ 2 పరుగులతో నెగ్గింది.

సన్‌రైజర్స్ జట్టులో విజయకాంత్

శ్రీలంక యువ లెగ్‌స్పిన్నర్ విజయకాంత్ వియస్కాంత్ ఐపీఎల్ టీమ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. గాయంతో టోర్నీకి దూరమైన లంక లెగ్‌స్పిన్నర్ వనిందు హసరంగ స్థానంలో కనీస విలువ రూ. 50 లక్షలకు రైజర్స్ యాజమాన్యం విజయ్‌కాంత్‌ను ఎంచుకుంది. 22 ఏళ్ల విజయ్‌కాంత్ ఆసియా క్రీడల్లో లంక తరఫున ఒకే ఒక అంతర్జాతీయ టి20 ఆడాడు.

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (సి) ధావన్ (బి) అర్ష్‌దీప్ 21; అభిషేక్ (సి) శశాంక్ (బి) సామ్ కరన్ 16; మార్క్‌రమ్ (సి) జితేశ్ (బి) అర్ష్‌దీప్ 0; నితీశ్ కుమార్ (సి) రబడ (బి) అర్ష్‌దీప్ 64; రాహుల్ త్రిపాఠి (సి) జితేశ్ (బి) హర్షల్ 11; క్లాసెన్ (సి) సామ్ కరన్ (బి) హర్షల్ 9; సమద్ (సి) హర్షల్ (బి) అర్ష్‌దీప్ 25; షాబాజ్ నాటౌట్ 14; కమిన్స్ (బి) రబడ 3; భువనేశ్వర్ (సి) బెయిర్‌స్టో (బి) సామ్ కరన్ 6; ఉనాద్కట్ నాటౌట్ 6; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 182. వికెట్ల పతనం: 1-27, 2-27, 3-39, 4-64, 5-100, 6-150, 7-151, 8-155, 9-176. బౌలింగ్: రబడ 4-0-32-1, అర్ష్‌దీప్ 4-0-29-4, సామ్ కరన్ 4-0-41-2, హర్షల్ 4-0-30-2, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-48-0. **పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్:** ధావన్ (స్టంప్డ్) క్లాసెన్ (బి) భువనేశ్వర్ 14; బెయిర్‌స్టో (బి) కమిన్స్ 0; ప్రభ్‌సిమ్రాన్ (సి) నితీశ్ (బి) భువనేశ్వర్ 4; సామ్ కరన్ (సి) కమిన్స్ (బి) నటరాజన్ 29; సికందర్ రజా (సి) క్లాసెన్ (బి) ఉనాద్కట్ 28; శశాంక్ నాటౌట్ 46; జితేశ్ (సి) అభిషేక్ (బి) నితీశ్ 19; అశుతోష్ నాటౌట్ 33; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 180. వికెట్ల పతనం: 1-2, 2-11, 3-20, 4-58, 5-91, 6-114. బౌలింగ్: భువనేశ్వర్ 4-1-32-2, కమిన్స్ 4-0-22-1, నటరాజన్ 4-0-33-1, నితీశ్ కుమార్ 3-0-33-1, ఉనాద్కట్ 4-0-49-1, షహబాజ్ 1-0-10-0.

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ X గుజరాత్
వేదిక: జైపూర్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	4	4	0	8	1.120
కోల్‌కతా	4	3	1	6	1.528
లక్నో	4	3	1	6	0.775
చెన్నై	5	3	2	6	0.666
హైదరాబాద్	5	3	2	6	0.344
పంజాబ్	5	2	3	4	-0.196
గుజరాత్	5	2	3	4	-0.797
ముంబై	4	1	3	2	-0.704
బెంగళూరు	5	1	4	2	-0.843
ఢిల్లీ	5	1	4	2	-1.370

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

అదరగొట్టాడు

ఏడేళ్ల క్రితం...బీసీసీఐ అండర్-16 టోర్నీ విజయ్‌మర్చంట్ ట్రోఫీ..రాజ్‌కోట్‌లో నాగాలాండ్‌తో ఆంధ్ర మ్యాచ్. అద్భుత బ్యాటింగ్‌తో చెలరేగిన నితీశ్ కుమార్ రెడ్డి 345 బంతుల్లో ఏకంగా 441 పరుగుల స్కోరు సాధించి సంచలనం సృష్టించాడు. ఈ క్వాడ్రపుల్ సెంచరీ మాత్రమే కాకుండా టోర్నీ మొత్తం అదరగొట్టిన అతను 8 ఇన్నింగ్స్‌లలో 4 సెంచరీలు, 2 అర్ధసెంచరీలు సహా 176.71 సగటుతో ఏకంగా 1237 పరుగులు నమోదు చేశాడు. విజయ్‌మర్చంట్ ట్రోఫీ చరిత్రలో ఒక్క సీజన్‌లో ఎవరూ చేయని పరుగుల రికార్డు అది. ఆ ఏడాది బీసీసీఐ వార్షిక అవార్డుల్లో 'బెస్ట్ అండర్-16 క్రికెటర్'గా నిలవడంతో దేశవాళీ క్రికెట్‌లో అందరి దృష్టీ ఈ కుర్రాడిపై పడింది. ఓపెనర్‌గా కెరీర్ మొదలు పెట్టిన నితీశ్ అండర్-19 స్థాయి వినూ మన్కడ్ ట్రోఫీ, చాలెంజర్ టోర్నీ వరకు అలాగే కొనసాగించాడు. అయితే మరో వైపు మీడియం పేస్ బౌలింగ్‌పై కూడా దృష్టి పెట్టిన అతను కొత్త బంతితో బౌలింగ్ చేశాడు. దాంతో భారం ఎక్కువ కావడంతో అతని భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మిడిలార్డర్‌లోకి మార్చారు. వైజాగ్‌లో పుట్టిన నితీశ్ ఏజ్ గ్రూప్ టోర్నీల్లో సత్తా చాటిన తర్వాత 2020-21 సీజన్‌లో ఆంధ్ర తరఫున రంజీ ట్రోఫీలోకి అడుగు పెట్టి ఆల్‌రౌండర్‌గా జట్టుకు కీలకంగా మారాడు. రెండేళ్ల తర్వాత రంజీ సీజన్‌లో 25 వికెట్లు పడగొట్టిన నితీశ్ తన బౌలింగ్ పదును కూడా చూపించాడు. తాజా సీజన్ రంజీ ట్రోఫీలో రెండు సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేసిన నితీశ్ బాధిత బ్యాటర్లలో పుజారా, రహానే, శ్రేయస్ అయ్యర్ ఉన్నారు. బ్యాటింగ్‌లో చెలరేగుతూ మీడియం పేస్ బౌలింగ్ చేసే హార్దిక్ పాండ్యాను అతను అభిమానిస్తాడు. తండ్రి ముత్యాల రెడ్డి హిందుస్తాన్ జింక్ సంస్థలో ఉద్యోగిగా పని చేసేవాడు. అయితే రాజస్తాన్‌కు బదిలీ కావడంతో ఆయన ఉద్యోగంకంటే కొడుకు భవిష్యత్తే ముఖ్యమని భావిస్తూ రాజీనామా చేశారు. ఆ తర్వాత పూర్తిస్థాయిలో నితీశ్‌కు మార్గనిర్దేశం చేసి నడిపించారు. ఇప్పుడు ఐపీఎల్‌లో మెరుపు ఇన్నింగ్స్‌తో నితీశ్ అందరికీ తెలిశాడు. 2023 సీజన్‌లో సన్‌రైజర్స్ తరఫున 2 మ్యాచ్‌లు ఆడినా బ్యాటింగ్ రాకపోగా, వికెట్ కూడా దక్కలేదు. ఈ సీజన్‌లో చెన్నైతో మ్యాచ్‌లో 8 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 14 పరుగులు చేసి ట్రైలర్ చూపించిన నితీశ్ తానేంటో ఈ మ్యాచ్‌లో అసలు షో ప్రదర్శించాడు. చాలా కాలం తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో ఒక స్థానిక ఆటగాడు చెలరేగి జట్టును గెలిపించడం మరో విశేషం.

(సాక్షి క్రీడా విభాగం)

'ఓల్డ్ ఈజ్ గోల్డ్'



మోంటెకార్లో: భారత ఆటగాడు రోహన్ బోపన్న 44 ఏళ్ల వయసులో టెన్నిస్ వరల్డ్ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో ఇటీవలే నంబర్‌వన్‌కు చేరాడు. సింగిల్స్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ కూడా తాజా ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా నిలిచిన అతి పెద్ద వయస్కుడిగా (36 ఏళ్లు) గుర్తింపు తెచ్చుకున్నాడు. ఈ ఇద్దరు ఆటగాళ్ల మధ్య తమ వయసుకు సంబంధించిన ఆసక్తికర సంభాషణ జరిగింది. 'టెన్నిస్ మనకు ఎంతో నేర్పించింది. అనుభవం మంచి విజయాలు అందిస్తుంది. ఇప్పుడు మనకు కావాల్సినంత ఉంది' అని బోపన్న వ్యాఖ్యానించగా... 'అనుభవం మాత్రమే కాదు. ప్రతీ రోజు ఆట పట్ల అంకితభావం చూపడమే మనల్ని ఈ స్థానంలో నిలిపింది' అని జొకోవిచ్ బదులిచ్చాడు. ఇద్దరు నంబర్‌వన్ ఆటగాళ్లు కలిసిన అరుదైన ఘట్టం సెర్బియా, భారత టెన్నిస్‌కు సంబంధించి ప్రత్యేకమైందన్న జొకోవిచ్...త్వరలోనే భారత గడ్డపై ఆడాలని అనుకుంటున్నట్లు చెప్పాడు. ఓల్డ్ ఈజ్ గోల్డ్ అంటూ తమ సంభాషణను నమస్తేతో జొకోవిచ్ ముగించాడు.

మెయిన్ 'డ్రా'కు మాళవిక

నింగ్బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్‌లో భారత యువ షట్లర్ మాళవిక బన్సోద్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. మంగళవారం ఆమె తన రెండు క్వాలిఫయింగ్ మ్యాచ్‌లలో కూడా విజయం సాధించింది. తొలి పోరులో నూరాని అజహారా (యూఏఈ)ని 21-18, 21-10తో ఓడించిన మాళవిక తన రెండో మ్యాచ్‌లో సోఫియా జకిరోవా (ఉజ్బెకిస్తాన్)ను 21-4, 21-5తో చిత్తు చేసింది.

ఆమిర్ పునరాగమనం



లాహోర్: లెఫ్టార్మ్ పేస్ బౌలర్ మొహమ్మద్ ఆమిర్ నాలుగేళ్ల తర్వాత పాకిస్తాన్ జట్టులో మళ్లీ చోటు దక్కించుకున్నాడు. సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో జరిగే ఐదు టి20 మ్యాచ్‌ల సిరీస్ కోసం మంగళవారం పాక్ సెలెక్టర్లు జట్టును ప్రకటించారు. ఆమిర్ చివరిసారిగా 2020లో పాక్ తరఫున అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. ఏడాది క్రితం జట్టులో స్థానం కోల్పోయిన ఆల్‌రౌండర్ ఇమాద్ వసీమ్‌కు కూడా అవకాశం దక్కింది. ఈ సిరీస్‌తో బాబర్ ఆజమ్ మళ్లీ కెప్టెన్సీ పగ్గాలు చేపట్టనున్నాడు. జట్టు హెడ్ కోచ్‌గా మాజీ ప్లేయర్ అజహర్ మహమూద్‌ను ఎంపిక చేయడం విశేషం.

సినిమా

విక్టరీ వినోదం


వెంకటేశ్

'ఎఫ్ 2', 'ఎఫ్ 3' (ఈ చిత్రాల్లో వరుణ్ తేజ్ మరో హీరో) చిత్రాల తర్వాత హీరో వెంకటేశ్-దర్శకుడు అనిల్ రావిపూడిల కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుంది. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ ఈ సినిమాను నిర్మించనున్నారు. ఉగాది సందర్భంగా ఈ సినిమాను అధికారికంగా ప్రకటించి, 2025 సంక్రాంతికి విడుదల చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. ''వెంకటేశ్‌గారితో మూడోసారి, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌తో ఆరోసారి, భీమ్స్‌తో తొలిసారి.. 2025 సంక్రాంతికి 'విక్టరీ వినోదం'తో కలుద్దాం'' అని ఈ సినిమా గురించి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు దర్శకుడు అనిల్ రావిపూడి. ఓ మాజీ పోలీస్ ఆఫీసర్, అతని మాజీ ప్రేయసి, అతని భార్య... ఈ ముగ్గురి పాత్రల చుట్టూ సాగే క్రైమ్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుందని ఈ చిత్రం యూనిట్ పేర్కొంది.

వేడుకలో...


సాయికుమార్, నాని

నాని హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'సరిపోదా శనివారం'. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ప్రియాంకా మోహన్ కథానాయిక. సాయికుమార్, ఎస్‌జే సూర్య కీలక పాత్రల్లో నటిస్తున్నారు. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి నాని, సాయికుమార్ ఉన్న కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు. సూర్యగా నాని, శంకరంగా సాయికుమార్ సంప్రదాయ దుస్తుల్లో చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు. సినిమాలో ఏదైనా వేడుకకు సంబంధించిన ఫొటో అన్నట్లుగా ఈ పోస్టర్ ఉంది. ''హై బడ్జెట్‌తో రూపొందిస్తోన్న ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఆగస్టు 29న రిలీజ్ చేస్తాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, కెమెరా: మురళి జి.

రవన్న దావత్‌కి రెడీ అయిపోండ్రి


రవితేజ

హీరో రవితేజ ల్యాండ్ మార్క్ మూవీ 'ఆర్‌టీ 75' (వర్కింగ్ టైటిల్) ప్రకటన వెలువడింది. భాను భోగవరపు దర్శకత్వంలో ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించనున్నారు. ఈ చిత్రం ప్రకటించిన సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్ మీద 'రవన్న దావత్ ఇస్తుండు.. రెడీ అయిపోండ్రి' అని ఉంది. ఈ సినిమాలో లక్ష్మణ భేరి అనే పాత్రలో రవితేజ కనిపిస్తారు. ఈ పాత్ర తీరు ఎలా ఉంటుందో ఉగాది పంచాంగం రూపంలో చెప్పారు. 'ఆదాయం: చెప్పను తియ్, ఖర్చు: లెక్క జెయ్యన్, రాజ్యపూజ్యం: అన్ లిమిటెడ్, అవమానం: జీరో' అంటూ రాసుకొచ్చారు. ఈ చిత్రాన్ని వచ్చే సంక్రాంతికి రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్, కెమెరా: కార్తీక్ ఘట్టమనేని.

ఫుల్ కామెడీ


శ్రీవిష్ణు

శ్రీ విష్ణు హీరోగా జానకి రామ్ మారెళ్ల దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. ప్రముఖ రచయిత-నిర్మాత కోన వెంకట్, దర్శకుడు బాబీ కొల్లి సమర్పణలో అనూష ద్రోణవల్లి, సీతాకుమారి కొత, గోపాలం లక్ష్మీ దీపక్ నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు అనిల్ రావిపూడి కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత 'దిల్' రాజు క్లాప్ ఇచ్చారు. దర్శకుడు వీవీ వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత నవీన్ యెర్నేని, దర్శకురాలు నందినీ రెడ్డి, దర్శకుడు కిశోర్ తిరుమల స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందజేశారు. ''ఇది చాలా మంచి ప్రాజెక్ట్ అవుతుందని బలంగా నమ్ముతున్నాను'' అని శ్రీవిష్ణు అన్నారు. ''శ్రీ విష్ణుతో సినిమా చేయడం హ్యాపీగా ఉంది'' అన్నారు కోన వెంకట్. ''నా 'పవర్' సినిమా నుంచి జానకి రామ్ నా దగ్గర అసోసియేట్‌గా చేస్తున్నాడు. ఈ కథ హిలేరియస్‌గా, ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది'' అన్నారు బాబీ. ఈ సినిమాకు సంగీతం: విజయ్ బుల్గానిన్, కెమెరా: సాయి శ్రీరామ్.

వినూత్న షణ్ముఖ


ఆది, మనోజ్ నందం

ఆది సాయికుమార్, అవికా గోర్ జంటగా నటిస్తున్న చిత్రానికి 'షణ్ముఖ' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ చిత్రానికి షణ్ముగం సాప్పని దర్శకుడు. సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేశ్ యాదవ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆది సాయికుమార్ మాట్లాడుతూ- ''కంటెంట్ ఈజ్ కింగ్ అని నమ్మి చేస్తున్న ఈ చిత్రం అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''ఇప్పటికి 70 శాతం షూటింగ్ పూర్తయింది'' అన్నారు షణ్ముగం సాప్పని. ''మా సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు తులసీరామ్ సాప్పని. ''షణ్ముగంకు సినిమా మీద ఉండే ఆసక్తే రాజకీయాల్లో ఉన్న నన్ను ఈ సినిమా నిర్మించేలా చేసింది'' అన్నారు నిర్మాత, ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్. ''ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం హైలైట్‌గా ఉంటుంది'' అన్నారు నటుడు మనోజ్ నందం.

రాయలసీమ నేపథ్యంలో...


మహేశ్ విటా

హాస్య నటుడు మహేశ్ విటా హీరోగా నటిస్తున్న చిత్రం 'ఉత్తుత్త హీరోలు'. మహేశ్ విటా స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజైంది. ఈ సందర్భంగా హీరో, దర్శక-నిర్మాత మహేష్ విటా మాట్లాడుతూ- ''కామెడీ, సస్పెన్స్ ప్రధానాంశాలుగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాను. రాయలసీమ ప్రాంతంలో జరిగే ఓ ఆసక్తికరమైన ఘటన చుట్టూ సీమ భాష, యాసతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జాన్ కె. జోసఫ్, నేపథ్య సంగీతం: జీవన్ బాబు (జేవీ).

బలంగా అనుకుంటే జరుగుతుంది - విశ్వక్ సేన్


నవదీప్, విశ్వక్ సేన్

''మనం ఏదైనా బలంగా అనుకుంటే అది జరుగుతుంది. 'లవ్ మౌళి' చిత్రంలోలా నేను ఒక్కడినే ట్రిప్స్‌కి వెళ్లిపోతాను.. ముఖ్యంగా కొండ ప్రాంతాలకు. నేను ఒక ప్లేస్‌లో కూర్చుని జీవితంలో ఎలా ఎదగాలి అనుకున్నానో.. కొన్నేళ్ల తర్వాత అదే ప్రదేశంలో షూటింగ్ చేశాను. 'లవ్ మౌళి' చిత్రం నవదీప్‌కి మంచి విజయం ఇవ్వాలి'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. నవదీప్ హీరోగా, పంఖురి గిద్వాని, భావనా సాగి హీరోయిన్లుగా నటించిన చిత్రం 'లవ్ మౌళి'. అవనీంద్ర దర్శకత్వంలో సి స్పేస్, నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు విశ్వక్ సేన్. ''లవ్ మౌళి' కోసం ఏడాది పాటు గడ్డం, జుట్టుతో పాటు బాడీ పెంచాను'' అన్నారు నవదీప్. ''ఇందులో మౌళి పాత్రకి నవదీప్ సరిగ్గా సరిపోయాడు'' అన్నారు అవనీంద్ర.

కొత్తవారితో కమిటీ కుర్రోళ్లు



నటి - నిర్మాత నిహారిక కొణిదెల సమర్పణలో యదు వంశీ దర్శకత్వంలో రూపొందిన చిత్రానికి 'కమిటీ కుర్రోళ్లు' అనే టైటిల్ ఖరారైంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్ పతాకాలపై పద్మజ కొణిదెల, ఫణి, జయలక్ష్మి అడపాక నిర్మించిన ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను హీరో సాయి దుర్గా తేజ్ విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిహారిక మాట్లాడుతూ- ''మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌పై వస్తున్న తొలి చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. కొత్తవారితో సినిమా చేయడాన్ని బాధ్యతగా భావిస్తున్నాం'' అన్నారు. ''ఈ చిత్రం ద్వారా పదకొండు మంది హీరోలు, నలుగురు హీరోయిన్లని పరిచయం చేస్తున్నాం'' అన్నారు యదు వంశీ. ''మంచి కంటెంట్ ఉన్న సినిమాలను నిర్మించాలనుకుంటున్నాం'' అన్నారు ఫణి, జయలక్ష్మి.

ప్రేమించడం నేర్పిస్తుంది - విజయ్ ఆంటోని



విజయ్ ఆంటోని, మృణాళినీ రవి హీరో హీరోయిన్లుగా వినాయక్ వైద్యనాథన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'లవ్ గురు'. మీరా విజయ్ ఆంటోని సమర్పణలో విజయ్ ఆంటోని నిర్మించిన ఈ చిత్రాన్ని తెలుగులో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ ఈ 11న రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా విజయ్ ఆంటోని మాట్లాడుతూ- ''ఈ కథలో తనంటే ఇష్టం లేని అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు ఓ అబ్బాయి. పెళ్లి తర్వాత తనను అర్థం చేసుకుంటుందని భావిస్తాడు. కానీ పెళ్లి తర్వాత కూడా ఆ అబ్బాయిపై ఆ అమ్మాయికి ఇష్టం ఏర్పడదు. అప్పుడు ఆ అబ్బాయి ఏం చేస్తాడు? ఆ అమ్మాయి ప్రేమను ఎలా గెలుచుకోవాలనుకుంటాడు? అన్నదే ఈ చిత్రకథ. ఈ సినిమాలో ఓ ఎమోషనల్ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ కూడా ఉంది. మా సినిమా ప్రేక్షకులకు ప్రేమించడం ఎలాగో నేర్పిస్తుంది. 'లవ్ గురు' సినిమా కోసం మైత్రీతో అసోసియేట్ కావడం సంతోషంగా ఉంది. ఇక మా ప్రొడక్షన్‌లో మూడు సినిమాలు లైనప్‌లో ఉన్నాయి. నా దర్శకత్వంలోనే 'బిచ్చగాడు 3' ఉంటుంది. 2026 సమ్మర్ రిలీజ్ ప్లాన్ చేస్తున్నాం'' అని చెప్పుకొచ్చారు.

రహస్య నిధి కోసం...


అవినాష్

'కేజీఎఫ్' ఫేమ్ అవినాష్ ఓ లీడ్ రోల్‌లో అఘోరాగా నటిస్తున్న చిత్రం 'నాగబంధం'. 'ది సీక్రెట్ ట్రెజర్' అనేది ఉపశీర్షిక. ఆధ్యాత్మిక, సాహసోపేతమైన అంశాలతో ఈ సినిమాకు స్క్రిప్ట్ అందించి, దర్శకత్వం వహిస్తున్నారు నిర్మాత అభిషేక్ నామా. దేవాన్ష్ సమర్పణలో అభిషేక్ పిక్చర్స్, థండర్ స్టూడియోస్ పతాకాలపై మధుసూదన్ రావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. ''ఈ చిత్రంలో ఓ నిధి కోసం సాగే థ్రిల్లింగ్ అన్వేషణ ఆసక్తికరంగా ఉంటుంది. ఈ సినిమాను 2025లో తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: అభే, సహనిర్మాత: దేవ్ బాబు గండి (బుజ్జి), కెమెరా: సౌందర్ రాజన్. ఎస్.

పురాణం.. విజ్ఞానం


అరవింద్ కృష్ణ

'శుక్ర, మాటరాని మౌనమిది' చిత్రాల దర్శకుడు సుకు పూర్వజ్ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'ఎ మాస్టర్ పీస్'. అరవింద్ కృష్ణ, జ్యోతి పూర్వజ్, ఆషూ రెడ్డి లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. శ్రీకాంత్ కండ్రేగుల, మనీష్ గిలాడ, ప్రజయ్ కామత్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ''మైథాలజీ, సైన్స్ (పురాణం.. విజ్ఞానం) ఫిక్షన్ కలిసిన ఒక న్యూ కాన్సెప్ట్ మూవీ ఇది. క్లైమాక్స్ మినహా షూటింగ్ పూర్తయింది. ఈ ఏడాదే సినిమాని రిలీజ్ చేస్తాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి కెమెరా: శివరామ్ చరణ్, సంగీతం: ఆశీర్వాద్, సుమన్ జీవరతన్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	59	74,684
నిఫ్టీ ▽	24	22,643

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
● నాస్‌డాక్	16,253	▽ 1
● డోజోన్స్	38,776	▽ 116
● ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,935	▽ 9
● డాక్స్	18,078	▽ 241
● షాంఘై	3,049	△ 2
● నికాయ్	39,760	△ 445

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్లు)	71,730
బంగారం (22 క్యారెట్లు)	65,750
వెండి (కేజీ)	84.500

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		81.49	85.17
£	బ్రిటన్ పౌండ్		102.99	107.94
€	యూరో		88.25	92.74
¥	జపాన్ ఎన్ (100)		42.00	68.00
AUS	ఆస్ట్రేలియా డాలర్		52.62	57.46
S$	సింగపూర్ డాలర్		59.63	64.19
SAR	సౌదీ రియాల్		21.32	22.88
UAE D	యూఏఈ దిర్హామ్		21.80	23.58
¥	చైనా యువాన్		10.40	12.47

పసిడి.. వెండి పోటాపోటీ



- న్యూఢిల్లీలో సరికొత్త రికార్డులు
- రూ.71,840కి బంగారం అప్
- వెండి కూడా కొండపైకి...
- కేజీ రూ.84,500

న్యూఢిల్లీ: పసిడి పరుగు వరుసగా రెండవ రోజూ కొనసాగింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో సోమవారం రూ.350 పెరిగి, రూ.71,700కు చేరిన 10 గ్రాముల ధర, మంగళవారం మరో రూ.140 జతచేసుకుని రూ.71,840 రికార్డు హైకి చేరింది. ఇక వెండి ధర కూడా సరికొత్త రికార్డులు చూసింది. కేజీ ధర ఒకేరోజు రూ.500 పెరిగి రూ.84,500కు చేరింది. సోమవారం వెండి ధర మొదటిసారి రూ.84,000కు చేరిన సంగతి తెలిసిందే.

ఫ్యూచర్స్ మార్కెట్‌లో మెరుపులు...

అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్‌లో పసిడి ఔన్స్ (31.1గ్రాములు) ధర మంగళవారం జూన్ కాంట్రాక్ట్ సరికొత్త రికార్డు 2,384 డాలర్లకు ఎగసింది. ఈ వార్త రాసే రాత్రి 9 గంటల సమయంలో క్రితం ముగింపుతో పోల్చితే 16 డాలర్ల పెరుగుదలతో 2,368 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇక దేశీయ ఫ్యూచర్స్ ఎంసీఎక్స్‌లో పసిడి జూన్ కాంట్రాక్ట్ ధర క్రితం ముగింపుతో పోల్చితే రూ.523 పెరిగి రూ.71,435 రికార్డు స్థాయిల వద్ద ట్రేడవుతోంది. ఒక దశలో రూ.71,739ని సైతం తాకింది. వెండి విషయానికివ వస్తే, క్రియాశీలక మే కాంట్రాక్ట్ ధర క్రితం ముగింపుతో పోల్చితే రూ.366 ఎగసి రూ. 82,241 సరికొత్త రికార్డుల వద్ద ట్రేడవుతోంది. ఒక దశలో రూ.83,000 దాటింది.

కారణాలు ఇవీ..



అమెరికా ఫెడ్ వడ్డీరేట్లు తగ్గించవచ్చన్న అంచనాలు, ఈజీ మనీ, ద్రవ్యోల్బణం భయాలు, సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్లు, భౌగోళిక ఉద్రిక్తతలు పసిడి, వెండి పరుగునకు కారణమవుతున్నాయి. ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులకు ఈ మెటల్స్ సురక్షితమైనవిగా పరిగణిస్తున్నారు. దేశీయంగా రూపాయి బలహీన ధోరణి కూడా బులిష్ ధోరణికి దోహదపడుతోంది.

విదేశీ మార్కెట్లకు ఓలా గుడ్‌బై

న్యూఢిల్లీ: దేశీయంగా కార్యకలాపాలపై మరింతగా దృష్టి పెట్టే ఉద్దేశంతో విదేశీ మార్కెట్ల నుంచి తప్పుకోవాలని వాహన సేవల సంస్థ ఓలా నిర్ణయించుకుంది. దీని ప్రకారం న్యూజిల్యాండ్, ఆస్ట్రేలియా, బ్రిటన్‌లో కార్యకలాపాలను నిలిపివేయాలని నిర్ణయించుకున్నట్లు ఓలా మాతృ సంస్థ ఏఎన్ఐ టెక్నాలజీస్ వెల్లడించింది. భారత్‌లో విస్తరణకు గణనీయంగా అవకాశాలు ఉన్నాయని పేర్కొంది.

యాక్సిస్ బ్యాంక్‌లో బెయిన్ వాటాల విక్రయం




న్యూఢిల్లీ: యాక్సిస్ బ్యాంక్‌లో ప్రైవేట్ ఈక్విటీ సంస్థ బెయిన్ క్యాపిటల్ 1.08 శాతం వాటాలను విక్రయించింది. ఓపెన్ మార్కెట్ ద్వారా నిర్వహించిన ఈ డీల్ విలువ రూ. 3,574 కోట్లు. బీఎస్ఈ గణాంకాల ప్రకారం బెయిన్ క్యాపిటల్‌లో భాగమైన బీసీ ఏషియా ఇన్వెస్ట్‌మెంట్స్ సెవెన్, ఇంటిగ్రల్ ఇన్వెస్ట్‌మెంట్స్ సౌత్ ఏషియా ఫోర్ 3.33 కోట్ల షేర్లను సగటున షేరు ఒక్కింటికి రూ. 1,071 రేటు చొప్పున విక్రయించాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-4-2024 ఫామ్ ధర...

విశాఖ	405-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	390-00
విజయవాడ	390-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	375-00
వరంగల్	377-00
రిటైల్ ధర	4.35



- రికార్డు స్థాయిల వద్ద లాభాల స్వీకరణ
- నష్టాల్లో ముగిసిన మార్కెట్లు
- 59 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్
- నిఫ్టీ 24 పాయింట్లు క్షీణత

తొలిసారి 75,000పైకి సెన్సెక్స్

ముంబై: దేశీ స్టాక్ మార్కెట్ చరిత్రలో తొలిసారి సెన్సెక్స్ 75,000 పాయింట్ల మైలురాయిని అధిగమించింది. తొలుత ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఎగబడటంతో 382 పాయింట్లు జంప్‌చేసింది. 75,124ను దాటింది. ఆపై మిడ్‌సెషన్ నుంచీ అమ్మకాలు ఊపందుకోవడంతో లాభాలను వీడి నష్టాలలోకి ప్రవేశించింది. చివరికి 59 పాయింట్లు తక్కువగా 74,684 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 24 పాయింట్ల క్షీణతతో 22,643 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో నిఫ్టీ 102 పాయింట్లు ఎగసి 22,768 వద్ద కొత్త గరిష్టాన్ని తాకింది. తదుపరి 22,612 పాయింట్ల వద్ద కనిష్టాన్నీ చవిచూసింది. సరికొత్త రికార్డుల వద్ద ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటం మార్కెట్లను దెబ్బతీసినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.

ఆర్‌ఐఎల్ వీక్ : ఎన్ఎస్ఈలో మీడియా, పీఎస్‌యూ బ్యాంక్స్, కన్జూమర్ డ్యురబుల్స్, ఎఫ్ఎంసీజీ 1.3-0.6 శాతం మధ్య నీరసించగా.. మెటల్, రియల్టీ, ప్రయివేట్ బ్యాంక్స్ 1-0.5 శాతం మధ్య బలపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో టైటన్, హీరోమోటో, కోల్ ఇండియా, ఆర్‌ఐఎల్, ఏషియన్ పెయింట్స్, బీపీసీఎల్, ఇండస్‌ఇండ్, టాటా కన్జూమర్, శ్రీరామ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్, సిప్లా, టెక్ ఎం, విప్రో 2-1 శాతం మధ్య క్షీణించాయి. అయితే అపోలో హాస్పిటల్స్, హిందాల్కో, ఐసీఐసీఐ, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్, టాటా స్టీల్ 3-0.5 శాతం మధ్య పుంజుకున్నాయి. కాగా గతేడాది క్యూ4(జనవరి–మార్చి)లో నికర లాభం భారీగా దూసుకెళ్లి రూ. 24 కోట్లకు చేరడంతో క్యుపిడ్ షేరు 5 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకి రూ. 134 వద్ద ముగిసింది.

చిన్న షేర్లు డౌన్

- బీఎస్ఈలో మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం తగ్గింది. ట్రేడైన షేర్లలో 2,288 నష్టపోగా.. 1,554 లాభపడ్డాయి.
- నగదు విభాగంలో ఎఫ్‌పీఐలు రూ. 593 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించగా.. దేశీ ఫండ్స్ రూ. 2,257 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి.

ఘనంగా రిలయన్స్ డిజిటల్ డిస్కౌంట్ల పండుగ



హైదరాబాద్: రిలయన్స్ డిజిటల్ ఈ నెల 6వ తేదీన ప్రారంభించిన డిజిటల్ డిస్కౌంట్ డేస్ సేల్‌కు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ నెల 15వ తేదీ వరకూ ఈ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. రిలయన్స్ డిజిటల్ స్టోర్స్‌తో పాటు మై జియో స్టోర్స్‌లోనూ ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. బ్యాంకింగ్ దిగ్గజ కార్డులపై కస్టమర్లు 10 శాతం వరకూ డిస్కౌంట్, ఫ్లెక్సిబుల్ ఈఎంఐ ఆప్షన్‌లతో కన్జూమర్ డ్యూరబుల్ లోన్స్‌పై రూ.15,000 వరకూ క్యాష్ బ్యాక్ వంటి ఆఫర్లను పొందవచ్చు.

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఎండీ రాజీనామా



న్యూఢిల్లీ: ఆర్‌బీఐ ఆంక్షలతో సమస్యల్లో చిక్కుకున్న పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్) ఎండీ, సీఈవో పదవి నుంచి సురీందర్ చావ్లా తప్పుకున్నారు. వ్యక్తిగత కారణాలతో పాటు ఇతరత్రా మెరుగైన కెరియర్ అవకాశాలపై దృష్టి పెట్టేందుకు ఏప్రిల్ 8న ఆయన రాజీనామా చేసినట్లు పేటీఎం బ్రాండ్ యాజమాన్య సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ తెలిపింది. జూన్ 26 వరకు ఆయన బాధ్యతల్లో కొనసాగుతారని వివరించింది. సురీందర్ చావ్లా గతేడాది జనవరిలో పీపీబీఎల్‌లో చేరారు. నిబంధనలను పదే పదే ఉల్లంఘించినందుకు గాను దాదాపు కార్యకలాపాలన్నీ నిలిపివేయాలంటూ ఈ ఏడాది జనవరి 31న కంపెనీని ఆదేశించింది. ఇందుకు ముందుగా ఫిబ్రవరి 29ని డెడ్‌లైన్‌గా విధించగా, ఆ తర్వాత మార్చి 15 వరకు పొడిగించింది.

‘ఇన్వెస్కో’లో హిందుజా సంస్థకు వాటాలు

ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్‌కు 60%



సంతకాల కార్యక్రమంలో ఇన్వెస్కో ఆసియా పసిఫిక్ సీనియర్ ఎండీ, సీఈఓ ఆండ్రూ, ఐఐహెచ్‌ఎల్ చైర్మన్ అశోక్ హిందుజా, సీఈఓ మోసెస్ హార్డింగ్ (ఎడమ నుంచి కుడికి)

ముంబై: మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్కో అసెట్ మేనేజ్‌మెంట్ ఇండియా (ఐఏఎంఐ)లో 60 శాతం వాటాలు కొనుగోలు చేస్తున్నట్లు హిందుజా గ్రూప్ సంస్థ ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ (ఐఐహెచ్‌ఎల్) వెల్లడించింది. ఇందుకు సంబంధించి జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేసేందుకు ఐఐహెచ్‌ఎల్, ఇన్వెస్కో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించింది. దీని ద్వారా ఐఏఎంఐలో ఐఐహెచ్‌ఎల్‌కు 60 శాతం, ఇన్వెస్కోకు 40% వాటాలు ఉంటాయి. 1.6 లక్షల కోట్ల డాలర్ల విలువ చేసే అసెట్స్‌ను నిర్వహించే అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ దిగ్గజం ఇన్వెస్కోకి ఐఏఎంఐ భారత విభాగంగా ఉంది. లోటస్ ఇండియా అసెట్ మేనేజ్‌మెంట్‌ను కొనుగోలు చేయడం ద్వారా 2008 ఆఖర్లో భారత మార్కెట్లో కార్యకలాపాలు ప్రారంభించింది. 2024 మార్చి 31 నాటికి ఐఏఎంఐ ఏయూఎం (నిర్వహణలో ఉన్న ఆస్తులు) రూ. 85,393 కోట్లుగా ఉండగా, దేశవ్యాప్తంగా 40 నగరాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. సంస్థకు హైదరాబాద్‌లో ఎంటర్‌ప్రైజ్ సెంటర్ కూడా ఉంది. ఇందులో 1,700 మంది పైచిలుకు ఉద్యోగులు ఉన్నారు.

గో ఫస్ట్ దివాలా ప్రక్రియకు గడువు పెంపు

న్యూఢిల్లీ: విమానయాన సంస్థ గో ఫస్ట్ దివాలా పరిష్కార ప్రక్రియను (సీఐఆర్‌పీ) పూర్తి చేసేందుకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) గడువును జూన్ 3 నాటికి పొడిగించింది. 60 రోజుల్లోగా దీన్ని ముగించాలని ఆదేశించింది. వాస్తవానికి ఈ గడువు ఏప్రిల్ 4తో ముగిసింది. దీనికి సంబంధించిన గడువును పొడిగించడం ఇది మూడోసారి. గతేడాది మే 3 నుంచి గో ఫస్ట్ కార్యకలాపాలు నిల్చిపోయాయి. 2023 మే 10న సంస్థ దివాలా ప్రక్రియకు అనుమతించాలంటూ కంపెనీ స్వచ్ఛందంగా దాఖలు చేసిన పిటీషన్‌ను ఎన్‌సీఎల్‌టీ స్వీకరించింది.

గ్లాండ్ ఫార్మా వాటా విక్రయం

డీల్ విలువ రూ. 1,412 కోట్లు

న్యూఢిల్లీ: ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా గ్లాండ్ ఫార్మాలో రెండు సంస్థలు 4.9% వాటాను విక్రయించాయి. ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం షేరుకి రూ. 1,735-1,739 ధరల శ్రేణిలో 81.20 లక్షల షేర్లను విక్రయించాయి. తద్వారా లకుమి ట్రస్ట్, నికొమాక్ మెషీనరీ సంయుక్తంగా రూ. 1,412 కోట్లు సమకూర్చుకున్నాయి. లకుమి 61.65 లక్షల షేర్లు, నికొమాక్ 19.55 లక్షల షేర్లు(1.18 శాతం వాటా) అమ్మివేశాయి. దీంతో నికొమాక్ కంపెనీ నుంచి పూర్తిగా వైదొలగింది. ప్రస్తుతం గ్లాండ్ ఫార్మాలో చైనా ప్రమోటర్ సంస్థ ఫోజిమ్ ఫార్మా 57.86%వాటాను కలిగి ఉంది. ఎన్ఎస్ఈలో గ్లాండ్ ఫార్మా షేరు 3% తగ్గి రూ. 1,807 వద్ద ముగిసింది.

డిక్సన్ చేతికి ఇస్మార్టు ఇండియా

50.1% వాటా కొనుగోలుకి డీల్ ● ఐటెల్, ఇన్ఫినిక్స్, టెక్నో బ్రాండ్లు సొంతం



న్యూఢిల్లీ: కన్జూమర్ డ్యురబుల్స్ కాంట్రాక్ట్ తయారీ దిగ్గజం డిక్సన్ టెక్నాలజీస్ ఎలక్ట్రానిక్స్, మొబైల్స్ తయారీ కంపెనీ ఇస్మార్టు ఇండియాను సొంతం చేసుకోనుంది. తొలి దశలో భాగంగా నగదు రూపేణా 50.1 శాతం వాటా కొనుగోలుకి షేరు కొనుగోలు ఒప్పందం(ఎస్‌పీఏ) కుదుర్చుకున్నట్లు డిక్సన్ టెక్ వెల్లడించింది. ఇందుకు ఇస్మార్టు సింగపూర్, ట్రాన్సిషన్ టెక్నాలజీ, 5ఏ అడ్వయి జర్స్ ఎల్ఎల్‌పీతో ఎస్‌పీఏపై సంతకాలు చేసినట్లు పేర్కొంది. 90 రోజుల్లోగా సొంతం చేసుకోనున్న ఈ వాటా కోసం రూ. 238 కోట్లకుపైగా వెచ్చించనున్నట్లు తెలియజేసింది. తదుపరి రెండో దశలో భాగంగా 2026-27కల్లా 1.6-5.9 శాతం మధ్య అదనపు వాటాను కొనుగోలు చేసేందుకు హక్కులను పొందనున్నట్లు వెల్లడించింది. వెరసి ఇస్మార్టు ఇండియాలో ఇస్మార్టు సింగపూర్ 42.75-47.05 శాతం మధ్య వాటాను మిగిల్చుకోనుంది. కాగా.. ఈ డీల్‌కు కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) అనుమతి పొందవలసి ఉంది.

జాబ్ పాయింట్

డీఎస్ఎస్ఎస్‌బీ, ఢిల్లీలో 414 గ్రూప్-3, గ్రూప్-4 పోస్టులు

ఢిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డ్ (డీఎస్ఎస్ఎస్‌బీ).. వివిధ శాఖలు, విభాగాలు, స్థానిక సంస్థల్లో గ్రూప్-3, గ్రూప్-4 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 414

» **పోస్టుల వివరాలు:** డ్రైవర్(డ్రగ్స్ కంట్రోల్)- 01, స్టాఫ్ కార్ డ్రైవర్(లా, జస్టిస్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్)-01, స్టాఫ్ కార్ డ్రైవర్ (లోకాయుక్త)-01, స్టాఫ్ కార్ డ్రైవర్ (డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్)-03, స్టాఫ్ కార్ డ్రైవర్(జనరల్ అడ్మినిస్ట్రేషన్)-12, డ్రైవర్(ఎల్ఎంవీ)-01, స్టాఫ్ కార్ డ్రైవర్(ఢిల్లీ జైల్స్)-11, ల్యాబ్ టెక్నీషియన్(గ్రూప్-3)-38, ల్యాబ్ టెక్నీషియన్ (గ్రూప్-4)-06, ల్యాబ్ టెక్నీషియన్-10, ల్యాబొరేటరీ టెక్నీషియన్-01, ఫార్మసిస్ట్(డిస్పెన్సర్)-110, ఫార్మసిస్ట్ (అల్లోపతి) -18, ఆక్సిలరీ నర్స్/మిడ్ వైఫ్(మున్సిపల్ కార్పొరేషన్)-144, ఆక్సిలరీ నర్స్/మిడ్ వైఫ్(మున్సిపల్ కౌన్సిల్)-08, డ్రాఫ్ట్స్‌మన్ గ్రేడ్3 (సివిల్)-10, స్టోర్ కీపర్-01, స్టోర్ సూపర్‌వైజర్-01, ఫార్మసిస్ట్(అగ్రి మార్కెటింగ్)-02, జూనియర్ ఫార్మసిస్ట్-03, అసిస్టెంట్ శానిటరీ ఇన్‌స్పెక్టర్-32.

» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 10+2, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. పని అనుభవం ఉండాలి.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.04.2024.

» **వెబ్‌సైట్:** https://dsssb.delhi.gov.in/

అలిమ్‌కో, కాన్పూర్‌లో 142 పోస్టులు

కాన్పూర్‌లోని ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎల్ఐఎంసీవో).. కాంట్రాక్ట్ ప్రాతిపదికన దేశ వ్యాప్తంగా ఉన్న అలిమ్‌కో కేంద్రాల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 142

» పోస్టుల వివరాలు: సీనియర్ కన్సల్టెంట్-01, మేనేజర్-01, డిప్యూటీ మేనేజర్-01, అసిస్టెంట్ మేనేజర్-04, జూనియర్ మేనేజర్-17, అడియాలజిస్ట్-50, ప్రోస్థెటిక్స్ అండ్ ఆర్థోటిక్స్-47, స్పెషల్ ఎడ్యుకేటర్- 05, క్లినికల్ సైకాలజిస్ట్-05, ఆప్టోమెట్రిస్ట్- 05, సీఎస్ఆర్ కన్సల్టెంట్-01, క్యూసీ అసిస్టెంట్-04, ఫైనాన్స్ అసిస్టెంట్-01.

» **అర్హత:** పోస్టును అనుసరించి డిగ్రీ, పీజీ, బీఈడీ/ఎంఈడీ, ఎంఫిల్, డిప్లొమా, సర్టిఫికేట్ కోర్సు, సీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

» **వయసు:** ఆడియాలజిస్ట్, ప్రోస్థెటిక్స్ అండ్ ఆర్థోటిక్స్, స్పెషల్ ఎడ్యుకేటర్, క్లినికల్ సైకాలజిస్ట్, ఆప్టోమెట్రిస్ట్, సీఎస్ఆర్ కన్సల్టెంట్ పోస్టులకు 40 ఏళ్లు, క్యూసీ అసిస్టెంట్, ఫైనాన్స్ అసిస్టెంట్, క్యూసీ అసిస్టెంట్, జూనియర్ మేనేజర్ పోస్టులకు 45 ఏళ్లు, మేనేజర్, డిప్యూటీ మేనేజర్ పోస్టులకు 50 ఏళ్లు, సీనియర్ కన్సల్టెంట్‌కు 62 ఏళ్లు మించకూడదు.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.04.2024.

» **వెబ్‌సైట్:** https://alimco.in/

నైపర్ మొహాలీలో టీచింగ్ పోస్టులు

పంజాబ్ మొహాలీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్).. తాత్కాలిక ప్రాతిపదిక టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 32

» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్ 13 పోస్టులు , అసోసియేట్ ప్రొఫెసర్ 12 పోస్టులు , అసిస్టెంట్ ప్రొఫెసర్ -7 పోస్టులు.

» **విభాగాలు:** ఫార్మకో ఇన్ఫర్మేటిక్స్, నేచురల్ ప్రొడక్ట్స్, ఫార్మస్యూటికల్ అనాలసిస్, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, ఫార్మాస్యూటిక్స్, ఫార్మసీ ప్రాక్టీస్, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ-ఫార్ములేషన్స్, బయోటెక్నాలజీ, మెడికల్ డివైసెస్, మెడిసినల్ కెమిస్ట్రీ, క్లినికల్ రీసెర్చ్.

» **అర్హత:** పీహెచ్‌డీతోపాటు బోధన/రీసెర్చ్/ఇండస్ట్రియల్ అనుభవం ఉండాలి.

» **వయసు:** గరిష్ట వయో పరిమితి 50 ఏళ్లకు మించరాదు.

» **వేతనం:** ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,59,100–రూ.2,20,200; అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,39,600–రూ.2,11,300; అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.రూ.1,01,500–రూ.1,67,400.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.

» **దరఖాస్తు తేదీ:** 06.05.2024

» **వెబ్‌సైట్:** https://niper.gov.in/

నాణ్యమైన విద్యకు కేరాఫ్.. కేవీలు!

దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాలు.. ఒకటో తరగతి నుంచే క్రియేటివ్ లెర్నింగ్‌కు ప్రాధాన్యమిస్తూ విద్యార్థులకు బోధన సాగిస్తున్నాయి. సీబీఎస్ఈ కరిక్యులం, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్, లెర్నింగ్ బై డూయింగ్‌ల ద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నాయి. ఇలాంటి వినూత్న బోధన అందిస్తున్న కేంద్రీయ విద్యాలయాల్లో.. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. కేవీల ప్రత్యేకత, అడ్మిషన్ విధానం, అర్హతలు తదితర వివరాలు..

» 2024కు కేవీల్లో ప్రవేశాలకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

» 9వ తరగతి మినహా అన్ని తరగతుల్లో నేరుగా ప్రవేశం

» 9వ తరగతి ప్రవేశాలకు పరీక్ష నిర్వహణ

» చదువుతోపాటు ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్



కేవీల్లో ప్రవేశాలు

కేంద్రీయ విద్యాలయాలను ఆరు దశాబ్దాల క్రితం కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రారంభంలో రక్షణ శాఖ ఉద్యోగుల పిల్లల కోసం సెంట్రల్ స్కూల్స్ పేరుతో వీటిని నెలకొల్పారు. ఆ తర్వాత సాధారణ పౌరుల పిల్లలకు కూడా ప్రవేశం కల్పించేలా నిబంధనలు మార్చారు. దేశ వ్యాప్తంగా నెలకొల్పిన కేవీలను పర్యవేక్షించేందుకు కేంద్రీకృత విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇందుకోసం కేంద్రీయ విద్యాలయ సంఘటన్ అనే ప్రత్యేక పర్యవేక్షణ సంస్థను ఏర్పాటు చేశారు.

లెర్నింగ్ బై డూయింగ్

కేంద్రీయ విద్యాలయాల్లో ప్రస్తుతం ఒకటో తరగతి నుంచి +2(సీబీఎస్ఈ) వరకు బోధన అందిస్తున్నారు. పూర్తిగా ఇంగ్లిష్ మీడియంలో.. యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌కు ప్రాధాన్యం ఇస్తూ బోధన సాగుతోంది. యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ కారణంగా విద్యార్థులు ఒకటో తరగతి నుంచే ఆయా అంశాలపై ఆసక్తిని పెంచుకునే అవకాశం ఉంటుంది. ఫలితంగా పాఠ్యాంశాలపై పట్టు సాధించేందుకు ఆస్కారం ఏర్పడుతుంది.

ఒకటో తరగతి..లాటరీ విధానం

కేంద్రీయ విద్యాలయాల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు లాటరీ విధానంలో విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్ విధానంలోనే దరఖాస్తులను స్వీకరిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోర్టల్ ను అందుబాటులోకి తెచ్చారు. ఈ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా గరిష్ఠంగా మూడు కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా లాటరీ విధానంలో సంబంధిత కేంద్రీయ విద్యాలయాలు విద్యార్థులను ఎంపిక చేస్తాయి.

తొమ్మిదో తరగతికి.. ప్రవేశ పరీక్ష

ఎనిమిదో తరగతి వరకు ఎలాంటి ప్రవేశ పరీక్షలు లేకుండా విద్యార్థుల మెరిట్, అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నారు. కాని తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి మాత్రం అడ్మిషన్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. మూడు గంటల వ్యవధిలో వంద మార్కులకు ఈ ప్రవేశ పరీక్ష ఉంటుంది. హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, సోషల్ సైన్స్, సైన్స్‌లలో ఒక్కో సబ్జెక్ట్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. ఇందులో 33 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఆ తర్వాత సంబంధిత కేంద్రీయ విద్యాలయ అధికారులు మెరిట్ జాబితా రూపొందించి.. కేటగిరీల వారీగా ప్రాధాన్యత క్రమంలో ప్రవేశాలు కల్పిస్తారు.

11, 12 నేరుగా ప్రవేశం

11వ తరగతి (సీబీఎస్ఈ +1), 12వ తరగతి (సీబీఎస్ఈ +2)లలో అందుబాటులో ఉన్న సీట్లకు నేరుగా ప్రవేశం కల్పిస్తారు. ఎలాంటి పరీక్ష ఉండదు. అదే విధంగా ఎలాంటి వయో పరిమితి నిబంధన కూడా లేదు. పదో తరగతి ఉత్తీర్ణులైన సంవత్సరంలోనే 11వ తరగతికి దరఖాస్తు చేసుకోవాలి. 11వ తరగతిలో బ్రేక్ లేని వారికి 12వ తరగతిలో ప్రవేశాలు కల్పిస్తారు.

ప్రవేశాల్లో.. ప్రాధాన్యతలు

- కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు సంబంధించి.. విద్యార్థుల తల్లిదండ్రుల వృత్తికి అనుగుణంగా ప్రాధాన్యతనిస్తారు. అయిదు కేటగిరీలు గా వీటిని పరిగణిస్తారు.
- బదిలీయైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, సాధారణ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, మాజీ సైనికోద్యోగుల పిల్లలు.
- కేంద్ర ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి సంస్థలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ ఆఫ్ ది ఇండియన్ గవర్నమెంట్‌కు సంబంధించి బదిలీయైన, సాధారణ ఉద్యోగుల పిల్లలు.
- బదిలీయైన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, సాధారణ ఉద్యోగుల పిల్లలు.
- రాష్ట్ర ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి సంస్థలు, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్, రాష్ట్ర ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్‌కు సంబంధించి బదిలీయైన, సాధారణ ఉద్యోగుల పిల్లలు.
- పై కేటగిరీలకు చెందని, ఇతర వర్గాలకు చెందిన పిల్లలు.

ప్రాధాన్యత విధానం

ప్రవేశాల ఖరారు, ఎంపికలో ప్రాధాన్యత విధానాన్ని అమలు చేస్తున్నారు. తల్లిదండ్రులకు ఒకే ఆడపిల్లగా ఉన్న విద్యార్థినికి, రాష్ట్ర ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్‌లు /సీబీఎస్ఈలతోపాటు జాతీయ/ రాష్ట్ర స్థాయి క్రీడల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుంది. స్పెషల్ ఆర్ట్స్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో గుర్తింపు పొందిన విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలకు ప్రాధాన్యం ఉంటుంది. అదే విధంగా..పరమ్ వీర్ చక్ర, మహావీర్ చక్ర తదితర మెడల్స్ పొందిన ఉద్యోగుల పిల్లలకు, పోలీస్ మెడల్స్ పొందిన ఉద్యోగుల పిల్లలకు ప్రాధాన్యం ఇస్తారు.

వయో పరిమితి ఇలా

- కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్దిష్ట వయో పరిమితులను నిర్దేశించారు. వీటిని నూతన విద్యా విధానానికి అనుగుణంగా నిర్ధారించారు. అవి..
- **ఒకటో తరగతి:** 6-8 ఏళ్లు ◆ **రెండో తరగతి:** 7-9 ఏళ్లు ◆ **మూడో తరగతి:** 8-10 ఏళ్లు ◆ **నాలుగో తరగతి:** 8-10 ఏళ్లు ◆ **ఐదో తరగతి:** 9-11 ఏళ్లు ◆ **ఆరో తరగతి:** 10-12 ఏళ్లు ◆ **ఏడో తరగతి:** 11-13 ఏళ్లు ◆ **ఎనిమిదో తరగతి:** 12-14 ఏళ్లు ◆ **తొమ్మిదో తరగతి:** 13-15 ఏళ్లు ◆ **పదో తరగతి:** 14-16 ఏళ్లు ఉండాలి.
- ఎన్ఈపీ మార్గదర్శకాలను అనుసరించి 3, 4 తరగతులకు వయో పరిమితిని ఒకే విధంగా (8-10 ఏళ్లు)గా పేర్కొన్నారు. విద్యార్థులు 2024, మార్చి 31వ తేదీ నాటికి ఈ వయో శ్రేణుల మధ్యలో ఉండాలి.

బోధన వినూత్నం

కేవీల్లో వినూత్న విద్యా విధానం అమలవుతోంది. ముఖ్యంగా కొత్తగా చేరే పిల్లలు స్కూల్ వాతావరణానికి అలవాటుపడేలా చేసేందుకు ఆరు వారాల వ్యవధితో ‘స్కూల్ రెడీనెస్ ప్రోగ్రామ్’ను రూపొందించాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తయిన అనంతరం టీచర్లు విద్యార్థుల్లో పలు దృక్పథాల్లో ఆశించిన ఫలితాలు వచ్చాయా లేదా అనే విషయాలను పరీక్షిస్తారు. పరిసరాలను అర్థం చేసుకోవడం; ఆత్మవిశ్వాసం, పరిశీలన సామర్థ్యం, పరస్పర సంబంధాలు, వర్గీకరణ , ప్యాట్రన్‌లను అర్థం చేసుకొని అనుకరించగలగడం, భావ వ్యక్తీకరణ, అవగాహన, క్రియేటివ్ స్కిల్స్ పొందేలా బోధన ఉంటుంది.

ముఖ్య సమాచారం:

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

» **ఒకటో తరగతి ప్రవేశ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఏప్రిల్ 15

» **2వ తరగతి నుంచి(11వ తరగతి) ఆఫ్‌లైన్ దరఖాస్తు తేదీలు:** ఏప్రిల్ 1 -10

» **11వ తరగతి ప్రవేశాలకు చివరి తేదీ:** కేవీల్లో చదువుతున్న విద్యార్థులు ఎస్ఎస్‌సీ ఫలితాలు వచ్చిన పది రోజుల్లోగా, కేవీల్లో చదవని విద్యార్థులు సీబీఎస్ఈ ఫలితాలు వచ్చిన 30 రోజుల్లోగా ఆన్‌లైన్ అడ్మిషన్‌ను ఖరారు చేసుకోవాలి.

» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** kvsangathan.nic.in/admission/

ఫీజులు నామమాత్రం

కేంద్రీయ విద్యాలయాల్లో ఫీజులు నామ మాత్రమని చెప్పొచ్చు. అడ్మిషన్ ఫీజు రూ.25. విద్యాలయ వికాస నిధి(రూ.500), ట్యూషన్ ఫీజు, కంప్యూటర్ ఎడ్యుకేషన్ తదితర ఫీజులు ఉంటాయి. ఒకటి నుంచి అయిదో తరగతి విద్యార్థులకు అన్ని ఫీజులు కలిపి నెలకు రూ.500-600, ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.1000 లోపు అవుతుంది. బాలికలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేంద్రీయ విద్యాలయ ఉద్యోగుల పిల్లలకు ట్యూషన్ ఫీజు మినహాయింపు ఉంటుంది.


చల్లటి కబురు చెప్పిన ఐఎండీ

- రేపటి నుంచి తేలికపాటి వర్షాలు
- తగ్గుముఖం పట్టిన ఉష్ణోగ్రతలు



సాక్షి, న్యూఢిల్లీ/విశాఖపట్నం: ద్రోణి ప్రభావంతో మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ముందుగా ప్రకటించింది. ఈ ద్రోణి ఉత్తర కోస్తా నుంచి దక్షిణ తమిళనాడు వరకు రాయలసీమ మీదుగా పయనించడం వల్ల వానలకు ఆస్కారం ఉంటుందని అంచనా వేసింది. అయితే.. ఈ ద్రోణి ఉత్తర గుజరాత్ నుంచి తమిళనాడు వరకు, మధ్య మహారాష్ట్ర, అంతర్గత కర్ణాటక వరకు ఉన్న ఉపరితల ఆవర్తనం వరకు కొనసాగుతోంది. ఫలితంగా రాష్ట్రంలో వర్షాలు కురవడానికి మరో రెండు రోజుల సమయం పట్టనుంది. తాజా పరిణామాలతో కోస్తాంధ్ర, రాయలసీమల్లో గురువారం నుంచి అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ మంగళవారం తెలిపింది. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు సంభవిస్తాయని పేర్కొంది. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఉరుములతో కూడిన వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నరేష్‌కుమార్ చెప్పారు. రెండు, మూడు రోజుల్లో ఏపీలో చిరుజల్లులతో కూడిన వర్షపాతం వల్ల చల్లటి వాతావరణం రాబోతోందని వివరించారు.

తగ్గిన ఉష్ణోగ్రతలు



కాగా.. కొద్ది రోజులుగా నిప్పుల కుంపటిని తలపిస్తున్న గరిష్ట ఉష్ణోగ్రతలు మంగళవారం కాస్త తగ్గుముఖం పట్టాయి. కొన్నాళ్ల నుంచి రాష్ట్రంలో పలుచోట్ల 40 నుంచి 46 డిగ్రీలు (సాధారణం కంటే 4–6 డిగ్రీలు అధికంగా) ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఫలితంగా అనేక ప్రాంతాల్లో వడగాడ్పులు, కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తూ జనాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. మంగళవారం ఉష్ణోగ్రతలు పలుచోట్ల 2నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదవడంతో వడగాడ్పుల ప్రభావం కాస్త తగ్గింది. దీంతో మంగళవారం 9 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 53 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. బుధవారం 11 మండలాల్లో తీవ్ర, 134 మండలాల్లో వడగాడ్పులు, గురువారం 16 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 92 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

ఇక విశాఖలోనే మెడికల్ ఎక్విప్‌మెంట్ అక్రిడిటేషన్



ఏపీ మెడ్‌టెక్ జోన్

సాక్షి, విశాఖపట్నం: మెడికల్ ఎక్విప్‌మెంట్ (వైద్య ఉపకరణాల) తయారీలో దిక్సూచిగా మారిన ఏపీ మెడ్‌టెక్ జోన్ సరికొత్త చరిత్ర సృష్టించింది. యునైటెడ్ అక్రిడిటేషన్ ఫౌండేషన్ నుంచి అక్రిడిటేషన్ సాధించిన దేశంలోని మొదటిసంస్థగా ఏపీ మెడ్‌టెక్ జోన్ అవతరించింది. వైద్య పరికరాలు తయారు చేసే సంస్థలకు సర్టిఫికెట్ అందించే ప్రొవైడర్‌గా ఇందులోని కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ టెక్నాలజీ మారింది. మెడికల్ ఎక్విప్‌మెంట్ తయారు చేసే సంస్థలకు ఇక్కడి నుంచే అక్రిడిటేషన్ మంజూరు చేస్తారు. 2028 జనవరి వరకూ మెడ్‌టెక్ జోన్ ఈ అవకాశం దక్కించుకుంది. ఈజ్ ఆఫ్ డూయింగ్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఎకో సిస్టమ్ నిర్మించనున్నామని మెడ్‌టెక్ జోన్ ప్రతినిధులు తెలిపారు.

ముగిసిన యాటింగ్ ట్రైనింగ్ క్యాంప్

- పది రాష్ట్రాలకు చెందిన 40 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరు
- విపత్తుల సమయంలో సేవలందించేలా సన్నద్ధం



శిక్షణార్థులకు మెలకువలు నేర్పిస్తున్న కమాండర్ హ్యాపీ మోహన్, ఎయిర్ కమాండర్‌వీఎం రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం విశాఖపట్నంలో తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి యాటింగ్ ట్రెనింగ్ క్యాంప్ మంగళవారం ముగిసింది. ఈ నెల 2 నుంచి 9వ తేదీ వరకు ఎన్‌సీసీ, నేవల్ మెడికల్ యూనిట్ ఆధ్వర్యంలో వాటర్‌మెన్ ట్రెనింగ్ సెంటర్‌లో మొదటి విడత శిక్షణ క్యాంప్ నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌సీసీ డీడీజీ ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి, ఐఎన్ఎస్ సర్కార్ కమాండింగ్ ఆఫీసర్ కమొడర్ హ్యాపీ మోహన్ హాజరయ్యారు. సెయిలింగ్ ఎంటర్ ప్రైజ్ క్లాస్ డింగ్, రోప్‌వర్క్, బోట్ రిగ్గింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎన్‌సీసీ క్యాడెట్లు యాటింగ్ శిక్షణతో నైపుణ్యాలను మెరుగు పరచుకొని విపత్తుల సమయంలో సేవలందించేందుకు సన్నద్ధంగా ఉన్నారని కమాండర్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా..శిక్షణ తీసుకున్న యువ క్యాడెట్స్ జాతీయ, అంతర్జాతీయ సెయిలింగ్ పోటీలో పాల్గొనే అవకాశం ఉందని కమొడర్ మోహన్ చెప్పారు. ఈ క్యాంప్‌లో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, సిక్కిం, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు చెందిన 40 నేవల్ వింగ్స్ నుంచి ఎన్‌సీసీ క్యాడెట్స్ శిక్షణ తీసుకున్నారు. వీరిలో 14 మంది బాలికలు ఉన్నారు. శిక్షణలో ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

మూడు నెలల కిందటి మాట. ఎనిమిదేళ్లొచ్చినా మాటలు రాని రూపను చూసి తల్లిదండ్రులు కంట తడి పెట్టని రోజు లేదు. తమ బిడ్డకు ఇక మాటలు రావేమోనని కలత చెందిన ఆ తల్లిదండ్రులు ఇప్పుడు తమను అమ్మానాన్న అని చక్కగా పిలుస్తుంటే.. ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం సాయంతో రూపకు చేయించిన కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీ ఆ పాప నోట మాటను పలికించింది. విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం గందవరం గ్రామానికి చెందిన రమణ, లక్ష్మి తనయ రూపకు మూడు నెలల కిందటి వరకు రూపకు ఎవరు పిలిచినా వినిపించేది కాదు. బదులూ ఇవ్వగలిగేది కాదు. ఏళ్లు గడిచినా మాటలు రాకపోయేసరికి ఆ తల్లిదండ్రులు గత ఏడాది డిసెంబర్‌లో విజయనగరం డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్ (డీఈఐసీ)కి తీసుకునివెళ్లారు. అక్కడి ప్రభుత్వ వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించి కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీ చేస్తే తప్ప రూపకు మాటలు రావని నిర్ధారించారు. రూ.లక్షల్లో ఖర్చయ్యే సర్జరీ చేయించడం కూలి పనులు చేసుకునే ఈ నిరుపేద జంట స్తోమతకు మించిన వ్యవహారం. ఈ క్రమంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం అండగా నిలిచింది. పథకం కింద సీఎం జగన్ ప్రభుత్వం ఉచితంగా సర్జరీ చేయించింది. 'ఆరోగ్యశ్రీ పథకం లేకుంటే మా బిడ్డకు సర్జరీ జరిగేది కాదు. అందరి పిల్లల్లా నా కూతురు మాట్లాడలేదేమోనని బాధపడని రోజంటూ లేదు. మా గోడు విని మా బిడ్డకు మాటలు వచ్చేలా చేశారు. ఏమిచ్చి సీఎం జగన్ రుణం తీర్చుకోగలం?' అని రూప తల్లి లక్ష్మి భావోద్వేగానికి గురవుతోంది.



పేదలంతా.. ఆరోగ్యశ్రీమంతులే

- వినికిడి లోపమున్న చిన్నారులకు వరంగా ఆరోగ్యశ్రీ
- పూర్తి ఉచితంగా కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీలు
- 2019 నుంచి ఇప్పటికి 650 మంది చిన్నారులకు సర్జరీలు
- ఈ ప్రొసీజర్‌కు రూ. 12 లక్షల చొప్పున ఖర్చు చేస్తున్న ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఆరోగ్యశ్రీ పథకమే తమ అయిదేళ్ల పాపకూ పునర్జన్మను ఇచ్చిందని కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం కుందనగుర్తి గ్రామానికి చెందిన దేవర్ధన్ సంబరపడుతున్నాడు. ఇతనో భవన నిర్మాణ కార్మికుడు. భార్య కవిత ఇంటి పట్టునే ఉంటుంది. వీరికి ఇద్దరు పిల్లలు. మొదటి పాపకు వినికిడి లోపంతోపాటు మాట్లాడలేకపోయేది. వైద్యులను సంప్రదించగా పుట్టుకతో వినికిడి లోపం ఉన్నట్టు నిర్ధారించారు. కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీ చేస్తే వినికిడి శక్తి వస్తుందన్నారు. ఇందుకు రూ.లక్షల్లో ఖర్చవుతుందని చెప్పారు. కూలికి వెళ్తే తప్ప పూటగడవని పరిస్థితి దేవర్ధన్‌ది. ఈ తరుణంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ఆదుకుంది. ఈ పథకం కింద తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రిలో ఈ ఏడాది జనవరిలో ఉచితంగా పాపకు కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీ చేశారు. సర్జరీ అనంతరం స్పీచ్ థెరపీ ఇచ్చారు. ఇప్పుడు తల్లిదండ్రులు పిలిస్తే పలుకుతోంది. తన భావాలను మాటలతో పలుకుతోంది. ఈ అద్భుతాన్ని చూసిన తల్లిదండ్రుల సంతోషం అంతా ఇంతా కాదు. 'ప్రస్తుతం మా పాపకు ఐదేళ్లు. కొద్దికాలం నుంచే మమ్మల్ని గుర్తించి, అమ్మ, నాన్న అని పిలుస్తోంది. చాలా సంతోషంగా ఉంది. బిడ్డకు సర్జరీ చేయించేంత ఆర్థిక స్తోమత లేని మాకు సీఎం వైఎస్ జగన్ అండగా నిలిచారు. బిడ్డకు మేం జన్మనిస్తే.. మాటలు వచ్చేలా చేసి ఆరోగ్యశ్రీ పునర్జన్మను ప్రసాదించింది' అని దేవర్ధన్ అంటున్నాడు.

ఇలా ఎందరో..

రూప, చరితశ్రీ తరహాలోనే వినికిడి లోపంతో పుట్టి జీవితమే నిశ్శబ్దంగా మారిన చిన్నారుల జీవితాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వెలుగులు నింపారు. రూ.లక్షల్లో ఖర్చయ్యే కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీలు చేయించే స్తోమత లేని తల్లిదండ్రుల గోడును సీఎం వైఎస్ జగన్ విన్నారు. నేనున్నానంటూ అండగా నిలిచి ఉచితంగా సర్జరీలు చేయించారు.

650 మంది చిన్నారులకు పునర్జన్మ

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేశారు. 1,059 ప్రొసీజర్‌లు ఉండగా, వాటిని 3,257కు పెంచారు. ఫలితంగా రూ.12 లక్షల అత్యంత ఖరీదైన బైలాటెరల్ కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీ ఆరోగ్యశ్రీ పథకం పరిధిలోకి వచ్చింది. దీంతో 2019 నుంచి 650 మంది వినికిడి లోపమున్న పిల్లలకు ప్రభుత్వం కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీలు నిర్వహించింది. ఇందుకు రూ.34.45 కోట్లు ఖర్చు చేశారు.

ఐదేళ్లలో నిర్వహించిన కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీలు ఇలా

సంవత్సరం	చేసిన సర్జరీలు	నిధులు (రూ. కోట్లలో)
2019–20	123	6.56
2020–21	47	3.26
2021–22	159	11.20
2022–23	170	11.60
2023–24	151	1.83
మొత్తం	650	34.45

గ్రామ స్థాయిలో స్క్రీనింగ్

పిల్లల్లో పుట్టుకతో వచ్చిన లోపాల నివారణపై సీఎం జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఫ్యామిలీ డాక్టర్ విధానం, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాల ద్వారా గ్రామ స్థాయిలో వైద్యులు స్క్రీనింగ్ నిర్వహించి వివిధ లోపాలున్న పిల్లలను గుర్తించి వారిని ఆస్పత్రుల్లో వైద్య సేవలకు మ్యాప్ చేశారు. గ్రామ స్థాయిలో 322 మంది వినికిడి లోపం ఉన్న చిన్నారులను డీఈఐసీ సెంటర్‌ల ద్వారా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు తరలించి ఉచితంగా కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీలు చేయించారు.

నా కోరిక నెరవేరింది



మా పాపకు ప్రస్తుతం ఐదేళ్లు. నా భర్త ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంటారు. పాపకు వినికిడి లోపముంది. ఆపరేషన్ చేయాలని చెప్పినప్పుడు అంత డబ్బు సమకూర్చుకోవడం మా వల్ల కాదని ఆందోళనకు గురయ్యాం. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా ఆదుకుంది. పెరిగి పెద్దయ్యాక ఎవరి మీదా ఆధారపడకుండా నా బిడ్డ స్వతంత్రంగా బతికితే చాలని అనుకునే దాన్ని. వినికిడి లోపం ఉండటంతో జీవితాంతం తాను ఎవరో ఒకరి మీద ఆధారపడాల్సి ఉంటుందేమోనని కలత చెందాను. ప్రభుత్వం నా బిడ్డకు ఆపరేషన్ నిర్వహించి తన భవిష్యత్తుకు భరోసానిచ్చింది. నా కోరిక నెరవేరింది. – వంగపండు లక్ష్మి, సిగబడి, పార్వతీపురం మన్యం జిల్లా

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.